


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 266

మంగళవారం 17-12-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL





**ఐఓసీని దాటిన రిలయన్స్**
ఫార్చ్యూన్ ఇండియా–500లో అగ్రస్థానం -బిజినెస్‌లో



**స్టోక్స్ ప్రదర్శనకు గుర్తింపు**
బీబీసీ 'స్పోర్ట్స్ పర్సనాలిటీ ఆఫ్ ద ఇయర్' అవార్డు సొంతం –స్పోర్ట్స్‌లో

# మద్యం ధరలకు కిక్కు!

రాష్ట్రంలో భారీగా పెరిగిన లిక్కర్ రేట్లు

ఒక్కో బ్రాండ్‌పై క్వార్టర్‌కు కనీసం రూ. 20 పెంపు

బీర్లపై రూ. 20 వరకు వడ్డన

- వివరాలు 2లో










# బక్క చిక్కిన బాల్యం!

## ఎత్తుకు తగ్గ బరువు లేరు | వయసుకు తగ్గ ఎత్తు లేరు

**సమగ్ర జాతీయ పౌష్టికాహార సర్వే 2016–18 నివేదిక**

| | |
|---|---|
| 38% పట్టణ బాలల్లో ఎదుగుదల లోపం | 46% 10-19 ఏళ్ల బాలికల్లో రక్తహీనత |
| 15.2% 10-19 ఏళ్ల వారిలో మధుమేహం | 24% కిడ్నీ సంబంధిత రుగ్మతలు |
| 55% పిల్లలకు శాకాహారమే | 42% తగిన ఆహారం లభించని వారు |

**సాక్షి, హైదరాబాద్:** బాల్యం చిక్కి శల్యమైపోతోంది. చిన్నారి చేతికండలు ఐస్‌క్రీం పుల్లల్లా చిక్కిపోయాయి. కొందరు పిల్లలు ఎత్తు ఎదగట్లేదు. మరికొందరికి వయసుకు తగ్గ బరువు లేదు. చిరుప్రాయంలోనే మధుమేహం, గుండె జబ్బుల ముప్పును ఎదుర్కొంటున్నారు. కిడ్నీ రోగాల బారినపడుతున్నారు. పౌష్టికాహార లోపంతో రాష్ట్రంలోని బాలల్లో తీవ్ర శారీరక ఎదుగుదల లోపం బయటపడింది. ఐదేళ్ల లోపు బాలల్లో ఏకంగా 29.3 శాతం మంది ఎదుగుదల (ఎత్తుపరంగా) లోపాన్ని కలిగి ఉన్నారు. 8.7 శాతం మంది తీవ్ర ఎదుగుదల లోపంతో బాధపడుతున్నారు. పట్టణ ప్రాంత బాలల్లో ఏకంగా 38.2 శాతం మంది ఎదుగుదల లోపం కలిగి ఉన్నారు. 30.8 శాతం మంది వయసుకు తగ్గ బరువు లేరు. మరో 17.9 శాతం మంది ఎత్తుకు తగ్గ బరువు లేరు. తాజాగా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ విడుదల చేసిన సమగ్ర జాతీయ పౌష్టికాహార సర్వే 2016–18 నివేదికలో ఈ విషయాలు వెలుగుచూశాయి.

**బక్క చిక్కిన మగపిల్లలు:** పాఠశాలకు వెళ్లే 5 నుంచి 9 ఏళ్ల పిల్లల్లో 31.4 శాతం మంది మగ పిల్లలు,

మిగతా 2వ పేజీలో ▶

# 'పౌర' ఆగ్రహం తీవ్రం

- దేశవ్యాప్తంగా పౌరసత్వ సవరణ చట్ట వ్యతిరేక ప్రదర్శనలు
- జామియా వర్సిటీలో పోలీసుల తీరును తీవ్రంగా ఖండించిన విద్యార్థులు, విపక్షాలు
- ఢిల్లీ, ముంబై, లక్నో, హైదరాబాద్ విశ్వవిద్యాలయాల్లో ఆందోళనలు
- కోల్‌కతాలో మమత భారీ ర్యాలీ

> **"పౌరసత్వ చట్ట సవరణ కారణంగా భారతీయులకుగానీ, ఏ మతం వారికి గానీ అన్యాయం జరగదు. ఇది శాంతిభద్రతలను కాపాడుకోవాల్సిన సమయం. ప్రజలంతా ఐకమత్యంతో సోదరభావంతో మెలగాలి. తప్పుడు సమాచారం, వదంతుల వ్యాప్తికి దూరంగా ఉండాలి."**
> – ప్రధాని మోదీ

- వివరాలు 14లో

# 'ఉన్నావ్' దోషి ఎమ్మెల్యేనే

➡ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఉన్నావ్ ఘటనపై ఎట్టకేలకు కోర్టులో విచారణ పూర్తయింది. బాలిక కిడ్నాప్.. అత్యాచారం.. బాధితురాలి తండ్రి లాకప్ మరణం.. ఆమె ప్రయాణిస్తున్న వాహనానికి ప్రమాదం..వంటి మలుపులతో రెండేళ్లుగా నలుగుతున్న ఉన్నావ్ కేసు ముగింపునకు వచ్చింది. సుప్రీంకోర్టు జోక్యంతో ఆగస్టు నుంచి రోజువారీ విచారణ చేపట్టిన ఢిల్లీలోని తీస్‌హజారీ కోర్టు సోమవారం బీజేపీ బహిష్కృత ఎమ్మెల్యే కుల్దీప్‌సింగ్ సెంగార్‌ను దోషిగా తేల్చింది. ఈనెల 19న శిక్ష ఖరారు చేయనుంది.


కుల్దీప్‌సింగ్ సెంగార్ (ఫైల్)

- **కారు ప్రమాదంపై అనుమానాలు**
- **లక్నో నుంచి ఢిల్లీ కోర్టుకు కేసు**
- **బోరుమన్న కుల్దీప్‌సింగ్ సెంగార్**
- **విచారణలో జాప్యంపై సీబీఐకి కోర్టు అక్షింతలు**

- వివరాలు 14లో

# సువర్ణ చరిత్రకు మరో అడుగు

- ఏపీ అసెంబ్లీలో ఒక్క రోజే 16 కీలక బిల్లులకు ఆమోదం
- దశలవారీ మద్య నిషేధం
- ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం
- వచ్చే ఏడాది నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం
- ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరు కమిషన్లు
- చిరు, పప్పు ధాన్యాలకు వేర్వేరు బోర్డులు
- వర్సిటీ నిబంధనల్లో మార్పులు, మరో 8 బిల్లులు ఆమోదం
- గత సమావేశాల్లో 19 విప్లవాత్మక బిల్లుల ఆమోదం

- వివరాలు 2లో

# ఆకాశాన్నంటే రామ మందిరం

అయోధ్యలో ఆకాశాన్నంటే భవ్యమైన రామమందిర నిర్మాణం నాలుగు నెలల్లో మొదలుకానుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. తద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయుల వందేళ్ల స్వప్నం సాకారం కానుందని తెలిపారు. -14లో









epaper.sakshi.com

క్లుప్తంగా...

## నేడు యాదాద్రికి సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మంగళవారం ఉదయం 11 గంటలకు యాదాద్రి ఆలయాన్ని సందర్శించనున్నారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించనున్నారు. రూ.235 కోట్లతో చేపట్టిన ఆలయ పునరుద్ధరణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. రహదారుల నిర్మాణం, భూసేకరణ కోసం రూ.109 కోట్లు, టెంపుల్ సిటీలో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.103 కోట్లు ప్రభుత్వం వెచ్చించింది. ఈ పనుల పురోగతిని ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించనున్నారు. ఆలయ పునరుద్ధరణ పనులు పూర్తయిన తర్వాత వచ్చే ఫిబ్రవరిలో యాదాద్రిలో మహా సుదర్శన యాగం నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఈ పర్యటన సందర్భంగా యాగం నిర్వహణ తేదీలను కేసీఆర్ ప్రకటించే అవకాశముంది.

## మెదక్‌లో 14 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత

సాక్షి, హైదరాబాద్: తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి వీస్తున్న తేమ గాలులతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే కాస్తంత ఎక్కువగా నమోదవుతున్నాయి. గత 24 గంటల్లో మెదక్‌లో 14 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రత నమోదైందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే హకీంపేటలో 16 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. రానున్న మూడు రోజులు రాష్ట్రంలో పొడి వాతావరణం నెలకొని ఉంటుందని వాతావరణ కేంద్రం అధికారి రాజారావు వెల్లడించారు.

## మౌజన్, ఇమామ్‌లకు గౌరవ వేతనం విడుదల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వక్ఫ్ బోర్డు పరిధిలోని మసీదుల మౌజన్, ఇమామ్‌లకు సంబంధించి రెండు నెలల గౌరవ వేతనాన్ని బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం విడుదల చేశారు. రాష్ట్రంలోని 9,975 మసీదుల మౌజన్, ఇమామ్‌లకు ప్రతి నెలా రూ.5,000ల చొప్పున గౌరవ వేతనాన్ని ప్రభుత్వం అందిస్తోంది. పెండింగ్‌లో ఉన్న గత జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి రూ.9,97,50,000లను సోమవారం విడుదల చేశారు. అలాగే హైదరాబాద్ నగరంలోని నాంపల్లి నియోజకవర్గ పరిధిలోని 8 మసీదుల మరమ్మతులకు ఆర్థిక చేయూత కింద రూ. 53 లక్షల విలువ గల చెక్కును నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్‌కు అందజేశారు.

## నేటి నుంచి హెచ్ఐసీసీలో అంతర్జాతీయ సదస్సు

సాక్షి, హైదరాబాద్: 'హై పర్ఫార్మెన్స్ కంప్యూటింగ్, డేటా అండ్ అనలిటిక్స్' సదస్సు మంగళవారం నుంచి హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగే ఈ సదస్సులో ఈ–కామర్స్ మొదలుకొని ఆరోగ్యం, వ్యవసాయం, వాతావరణం తదితర రంగాల్లో ఆధునిక, అత్యంత వేగవంతమైన కంప్యూటింగ్ ప్రాధాన్యం, ఆయా రంగాల్లో వస్తున్న మార్పులు తదితర అంశాలపై చర్చించనున్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ వేదికగా జరగనున్న 26వ హెచ్ఐపీసీ సదస్సులో దేశ, విదేశాల ప్రతినిధులు సుమారు 500 మంది పాల్గొంటారని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

## కృష్ణా నదీ జలాల విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా నదీ జలాల వివాదంపై ఏపీ, తెలంగాణ సహా సంబంధిత నదీ పరివాహక రాష్ట్రాలు దాఖలు చేసిన పలు పిటిషన్లపై విచారణ వాయిదా పడింది. జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం వద్దకు సోమవారం ఈ పిటిషన్లు రాగా తెలంగాణ తరఫు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ అభ్యర్థన మేరకు ధర్మాసనం విచారణను ఫిబ్రవరి 19కి వాయిదా వేసింది.

## ఏపీ, తెలంగాణ బార్ కౌన్సిళ్లకు సుప్రీం నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ, తెలంగాణ బార్ కౌన్సిళ్లకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. అడ్వొకేట్ యాక్ట్ సెక్షన్ 3ని సవరించకుండా తెలంగాణ బార్ కౌన్సిల్ ఏర్పాటు సాధ్యం కాదని, ఈ నేపథ్యంలో గత ఏడాది నిర్వహించిన ఏపీ, తెలంగాణ రాష్ట్రాల బార్ కౌన్సిల్ ఎన్నికలు చెల్లవంటూ న్యాయవాదులు శారదా గౌడ్, నరసింహులు గౌడ్, సౌభాగ్య రాజ్ దాఖలు చేసిన పిటిషన్లను విచారించిన జస్టిస్ రోహింటన్ నారీమన్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

## దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై మరో పిటిషన్

సాక్షి, న్యూఢిల్లీ: దిశ నిందితులను ఎన్‌కౌంటర్ చేసిన పోలీసులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ సుప్రీంకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. హైదరాబాద్‌కు చెందిన కె.సజయ, మీరా సంఘమిత్ర, వి.సంధ్యారాణి, ఎం.విమల దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ బాబ్డే నేతృత్వంలోని ధర్మాసనం ముందు ప్రస్తావిస్తూ అత్యవసరంగా విచారించాలని కోరారు. అయితే సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ వద్ద పిటిషన్లు ప్రస్తావించాలని ధర్మాసనం ఆదేశించింది.

# బక్కచిక్కిన బాల్యం!



▶ మొదటి పేజీ తరువాయి

24.2 శాతం మంది ఆడ పిల్లలు, 10–14 ఏళ్ల పిల్లల్లో 33.2 శాతం మగ, 23.4% ఆడ పిల్లలు, 15–19 ఏళ్ల పిల్లల్లో 35.4 శాతం మగ, 21.8 శాతం ఆడపిల్లలు బక్కచిక్కిపోయారు. 5–9 ఏళ్ల పిల్లల్లో 5.5 శాతం మగ, 4.2 శాతం ఆడపిల్లలు ఊబకాయాన్ని కలిగి ఉన్నారు. ప్రధానంగా పట్టణ బాలల్లోనే ఊబకాయం సమస్య అధికంగా ఉంది. 11 శాతం పట్టణ, 1.5 శాతం గ్రామీణ బాలలు ఊబకాయాన్ని కలిగి ఉన్నారు. ఇదే వయసు శ్రేణిలోని 15.6 శాతం మగ, 15.3 శాతం ఆడపిల్లల్లో ఎదుగుదల లోపాన్ని గుర్తించారు.

### చిక్కిన చేతి కండలు

వయసుతో పోలిస్తే 6–59 నెలల బాలల్లో 13.2 శాతం మంది ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) నిర్దేశిత ప్రమాణం కన్నా తక్కువ చేతికండ చుట్టు కొలత కలిగి ఉన్నారు. 5.2 శాతం మంది 12.5 సె.మీటర్ల లోపు, 0.9 శాతం మంది 11.5 సె.మీ. కన్నా తక్కువ చేతికండ చుట్టు కొలత కలిగి ఉన్నారు.

### మూడో వంతు చిన్నారుల్లో రక్తహీనత

రాష్ట్రంలోని కిశోర బాలికలు తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్నారు. 10–19 ఏళ్ల బాలికల్లో ఏకంగా 46 శాతం మంది, బాలురల్లో 18.5 శాతం మంది రక్తహీనత సమస్యతో బాధపడుతున్నారు. 1–4 ఏళ్ల పిల్లల్లో 33.4 శాతం మంది ఇనుము లోపం కలిగి ఉన్నారు. 10–19 ఏళ్ల పిల్లల్లో ఏకంగా 63.7 శాతం మంది బి–విటమిన్ లోపంతో బాధపడుతున్నారు.

### మధుమేహం ముప్పు..

రాష్ట్రంలోని 15.4 శాతం మంది 5 నుంచి 9 ఏళ్ల బాలలు, 15.2 శాతం మంది 10–19 ఏళ్ల బాలలు మధుమేహం ముప్పును ఎదుర్కొంటున్నారు. రక్తంలో 5.7 -6.4 శాతం చక్కెర (గ్లైకోసిలేటెడ్ హిమోగ్లోబిన్ కాన్సన్‌ట్రేషన్) కలిగి ప్రీడయాబెటిక్ స్టేజీలో ఉన్నట్లు సర్వేలో తేలింది. ఇక 5–9 ఏళ్ల పిల్లల్లో 1 శాతం మంది మధుమేహంతో బాధపడుతున్నారు. 5–9 ఏళ్ల పిల్లల్లో 21.9 శాతం మంది, 10–19 ఏళ్ల పిల్లల్లో 12.4 శాతం మంది తమ రక్తంలో అధిక కొవ్వు కలిగి ఉన్నారు. 5–9 ఏళ్ల పిల్లల్లో 23.6 శాతం మంది, 10–19 ఏళ్ల పిల్లల్లో 24.3 శాతం మంది కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతుండటంతో అధిక 'క్రియాటిన్'కలిగి ఉన్నారు.

### తొలిసారి సమగ్ర సర్వే!

పాఠశాలకు వెళ్లడానికి ముందు వయసు (0–4 ఏళ్లు), పాఠశాల వెళ్లే వయసు (4–9 ఏళ్లు), కిశోర వయసు (10–14 ఏళ్లు) బాలబాలికలను ఇంటర్వ్యూలు చేయడం, శరీర కొలతలు తీయడం, మలమూత్ర, రక్త పరీక్షలు నిర్వహించడం ద్వారా బాలల్లో పౌష్టికాహార స్థితిగతులపై అధ్యయనం జరిపింది. బాలల్లో సూక్ష్మ పౌష్టికాహార లోపం తీవ్రత, స్థాయిలను అంచనా వేయడం, అసంక్రమిత వ్యాధుల బారినపడేందుకు ఉన్న అవకాశాలను గుర్తించేందుకు ప్రామాణిక పద్ధతుల్లో పకడ్బందీగా ఇలాంటి సర్వే నిర్వహించడం దేశంలో ఇదే తొలిసారి. క్షేత్ర స్థాయిలో పౌష్టికాహార లోపం స్థితిగతులను తెలుసుకుని, తదనుగుణంగా కేంద్ర ప్రభుత్వ విధానాలను అభివృద్ధిపరచాలనే ఉద్దేశంతో ఈ సర్వే నిర్వహించారు. రాష్ట్రంలో 30 బృందాలు 2016 ఫిబ్రవరి 26 నుంచి జూలై 24 మధ్యలో 3,600 మంది బాలల శరీర కొలతలు తీసుకోవడంతో పాటు 1,800 బాలల రక్త, మల, మూత్ర పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య స్థితిగతులపై అధ్యయనం జరిపాయి.

### 55 శాతం శాఖాహారులే..

జాతీయ స్థాయిలో 0–4 ఏళ్ల వయసున్న 38,060 మంది, 5–9 ఏళ్ల 38,355 మంది, 10–19 ఏళ్ల 35830 మంది బాలబాలికలపై సర్వే నిర్వహించారు. వీరిలో 55 శాతం బాలలు శాఖాహారమే (కోడిగుడ్డు కూడా లేకుండా) తీసుకుంటున్నారు. 36–40 శాతం మంది మాంసాహారం తీసుకుంటుండగా, మిగిలిన వారు శాఖాహారంతో పాటు కోడిగుడ్డు తీసుకుంటున్నారు. 5 నుంచి 9 ఏళ్ల బాలల్లో 91 శాతం మంది, 10–14 ఏళ్ల బాలల్లో 52 శాతం, 15–19 ఏళ్ల బాలల్లో 48 శాతం మంది పాఠశాలకు వెళ్తున్నారు.

### 42 శాతం మందికి సరిగ్గా దొరకని ఆహారం

6–23 నెలల బాలల్లో 42 శాతం మందికి వారి వయసుకు తగ్గట్టు రోజూ లభించాల్సిన ఆహారం కన్నా తక్కువగా లభిస్తోంది. 21 శాతం మందికి సరిపడా వైవిధ్యమైన ఆహారం దొరుకుతుండగా, 6 శాతం మంది కనీస ఆమోదయోగ్యమైన ఆహారం పొందగలుగుతున్నారు. తెలంగాణలోని 6–23 నెలల బాలల్లో 3.6 శాతం మందికి కనీస ఆమోద్యయోగ్యమైన ఆహారం లభిస్తోంది.

### 58 శాతం మందికి తల్లిపాలే..

6 నెలల లోపు బాలల్లో 58 శాతం మంది కేవలం తల్లిపాలపై ఆధారపడి ఉన్నారు. 12–15 నెలల బాలల్లో 83 శాతం మందికి తల్లిపాలు కొనసాగిస్తున్నారు. 6–8 నెలల బాలల్లో 53 శాతం మందికే పుష్టికరమైన ఆహారం లభిస్తోంది. 0–24 నెలల బాలల్లో 57 శాతం మందికి పుట్టిన గంటలోపే తల్లిపాలు తాగించడం జరిగింది.

**5 ఏళ్ల లోపు పిల్లలకు సంబంధించి శారీరక స్థితిగతి (శాతాల్లో)**

| శారీరక స్థితి | బాలురు | బాలికలు | గ్రామీణ | పట్టణ | మొత్తం |
|---|---|---|---|---|---|
| ఎదుగుదల లోపం | 28.1 | 30.1 | 15.7 | 38.2 | 29.3 |
| తీవ్ర ఎదుగుదల లోపం | 10.1 | 7.3 | 4.6 | 11.5 | 8.7 |
| ఎత్తుకు తగ్గ బరువు లేని | 19.7 | 16 | 17.8 | 18 | 17.9 |
| తీవ్రమైన బరువు లోపం | 5.9 | 5.3 | 5.1 | 5.9 | 5.6 |
| వయసుకు తగ్గ బరువు లేదు | 31.9 | 29.7 | 19.7 | 38. | 30.8 |
| వయసుకు తగ్గ తీవ్ర బరువు లేదు | 9.1 | 5.5 | 5.2 | 8.7 | 7.3 |

**5-9 ఏళ్ల బాలలకు సంబంధించి వివరాలు (శాతాల్లో)**

| అంశం | బాలురు | బాలికలు | పట్టణ | గ్రామీణ | మొత్తం |
|---|---|---|---|---|---|
| ఎదుగుల లోపం | 15.6 | 15.3 | 13.5 | 16.6 | 15.5 |
| బక్కపలచ | 31.4 | 24.2 | 22.9 | 31.1 | 28.1 |
| ఊబకాయం | 5.5 | 4.2 | 11 | 1.5 | 4.9 |

**రక్తహీనత, విటమిన్ల లోపాలున్న బాలల వివరాలు (శాతాల్లో)**

| అంశం | 1-4 ఏళ్లు | 5-9 ఏళ్లు | 10-19 ఏళ్లు |
|---|---|---|---|
| రక్త హీనత (బాలికలు) | 36.5 | 27.7 | 46 |
| రక్త హీనత (బాలురు) | 39.3 | 26.9 | 18.5 |
| మొత్తం రక్త హీనత | 37.8 | 27.2 | 32.1 |
| ఇనుము లోపం | 33.4 | 22.7 | 26 |
| బి–విటమిన్ లోపం | 46.8 | 45.8 | 63.7 |
| బి12–విటమిన్ లోపం | 12.4 | 13.2 | 29.1 |
| విటమిన్–డి లోపం | 9.6 | 5.5 | 8.8 |
| విటమిన్–ఎ లోపం | 26.5 | 35 | 19.7 |
| జింక్ లోపం | 10.1 | 9.3 | 27.9 |
| అయోడిన్ లోపం | 299 మంది | 290 మంది | 254 మంది |

# మద్యం ధరలకు కిక్కు

**రాష్ట్రంలో భారీగా పెరిగిన లిక్కర్ రేట్లు**

- ఒక్కో బ్రాండ్‌పై క్వార్టర్‌కు కనీసం రూ.20 పెంపు... బీర్లపై రూ.20 వరకు వడ్డన
- ప్రీమియం బ్రాండ్ క్వార్టర్ విస్కీ ధర రూ.40, ఫుల్ బాటిల్ ధర రూ.150 వరకు పెంపు
- సాధారణ బ్రాండ్లపై 90 ఎంఎల్ రూ.10, క్వార్టర్ 20, హాఫ్ 40, ఫుల్ 80, లీటర్ రూ.110 చొప్పున వడ్డన
- చీప్ లిక్కర్ క్వార్టర్‌పై రూ.20 పెంపు
- పేదల నుంచి సంపన్నులు తాగే మందు వరకు అన్ని ధరలను పెంచిన ప్రభుత్వం
- పెరిగిన ధరలు వెంటనే అమల్లోకి... పాత స్టాక్ పాతరేటుకు అమ్మాల్సిందే

సాక్షి, హైదరాబాద్: మందు బాబుల జేబులకు రాష్ట్ర ప్రభుత్వం భారీ చిల్లు పెట్టింది. మద్యం ధరలను భారీస్థాయిలో పెంచుతూ నిర్ణయం తీసుకుంది. పేదలు తాగే చీప్ లిక్కర్ నుంచి సంపన్నులు సేవించే ఖరీదైన మందు వరకు అన్ని బ్రాండ్ల ధరలను 10 నుంచి 30 శాతం వరకు పెంచేసింది. చీప్ లిక్కర్ ధరలు 30 శాతం వరకు పెంచడం గమనార్హం. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం.. సాధారణ మద్యంపై క్వార్టర్‌కు కనీసం రూ.20 చొప్పున ధర పెరగ్గా, ప్రీమియం బ్రాండ్లపై రూ.40 వరకు పెరిగింది. ఇక బీర్ల ధరలను కూడా రూ. 20, రూ.30 చొప్పున పెంచింది. విస్కీ, బ్రాందీ, రమ్, బీర్లు... ఇలా అన్ని రకాల మద్యంపై పెరిగిన ధరలు వెంటనే అమల్లోకి వస్తాయని, అయితే మద్యం వ్యాపారులు ఇప్పటికే తీసుకున్న స్టాక్‌ను పాత ధరలకే అమ్మాల్సి ఉంటుందని, కొత్తగా బుధవారం నుంచి తీసుకునే స్టాక్‌కు మాత్రమే కొత్త ధరలు వర్తిస్తాయని ఎక్సైజ్ వర్గాలు స్పష్టం చేశాయి.

### బీర్ 'భారమే'...

కనీసం ఒక్కో క్వార్టర్‌కు రూ.20 చొప్పున ధరలను పెంచగా, కొన్ని బ్రాండ్లకు ఇంకా ఎక్కువే పెంచారు. మొత్తం మీద సాధారణ మద్యం ప్రస్తుతమున్న ధరలతో పోలిస్తే 90 ఎంఎల్ రూ.10, క్వార్టర్ రూ.20, హాఫ్ బాటిల్ రూ.40, ఫుల్‌బాటిల్ రూ.80, లీటర్ బాటిల్ రూ.110 వరకు పెంచారు. కొన్ని ప్రీమియం బ్రాండ్ల ఫుల్ బాటిల్ ధర రూ.150 వరకు పెరిగాయి. యువత ఎక్కువగా తీసుకునే బీర్ల ధరలను కూడా భారీగానే పెంచారు. గతంలో లైట్ బీర్ రూ.100 కాగా, ఇప్పుడు దాన్ని రూ.120 చేశారు. స్ట్రాంగ్ బీర్‌ను రూ.120 నుంచి 130కి పెంచగా, కొన్ని బ్రాండ్లు రూ.180 వరకు పెరిగాయి. చిన్న బీర్ల విషయానికి వస్తే 60రూపాయలున్న బీరు 70కి, 80 రూపాయిలున్న బీరు 90కి పెరిగింది. ఇక, చీప్‌లిక్కర్ ధరలు కూడా విపరీతంగా పెంచారు. డైమండ్, ఆర్‌కేఎస్, కేరళ, రైజోమ్ లాంటి బ్రాండ్లపై క్వార్టర్‌కు రూ.20 చొప్పున పెంచారు. అన్ని బ్రాండ్ల బ్రీజర్లపై కూడా ధర రూ.30 వరకు పెంచారు.

### గప్‌చుప్‌గా...

వాస్తవానికి మద్యం ధరలను పెంచాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉన్నప్పటికీ దీనికోసం మంత్రివర్గ ఉప సంఘం వేయాలని భావించింది. కానీ, ఉప సంఘం నియమించుకుండానే, ఆ కమిటీ సిఫారసు లేకుండానే ఎక్సైజ్ అధికారులు గప్‌చుప్‌గా మద్యం ధరలను సవరించేశారు. సవరించిన ధరలను అమల్లోకి తెచ్చేందుకు ఎలాంటి సూచన లేకుండా సోమవారం నుంచే మద్యం డిపోల నుంచి సరఫరా నిలిపివేశారు. మంగళవారం కూడా వైన్‌షాప్‌లకు డిపోల నుంచి మద్యం ఇవ్వడం లేదని, బుధవారం నుంచే కొత్త స్టాక్ ఇస్తామని ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారి 'సాక్షి'తో చెప్పారు.



## ముడుపుల ప్రవాహం వల్లే మూసీపై శ్రద్ధలేదు

**సీఎం కేసీఆర్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ విమర్శ**

హైదరాబాద్: సమైక్య రాష్ట్రంలో పారిశ్రామికవేత్తలు మూసీని కలుషితం చేశారని దూషించి, ఇప్పుడు రాష్ట్రం సాధించాక వారి వద్ద నుంచి ముడుపుల ప్రవాహాన్ని తెచ్చుకుంటూ ప్రజల ప్రాణాలతో ముఖ్యమంత్రి కేసీఆర్ చెలగాటాలాడుతున్నారని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. తెలంగాణ గంగను పవిత్రం చేద్దాం అంటు మూసీ శుద్ధి కోసం చేపట్టిన 'నమామి మూసీ'ఉద్యమంలో భాగంగా లంగర్‌హౌస్ త్రివేణి సంగమాన్ని ఆయన సోమవారం తిలకించారు. వికారాబాద్ అనంతగిరి కొండల నుంచి తెచ్చిన ముచికుందా జలాన్ని త్రివేణి సంగమంలో వదిలి పూజలు చేశారు. అనంతరం కార్వాన్ నియోజక వర్గం ఇన్‌చార్జి అమర్‌సింగ్ మూసీలో ఏర్పాటు చేసిన వేదికపై రాంచంద్ర జీ మఠం వేదపండితులతో కలిసి మూసీ నదికి మహా హారతి ఇచ్చారు. మూసీని, ప్రజల ఆరోగ్యాలను కాపాడుకుందాం అంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ... మూసీని ప్రక్షాళన చేసి, హుస్సేన్ సాగర్‌ను కొబ్బరి నీటితో నింపుతానని చెప్పిన కేసీఆర్ డబ్బుల వరదతో అన్నీ మరిచి పోయారన్నారు. మూసీ కాలుష్యంతో దాని పరీవాహక ప్రాంతాల్లోని 600 గ్రామాల ప్రజలు వింత అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు.

**కోరితే 70 శాతం నిధులు ఇస్తాం....**

ఈ సందర్భంగా ఆలయం ముందు రాంలీలా మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో కూడా లక్ష్మణ్ మాట్లాడుతూ.... సబర్మతితో పాటు, గంగా నదిని పూర్తిగా శుద్ధి చేసిన ఘనత ప్రధాని మోదీది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కోరితే మూసీ ప్రక్షాళన, హుస్సేన్ సాగర్ శుద్ధి కోసం 70 శాతం నిధులను కేంద్ర ం భరించడానికి సిద్ధంగా ఉందన్నారు.

## 'మనూ'కు పాకిన పౌరసత్వం సెగ!

హైదరాబాద్: ఇటీవల కేంద్రం తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టం సెగ హైదరాబాద్‌కూ తాకింది. మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఈ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు సాగాయి. విద్యార్థులు క్యాంపస్‌లో బైఠాయించి ఆదివారం అర్ధరాత్రి నుంచి కొనసాగిస్తున్నారు. కేంద్రప్రభుత్వానికి, పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ మెయిన్ గేటు వద్ద బైఠాయించారు. సోమవారం ఉదయం క్యాంపస్‌లో విధులు నిర్వహించేందుకు ఉదయం 10 గంటలకు వచ్చిన ప్రొఫెసర్లు, అధ్యాపకులు, అధికారులు, సిబ్బందిని విద్యార్థులు అడ్డుకున్నారు. గేటు తాళం వేసి ఎవరినీ లోపలికి రానివ్వలేదు. అలా మధ్యాహ్నం వరకు సిబ్బంది బయటే వేచి చూడాల్సి వచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు విశ్వవిద్యాలయం వద్ద భారీగా మోహరించారు. కాగా, ఉర్దూ విశ్వవిద్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేశారు.

# సువర్ణ చరిత్రకు మరో అడుగు

## ఏపీ శాసనసభలో ఒక్క రోజే 16 కీలక బిల్లులు

**ఇదివరకెన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో కీలక బిల్లులను ఆమోదించి ఆంధ్రప్రదేశ్ శాసనసభ సువర్ణాక్షరాలతో కొత్త చరిత్రను లిఖించింది.. ప్రభుత్వ బడుల్లో వచ్చే ఏడాది నుంచి ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెడుతూ బడుగు, బలహీన వర్గాలు, ఇతరత్రా పేద పిల్లల బంగారు భవిష్యత్‌కు శ్రీకారం చుట్టింది.. పేద మహిళల పసుపు–కుంకుమలను అర్ధాంతరంగా దూరం చేస్తున్న మద్యం మహమ్మారిపై ఉక్కుపాదం మోపింది.. నిత్యం లక్షలాది మంది ప్రజానీకం సేవలో తరిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ వారి కలను సాకారం చేసింది.. కుల సంబంధిత గొడవలకు స్వస్తి పలికేందుకు దోహదపడేలా ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరు కమిషన్లు.. రైతులు మరింతగా నిలదొక్కుకునేలా చిరు, పప్పు ధాన్యాలకు వేర్వేరు బోర్డుల ఏర్పాటు.. వర్సిటీల చట్టంలో మార్పులు.. తదితర కీలక నిర్ణయాలకు నాంది పలికింది.. ఐదున్నర కోట్ల రాష్ట్ర ప్రజానీకం ఆకాంక్షలకు అనుగుణంగా గత శాసనసభ సమావేశాల్లో 19 బిల్లుల ఆమోదంతో తొలి అడుగు వేసిన వైఎస్ జగన్ సర్కారు.. తాజాగా యావత్ ప్రపంచంలోని తెలుగు వారు ప్రశంసించేలా 16 బిల్లులకు 'ఎస్'అంటూ మలి అడుగు వేసింది. పొరుగు రాష్ట్రాలకు సైతం దిశా నిర్దేశం చేసే విప్లవాత్మక నిర్ణయాలకు వేదికైంది.**

సాక్షి, అమరావతి

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సోమవారం మరో చారిత్రక ఘట్టానికి వేదికై ంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో పాఠ్యాంశాల బోధన, ఏపీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ సర్వీసుల్లోకి తీసుకోవడం వంటి 16 చరిత్రాత్మక బిల్లులకు ఆమోదం తెలిపింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి బడ్జెట్ సమావేశాల్లోనే 19 విప్లవాత్మక బిల్లులను శాసనసభ ఆమోదించడం ద్వారా రికార్డు సృష్టించింది. సోమవారం శాసనసభ ఆమోదించిన ఏపీ ఎడ్యుకేషన్ యాక్ట్–1982 సవరణ బిల్లు ద్వారా వచ్చే విద్యా సంవత్సరం ఒకటి నుంచి ఆరో తరగతి వరకు లక్షలాది మంది విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంలో పాఠ్యాంశాలను బోధించడానికి బాటలు వేసింది. ఆ తర్వాత వరుస సంవత్సరాల్లో పదో తరగతి వరకూ ఇంగ్లిష్ మీడియంలో పాఠ్యాంశాలను బోధించడం ద్వారా మధ్యతరగతి, పేద వర్గాలకు చెందిన లక్షలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు మెరుగైన ఉపాధి అవకాశాల కల్పనకు ఈ బిల్లు చుక్కానిలా నిలుస్తుంది. ఏపీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ సర్వీసుల్లోకి తీసుకునే బిల్లును ఆమోదించడం ద్వారా 51,488 మంది కార్మికుల స్వప్నం సాకారం చేసింది. ఎస్సీ వర్గాల ప్రజల ప్రయోజనాలను సమర్థవంతంగా పరిరక్షించడం కోసం ఎస్సీ కమిషన్, ఎస్టీ వర్గాల ప్రజల హక్కులను పరిరక్షించడంతోపాటు ఆ వర్గాల ప్రజలకు మరింతగా ప్రయోజనం చేకూర్చడం కోసం ఎస్టీ కమిషన్ ఏర్పాటుకు వీలుగా శాసనసభ బిల్లులను ఆమోదించింది. చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు సాగు చేసే రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం.. ధరలు పెరగకుండా నియంత్రించడం.. ప్రజలందరికీ వాటిని అందుబాటులో ఉంచడం ద్వారా పౌష్టికాహారాన్ని అందించడం కోసం చిరుధాన్యాలు, పప్పుధాన్యాల బోర్డుల ఏర్పాటుకు వీలుగా వేర్వేరు బిల్లులను ఆమోదించింది.

### సోమవారం ఆమోదం పొందిన బిల్లులు.. వాటి ఉద్దేశాలు

**బిల్లు:** ఏపీ ఎడ్యుకేషన్ యాక్ట్–1982 సవరణ
**ఉద్దేశం:** ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో విద్యార్థులకు బోధన.. ధనిక, మధ్యతరగతి, పేద అనే తేడా లేకుండా అందరికీ నాణ్యమైన విద్యను అందించడం.. ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి దోహదం చేయడం.. అన్ని తరగతుల్లోనూ తెలుగు సబ్జెక్టును తప్పనిసరి చేయడం.

**బిల్లు:** ఏపీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ సర్వీసుల్లోకి తీసుకోవడం
**ఉద్దేశం:** ఏపీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులు దశాబ్దాల స్వప్నాన్ని సాకారం చేయడం.. ఆ సంస్థ ఉద్యోగులను ప్రభుత్వ సర్వీసుల్లోకి తీసుకునేలా ప్రత్యేకంగా ప్రజా రవాణా విభాగాన్ని ఏర్పాటు చేయడం.

**బిల్లు:** ఎస్సీ కమిషన్
**ఉద్దేశం:** ఎస్సీ వర్గాల ప్రజల ప్రయోజనాలను సమర్థవంతంగా పరిరక్షించడం.

**బిల్లు:** ఎస్టీ కమిషన్
**ఉద్దేశం:** ఎస్టీ వర్గాల ప్రజల ప్రయోజనాలను సమర్థవంతంగా పరిరక్షించడం.

**బిల్లు:** చిరుధాన్యాల(మిల్లెట్స్) బోర్డు ఏర్పాటు
**ఉద్దేశం:** చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడం.. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం.. ప్రజలందరికీ అందుబాటులోకి తేవడం.. పౌష్టికాహారాన్ని అందించడం.

**బిల్లు:** పప్పుధాన్యాల(పల్సస్) బోర్డు ఏర్పాటు
**ఉద్దేశం:** పప్పుధాన్యాల సాగును ప్రోత్సహించడం.. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం.. ధరలు పెరగకుండా నియంత్రించడం.. ప్రజలందరికీ అందుబాటులోకి తేవడం.. పౌష్టికాహారాన్ని అందించడం.

**బిల్లు:** ఆంధ్రప్రదేశ్ మద్యనిషేధ చట్టం–1995కు సవరణ
**ఉద్దేశం:** అక్రమ మద్యం తయారీ, రవాణా, విక్రయాలకు అడ్డుకట్ట వేయడం.. అలాంటి నేరానికి తొలిసారి పాల్పడితే రూ.రెండు లక్షల జరిమానా.. రెండోసారి నేరానికి పాల్పడితే రూ.5 లక్షల జరిమానా.

**బిల్లు:** ఆంధ్రప్రదేశ్ ఆబ్కారీ చట్టం–1968కు సవరణ
**ఉద్దేశం:** బార్‌లలో అక్రమ, సుంకం చెల్లించని మద్యం విక్రయం.. సరిహద్దుల నుంచి అక్రమ రవాణా.. ఇలాంటి నేరాలకు తొలిసారి పాల్పడితే హెచ్చరికతోపాటు లైసెన్స్ ఫీజుకు రెండు రెట్లు జరిమానా.. రెండోసారి పాల్పడితే బార్ లైసెన్స్ రద్దు, నాన్ బెయిలబుల్ కేసులు నమోదు.

**బిల్లు:** కర్నూలులో క్లస్టర్ యునివర్సిటీ ఏర్పాటు
**ఉద్దేశం:** కర్నూలులో సిల్వర్ జూబ్లీ కాలేజీ, కేవీఆర్ ప్రభుత్వ బాలికల డిగ్రీ కాలేజీలను విలీనం చేసి క్లస్టర్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం.. విద్యార్థులకు ఉపాధి కల్పన సామర్థ్యాలు, నైపుణ్యాలను పెంచేలా నాణ్యమైన విద్యను అందించడం.

**బిల్లు:** జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్, లలిత కళల విశ్వవిద్యాలయం చట్టం సవరణ
**ఉద్దేశం:** వైఎస్సార్ ఆర్కిటెక్చర్, లలిత కళల విశ్వవిద్యాలయం కడపలో ఏర్పాటు చేయడం.

**బిల్లు:** ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయాల చట్టాల సవరణ బిల్లు
**ఉద్దేశం:** విశ్వవిద్యాలయాల పాలక మండళ్లలో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి చైర్మన్/ప్రతినిధి ఎక్స్–ఆఫిషియో సభ్యునిగా నియామకం.

**బిల్లు:** ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయాల చట్టాల రెండో సవరణ బిల్లు
**ఉద్దేశం:** విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ (ఉపకులపతులు)ల నియామక నిబంధనల్లో మార్పులు

**బిల్లు:** ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల రెండో సవరణ బిల్లు
**ఉద్దేశం:** సహకార సంఘాల పాలక మండలి ఎన్నికల్లో కుష్టు వ్యాధిగ్రస్తులు, మూగ, చెవిటి వారికి పోటీ చేసే అవకాశం కల్పించడం.

- ఏపీ వృత్తిదారులు, వ్యాపారులు, ఉద్యోగుల వృత్తిపన్ను చట్టం సవరణ బిల్లు–2019
- ఏపీ జీఎస్టీ సవరణ బిల్లు–2019
- ఏపీ మున్సిపల్ చట్టం సవరణ బిల్లు–2019

## ర్యాగింగ్ నిరోధానికి చర్యలు: విద్యాశాఖ కమిషనర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో ర్యాగింగ్ నిరోధానికి చర్యలు చేపట్టాలని కాలేజీల ప్రిన్సిపాళ్లను ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ సయ్యద్ ఉమర్ జలీల్ ఆదేశించారు. మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు జూనియర్ కాలేజీలో సీనియర్ల ర్యాగింగ్ కారణంగా ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు విద్యాశాఖ దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో అన్ని కాలేజీల్లో ర్యాగింగ్ నిరోధానికి పక్కా ఏర్పాట్లు చేయాలని ఉమర్ జలీల్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

## అదనపు సొలిసిటర్ జనరల్‌గా సూర్యకరణ్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: భారత అదనపు సొలిసిటర్ జనరల్‌గా టి.సూర్యకరణ్‌రెడ్డిని కేబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ నియమించింది. ఈయన హైదరాబాద్ కేంద్రంగా సదరన్ జోన్ బాధ్యతలు నిర్వర్తిస్తారు.

ఇదం జగత్



.. మా ఇంటి ఇలవేలుపు నువ్వే తల్లీ!

# ఇక బాలామృతం 'ప్లస్'

- తీవ్రమైన పోషకలోపాన్ని పరిష్కరించేందుకు చర్యలు
- ఎన్ఐఎన్, యూనిసెఫ్, టీఎస్ ఫుడ్స్ సమన్వయంతో తయారీ
- తొలుత ఆసిఫాబాద్, గద్వాల జిల్లాల్లోని అంగన్‌వాడీలకు సరఫరా
- రెండునెలల తర్వాత పురోగతి ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా అమలు

**సాక్షి, హైదరాబాద్:** చిన్నారుల్లో తీవ్ర పోషక లోపాలకు చెక్ పెట్టేందుకు సరికొత్త పౌష్టికాహారం అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అన్నిరకాల పోషక విలువలున్న ఆహారంగా 'బాలామృతా'న్ని చిన్నారులకు అందిస్తున్నారు. దీంతో చిన్నారుల పెరుగుదల సంతృప్తికరంగా ఉంటోంది. అయితే పోషకలోపాలున్న చిన్నారులకు బాలామృతం కంటే మరింత అధిక పోషణ గుణాలున్న ఆహారాన్ని ఇవ్వాలని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 'బాలామృతం ప్లస్'ను ప్రవేశపెట్టింది.

### ముందుగా రెండు జిల్లాల్లో...

అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన చిన్నారుల ఆరోగ్య స్థితిని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఎప్పటికప్పుడు అంచనా వేస్తుంది. వారి బరువు, ఎదుగుదలను క్రమం తప్పకుండా కొలవడంతో పాటు వారి ఆరోగ్య స్థితిని సైతం రికార్డు చేస్తుంది. ఈక్రమంలో రాష్ట్రస్థాయి నివేదికను విశ్లేషించగా... కొమ్రంభీం ఆసిఫాబాద్, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో ఎక్కువ మంది చిన్నారులు తీవ్ర పోషక లోపాల బారిన పడినట్లు గుర్తించారు. ఇలాంటి వారికి సాధారణ ఆహారంతో పాటు అధిక పోషక విలువలున్న ఆహారాన్ని ఇవ్వాలి. అలా అయితేనే వారు ఐదేళ్ల వయసొచ్చేసరికి పోషక లోపాలు అధిగమించడంతో పాటు ఆ తర్వాత ఎదుగుదల సాధారణంగా మారుతుంది. ఈ అంశంపై రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ యంత్రాంగంతో పాటు ఎన్ఐఎన్, టీఎస్ ఫుడ్స్, యూనిసెఫ్ అధికారులు సంయుక్తంగా పోషక విలువలు ఎక్కువగా ఉన్న బాలామృతం ప్లస్‌ను తయారు చేశారు

### కొత్త ఆహారంలో...

కొత్తగా తీసుకొచ్చిన బాలామృతం ప్లస్‌లో పాలపొడి, పల్లీ నూనె, రైస్, వీట్, బెంగాల్ గ్రామ్, చక్కెరతో పాటు కొవ్వు పదార్థాలు సమృద్ధిగా ఉండే మిశ్రమాలను జత చేస్తారు. దీంతో పోషక విలువలు సాధారణ స్థాయి కంటే ఎక్కువగా ఉంటాయి. ప్రస్తుతం బాలామృతం ప్లస్‌ను కొమ్రంభీం ఆసిఫాబాద్, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో అందించాలని అధికారులు నిర్ణయించారు. ఈ రెండు జిల్లాల్లో నెలకు సగటున టన్ను బాలామృతం ప్లస్ సరఫరా చేసేలా తయారు చేస్తున్నారు. డిమాండ్‌కు తగినట్లు పరిమాణాన్ని పెంచేందుకు టీఎస్‌ఫుడ్స్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్లస్ ఆహారాన్ని అందిస్తూ చిన్నారుల ఎదుగుదల, పోషక లోపాల తీరును వరుసగా మూడు నెలల పాటు పరిశీలిస్తారు. ఫలితాల ఆధారంగా వచ్చే ఏడాది మరో 10 జిల్లాల్లో బాలామృతం ప్లస్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేస్తోంది.



సోమవారం బాలామృతాన్ని ఓ చిన్నారికి తినిపిస్తున్న ఈటల రాజేందర్. చిత్రంలో మంత్రి సత్యవతి రాథోడ్ తదితరులు

# రోగాలు లేని తెలంగాణ మా లక్ష్యం

- ఆ దిశగా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు చేపట్టింది
- బాలామృతం ప్లస్ ప్రారంభంలో మంత్రి ఈటల రాజేందర్

**సాక్షి, హైదరాబాద్:** రోగాలు లేని తెలంగాణే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. సోమవారం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్‌లో బాలామృతం ప్లస్‌ను రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు, గిరిజన సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. స్వాతంత్య్రం వచ్చి 72 ఏళ్లు గడిచినా పౌష్టిక లోపాలను అధిగమించకపోవడం బాధాకరమన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను రోగాలు లేని రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందని, అందుకు అనువైన సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెడుతుందని చెప్పారు. ఆరోగ్య భారతం అంగన్‌వాడీల నుంచే ప్రారంభమవుతుందని, ఈ కేంద్రాల ద్వారా గతంలో 15 గుడ్లు సరఫరా చేస్తే ఇప్పుడు 30 గుడ్లు ఇస్తున్నామని పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు వేతనాలు పెంచి మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. గర్భిణులకు పౌష్టికాహార పంపిణీతో పాటు కాన్పు అయిన తర్వాత రూ.12 వేల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. అనంతరం మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, బాలికలు, చిన్నారుల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఆర్థిక మాంద్యం ఉన్నప్పటికీ ఆరోగ్య, సంక్షేమ కార్యక్రమాలకు సంతృప్తికర స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని పేర్కొన్నారు. అమ్మ ఒడి పథకం సత్ఫలితాలను ఇస్తోందని తెలిపారు. కొత్తగా తీసుకొచ్చిన బాలామృతం ప్లస్ ద్వారా అంగన్‌వాడీల్లోని చిన్నారులు మరింత ఆరోగ్యవంతంగా ఎదుగుతారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనిసెఫ్ దక్షిణాది రాష్ట్రాల చీఫ్ మిషల్ రాస్డియా తదితరులు పాల్గొన్నారు.

# చెన్నమనేని రమేశ్‌కు ఊరట

- పౌరసత్వం రద్దుపై స్టే 8 వారాల పొడిగింపు
- ఇంకా జర్మనీ పౌరసత్వం ఉందో లేదో చెప్పాలని కేంద్ర హోం శాఖకు హైకోర్టు ఆదేశం
- తదుపరి విచారణ 4 వారాలకు వాయిదా



**సాక్షి, హైదరాబాద్:** వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ పౌరసత్వం రద్దుపై స్టేను హైకోర్టు మరో 8 వారాలు పొడిగించింది. పౌరసత్వాన్ని రద్దు చేస్తూ కేంద్ర హోం శాఖ జారీ చేసిన ఉత్తర్వులపై హైకోర్టు గత నవంబర్‌లో స్టే ఇచ్చింది. ఆ ఉత్తర్వులను తాజాగా పొడిగిస్తూ న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరాం ఆదేశాలు జారీ చేశారు. రమేశ్ జర్మనీ పౌరసత్వం రద్దయిందో లేదో తెలపాలని కేంద్రాన్ని ఆదేశించారు. తదుపరి విచారణ 4 వారాలకు వాయిదా వేశారు. వాస్తవాలను దాచిపెట్టి మోసపూరిత విధానాల ద్వారా చెన్నమనేని రమేశ్ భారతీయ పౌరసత్వం పొందినట్లు గతంలో కేంద్ర హోంశాఖ నిర్ధారించింది. భారత పౌరసత్వ చట్టం–1955లోని 10వ సెక్షన్ ప్రకారం రమేశ్ పౌరసత్వాన్ని రద్దు చేస్తూ కేంద్ర హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రమేశ్ పౌరసత్వం చెల్లదంటూ 2009లో ఆయనపై పోటీ చేసి ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్, కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేయడంతో పాటు హైకోర్టును ఆశ్రయించారు.పౌరసత్వ అంశం కేంద్ర హోంశాఖ పరిధిలో ఉంటుందని చెన్నమనేని రమేశ్ గతంలో వాదించారు. దీంతో హైకోర్టు.. ఓ కమిటీ ఏర్పాటు చేసి పౌరసత్వ వివాదాన్ని పరిష్కరించాలని గతంలో కేంద్ర హోం శాఖను ఆదేశించింది. ఫలితంగా 2010లో ఎస్.కె.టాండన్ ఆధ్వర్యంలో ఏర్పడిన త్రిసభ్య కమిటీ విచారణ జరిపి ఆయన పౌరసత్వాన్ని రద్దు చేస్తూ 2017లో నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం చెల్లదని చెన్నమనేని రమేశ్ తిరిగి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 1993లో జర్మనీ పౌరసత్వం పొందానని, అయితే ఆ తర్వాత చట్ట ప్రకారం భారత పౌరసత్వాన్ని పొందినట్లు చెప్పారు. కేంద్ర హోంశాఖ ఈ విషయాన్ని తేల్చాలని ఈ ఏడాది జూలైలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్ని అమలు చేయలేదని, హైకోర్టు ఉత్తర్వులను కేంద్రానికి, ఫిర్యాదు దారుడు శ్రీనివాస్‌కు అఫిడవిట్ ద్వారా తెలియజేసినట్లు రమేశ్ తరఫు న్యాయవాది వాదించారు. ఇప్పటికీ రమేశ్ రెండు దేశాల పాస్‌పోర్టులతో ఉన్నారని, నేటికీ జర్మనీ పౌరసత్వంతో కూడా ఉన్నారని శ్రీనివాస్ వాదించారు. ఇరుపక్షాల వాదనల అనంతరం ద్వంద్వ పౌరసత్వంపై చేస్తున్న ఆరోపణలకు ఆధారాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆది శ్రీనివాస్‌కు హైకోర్టు నోటీసులు ఇచ్చింది.

## 19న చార్మినార్ నుంచి ర్యాలీ: లెఫ్ట్ పార్టీలు

**సాక్షి, హైదరాబాద్:** దేశ సమగ్రత, సార్వభౌమత్వాన్ని దెబ్బతీసేలా తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 19న రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వామపక్షాలు (లెఫ్ట్ పార్టీలు) ప్రకటించాయి. హైదరాబాద్‌లో చార్మినార్ నుంచి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వరకు ఈ ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపాయి. సోమవారం మఖ్దూంభవన్‌లో సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అధ్యక్షతన జరిగిన సమావేశంలో చాడ వెంకట్‌రెడ్డి, గుండ మల్లేశ్, ఎన్.బాలమల్లేశ్, డా.సుధాకర్ (సీపీఐ), కె.గోవర్ధన్, జేవీ చలపతిరావు (న్యూడెమోక్రసీ రెండు గ్రూపులు), డీజీ నరసింహారావు (సీపీఎం) కె.జానకిరాములు (ఆర్ఎస్‌పీ), ఆర్‌వీ ప్రసాద్ (ఫార్వర్డ్‌బ్లాక్) నిర్ణయించారు. జనవరి 1న ఈ పార్టీల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సదస్సు జరగనుంది.

# అనుకున్న ధరకన్నా ఎక్కువకే

- సన్నబియ్యం టెండర్లలో గతేడాది ధరకన్నా అధికంగా కోట్ చేసిన మిల్లర్లు
- మిల్లర్లతో సంప్రదింపులు జరపనున్న ప్రభుత్వం

**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వ వసతి గృహాలు, మధ్యాహ్న భోజనం వంటి సంక్షేమ కార్యక్రమాల కోసం వినియోగించే సన్నబియ్యం సరఫరాకు సంబంధించి నిర్వహించిన టెండర్లలో ప్రభుత్వం ఊహించిన ధరకన్నా అధిక ధరకే మిల్లర్లు కోట్ చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం వరకు స్టీమ్డ్ రైస్ క్వింటాల్‌కు రూ.3,350, రారైస్ క్వింటాల్‌కు రూ.3,250 మేర మిల్లర్లు కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నారు. అయితే ప్రస్తుతం నిర్వహించిన టెండర్లకు గరిష్టంగా రూ.3,600 వరకు మిల్లర్లు కోట్ చేసినట్లు పౌరసరఫరాల వర్గాల ద్వారా సమాచారం అందింది. ఈ ధర అధికంగా ఉండటంతో మిల్లర్లతో చర్చలు జరిపి ప్రస్తుతం అందిస్తున్న ధరలకే సన్నబియ్యాన్ని సరఫరా చేసేలా చర్చలు జరపాలని శాఖ నిర్ణయించినట్లు సమాచారం.

**ఎక్కువైతే ప్రభుత్వంపై భారం..**

ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలు, మధ్యాహ్న భోజనం పథకం ద్వారా పాఠశాల విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం అందిస్తున్న విషయం తెలిసిందే. ఇందు కోసం ఏడాదికి 1.5 లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యం అవసరమవుతుంది. ఇందులో స్టీమ్డ్ రైస్ 37,500 టన్నులు, రా రైస్ 1,12,500 టన్నులు అవసరం. దీనికోసం ప్రభుత్వం ఏటా రూ.738 కోట్ల మేర ఖర్చు చేస్తోంది. వచ్చే ఏడాది బియ్యం అవసరాలకు సంబంధించి పౌర సరఫరాల శాఖ టెండర్లు ఆహ్వానించగా, ముగ్గురు మిల్లర్లు మాత్రమే ఈ ప్రక్రియలో పాల్గొన్నారు. ఇందులో అత్యంత తక్కువగా తుది రేటు క్వింటాల్‌కు రూ.3,600 వరకు కోట్ చేసినట్లుగా తెలుస్తోంది. ఇప్పటివరకు సరఫరా చేస్తున్న బియ్యం ధరలతో పోలిస్తే ఇది రూ.300 వరకు అధికంగా ఉంది. అయితే ఇది ఆర్థికంగా ప్రభుత్వంపై రూ.35 నుంచి రూ. 40 కోట్ల మేర భారం పడే అవకాశం ఉండటంతో ప్రభుత్వం అంగీకరించలేదు. అయినా సోమవారం టెండర్లలో మిల్లర్లు అధిక ధరకే కోట్ చేశారు. గతంలోనూ ఇదేమాదిరి అధిక ధరలకు కోట్ చేసిన సమయంలో శాఖ అధికారులు మిల్లర్లతో చర్చించి తక్కువ ధరలకే సన్న బియ్యం సరఫరా చేసేలా ఒప్పించారు.

## 'సఫాయి కర్మచారీలకు ఆర్థిక చేయూత పథకాలు'

**సాక్షి, హైదరాబాద్:** సఫాయి కర్మచారీల వృత్తిని మార్చేందుకు ప్రభుత్వం పలు ఆర్థిక చేయూత కార్యక్రమాలు చేపడుతోందని రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. సోమవారం టూరిజం ప్లాజాలో 'యాక్షన్ ప్లాన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ మాన్యువల్ క్లీనింగ్ అండ్ సేవర్స్ సిస్టం అండ్ సెప్టిక్ ట్యాంక్స్'పై దక్షిణాది రాష్ట్రాలు నిర్వహించిన వర్క్‌షాప్‌లో మంత్రి మాట్లాడారు. మాన్యువల్ స్కావెంజర్లు ఉండొద్దని చట్టాలు చెబుతున్నాయని, ఇప్పటివరకు అలాంటి వృత్తినే నమ్ముకున్న వారికి ఆర్థిక సహకార పథకాల ద్వారా సరైన ఉపాధి కల్పిస్తున్నట్లు చెప్పారు. జీహెచ్ఎంసీ పరిధిలో సుమారు 18 వేల మంది సఫాయి కర్మచారీలు పనిచేస్తున్నారని, సెప్టిక్ ట్యాంకులు శుభ్రపరిచే ప్రక్రియ అంతా యంత్రాల ద్వారానే జరుగుతోందన్నారు.

## 29న పూర్వ విద్యార్థుల మహాసమ్మేళనం

### ముఖ్య అతిథిగా ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

**హైదరాబాద్:** సరస్వతీ విద్యా పీఠం తెలుగు రాష్ట్రాల పూర్వ విద్యార్థులు, ఆచార్యుల మహాసమ్మేళనం ఈ నెల 29న హైదరాబాద్‌లోని బండ్లగూడలోని శారదాధామంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో 10 వేల మందికి పైగా పూర్వ విద్యార్థులు, 1,500 మంది పూర్వ ఆచార్యులు పాల్గొంటారని తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని విద్యాభారతి ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి పసరి మల్లయ్య, పూర్వ విద్యార్థుల పరిషత్ రాష్ట్ర సెక్రటరీ బొడ్డు శ్రీనివాస్‌లతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహా సమ్మేళనం కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ముఖ్య అతిథిగా విచ్చేస్తారని చెప్పారు. కార్యక్రమం అనంతరం పీఠం ఆధ్వర్యంలో బండ్లగూడలో నిర్మించిన శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ సీబీఎస్‌సీ స్కూల్, అధ్యాపకుల కోసం నిర్మించిన 18 టీచర్స్ క్వార్టర్స్‌ను భగవత్ ప్రారంభిస్తారని తెలిపారు.



## క్లుప్తంగా...



ఎలక్ట్రిక్ వాహనాన్ని నడుపుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

### ‘మేడారం’లో ఎలక్ట్రిక్ వాహనాలు

**వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేకం**

**ములుగు:** మేడారం మహా జారతలో ఈసారి వృద్ధులు, దివ్యాంగ భక్తుల సౌకర్యార్థం రెండు మినీ ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి తీసుకు రానున్నారు. ఈ మేరకు ములుగు కలెక్టర్ నారాయణరెడ్డి సమక్షంలో సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ వాహనాలు ఎలా ఉపయోగపడతాయనే విషయంపై సంబంధిత వాహన నిర్వాహకుల ఆధ్వర్యంలో ట్రయల్ రన్ నిర్వహించగా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మేడారం జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లుగా పేర్కొన్నారు.

### నేటి నుంచి ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు

**కేయూ క్యాంపస్:** కాకతీయ యూనివర్సిటీలో ఈనెల 17 నుంచి 20వ తేదీ వరకు ఏబీవీపీ 38వ రాష్ట్ర మహా సభలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మహాసభల స్వాగత సమితి అధ్యక్షుడు డాక్టర్ నర్సింహారెడ్డి, కన్వీనర్ నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి అంబాల కిరణ్ తెలిపారు. మొదటి రోజు ఏబీవీపీ సంస్థాగత జెండా ఆవిష్కరణ ఉంటుందని, రెండో రోజు సభలను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రారంభిస్తారని, 19న హన్మకొండ ఏకశిలపార్కులో బహిరంగ సభ ఉంటుందని పేర్కొన్నారు. రెండు వేల మంది ప్రతినిధులు పాల్గొన్నే ఈ మహాసభల్లో విద్యారంగ, సామాజిక సమస్యలపై చర్చించిన అనంతరం తీర్మానాలను ఆమోదించి ప్రభుత్వానికి నివేదిస్తామని వివరించారు.

### ఏసీబీ వలలో డిప్యూటీ తహసీల్దార్



సందీప్

**హుజూరాబాద్:** కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ఆర్డీవో కార్యాలయం డిప్యూటీ తహసీల్దార్ సందీప్ రూ.75 వేలు లంచం తీసుకుంటూ సోమవారం ఏసీబీ అధికారులకు చిక్కాడు. డీఎస్పీ భద్రయ్య కథనం ప్రకారం.. తిమ్మాపూర్ మండల కేంద్రానికి చెందిన ఎడ్ల జోగిరెడ్డి మరో నలుగురితో కలిసి కేశవపట్నం మండలం వంకాయగూడెం గ్రామపంచాయతీ పరిధిలో 2.32 ఎకరాల భూమిని అదే గ్రామానికి చెందిన గోపాల్ వద్ద కొనుగోలు చేశాడు. ఈ భూమి నాలా కన్వర్షన్ కోసం శంకరపట్నం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేశారు. ఈ పత్రాలు హుజూరాబాద్‌లోని ఆర్డీవో కార్యాలయానికి వచ్చాయి. జోగిరెడ్డి ఆర్డీవో చెన్నయ్యను కలువగా, డిప్యూటీ తహసీల్దార్ సందీప్‌ను కలవాలని సూచించారు. సందీప్ రూ.2 లక్షలు డిమాండ్ చేయగా.. జోగిరెడ్డి బతిమిలాడితే రూ.75 వేలకు ఒప్పందం కుదిరింది. అనంతరం జోగిరెడ్డి ఏసీబీని ఆశ్రయించాడు. వారి సూచన మేరకు సోమవారం మధ్యాహ్నం డిప్యూటీ తహసీల్దార్‌కు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

### రూ.25 వేలకు చిన్నారి విక్రయం

**కమాన్‌చౌరస్తా (కరీంనగర్):** రెండేళ్ల చిన్నారిని ఇద్దరు వ్యక్తులు కలసి రూ.25 వేలకు విక్రయించారు. పోలీసుల కథనం ప్రకారం.. దేవాపూర్‌కు చెందిన అరుణ కుటుంబ కలహాలతో తన రెండేళ్ల కూతురుతో కరీంనగర్‌కు వచ్చి అంగడిబజార్‌లో ఉంటోంది. ఆమెను కరీంనగర్‌కు చెందిన రజనీ చేరదీసింది. రెండు నెలల పాటు అరుణతోపాటు ఆమె కూతురిని రజినీ ఇంటి వద్దనే ఆశ్రయం కల్పించింది. అరుణ తను మళ్లీ పెళ్లి చేసుకుంటానని, తన కూతురుని ఎవరికైనా దత్తత ఇవ్వాలని కోరింది. రజనీకి అప్పటికే తెలిసిన కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉండే దుబ్బాసి నర్సయ్యకు అప్పగించింది. చిన్నారిని నర్సయ్య ధర్మారం మండలం పత్తిపాక నర్సింగాపూర్‌కు చెందిన కె.గంగయ్యకు రూ.25 వేలకు విక్రయించాడు. ఆ డబ్బును నర్సయ్య, రజనీ సమానంగా పంచుకున్నారు. గంగయ్యకు దత్తత ఇచ్చినట్లు అరుణకు చెప్పారు. ఈ విషయం కరీంనగర్ వన్ టౌన్ సీఐ దృష్టికి రాగానే రంగంలోకి దిగి ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. రజనీ, నర్సయ్య, గంగయ్యలను సోమవారం రిమాండ్‌కు తరలించారు. చిన్నారిని స్వధార్‌హోంకు రక్షణ నిమిత్తం పంపినట్లు తెలిపారు.

### కారులో మంటలు

**ప్రయాణిస్తున్నవారు దిగిపోవడంతో తప్పిన ప్రమాదం**



**జహీరాబాద్:** అకస్మాత్తుగా కారులో మంటలు చెలరేగడంతో పూర్తిగా దగ్ధం అయింది. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని సత్వార్ గ్రామ శివారులో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి హైదరాబాద్ నుంచి మహారాష్ట్రలోని షోలాపూర్‌కు వెళుతున్న కారు ఇంజన్‌లో పొగలు రావడంతో డ్రైవర్ కారును నిలిపి వేశాడు. వెంటనే అందులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు కారు దిగారు. అదే సమయంలో ఇంజన్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో కారు పూర్తిగా దగ్ధం అయింది. అందులో ప్రయాణిస్తున్నవారు వెంటనే కిందకు దిగడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. కారులో ప్రయాణిస్తున్న కేదార్‌నాథ్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిరాగ్‌పల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ ప్రభుత్వం
**సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, గిరిజన సంక్షేమం, హైదరాబాద్**
NIT No.SE/TW/HYD/249 to 252/2019-20 **ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన** తేది: 13.12.2019
**పనుల సంఖ్య:** (4), **పనులపేరు:** మెదక్ జిల్లాలోని జిన్నారం (V&M) వద్ద ST రెసిడెన్షియల్ స్కూల్ ఫర్ బాయ్స్‌కు ప్రహరీగోడ నిర్మాణం, సంగారెడ్డి జిల్లాలో కల్హేర్ (V&M) వద్ద మినీ గురుకులంకు ప్రహరీగోడ నిర్మాణం, నల్గొండ జిల్లాలో P.A. పల్లి (V&M) వద్ద ST ఆశ్రమ స్కూల్ ఫర్ బాయ్స్‌కు ప్రహరీ గోడ నిర్మాణం, వికారాబాద్ జిల్లాలో కుల్కచర్ల (V&M) వద్ద TW రెసిడెన్షియల్ స్కూల్ ఫర్ బాయ్స్‌కు మైనర్ రిపేర్స్ & సదుపాయాలు ఏర్పాటు చేయుట కోసం టెండర్లు కోరబడుచున్నవి. **మొత్తం ECV: రూ. 87.00 లక్షలు (సుమారుగా).** బిడ్ దాఖలు ప్రారంభ తేది: 19.12.2019 సా.5.00గం॥, బిడ్ దాఖలు ముగింపు తేది: 03.01.2020 మ.3.00గం॥, కమర్షియల్ బిడ్ తెరచు తేది: 03.01.2020 సా.4.00గం॥. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ **@https://tender.telangana.gov.in//** లో చూడవచ్చును. **ఫోన్ నం. 040-23315950** మెయిల్ID: **setwhyd13@gmail.com.**
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, TW, 5వ అంతస్తు, DSS భవన్, మాసబ్‌ట్యాంక్, హైదరాబాద్
DIPR RO.No.1965-DP/CL/Advt/1/2019-20, Dt:16.12.2019

తెలంగాణ ప్రభుత్వం
**కమిషనర్ కార్యాలయం, ఎండోమెంట్స్ డిపార్ట్‌మెంట్, హైదరాబాద్**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు**
**NIT No. EE/13/Tender Notice/2019,** **తేది: 12.12.2019 (2వ పిలుపు)**
04 దేవాలయాలు అంటే నిజామాబాద్ జిల్లాలో 3 & కామారెడ్డి జిల్లాలో 1 అభివృద్ధి కోసం **రూ. 92.75 లక్షల** వ్యయంతో ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. బిడ్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 17.12.2019, బిడ్ డౌన్‌లోడ్ ముగింపు తేది (దాఖలు) 24.12.2019. మరింత సమాచారం కోసం దర్శించండి. https://tender.telangana.gov.in
**సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఎండోమెంట్స్ డిపార్ట్‌మెంట్, హైదరాబాద్**
DIPR.Ro.No. 1966-DP/CL/ADVT/1/2019-20, Dt 16/12/2019

**సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం**
**తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ :: హైదరాబాద్**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు**
**టెండరు నోటీసు నెం. SE/TSEWIDC/HYD/NIT/631&633/2019-20** **తేది: 13-12-2019**
సిద్దిపేట జిల్లాలో 1). చింతమడక వద్ద ఇన్‌ఫ్రాతో సహా 2 BHK (628 నం.లు) నిర్మాణం (రూ.52.37 కోట్లు), 2). మంచాపూర్ మరియు సీతారామ్‌పల్లి వద్ద ఇన్‌ఫ్రాతో సహా 2 BHK (475 నం.లు) నిర్మాణం (రూ.47.79 కోట్లు) కొరకు అర్హతగల కాంట్రాక్టర్లందరి నుండి టెండర్లు కోరబడుచున్నవి. ఆన్‌లైన్‌లో బిడ్ దాఖలుకు మరియు స్వీకరణకు చివరి తేది: 24-12-2019 సా.4:00 గం.వరకు. **గమనిక:** ధర సర్దుబాటు GO MS.No.94 ఆఫ్ ట్రాన్స్‌పోర్ట్, రహదారులు & భవనాలు (R.1) శాఖ, తేది: 16-04-08 ప్రకారం మాత్రమే వర్తిస్తుంది. అనగా స్టీల్ మరియు సిమెంట్ కొరకు మాత్రమే. పూర్తి వివరాలను **https://tender.telangana.gov.in** లో చూడవచ్చును లేదా సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, TSEWIDC, 3వ బ్లాక్, 4వ అంతస్తు, రాజీవ్ విద్యా మిషన్ బిల్డింగ్, SCERT కాంపౌండ్, E-గేట్ L.B.స్టేడియం ఎదురుగా, హైదరాబాద్. ఫోన్: 23326692 వారిని స్వయంగా సంప్రదించవచ్చును.
**సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, TSEWIDC, హైదరాబాద్**
DIPR RO.No.543-PP/CL/Advt/1/2019-20, Dt: 16-12-2019

# గడువు ఇవ్వం

**‘సమత’ నిందితులకు స్పష్టం చేసిన ఫాస్ట్‌ట్రాక్ కోర్టు**

**నేటి ఉదయం 10 గంటల వరకే చాన్స్**



సమత కేసు నిందితులను కోర్టులో హాజరుపరిచేందుకు తీసుకెళుతున్న పోలీసులు

**సాక్షి, ఆసిఫాబాద్:** న్యాయవాదిని నియమించుకునేందుకు ఈనెల 20వ తేదీ వరకు గడువడిగిన సమత నిందితుల అభ్యర్థనను ఫాస్ట్‌ట్రాక్ కోర్టు తిరస్కరించింది. మంగళవారం ఉదయం 10 గంటల లోపు లాయర్‌ను నియమించుకునేందుకు న్యాయమూర్తి గడువు ఇచ్చారు. సమత కేసులో నిందితులైన షేక్‌బాబు, షేక్ షాబొద్దీన్, షేక్ ముఖ్దూమ్‌లను ఆసిఫాబాద్‌జిల్లా పోలీసులు ఆదిలాబాద్ ఫాస్ట్ ట్రాక్ కోర్టు ముందు సోమవారం ప్రవేశపెట్టారు. పోలీసుల విచారణలో సేకరించిన కత్తి, దుస్తులు, రూ.200 నగదు, ఇతర వస్తువులతోపాటు ఆడియో టేపులను కోర్టు పరిశీలించి డిపాజిట్ చేసుకుంది. నేడు కేసు విచారణకు సంబంధించిన షెడ్యూల్‌ను జడ్జి ప్రకటించనున్నారు. దాని ప్రకారమే చార్జిషీటులో పేర్కొన్న 44 మంది సాక్షులను రోజువారీగా విచారణ చేపట్టనున్నారు. రోజుకు ఐదుగురు చొప్పున సాక్షులను విచారించి సాధ్యమైనంత తొందరగా తీర్పు వెలువడేలా న్యాయ ప్రక్రియ సాగుతోంది. కోర్టుకు హాజరైన నిందితుల్లో ఏ ఒక్కరిలోనూ పశ్చాత్తాపం కనిపించడం లేదని, ప్రస్తుతం అందరూ ఆరోగ్యంగానే ఉన్నారని ఓ పోలీసు అధికారి ‘సాక్షి’తో పేర్కొన్నారు.

**కేసు విచారణ ప్రారంభం**

**ఆదిలాబాద్‌టౌన్:** సంచలనం రేపిన సమత కేసు విచారణ మొదలైంది. రిమాండ్ గడువు సోమవారంతో ముగియడంతో పోలీసులు నిందితులను కోర్టు ఎదుట హాజరుపర్చారు. చార్జిషీటు దాఖలు చేశారు. నిందితుల తరపున వాదించకూడదని బార్ అసోసియేషన్ తీర్మానించడంతో వారి తరపున వాదించేందుకు న్యాయవాదులు ఎవరూ ముందుకు రాలేదు. న్యాయవాదులను నియమించుకునేందుకు రెండు మూడు రోజుల గడువు ఇవ్వాలని నిందితులు న్యాయమూర్తిని కోరినా.. మంగళవారం ఉదయం 10 గంటల వరకే అవకాశం కల్పించారు. ఆ లోగా న్యాయవాదులెవరూ ముందుకు రానట్లయితే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా కానీ, ప్రభుత్వం ద్వారాగానీ న్యాయవాదులను నియమించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఆసిఫాబాద్ జిల్లాలోని లింగాపూర్ మండలం రాంనాయక్ తండాకు అర కిలోమీటరు దూరంలో సమతను గత నెల 24న ముగ్గురు నిందితులైన షేక్ బాబు, షేక్ షాబొద్దీన్, షేక్ ముఖ్దూమ్ అత్యాచారం చేసి హత్య చేసిన విషయం తెలిసిందే. నిందితులను న్యాయస్థానం జుడీషియల్ కస్టడీకి అప్పగించింది. కేసు తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

### పసుపు బోర్డు కోసం ఆందోళనలు ప్రారంభం

**మోర్తాడ్/బాల్కొండ/కమ్మర్‌పల్లి:** పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ నిజామాబాద్ జిల్లాలో సోమవారం ఆందోళనలు ప్రారంభమయ్యాయి. రైతు ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో మెండోరా మండలం వెల్కటూర్‌లో రైతు ఆత్మగౌరవ పాదయాత్రను ప్రారంభించగా, పసుపు బోర్డు సాధన సమితి ఆధ్వర్యంలో ఎంపీ అర్వింద్ దిష్టిబొమ్మలను తగులబెట్టారు. ఎంపీగా గెలిచిన వెంటనే పసుపు బోర్డు తీసుకువస్తానని, లేని పక్షంలో లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేస్తానని అర్వింద్ ఎన్నికల వేళ మాటిచ్చారన్నారు. గెలిచి ఆరు నెలలు గడుస్తున్నా, నేటికీ పసుపు బోర్డు ఏర్పాటు ఊసేలేకుండా పోయిందని రైతులు విమర్శించారు.

**మద్దతు ధర చెల్లించాలి**

**జగిత్యాల అగ్రికల్చర్:** పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని, క్వింటాల్‌కు రూ.15 వేల మద్దతు ధర చెల్లించాలని కోరుతూ రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేశారు. జగిత్యాలలో కలెక్టరేట్ వరకు ర్యాలీ తీశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ రాజేశంకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు.

# టీఆర్‌ఎస్ నేత దారుణ హత్య

**కళ్లలో కారం చల్లి.. కత్తితో నరికి..**

- రాజీ చర్చల కోసం పిలిచి దాడి.. భూ తగాదాలే కారణం
- నిందితుడి గృహదహనం.. కోళ్లఫారం, వాహనం ధ్వంసం
- మృతదేహం తరలింపును అడ్డుకున్న ఆందోళనకారులు
- తీవ్ర ఉద్రిక్తత.. పోలీసులకు లొంగిపోయిన నిందితుడు



ఎంఏ కలీం



నిందితుడు బలరాం

**భీమ్‌గల్:** నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం బాబాపూర్ గ్రామ శివారులోని కోళ్ల ఫారంలో సోమవారం టీఆర్‌ఎస్ నేత ఎంఏ కలీం (42) దారుణ హత్యకు గురయ్యాడు. భూ వివాదంలో కలీంను రాజీ చర్చల కోసం పిలిపించిన ప్రత్యర్థి.. పథకం ప్రకారం కళ్లలో కారం కొట్టి, దారుణంగా నరికి చంపాడు. అనంతరం నేరుగా పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. ఏసీపీ రఘు కథనం ప్రకారం.. భీమ్‌గల్‌కు చెందిన కలీం కుటుంబానికి, బాబాపూర్‌కు చెందిన రాడె బలరాంకు మధ్య భీమ్‌గల్‌లోని సర్వే నెంబర్ 33లో 23 గుంటల భూ తగదా ఇరవై ఏళ్లుగా నడుస్తోంది. ఇరుపక్షాలు కోర్టు చుట్టూ తిరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బలరాం పథకం ప్రకారం కలీంను రాజీ చర్చల కోసం పిలిచి హత్య చేసినట్లు ఏసీపీ తెలిపారు. అయితే దీని వెనుక ఇంకా ఎవరున్న విషయమై దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

**తీవ్ర ఉద్రిక్తత**

హత్య వార్త దావానలంలా వ్యాపించడంతో మృతుని వర్గానికి చెందిన వందలాది మంది పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మృతదేహం తరలింపు కోసం తెచ్చిన వాహనంపై దాడి చేశారు. నిందితుడి కోళ్ల ఫారంపై రాళ్ల దాడి చేశారు. పోలీసులు అతికష్టం మీద వారిని అదుపు చేశారు. నిందితులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు.

**నిందితుడి ఇల్లు, వాహనం ధ్వంసం**

కలీం మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించిన అనంతరం ఆగ్రహంతో రగిలిపోయిన ప్రజలు.. నిందితుడు బలరాం ఇంటిపై దాడి చేశారు. ఫర్నిచర్, ఇంటి తలుపులు, కిటికీలు ధ్వంసం చేసి నిప్పు పెట్టారు. కారును ధ్వంసం చేశారు. పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టి, మంటలను ఆర్పారు. బలరాం గత జడ్పీటీసీ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. కేసు దర్యాప్తులో ఉంది.

# చదవాలని మందలిస్తే..

**ఉరి వేసుకొని విద్యార్థి ఆత్మహత్య**

**విధుల నుంచి ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుడిని తొలగింపు**



రత్నం

**కొండాపూర్:** తెలంగాణ గురుకుల సాంఘిక సంక్షేమ వసతి గృహంలో సోమవారం ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గిర్మాపూర్‌లో ఈ సంఘటన చోటు చేసుకుంది. కోహీర్ మండలం పైడిగుమ్మాల్ గ్రామానికి చెందిన రత్నం(16) గిర్మాపూర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. రత్నం సరిగ్గా చదవకపోవడంతో ‘నిన్ను వేరే హాస్టల్‌కు పంపిస్తాం’ అంటూ తరచూ తరగతి ఉపాధ్యాయుడు శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రవీంద్ర ప్రసాద్‌లు చెప్పేవారు. ఈ క్రమంలో ఈ నెల 12న ఉపాధ్యాయుడు విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఈనెల 15న రత్నం తల్లి సుమీల వచ్చి బాగా చదువుకోవాలని మందలించి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన రత్నం ఎవరితోనూ మాట్లాడకుండా మౌనంగా ఉన్నాడని తోటి విద్యార్థులు తెలిపారు. కాగా, సోమవారం తెల్లవారు జామున రత్నం వసతి గృహం వెనుక వైపున బెడ్ షీట్‌తో చెట్టుకు ఉరి వేసుకొని విగత జీవిగా కనిపించాడు.

**వసతి గృహం వద్ద ఆందోళన**

విద్యార్థి మృతి గురించి తెలుసుకున్న ఎస్‌ఎఫ్‌ఐ, కేవీపీఎస్, ప్రజా సంఘాలు, దళిత సంఘాల నాయకులు పెద్ద ఎత్తున వసతి గృహం వద్దకు చేరుకున్నారు. తల్లిదండ్రులు, బంధువులు రాకుండా మృతదేహాన్ని ఎందుకు తరలించారని ఆందోళన చేపట్టారు. కాగా, వసతి గృహ ఉపాధ్యాయులే మానసికంగా వేధించి చంపేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని బంధువులు ఆరోపించారు. ఆర్‌సీఓ బాలాస్వామి స్పందిస్తూ ప్రిన్సిపాల్‌తోపాటు ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ను తక్షణమే విధుల నుంచి తొలగిస్తున్నామని, అదే విధంగా కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

# చెయ్యి ఎత్తితే బస్సు ఆపండి

**ఆర్టీసీని లాభాల బాటలో నడపండి**

**కార్మికులకు మంత్రి హరీశ్‌రావు పిలుపు**



ఆర్టీసీ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

**పటాన్‌చెరు, పటాన్‌చెరు టౌన్:** చెయ్యి ఎత్తితే బస్సు ఆపి ప్రయాణికులను ఎక్కించుకుని ఆర్టీసీని లాభాల బాటలోకి తేవాలని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సోమవారం ఆయన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ఆర్టీసీ కార్మికులకు బియ్యం బస్తాలను పంపిణీ చేశారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తన సొంత నిధుల నుంచి ఒక్కో కార్మికుడి కుటుంబానికి క్వింటాల్ బియ్యం చొప్పున ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వం, సమ్మె చేసిన కార్మికుల డిమాండ్లను పరిష్కరించిందని గుర్తు చేశారు. ఇక కార్మికులు ఆర్టీసీని లాభాల బాటలో నడిపించేందుకు కృషి చేయాలన్నారు. ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్)ను పెంచి ప్రయాణికులకు మంచి సేవలందించాలని సూచించారు. అనధికార రవాణా వ్యవస్థలను కట్టడి చేసి ఆర్టీసీ లాభాలు పెంచేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆర్టీసీని కాపాడుకునే బాధ్యత కార్మికులపై ఉందని అన్నారు.

**కార్మికుల పిల్లలు ఆఫీసర్లు కావాలి**

కార్మికుల పిల్లలు కార్మికులు కావద్దని, వారు ఆఫీసర్లు, ఇంజనీర్లు, డాక్టర్లు కావాలని మంత్రి హరీశ్‌రావు అన్నారు. సోమవారం పటాన్‌చెరు పట్టణంలో బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జీహెచ్‌ఎంసీ కార్యాలయం, మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ తదితర అభివృద్ధి పనులను మంత్రి హరీశ్‌రావు, మెదక్ ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, సంగారెడ్డి జెడ్పీ చైర్ పర్సన్ మంజు శ్రీ,, కలెక్టర్ హనుమంత రావులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు నైతిక విలువలు బోధించాలని ప్రిన్సిపాళ్లకు సూచించారు. ఇంటర్, డిగ్రీలో ఫలితాలు ఎందుకు పడిపోతున్నాయని పటాన్‌చెరులోని కళాశాలల ప్రిన్సిపాళ్లను ప్రశ్నించారు. విద్యార్థులు సోషల్ మీడియా, టీవీలు, సినిమాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇప్పించి ఉత్తీర్ణత శాతం పెంచాలని సూచించారు.

### హెచ్‌ఎం సెలవులు ఇవ్వడం లేదని..

- ఉపాధ్యాయురాలు ఆత్మహత్యాయత్నం
- నల్లగొండ జిల్లాలో ఘటన

**కొండమల్లేపల్లి:** సెలవులు ఇవ్వకుండా ప్రధానోపాధ్యాయుడు తనను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ ఓ ఉపాధ్యాయురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సోమవారం నల్లగొండ జిల్లా దేవరకొండ మండల రిసోర్స్ సెంటర్ (ఎమ్మార్సీ) కార్యాలయం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. మండలంలోని కొండభీమనపల్లికి చెందిన రాంబాయి దేవరకొండలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. అనారోగ్యం కారణంగా సెలవు కావాలన్నా హెచ్‌ఎం ముత్యాలు సెలవు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ విషయమై పలుమార్లు ఎంఈఓ మాతృనాయక్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ఈ క్రమంలో తనకు ఆరోగ్యం బాగోలేదని.. ఈనెల 10వ తేదీ నుంచి 15వ తేదీ వరకు సెలవులు మంజూరు చేయాలని ఆమె మరోసారి ప్రధానోపాధ్యాయుడిని కోరింది. అందుకు హెచ్‌ఎం నిరాకరించడంతో సోమవారం తనకు సెలవు మంజూరు చేయాలని ఎంఈఓను ఫోన్‌లో కోరినప్పటికీ నిరాకరించారు. దీంతో ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట రాంబాయి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోవడానికి ప్రయత్నించింది. అక్కడే ఉన్న అటెండర్ లక్ష్మణ్ ఆమెను అడ్డుకుని చేతిలో ఉన్న అగ్గిపెట్టెను తీసుకున్నాడు. వెంటనే 108లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనకు సంబంధించి శాఖాపరమైన విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని డీఈఓ భిక్షపతి తెలిపారు. ఆసుపత్రిలో బాధితురాలి నుంచి సీఐ వివరాలు సేకరించారు.

### ప్రజావాణిలో కలకలం

- న్యాయం చేయాలని పెట్రోల్ బాటిళ్లతో నిరసన

**బోధన్‌టౌన్:** తమ సాగు భూముల్లోకి వెళ్లకుండా కొందరు అడ్డుకుంటున్నారని, తమకు న్యాయం చేయాలంటూ 20 మంది రైతులు పెట్రోల్ బాటిళ్లతో సోమవారం బోధన్ ప్రజావాణికి రావడం కలకలం రేపింది. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం పెంటకుర్దుకు చెందిన శ్రీనివాస్‌రెడ్డి, సలాం, జనార్ధన్‌రావ్, కొండారెడ్డి, అప్సర్, ఈసా, గోపి, రమ్య, లావణ్య, రమేశ్‌బాబు, అరుణకుమారి తదితరులకు పెంటకుర్దు, వల్లభాపూర్ గ్రామ శివార్లలో 20 ఎకరాలకు పైగా భూమి ఉంది. అయితే, ఈ దారిని కొందరు కబ్జా చేసి, అడ్డంగా గేటు పెట్టారు. దీనిపై బాధిత రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా, వారు వచ్చి గేటును తొలగించారు. అయితే, ఇటీవల ఆ దారిని మళ్లీ కబ్జా చేసి తమ భూమిలో కలిపేసుకున్నారు. ఇదేమిటని రైతులు అడిగితే చంపుతామని బెదిరిస్తుండడంతో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి పెట్రోల్ బాటిళ్లతో తరలి వచ్చారు. తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

### నిండు గర్భిణిపై అత్యాచారం

- డిష్ రిపేర్ పేరిట వచ్చి అఘాయిత్యం
- సెల్‌ఫోన్ ద్వారా చిత్రీకరించాడని ఫిర్యాదు

**కమాన్‌చౌరస్తా:** నిండు గర్భిణిపై ఓ వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. కరీంనగర్ మండలం బొమ్మకల్‌లో సెక్యూరిటీ గార్డు కుటుంబం నివాసం ఉంటోంది. ఈనెల 9న డిష్ రిపేర్ పేరిట ఒంటరిగా ఉన్న మహిళ ఇంట్లోకి వచ్చిన కనపర్తి రామకృష్ణ తొమ్మిది నెలల గర్భిణిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం ఆమె భర్తకు చెప్పింది. బయటకు తెలిస్తే పరువు పోతుందని ఫిర్యాదు చేయలేదు. చివరకు సోమవారం పోలీసుల ఆశ్రయించారు. దీంతో నిందితుడిపై రామకృష్ణపై కేసు నమోదు చేశారు. కాగా, అత్యాచారం చేసిన సమయంలో నిందితుడు సెల్‌ఫోన్ ద్వారా వీడియో చిత్రీకరించాడని మహిళ కుటుంబ సభ్యులు ఆరోపించారు.

### డ్రైవర్‌కు గుండెపోటు

- అదుపుతప్పిన బస్సు..ఇద్దరికి గాయాలు
- ఆస్పత్రికి తరలిస్తుండగా డ్రైవర్ మృతి

**డిచ్‌పల్లి:** ఆర్టీసీ డ్రైవర్‌కు గుండెపోటు రావడంతో బస్సు అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందగా.. ఇద్దరు ప్రయాణికులు గాయపడ్డారు. డిచ్‌పల్లి ఎస్‌ఐ సురేశ్‌కుమార్ కథనం ప్రకారం.. బోధన్ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు హైదరాబాద్ నుంచి సోమవారం ఉదయం 8.30 గంటలకు బోధన్‌కు బయలు దేరింది. మార్గమధ్యలో డ్రైవర్ మారుతి (44) గుండెపోటుకు గురయ్యాడు. దీంతో వేగంగా వెళుతున్న బస్సు అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి సమీపంలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ కమాన్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మారుతితో పాటు బస్సులో ముందు సీట్లలో కూర్చున్న ప్రభాకర్, గంగారెడ్డి కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తుండగా డ్రైవర్ మారుతి మృతి చెందాడు.

### మధ్యవర్తులకు అనుమతి లేదు

**తహసీల్దార్ కార్యాలయం వద్ద బోర్డు**

**అల్లాదుర్గం:** ‘రైతులు నేరుగా వస్తే వారి సమస్యలను పరిష్కరిస్తాం.. తహసీల్దార్ కార్యాలయంలో దళారులు, పైరవీకారులు అడుగుపెడితే క్రిమినల్ కేసులు పెడతాం’ అని మెదక్ జిల్లా అల్లాదుర్గం తహసీల్దార్ సాయాగౌడ్ సోమవారం కార్యాలయం గోడకు బోర్డు రాయించారు. ఇటీవల రెవెన్యూ అధికారులపై అవినీతి ఆరోపణలు పెరిగిపోతున్న నేపథ్యంలో మధ్యవర్తులు, పైరవీకారులు, భూ సమస్యలకు సంబంధం లేని వ్యక్తులకు కార్యాలయంలోకి అనుమతి లేదని.. అనుమతి లేకుండా కార్యాలయంలోకి వస్తే కేసులు పెడతామన్నారు.

# మావోయిస్టు నేత రామన్నకు నివాళి



రామన్న మృతదేహం వద్ద విలపిస్తున్న మావోలు

**సాక్షి, కొత్తగూడెం:** మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి రావుల శ్రీనివాస్ అలియాస్ రామన్న మృతి పీడిత ప్రజలకు తీవ్రమైన నష్టమని ఆ పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార ప్రతినిధి వికల్ప్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామన్న ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరుస్తూ వర్గ పోరాటంలో ముఖ్య భూమిక పోషించాడని తెలిపారు. దోపిడీ, అణచివేతను అరికట్టి వర్గ పోరాటాన్ని ముందుకు తీసుకుపోవడంలో రామన్న పాత్ర ఎనలేనిదన్నారు. ఇక్కడి ప్రజా పోరాటాలను అణచడానికి, పార్టీ నాయకత్వాన్ని నిర్మూలించే లక్ష్యంతో 1990లో ప్రభుత్వ దమనకాండ అయిన మొదటి జన జాగరణ్ అభియాన్ నుంచి ఇప్పటి ‘సమాధాన్’దాడి వరకు అన్ని రకాల దాడులను ఓడించడంలో రామన్న ప్రధాన భూమిక పోషించాడని వివరించారు. దండకారణ్యంలో మొదటి మిలటరీ దళానికి కమాండర్ నుంచి సబ్‌జోన్ కమాండ్ ఇన్ చీఫ్‌గా, ఎస్‌ఎంసీ సభ్యుడిగా, 3వ కంపెనీ, బెటాలియన్–1 కార్యదర్శిగా ఉంటూ అనేక సైనిక చర్యలకు నాయకత్వం వహిస్తూ మిలటరీ చర్యలతో శత్రువు గుండెల్లో వణుకు పుట్టించాడని పేర్కొన్నారు. 36ఏళ్ల నుంచి దండకారణ్య పీడిత ప్రజల విముక్తి కోసం తన ప్రాణాలను త్యాగం చేశాడన్నారు.

### దేశంలో తగ్గిన నూనె గింజల సాగు

**మంత్రి నిరంజన్‌రెడ్డి**

**వనపర్తి:** దేశవ్యాప్తంగా నూనెగింజల పంటల సాగు తగ్గిపోవడంతో నూనెల దిగుమతి వల్ల ప్రజలపై ఏటా రూ.70 వేల కోట్ల భారం పడుతోందని మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం వనపర్తిలో జరిగిన వేరుశనగ సాగు, మార్కెటింగ్ అవగాహన సదస్సులో మాట్లాడారు. 70 శాతం ప్రజలు ఉపయోగించే పామాయిల్ మనకు మలేషియా, ఇండోనేషియా దేశాల నుంచి దిగుమతి అవుతోందని అన్నారు. దిగుమతి భారాన్ని తగ్గించుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా నూనె ఉత్పత్తికి అవసరమైన ఐదురకాల పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు రాష్ట్ర వ్యవసాయశాఖ కృషి చేస్తోందని వెల్లడించారు.

# దిశ కేసులో 'ఫైనల్ రిపోర్ట్'

**త్వరలోనే షాద్‌నగర్ కోర్టుకు సమర్పణ..**

**సాక్షి, హైదరాబాద్:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిశ కేసులో పోలీసులు చార్జిషీటు దాఖలు చేయడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ కేసులోని నలుగురు నిందితులు ఎన్‌కౌంటర్‌లో మరణించిన నేపథ్యంలో వీరిపై నేరాభియోగపత్రం (చార్జిషీటు) దాఖలు చేయాల్సిన అవసరం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. త్వరలోనే సైబరాబాద్ పోలీసులు చార్జిషీటు స్థానంలో ఫైనల్ రిపోర్టును సమర్పించనున్నారని సమాచారం. నవంబర్ 27న శంషాబాద్ తొండుపల్లి టోల్‌గేట్ వద్ద 'దిశ'అపహరణ, హత్య నుంచి డిసెంబర్ 6న చటాన్‌పల్లిలో నిందితుల ఎన్‌కౌంటర్ వరకు జరిగిన ఘటనలన్నింటినీ వివరిస్తూ షాద్‌నగర్ కోర్టుకు ఫైనల్ రిపోర్టు సమర్పించనున్నారని ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఈ కేసులో నిందితులకు వేగంగా శిక్ష పడేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఆరంభానికి ముందే నిలిచిపోయింది. కోర్టు ఏర్పాటు ప్రకటన అనంతరం నిందితులంతా హతమవ్వడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఇప్పుడు సైబరాబాద్ పోలీసులు ఫైనల్ రిపోర్టును రూపొందించే పనిలో పడ్డారు. ఇది సమర్పించాక ఇక దర్యాప్తు దాదాపుగా ముగిసినట్లేనని ఓ సీనియర్ అధికారి వ్యాఖ్యానించారు. ఎన్‌కౌంటర్‌పై విచారణ చేయడానికి రాచకొండ కమిషనర్ మహేశ్ భగవత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తన విచారణను కొనసాగించనుంది. ఇక ఎన్‌కౌంటర్ బూటకమంటూ సుప్రీంకోర్టులు పలు పిటిషన్లు దాఖలు కావడంతో దీనిపై విచారణకు ముగ్గురు సభ్యులతో ప్రత్యేక కమిషన్ ఏర్పాటైన సంగతి తెలిసిందే. ఈ కమిటీ వారం రోజుల్లోపు నగరానికి రావొచ్చని డీజీపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ కమిషన్ సిఫార్సు మేరకే నిందితుల మృతదేహాల అప్పగింతపై తుది నిర్ణయం ఉంటుంది. అయితే తమ కుమారుల మృతదేహాలు త్వరగా అప్పగించాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

# నయాఖిల్లాలో తాజ్ లాంటి ఉద్యానవనం

**'గోల్కొండ' తవ్వకాలను పరిశీలించిన ఇంటాక్ కన్వీనర్**

**సాక్షి, హైదరాబాద్:** పురావస్తుశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న గోల్కొండ కోటలోని నయా ఖిల్లా తవ్వకాలను సోమవారం ఇంటాక్ కన్వీనర్ అనురాధారెడ్డి పరిశీలించారు. 16వ శతాబ్దంలో ఆగ్రాలో తాజ్‌మహల్ ఆవరణలో నిర్మించిన మెహ్‌తాబ్ బాగ్ కంటే ముందే ఇక్కడ బాగ్ (ఉద్యానవనం)ను నిర్మించారని, అక్కడికి ఇక్కడికి అనేక సారూప్యతలు కనిపిస్తున్నాయని ఆమె అభిప్రాయపడ్డారు. తాజ్‌మహల్ వద్ద అభివృద్ధి చేసినట్లు ఇక్కడ కూడా అభివృద్ధి చేయాలని ఆమె కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇక్కడి తవ్వకాల్లో గతంలో చైనాకు చెందిన గాజు పాత్రలు, ఇతర వస్తువులు లభ్యమయ్యాయని, ఇప్పుడు కూడా అనేక రాతి శిలలు బయటపడుతున్నాయని తెలిపారు. తవ్వకాలను పకడ్బందీగా నిర్వహించి, ఇక్కడి స్థలాలను పురావస్తుశాఖ పరిరక్షించాలని, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని ఆమె కోరారు.



సోమవారం చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద విజయవాడ వైపు బారులుదీరిన వాహనాలు

# రెండో రోజు అదే తీరు

- పంతంగి, గూడూరు టోల్‌ప్లాజాల వద్ద వాహనాల రద్దీ
- నగదు చెల్లింపు మార్గాల్లో వాహనదారుల అవస్థలు
- ఫాస్టాగ్ లేని వాహనదారుల నుంచి రెండింతల రుసుము వసూలు

**చౌటుప్పల్/బీబీనగర్:** హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద రెండో రోజు సోమవారం కూడా వాహనాల రద్దీ కొనసాగింది. ఇక్కడ 16 గేట్లకుగాను ఫాస్టాగ్ ఉన్న వాహనాల కోసం ఇరువైపులా 5 చొప్పున గేట్లను కేటాయించారు. ఫాస్టాగ్ లేని వాహనాల కోసం ఇరువైపులా 3 చొప్పున ద్వారాలు పని చేస్తున్నాయి. అయితే ఫాస్టాగ్ లేని వాహనాలే అధిక సంఖ్యలో వస్తుండడంతో రద్దీ నెలకొంది. కాగా మొదటి రోజున టోల్‌గేట్‌కు ఇరువైపులా సిబ్బంది నిల్చొని ఫాస్టాగ్, క్యాష్ కౌంటర్ మార్గాలను వాహనదారులకు చూపించారు. రెండో రోజు సిబ్బంది లేకపోవడంతో వాహనదారులు అయోమయానికి గురయ్యారు. తమకు కేటాయించిన ద్వారాల్లోకి కాకుండా ఇతర ద్వారాల్లోకి వెళ్లడంతో గందరగోళం నెలకొంది. ఫాస్టాగ్ కౌంటర్‌లలోకి వెళ్లిన ఫాస్టాగ్ కార్డులు లేని వాహనదారులు రెండింతల రుసుము చెల్లించాల్సి వచ్చింది. ఈ సందర్భంగా రద్దీ ఏర్పడడంతో వారు ఇబ్బందులు పడ్డారు. అలాగే హైదరాబాద్–వరంగల్ మార్గంలో బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద ఫాస్టాగ్ కార్డులు పొందని వాహనదారులకు నిరీక్షణ తప్పలేదు.

## 19న లోకాయుక్త ఎంపిక కమిటీ భేటీ

- హెచ్‌ఆర్సీకి కూడా ఇద్దరు సభ్యుల నియామకం
- సీఎం నేతృత్వంలో సమావేశం కానున్న ఎంపిక కమిటీలు
- హెచ్‌ఆర్సీ ఇన్‌చార్జి చైర్మన్‌గా నిరంజన్‌రావు?

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ లోకాయుక్త చైర్మన్, ఉపలోకాయుక్త పోస్టుల తోపాటు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సభ్యుల నియామకం కోసం ఈ నెల 19న ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నేతృత్వంలో రెండు వేర్వేరు ఎంపిక కమిటీలు సమావేశం కానున్నాయి. లోకాయుక్తగా హైకోర్టు మాజీ జడ్జి, ఉపలోకాయుక్తగా రిటైర్డు జిల్లా జడ్జిని నియమించేందుకు కేసీఆర్ నేతృత్వంలోని కమిటీ సమావేశమై నిర్ణయం తీసుకోనుంది. రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్, ఇద్దరు సభ్యుల పోస్టులు ఖాళీగా ఉండగా, ప్రస్తుతానికి కేవలం ఇద్దరు సభ్యులను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సభ్యుల నియామకం కోసం సీఎం నేతృత్వంలో శాసనసభ, శాసనమండలి విపక్ష నేతలు, శాసనమండలి చైర్మన్, అసెంబ్లీ స్పీకర్, హోంమంత్రితో కూడిన ఎంపిక కమిటీ సమావేశం కానుంది. రిటైర్డు జిల్లా జడ్జిని ఓ సభ్యుడిగా, మానవ హక్కుల కార్యకర్తను మరో సభ్యుడిగా ప్రభుత్వం నియమించే అవకాశముంది. రాష్ట్ర న్యాయ శాఖ కార్యదర్శిగా డిప్యుటేషన్‌పై సుదీర్ఘంగా పనిచేసిన జిల్లా జడ్జి వి.నిరంజన్‌రావు ఇటీవల స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ఆయన్ను హెచ్‌ఆర్సీ సభ్యుడిగా నియమించి ఇన్‌చార్జి చైర్మన్‌గా అదనపు బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. ముఖ్యమంత్రి నేతృత్వంలో ఎంపిక కమిటీల సమావేశాలు ముగిసిన వెంటనే ఈ నియామకాలకు సంబంధించిన ఉత్తర్వులు రానున్నాయి.

## ఎక్సైజ్‌శాఖ డైరెక్టర్‌గా సర్ఫరాజ్ అహమ్మద్

**రెవెన్యూకు బుసాని వెంకటేశ్వర్లు.. కరీంనగర్ కలెక్టర్‌గా శశాంక**

**సాక్షి, హైదరాబాద్:** కరీంనగర్ జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్ అహమ్మద్‌కు ప్రభుత్వం కీలకమైన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ పదవిని కట్టబెట్టింది. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ ఇప్పటివరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు చూస్తుండగా, ఆయన్ను తప్పించి ఆ విభాగాన్ని సర్ఫరాజ్ అహమ్మద్‌కు అప్పగించింది. ఈ మేరకు రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మూడేళ్ల పాటు కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సర్ఫరాజ్ అహమ్మద్ ఇటీవల వార్తల్లో నిలిచారు. గత శాసనసభ ఎన్నికల వ్యయం లెక్కల విషయంలో తనకు వ్యతిరేకంగా కలెక్టర్ సర్ఫరాజ్ అహమ్మద్ స్థానిక బీజేపీ ఎంపీ బండి సంజయ్‌తో కలసి కుట్ర చేశారని జిల్లా మంత్రి గంగుల కమలాకర్ తీవ్ర ఆరోపణలు చేశారు. దీనిపై ఆయన సీఎం కేసీఆర్‌కు కలసి ఫిర్యాదు సైతం చేశారు. అయితే, కలెక్టర్‌గా మూడేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో సర్ఫరాజ్‌ను బదిలీ చేసినట్టు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఈ వివాదం తర్వాత ఆయనకు అనూహ్యంగా కీలకమైన ఎక్సైజ్ శాఖ పోస్టు లభించడం గమనార్హం.

**రెవెన్యూ కార్యదర్శిగా బుసాని**

డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం అదనపు డైరెక్టర్ జనరల్ బుసాని వెంకటేశ్వర్లును రెవెన్యూ శాఖ (విపత్తుల నిర్వహణ) కార్యదర్శిగా ప్రభుత్వం బదిలీ చేసింది. వెయిటింగ్‌లో ఉన్న ఎ.అశోక్‌ను డాక్టర్ మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం అదనపు డైరెక్టర్ జనరల్‌గా బదిలీ చేసింది. జోగుళాంబ–గద్వాల జిల్లా కలెక్టర్ కె.శశాంక కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. వనపర్తి జిల్లా కలెక్టర్ శ్వేతా మహంతికి జోగుళాంబ–గద్వాల జిల్లా కలెక్టర్‌గా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది.

## జీఎస్టీ బకాయిల విడుదల

**సాక్షి, న్యూఢిల్లీ:** రాష్ట్రానికి రావాల్సిన జీఎస్టీ పరిహార బకాయిల్లో రూ. 1,036 కోట్లను కేంద్రం విడుదల చేసినట్టు తెలంగాణ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ తెలిపారు. వివిధ రాష్ట్రాలకు కేంద్రం జీఎస్టీ పరిహార బకాయిల కింద రూ. 35,298 కోట్ల నిధులు విడుదల చేసిందని, ఇందులో రాష్ట్రానికి రూ. 1,850 కోట్లు రావాల్సి ఉండగా రూ. 1,036 కోట్లు విడుదలయ్యాయని వెల్లడించారు. ఐజీఎస్టీ కింద రూ. 2,350 కోట్లు రావాల్సి ఉందన్నారు. అలాగే వెనుకబడిన జిల్లాల అభివృద్ధి ప్యాకేజీకి సంబంధించి రూ. 450 కోట్ల మేర నిధులు విడుదల కావాల్సి ఉందని పేర్కొన్నారు.

## ఇకపై ఉద్యోగులుగా పిలవాలి: ఆర్టీసీ ఎండీ

**సాక్షి, హైదరాబాద్:** ఇకపై ఆర్టీసీలో పనిచేసే వారందరినీ ఉద్యోగులుగానే సంబోధించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఆర్టీసీ సమ్మె అనంతరం ఇటీవల ప్రగతిభవన్‌లో ఆర్టీసీ ఉద్యోగుల కోసం సీఎం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలోనే కేసీఆర్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. తాజాగా సీఎం ఆదేశాలను అమలు చేస్తూ.. ఇకపై ఆర్టీసీ సిబ్బంది మొత్తాన్ని ఉద్యోగులుగానే సంబోధించాలని, కార్మికులు అన్న పదం వాడకూడదని ఆర్టీసీ ఇన్‌చార్జి ఎండీ సునీల్ శర్మ సర్క్యులర్‌లో స్పష్టం చేశారు.

## నాగర్ కర్నూలు మైన్స్ ఏడీ సస్పెన్షన్

**సాక్షి, హైదరాబాద్:** కంకర క్వారీ లీజు విషయంలో ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటూ ఈ నెల 3న ఏసీబీకి చిక్కిన నాగర్ కర్నూలు భూగర్భ జల వనరుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)ని సస్పెండ్ చేస్తూ పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏడీకి ఈ నెల 18 వరకు జ్యుడీషియల్ రిమాండు విధించడంతో సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఏడీపై నమోదైన క్రిమినల్ కేసు పరిష్కారమయ్యేంత వరకు సస్పెన్షన్ కొనసాగుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## పందుల పెంపకం కోసం కమిటీ: తలసాని

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో పందుల పెంపకంపై ఆసక్తి ఉన్న వారికి సాయం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. ప్రభుత్వం చేయదగిన సాయాన్ని అధ్యయనం చేసేందుకు పందుల పెంపకందారులు, అధికారులతో కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సోమవారం మాసాబ్‌ట్యాంక్‌లోని ఆ శాఖ కార్యాలయంలో పిగ్ బ్రీడింగ్ పాలసీపై ఆయన సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో వేలాది కుటుంబాలు పందుల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నాయని, జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో ఈ మాంసానికి మంచి డిమాండ్ ఉందని అన్నారు.

## టీజేఎఫ్‌ఓఏ నూతన కార్యవర్గం ఎన్నిక

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజేఎఫ్‌ఓఏ) అధ్యక్షుడిగా మహ్మద్ మొజం అలీఖాన్, ప్రధాన కార్యదర్శిగా భావ్య నాయక్, కోశాధికారిగా ప్రశాంత్ ఎన్నికయ్యారు. సోమవారం అరణ్య భవన్‌లో మూడేళ్ల కాల వ్యవధి కోసం (2020–23) రాష్ట్ర స్థాయి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో భాగంగా రాష్ట్ర స్థాయిలో 5 సర్కిల్ యూనిట్లు, 7 జోనల్ యూనిట్ల ప్రతినిధులను అటవీశాఖ ఉద్యోగులు ఎన్నుకున్నారు.

## ఈనెల 28 నుంచి ట్రస్మా విద్యా సదస్సు

**సాక్షి, హైదరాబాద్:** ఈ నెల 28, 29 తేదీల్లో హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఎడ్ ఎక్స్–2019 పేరుతో విద్యా సదస్సును తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) నిర్వహించనుందని సంఘం ప్రధాన కార్యదర్శులు యాదగిరి, శేఖర్‌రావు తెలిపారు.

# మొహం చాటేస్తున్న ఉల్లి

- పొరుగు రాష్ట్రాల నుంచి నిలిచిన సరఫరా
- కర్ణాటక నుంచి పూర్తిగా బంద్.. మహారాష్ట్ర నుంచి కేవలం 4వేల బస్తాల రాక
- గ్రేడ్–1 ఉల్లి హోల్‌సేల్‌లో రూ.110, రిటైల్‌లో రూ.130

**సాక్షి, హైదరాబాద్:** దేశీయంగా ఉల్లి ధర ఒడిదొడుకులు ఎదుర్కొంటోంది. డిమాండ్‌కు తగ్గట్లు సరఫరా ఉన్న రోజు ధరలు దిగొస్తుండగా, సరఫరా తగ్గిన రోజు ధరలు పుంజుకుంటున్నాయి. పొరుగు రాష్ట్రాల సరఫరాపైనే రాష్ట్రం పూర్తిగా ఆధారపడిన నేపథ్యంలో అక్కడినుంచి ఉల్లి రాక మొహం చాటేస్తుండటంతో ధరల్లో స్థిరత్వం ఉండటం లేదు. రెండ్రోజుల కిందటి వరకు ఉల్లి దిగుమతి ఎక్కువగా ఉండి కాస్త దిగొచ్చినట్లు కనిపించిన మళ్లీ సోమవారం అమాంతం పెరిగింది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు నుంచి సరఫరా నిలిచిపోవడంతో రిటైల్ మార్కెట్‌లో రూ.130 వరకు పలుకుతోంది.

**మహారాష్ట్రలోనే హెచ్చుతగ్గులు..**

రాష్ట్రానికి 50శాతానికి పైగా ఉల్లి మహారాష్ట్ర నుంచి వస్తుండగా, అక్కడే ధరల్లో ఏరోజుకారోజు ధరల నిర్ణయం జరుగుతోంది.అది కూడా డిమాండ్, దాని గ్రేడ్ ఆధారంగా ధరల్లో హెచ్చుతగ్గులుంటున్నాయి. నిన్నమొన్నటి వరకు పుణే, షోలాపూర్‌లో ఉల్లి ధరలు క్వింటాల్‌కు రూ.80వేల నుంచి రూ.90వేలు పలుకగా, అది సోమవారం రూ.11వేల నుంచి రూ.12వేలకు చేరింది.ఉల్లికి మంచి ధర పలుకుతుండటం, అదే సమయంలో ఢిల్లీ, గుజరాత్, హరియాణా రాష్ట్రాల నుంచి డిమాండ్ అధికంగా ఉండటంతో రాష్ట్రానికి ఉల్లి సరఫరా తగ్గింది. దీంతో ప్రతిరోజూ మహారాష్ట్ర నుంచి 6వేలకు పైగా బస్తాలు వస్తూ ఉండగా, అది సోమవారం 4వేల బస్తాలకు తగ్గింది. దీంతో సోమవారం మలక్‌పేట మార్కెట్‌లో గ్రేడ్–1 రకం ఉల్లి కిలో రూ.110 పలికింది. ఇది రిటైల్ మార్కెట్‌కు వచ్చేసరికి రూ.130 నుంచి రూ.140 పలికింది. గ్రేడ్–2 ఉల్లి ధర కిలో రూ.70 నుంచి రూ.60 పలుకగా, అది రిటైల్‌లో రూ.80–90మధ్య పలుకుతోంది. ఇక కర్ణాటక నుంచి ఉల్లి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. సోమవారం ఒక్క బస్తా కూడా రాలేదు. అక్కడే డిమాండ్ పెరిగిపోవడం, ధర కిలోకు రూ.110 వస్తుండటంతో ఇక్కడికి తీసుకురావడం లేదు. కర్నూలు నుంచి అదే పరిస్థితి ఎదురవుతోంది. అక్కడి ప్రభుత్వమే ఎంత ధరకైనా వ్యాపారుల నుంచి కొనుగోలు చేసి రాయితీపై ప్రజలకు విక్రయిస్తుండటంతో ఏపీలోనే డిమాండ్ అధికమైపోయింది. దీంతో తెలంగాణకు సరఫరా తగ్గి ధరలు పెరుగుతున్నాయి. ఇక ఈజిప్టు నుంచి ఉల్లి రావాల్సి ఉన్నా అది ఇంత వరకూ రాలేదు. ఈ ఉల్లి ముంబాయి పోర్టుకు వచ్చాక అక్కడి నుంచి రాష్ట్రానికి లారీల్లో తెచ్చేందుకు మరో రెండు, మూడు రోజులు పట్టొచ్చని మార్కెటింగ్ వర్గాలు చెబుతున్నాయి.



**ఒక ఈజిప్టు ఉల్లి 250 గ్రాములు..**

**చాదర్‌ఘాట్:** ఇదిగో ఈజిప్టు ఉల్లి.. చూశారా.. ఒక ఉల్లి బరువే పావు కిలో ఉంది. మహారాష్ట్రకు చెందిన ఒక రైతు ఈజిప్టు ఉల్లిని దిగుమతి చేసుకుని.. మలక్‌పేట మార్కెట్లో అమ్మాడు. క్విం టాల్ రూ.11 వేలకు కొనుగోలు చేశామని.. రిటైల్‌లో కిలో రూ.150 వరకూ అమ్మినట్లు తెలిపాడు. ఈజిప్ట్ ఉల్లి గడ్డ పెద్దదిగా ఉండటంతో వినియోగదారులు వాటిని ఆసక్తిగా చూశారు.

# 2,98,64,689 మంది ఓటర్లు

**ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటన**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో 2,98,64,689 మంది ఓటర్లున్నారు. ఇందులో 1,50,07,047 మంది పురుషులు, 1,48,56,076 మంది మహిళలు, 1,566 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం 2020లో భాగంగా సోమవారం ముసాయిదా ఓటర్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) రజత్‌కుమార్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వచ్చే నెల 15 వరకు ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, తప్పుల సవరణకు దరఖాస్తులతో పాటు కొత్త ఓటర్ల నమోదు దరఖాస్తులను స్వీకరించనున్నారు. జనవరి 27 నాటికి ఈ దరఖాస్తులను పరిష్కరించి ఫిబ్రవరి 7న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. 2020 జనవరి 1 నాటికి 18 ఏళ్ల వయస్సు కలిగి ఉండి, ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు లేని వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవడానికి దరఖాస్తు చేసుకోవాలని రజత్‌కుమార్ సూచించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా రాష్ట్రంలో కొత్తగా 105 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతిచ్చింది. దీంతో మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 34,707కి పెరిగిందని రజత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

## త్వరలో మొబైల్ ఫిష్ ఔట్‌లెట్లు: తలసాని

**సాక్షి, హైదరాబాద్:** చేపల విక్రయాల కోసం రాష్ట్రంలో త్వరలోనే మొబైల్ ఫిష్ ఔట్‌లెట్లు ప్రారంభిస్తామని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.18 కోట్ల వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా వీటిని ఏర్పాటు చేస్తామని, ప్రయోగాత్మకంగా జీహెచ్‌ఎంసీ పరిధిలోని 150 డివిజన్లలో ఈ ఔట్‌లెట్లను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. సోమవారం మాసబ్‌ట్యాంక్‌లోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్‌తో కలసి మత్స్య సహకార సంఘాల అభివృద్ధి, సభ్యత్వ నమోదు తదితర అంశాలపై మత్స్య శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మొబైల్ ఫిష్ ఔట్‌లెట్లకు సంబంధించిన మార్గదర్శకాలను త్వరలోనే తయారు చేస్తామని చెప్పారు.

# పెట్టుబడులకు కెనడా ఆసక్తి

**మంత్రి కేటీఆర్‌తో ఆల్‌బెర్టా ప్రావిన్సు మంత్రి భేటీ**



ప్రసాద్ పండాను సత్కరిస్తున్న మంత్రి కేటీఆర్, జయేశ్ రంజన్

**సాక్షి, హైదరాబాద్:** కెనడాలోని ఆల్‌బెర్టా ప్రావిన్సు పారిశ్రామిక వర్గాలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయని ఆల్‌బెర్టా ప్రావిన్సు మౌలిక వసతుల శాఖ మంత్రి ప్రసాద్ పండా చెప్పారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌తో జరిగిన భేటీలో ఇరు ప్రాంతాల నడుమ వ్యాపార, వాణిజ్య అవకాశాలపై పండా చర్చించారు. తెలంగాణలో ఐటీ రంగం పురోగమిస్తున్న తీరుపై సానుకూల స్పందన కనిపిస్తోందని, రాష్ట్రంలో ఉన్న పెట్టుబడి అవకాశాలు, పారిశ్రామిక విధానం, ఇతర అనుకూలతలు వివరించేందుకు తమ ప్రావిన్సులో పర్యటించాల్సిందిగా కేటీఆర్‌ను పండా ఆహ్వానించారు. తమ ప్రావిన్సులో తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మను ఘనంగా నిర్వహిస్తామని, శాంతియుత ఉద్యమం ద్వారా రాష్ట్రాన్ని సాధించి, కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తీరుపై తమకు ఎంతో గౌరవం ఉందని వ్యాఖ్యానించారు. తెలంగాణ పారిశ్రామిక విధానం టీఎస్ఐపాస్ ద్వారా పేరొందిన కంపెనీలను తెలంగాణకు రప్పించిన తీరుపై పండాకు కేటీఆర్ వివరించారు. భేటీలో పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్, ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

# తెలంగాణ.. దేశానికే ఆదర్శం

- ఇతర రాష్ట్రాలు మన పథకాల వైపే చూస్తున్నాయి
- అద్భుత ఫలితాలిస్తున్న మిషన్ భగీరథ
- మాంద్యాన్ని అధిగమించడానికి సూచనలివ్వండి
- 'విజన్ తెలంగాణ' సదస్సులో మంత్రి హరీశ్



**నాంపల్లి:** అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ.. దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. సోమవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'విజన్ తెలంగాణ'ఇంటరాక్టివ్ సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచిన గుజరాత్, కేరళ రాష్ట్రాలు సైతం తెలంగాణ వైపు చూస్తున్నాయన్నారు. మొన్న ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో తెలంగాణలో అమలవుతున్న మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, రైతుబంధు వంటి పథకాలను తీసుకువస్తామని మేనిఫెస్టోలో పార్టీలు పేర్కొనడం జరిగిందని గుర్తు చేశారు. ఐదేళ్లలోనే కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం సాధించిన ప్రగతిని ప్రజలు గమనిస్తున్నారు. మిషన్ భగీరథ అద్భుత ఫలితాలను ఇస్తున్నట్లు పేర్కొన్నారు. టీఎస్ ఐపాస్ పాలసీని అందుబాటులోకి తీసుకొచ్చి పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి పథంలో పయనింపజేస్తున్నట్లు వివరించారు. మిషన్ భగీరథ కింద 1.70 లక్షల పైపులైన్లు వేసి ఇంటింటికి తాగేందుకు మంచినీరు అందిస్తున్నట్లు చెప్పారు. పరిశ్రమల ప్రోత్సాహానికి మంత్రి కేటీఆర్ నిత్యం తనపై ఒత్తిడి తీసుకువస్తున్నారని, పరిశ్రమల స్థాపనతో ఉపాధి, ఉత్పత్తులను పెంపొందించుకోవడానికి వీలుంటుందని పదే పదే చర్చిస్తున్నారని వివరించారు. భూ సేకరణతో వరంగల్ జిల్లాలో ఏర్పాటు చేయనున్న టెక్స్‌టైల్ పార్కు ఆలస్యమవుతోందని, ఈ సమస్యను సత్వరమే పరిష్కరించి కొద్ది నెలల్లోనే ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తామని తెలిపారు. ఆర్థిక మాంద్యాన్ని అధిగమించడానికి ప్రభుత్వానికి పారిశ్రామిక వేత్తలు సూచనలు చేయాలని కోరారు. అలాగే రెవెన్యూ శాఖలో జవాబుదారీతనం పెంచేందుకు కొత్త చట్టాన్ని తీసుకొచ్చేందుకు సీఎం కేసీఆర్ కృతనిశ్చయంతో ఉన్నట్లు సభికులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు కరుణేంద్ర జాస్తి, సీనియర్ ఉపాధ్యక్షుడు రమాకాంత్ ఇనానీ, ఉపాధ్యక్షుడు కె.భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

WALK IN INTERVIEW
Applications are invited for the following positions in API/Bulk Drug Manufacturing industry. Fresh or Min 2-5 years experience in the respective fields with **Intermediate/ B.Sc/M.Sc/B.Pharmacy qualification.**
1. Production Assistant 2. Production Tr. Chemist
3. Production Chemist 4. Production Incharge
Interested candidates may attend for the **Walk In Interview** between **17.12.2019 to 31.12.2019** from **10.00 am to 5.00 pm** at below given Factory.
INCHEM LABORATORIES PVT LTD
IDA, Kondapalli, Vijayawada, Cell:9959806383
If unable for walk in, pls send resume to **office.inchemlabs@gmail.com**

VIRCHOWS Walk-in-interview
VIRCHOW PETROCHEMICAL PVT LTD.,A leading Bulk Drug Manufacturing Industry requires the following Candidates:
1. **Maintenance Manager:** The candidate should have Diploma/B.Tech (Mech.) with 15 to 20 years experience in a similar field in a reputed chemical / bulk drug industry.
2. **E.T.P. Head:** The candidate should have B.Sc/M.Sc/B.Tech (Chem.) with 10 to 15 years experience in Bio ETP and RO Plant operations in a reputed chemical / bulk drug industry.
3. **Production Chemist:** The candidate should have B.Sc/M.Sc with 2 to 5 years experience in a reputed chemical / bulk drug industry. Preferable in Cephalosporin's
4. **R&D Team Leader:** The candidate should have M.Sc (Organic Chemistry) with 5 to 10 years experience in a similar field in a reputed API Units.
5. **R&D Chemist:** The candidate should have M.Sc (Organic Chemistry) with 2 to 5 years experience in a similar field in a reputed API Units.
6. **Q.C.Chemist:** The candidate should have M.Sc (Chemistry) with 2 to 5 years experience in a similar field in a reputed chemical/bulk drug industry.
7. **Fitter & Electrician:** The candidate should have ITI with 2 to 5 years experience in a similar
- Work Location: Unit - II Jadcherla, Mahabubnagar Dist.
- Only Male candidates are eligible
- Freshers having good academic background are also eligible to attend interview

**Walk-in-interview** on 21.12.2019 from 1:00 PM onwards. at the following Address Please bring Bio-data along with Original Certificates and set of Xerox copies, Latest Pay Slip.
GENERAL MANAGER
VIRCHOW PETROCHEMICAL PVT LTD
PLOT NO.17A,PHASE-1,IDA PATANCHERU,
SANGAREDDY DIST. PH:08455-240092,244898
E-Mail: vpcpl@virchows.com

WALK- IN INTERVIEW
On 22.12.2019 (Sunday) from 10.00 AM to 4.00PM At
S.B. Organics Limited
Survey No: 352 & 353, Chandapur(V), Hathnoora(M), Sangareddy(D), PIN-502296.
A reputed **Pellets** Manufacturing company in Hyderabad is require the following candidates
CHEMIST/EXECUTIVE - QUALITY CONTROL
**No. of Vacancies:** 10 Nos, **Experience:** 3-5 Years
Experience on HPLC(with empower software) and Dissolution Instrument (preferable)
**Qualification:** B.Sc/M.Sc or B.Pharmacy/M.Pharmacy
**Salary:** As per Market Standards (Negotiable)
OPERATOR/EXECUTIVE - PRODUCTION
**No. of Vacancies:** 15 Nos, **Experience:** 3-5 Years
Experience on Fluid Bed Coater and Coating Pan
**Qualification:** SSC/Inter/Diploma/B.Pharmacy
**Salary:** As per Market Standards (Negotiable)
Interested candidates can send your CV to **hr@sborganicsltd.com**

సాక్షి
మంగళవారం, డిసెంబర్, 17

# అనర్థదాయకం

పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సాగుతున్న ఆందోళనల్లో చోటుచేసుకుంటున్న విధ్వంసం, పోలీసుల చర్యలు ప్రజాస్వామ్యవాదులందరినీ కలవరపరుస్తున్నాయి. ఒక నగరమని కాదు, ఒక విశ్వవిద్యాలయమని కాదు... దేశవ్యాప్తంగా ఎన్నోచోట్ల ఈ చట్టంపై ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. న్యూఢిల్లీ, లక్నో, వారణాసి, ముంబై, చెన్నై, హైదరాబాద్, తిరువనంతపురం నగరాల్లో విద్యార్థులు రోడ్లపైకి వచ్చారు. ఈ ఆందోళనలకు దిగినవారంతా ఆ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నా అందుకు ఎవరి కారణాలు వారికున్నాయి. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఈ చట్టం పౌరుల్ని మత ప్రాతిపదికన విభజిస్తోందని ఆరోపిస్తున్నవారితోపాటు తమ రాష్ట్రాల్లోకి అక్రమంగా వలస వచ్చినవారిలో కొందరిని ఇక్కడే ఉంచడానికి ఈ చట్టం వీలు కల్పిస్తోందని ఈశాన్య రాష్ట్రాల పౌరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బిల్లులో శ్రీలంక తమిళ శరణార్థుల ప్రస్తావన లేకపోవడంతో తమిళనాడులో నిరసన గళాలు వినిపిస్తున్నాయి. ఈ ఆందోళన ప్రభావం ఏ స్థాయిలో ఉందంటే ఎన్‌డీఏ మిత్రపక్షాలు అసోం గణ పరిషత్(ఏజీపీ), జేడీ(యూ)లు కూడా ఇప్పుడు పౌరసత్వ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఆ చట్టాన్ని రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలంటూ ఏజీపీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తానని తెలిపింది. ఢిల్లీలోని జామియా మిలియా విశ్వవిద్యాలయం విద్యార్థులు చేస్తున్న ఆందోళన హింసాత్మకంగా మారడం, పోలీసులపై దాడులు చేసి వారిని రక్తాలు కారేలా కొట్టడం, దాన్ని నియంత్రించే పేరు మీద పోలీసులు దాడి చేయడం వంటి దృశ్యాలు చానెళ్లలో చూసి అందరూ దిగ్భ్రాంతి చెందుతున్నారు. విశ్వవిద్యాలయం వెలుపల జరిగిన విధ్వంసంపైనా, తమపై జరిగిన దాడులపైనా దర్యాప్తు చేయడం పోలీసుల బాధ్యతే. దాన్నెవరూ కాదనరు. కానీ ఆ పేరు మీద జామియాలోని లైబ్రరీపై, అక్కడి వాష్‌రూంపై దాడి చేసి దొరికినవారిని దొరికినట్టు కొట్టి తీవ్రంగా గాయపర్చడం, విద్యార్థినులను సైతం కొట్టడం సరైన చర్య కాదు. ఈ ఆందోళన సాకుగా తీసుకుని సంఘ వ్యతిరేక శక్తులు విధ్వంసానికి దిగాయని జామియా విద్యార్థులు కూడా ఆరోపించారు. తాము శాంతియుతంగా ఆందోళన చేయదల్చుకున్నాం తప్ప, హింసకు దిగే ఉద్దేశం లేదని వారు చెప్పారు. బహుశా సరైన చర్యలు తీసుకుని ఉంటే సోమవారంనాటికి ఈ ఉద్రిక్త వాతావరణం ఎంతో కొంత సడలేది. కానీ అందుకు విరుద్ధంగా అది మరింత తీవ్ర రూపం దాల్చింది. జామియాలోనూ, అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయంలోనూ పోలీసులు దాడులు చేయడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా అనేక విశ్వవిద్యాలయాలు, ఐఐటీలు, ఇతర విద్యాసంస్థల విద్యార్థులు నిరసనలకు దిగారు. తాము ఎంతో సహనంతో ఉన్నామని పోలీసులు చెబుతున్నారు. కానీ జామియాలో ముగ్గురు విద్యార్థులకు తగిలిన బుల్లెట్ గాయాలకు కారకులు ఎవరు?

ఉద్యమాల్లో అధిక సంఖ్యలో జనం పాల్గొంటున్నప్పుడు నిర్వాహకులకు వారిపై అదుపు ఉండదు. ఇది ఆసరా చేసుకుని సంఘ వ్యతిరేక శక్తులు ఆ ఉద్యమాలను పక్కదోవపట్టించే ప్రయత్నం చేస్తాయి. ఈ ప్రమాదాన్ని ఊహించబట్టే విశ్వవిద్యాలయం ఆవరణలోనే ఆందోళనలు నిర్వహించమని తాను విద్యార్థులకు సూచించానని జామియా మిలియా వైస్ చాన్సలర్ నజ్మా అఖ్తర్ చెబుతున్నారు. కారణం ఏమైనా విద్యార్థుల ఆందోళన రోడ్లపైకి వచ్చింది. కనీసం పోలీసులైనా విశ్వవిద్యాలయ అధికారుల నుంచి ముందస్తు అనుమతి పొంది అందులోకి ప్రవేశించి ఉంటే బాగుండేది. అప్పుడు లైబ్రరీని ధ్వంసం చేశారని, వాష్‌రూంలోకి చొరబడి విద్యార్థులను గాయపరిచారని ఆరోపణలొచ్చేవి కాదు. ఏ సమస్యపైన అయినా ఆందోళన జరుగుతున్నప్పుడు వీలైనంతవరకూ ఉద్రిక్తతలు తగ్గించడం ప్రధాన లక్ష్యంగా ఉండాలి. కానీ జామియాలో అందుకు విరుద్ధంగా జరిగింది. ఫలితంగా విద్యార్థుల ఆందోళన దేశవ్యాప్తంగా విస్తరించింది. రాజీవ్‌గాంధీ హయాంలో అస్సాం విద్యార్థులు అక్రమ వలసలను అరికట్టాలని కోరుతూ 1985లో జరిపిన ఉద్యమాన్ని ఈ తరహాలోనే అణచడానికి ప్రయత్నించినప్పుడు అదెలా విస్తరించిందో పాలకులకు గుర్తుండే ఉంటుంది. గత వారమంతా ఉద్రిక్తంగా ఉన్న అస్సాం సోమవారానికి కాస్త ఉపశమించింది. గువాహటిలో జరిగిన పోలీసు కాల్పుల్లో నలుగురు మరణించగా, 29 మందికి బుల్లెట్ గాయాలయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లో కూడా ఆందోళన హింసాత్మకం అయింది. కేవలం వదంతులు నమ్మి జనం ఆందోళనకు దిగుతున్నారని, విపక్షాలు వారిని పక్కదోవపట్టిస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెబుతున్నారు. కానీ ఈ చట్టం తీసుకొచ్చేముందు సమాజంలోని అన్ని వర్గాల వారితో చర్చించివుంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదు. జాతీయ పౌరసత్వ నమోదు (ఎన్ఆర్‌సీ)ని ఏదోమేరకు అంగీకరించిన అస్సాంలో సైతం ఇప్పుడు కొత్త చట్టంపై ఇంత బలమైన వ్యతిరేకత ఎందుకొచ్చిందో కేంద్ర ప్రభుత్వం ఆలోచించాలి. పరాయి దేశాల నుంచి వచ్చినవారిలో కొందరికి పౌరసత్వం ఇవ్వడానికి కొత్త చట్టం తీసుకొస్తున్నారని, ఇది తమ భాష, సంస్కృతి వగైరాలపై బలమైన ప్రభావం చూపడమేకాక... తమ ఉపాధిని సైతం దెబ్బతీస్తుందని అస్సాం పౌరులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంలో తలెత్తిన సందేహాలు నివృత్తి చేయడానికి బదులు ఎవరో కారకులని నిందించడం వల్ల ఉపయోగం లేదు.

దేశవ్యాప్తంగా ఇప్పుడు జరుగుతున్న ఆందోళనల్ని ఉపశమింపజేయడానికి ఏం చేయాలని ఆలోచించాల్సిన తరుణంలో మేఘాలయ గవర్నర్ తథాగత్ రాయ్ 'ఇక్కడుండటం ఇష్టంలేనివాళ్లు ఉత్తర కొరియా పోవచ్చు' అంటూ ట్వీట్ చేయడం బాధ్యతారాహిత్యం. ఇలాంటి నేతలను అదుపు చేయడంతోపాటు జరుగుతున్న ఆందోళనలపై దృష్టి పెట్టి, సందేహ నివృత్తి కోసం తగిన చర్యలు తీసుకోవడం అవసరమని కేంద్రం గుర్తించాలి. ప్రశ్నించడం దానికదే నేరం కాదు. ప్రజాస్వామ్యానికి అది ఎంతో అవసరం కూడా. ప్రశ్నించడానికి అవకాశం ఇచ్చినప్పుడు, సమస్యల్ని పరిష్కరించడానికి ప్రయత్నించినప్పుడు ఉద్యమాలు బయల్దేరవు. అవి ఉగ్రరూపం దాల్చవు.

### గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, తిథి బ.షష్ఠి రా.2.51 వరకు, తదుపరి సప్తమి నక్షత్రం మఖ రా.3.10 వరకు, తదుపరి పుబ్బ, వర్జ్యం ప.3.50 నుంచి 5.21 వరకు, దుర్ముహూర్తం ఉ.8.38 నుంచి 9.21 వరకు తదుపరి రా.10.36 నుంచి 11.28 వరకు, అమృతఘడియలు... రా.12.51 నుంచి 2.20 వరకు.

**సూర్యోదయం :** 6.27
**సూర్యాస్తమయం:** 5.25
**రాహుకాలం :** ప. 3.00 నుంచి 4.30 వరకు
**యమగండం :** ఉ.9.00 నుంచి 10.30 వరకు

# సాధికార శంఖారావం


వర్ధెల్లి మురళి

ఈ డిసెంబర్ నెల ఎందుకో కొంచెం స్పెషల్‌గా కనిపిస్తున్నది. వణికించే చలిగాలులు ఇంత వరకూ వీచిన దాఖలా లేదు. ఈసారి డిసెంబర్ మాసం రైతుల పాలిటి కరుణామయి లాగా కనిపిస్తున్నది. కల్లాల్లోని ఖరీఫ్‌ను–నాటేసుకుంటున్న రబీని కబళించే తుపాను దాడులకు తావీయలేదు. శ్రీ వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, మార్గశిర మాసం నడుస్తున్న ఈ డిసెంబర్ నెల మహిమాన్వితమైన మాసంగా ఉత్తేజపరుస్తున్నది. సాధికారత కోసం, సమాన హక్కులకోసం స్వప్నిస్తున్న మహిళలకు, పేద వర్గాలకూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ఖడ్గాలనూ, రక్షణ కవచాలను అందజేసింది. శాసనసభ శీతాకాల సమావేశాలు ఒక విప్లవాత్మక బిల్లును ఆమోదించాయి. మరో విప్లవాత్మక ప్రస్థానానికి అడ్డుగా నిలిచిన ముళ్లనూ, రాళ్లనూ ఏరివేశాయి. ఈ నేలనూ నింగినీ ఏలడానికి ముందుకొస్తున్న మహిళల పాలిటి తోడేళ్లుగా దాపురించిన మృగాళ్లను గురి తప్పకుండా వేటాడే ఏపీ–దిశ చట్టాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వం రూపొందించి సభ ఆమోదాన్ని తీసుకున్నది. పోటీ ప్రపంచంలో నెగ్గుకు రావడానికి ఒక దివ్యాస్త్రంలాగా ఉపయోగపడుతున్న అంశం ఇంగ్లిష్ మాధ్యమంలో విద్యాబోధన. ఆ దివ్యాస్త్రాన్ని పేద విద్యార్థులందరికీ ప్రసాదించడం కోసం వైఎస్ జగన్ ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీచేసింది. దానికి వ్యతిరేకంగా ఒక ఉద్యమాన్ని నిర్మించాలని ఉవ్విళ్లూరిన ప్రతిపక్షం ప్రజా చైతన్యాన్ని చూసి వెనకడుగు వేసింది. ఈ అసెంబ్లీ చర్చల్లో ఇంగ్లిష్ మాధ్యమంపై తెల్లజెండా చూపించి సంపూర్ణమైన లొంగుబాటును బేషరతుగా ప్రకటించింది.

మహిళల విద్యపై అప్రకటిత నిషేధం కొనసాగుతున్న రోజుల్లోనే, నూరేళ్లకు పూర్వం.. 'ముదితల్ నేర్వగరాని విద్యగలదే ముద్దార నేర్పించినన్' అని చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు ప్రశ్నించారు. నాటినుంచి నేటివరకు విద్యా– విజ్ఞాన రంగాల్లో మహిళల ప్రస్థానం జెట్ వేగంతో దూసుకొని వచ్చింది. ఎన్నోవిధాలుగా సామాజిక శృంఖలాలలో బంధించే ప్రయత్నాలు చేసినప్పటికీ ఆమె జైత్రయాత్రను సంపూర్ణంగా అడ్డుకోలేకపోయారు. రైలింజన్లూ, యుద్ధ విమానాలు నడపడంతోపాటు అంతరిక్షయానం దాకా ఆకాశమే హద్దుగా పురోగమిస్తున్నది. ఈ దశలో, ప్రత్యేకించి మనదేశంలో నెలకొన్న దురదృష్టకర పరిస్థితి మహిళా సాధికారతకు ఆటంకాలు సృష్టిస్తున్నది. మహిళలపై జరుగుతున్న హింసా, అత్యాచారాలు మనదేశంలోనే ఎక్కువ. రెండేళ్ల కిందటి అధికారిక లెక్కల ప్రకారమే సగటున రోజుకు 90 అత్యాచారాలు జరుగుతున్నాయి. ఇది పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు అవుతున్న కేసుల సంఖ్య మాత్రమే. ఫిర్యాదు చేయకుండా తమలో తాము కుమిలిపోతున్న వారి సంఖ్య ఇంతకు ఎన్నో రెట్లు ఎక్కువగా ఉండవచ్చు. చదువుకునే చోట, పనిచేసే ఆఫీసులో, ఇంట్లో–ఇరుగుపొరుగులో, బంధువర్గాల మధ్య, వీధుల్లో పోకిరీల నడుమ వేధింపులు, వెక్కిరింతలతో మానసిక వేదనకు గురికాని మహిళల సంఖ్య బహు స్వల్పం. స్త్రీని సహచరిగా కాక, తక్కువగా చూసే మన సాంస్కృతిక వారసత్వ భావజాలం కారణంగా కొందరి మెదళ్లలో 'మృగాళ్లు' మొలుస్తున్నాయి. అలా మొలకెత్తిన మృగాళ్లకు కడుపునిండా మద్యంపోసి, కంటినిండా అశ్లీలం పోసి ఏపుగా పెంచుతున్నాము. అలా పెరిగిన తోడేళ్లు మానవ రూపం కప్పుకొని యథేచ్ఛగా మహిళలపై దాడులు చేయగలుగుతున్నాయి. గజానికొక గాంధారీసుతుడు గాండ్రిస్తున్న నేలలో, విచ్చలవిడిగా కీచక సంతతి రెచ్చిపోతున్న వేళలో నిర్భీతిగా సంచరించే స్వేచ్ఛను మహిళ కోల్పోతున్నది. ఆ స్వేచ్ఛ లేనినాడు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించడం మహిళకు సాధ్యంకాదు. ఒక రకంగా మహిళా సాధికారతకు ఈ కీచక పర్వం ఆటంకంగా తయారైంది. తన పతి ప్రాణాలను అన్యాయంగా హరించారన్న కోపంతో యమ ధర్మరాజును నిలదీయడానికి బయల్దేరుతుంది సావిత్రి. యమపురిలోకి ప్రవేశించడానికి అడ్డుగా భయంకరమైన వైతరణీ నది ప్రవహిస్తుంటుంది. సావిత్రి తన లక్ష్యాన్ని సాధించి పతిప్రాణాలను తిరిగి పొందాలంటే ఈ వైతరణీ సవాల్‌ను అధిగమించవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. నేటి మహిళ తన సాధికారతా లక్ష్యసాధన కోసం అత్యాచారాల రూపంలో జుగుప్సాకరంగా ప్రవహిస్తున్న వైతరణిని దాటవలసి వున్నది. అదిగో, అలా దాటడానికి ఉపయోగపడే ఒక పడవను ఏపీ దిశ యాక్ట్–2019 రూపంలో వైఎస్ జగన్ ప్రభుత్వం తయారు చేసింది. గతంలో ఇందుకోసమే కేంద్రం రూపొందించిన నిర్భయ చట్టం ఆచరణలో సత్ఫలితాలు ఇవ్వని నేపథ్యంలో అందులోని లోపాలను పరిహరిస్తూ, కట్టుదిట్టంగా, బాధితులకు సత్వర న్యాయం జరిగేలాగా ఈ బిల్లును ఏపీ ప్రభుత్వం తయారుచేసింది.

### జనతంత్రం



యావత్తు ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన శంషాబాద్ అత్యాచార ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వెటర్నరీ డాక్టర్ 'దిశ' పేరు మీద ఏపీ ప్రభుత్వం కొత్త చట్టాన్ని తెచ్చింది. దుర్మార్గాలకు బలవుతున్న ఆడబిడ్డల పట్ల ఒక అన్నగా, ఒక తండ్రిగా ఆలోచించి ఈ చట్టాన్ని తీసుకొచ్చినట్లు ఏపీ శాసనసభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రకటించారు. ఇది అమలులోకి వచ్చిన తర్వాత అత్యాచారం ఆలోచన వస్తేనే వెన్నులో వణుకు పుట్టాలని ఆయన హెచ్చరించారు. దిశ చట్టం ప్రకారం అత్యాచారం కేసుల్లో ఏడు పని దినాల్లోనే పోలీసు దర్యాప్తు పూర్తి కావాలి. మరో 14 పని దినాల్లో కోర్టు విచారణ పూర్తికావాలి. దోషం నిరూపితమైతే తప్పనిసరిగా మరణదండనే. ఇందుకోసం ఇండియన్ పీనల్ కోడ్‌లో కొత్తగా 354 (ఎఫ్) సెక్షన్‌ను చేర్చారు. అదేవిధంగా సోషల్ మీడియా వేదిక ద్వారా మహిళలపై జరిగే వేధింపులపై కూడా కఠిన శిక్షలను ప్రతిపాదిస్తూ 354 (ఇ) సెక్షన్‌ను జోడించారు. ఈరకంగా ప్రతిపాదించిన సత్వర న్యాయం పూర్తిగా ఆచరణాత్మకం కావడానికి కూడా ఏపీ ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకున్నది. ఇందుకోసం మరొక బిల్లును ప్రత్యేకంగా శాసనసభ ఆమోదించింది. ఈ బిల్లు ప్రకారం అత్యాచారాల కేసులు విచారించడానికి ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేక కోర్టు ఏర్పాటవుతుంది. ఈ కేసులు వేగంగా దర్యాప్తు చేయడానికి వీలుగా ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటుచేస్తారు. వీటికోసమే ప్రత్యేకంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమిస్తారు. స్థానిక పరిస్థితులు, అవసరాల మేరకు ఐపీసీలో సవరణలు చేసుకునే సౌకర్యం రాష్ట్రాలకు ఉన్నందువలన ఏపీ దిశ–2019 బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించడంలో ఎటువంటి ఇబ్బంది వుండే అవకాశం లేదు. బిల్లుకు ఇప్పటికే దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి హర్షామోదాలు వ్యక్తమయ్యాయి. మహిళా హక్కుల ఉద్యమకారుల దగ్గర నుంచి సినీతారలు, పారిశ్రామికవేత్తలు, పార్లమెంట్ సభ్యులు, విద్యార్థులు, యువతులు స్వాగతించారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించారు. ఏపీ దిశ చట్టాన్ని దేశమంతటా అమలు చేయాలని కోరుతూ ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మలివాల్ ప్రధానమంత్రికి లేఖ రాశారు. నిర్భయ తల్లి, దిశ తండ్రి రాష్ట్ర ప్రభుత్వ చర్యను కొనియాడారు. భారతదేశ మహిళా సాధికారిత ఉద్యమ చరిత్రలో ఏపీ–దిశ యాక్ట్–2019 ఒక ప్రత్యేక అధ్యాయాన్ని రిజర్వు చేసుకున్నది.

ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధనపై కూడా సభలో చర్చ జరిగింది. ఈ అంశంపై ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసివున్నప్పటికీ మరోసారి చర్చ జరగడానికి కారణం వున్నది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందే తడవుగా ప్రతిపక్ష క్యాంపు దీనికి వ్యతిరేకంగా ఒక కృత్రిమ ఉద్యమాన్ని నిర్మించేటందుకు సన్నాహాలు చేసింది. తెలుగు భాషకు మరణ శాసనం రాస్తున్నారంటూ చంద్రబాబు–పవన్ కల్యాణ్‌లు విరుచుకుపడ్డారు. ఎల్లో మీడియాగా చలామణిలో వున్న రెండు పత్రికలు పతాక శీర్షికలతో కృత్రిమ ఉద్యమానికి సమిధలు సమకూర్చాయి. ఈ వ్యవహారంపై పేద ప్రజానీకంలో ఆగ్రహం కట్టలు తెంచుకున్నది. ప్రైవేట్ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో చదువుకున్న ధనవంతుల బిడ్డలతో తెలుగు మాధ్యమంలో చదువుకున్న తమ బిడ్డలు పోటీ పడలేకపోవడాన్ని ఈ తల్లిదండ్రులు అనుభవపూర్వకంగా తెలుసుకున్నారు. ఇంగ్లిష్ నైపుణ్యం లేకుండా పోటీ పరీక్షల్లో, ఇంటర్వ్యూల్లో నెగ్గుకు రావడం కష్టం. తెలుగులో చదివిన విద్యార్థి ఉన్నత స్థానాలను చేరుకోవడానికి ఇది పెద్ద అవరోధంగా తయారైంది. అసమానుల మధ్య పోటీ ధర్మంకాదు, యుద్ధనీతి కూడా కాదు. విరథిపై రథి బాణం వేయడు. తన రథ చక్రం నేలలో దిగబడినప్పుడు కిందికి దిగి చక్రాన్ని పైకెత్తడానికి ప్రయత్నిస్తాడు కర్ణుడు. ఇదే అదనుగా బాణం ఎక్కుపెట్టిన అర్జునుడికి ఈ ధర్మాన్ని గుర్తుచేస్తాడు కర్ణుడు.

బ్రాహ్మణేతరులకు తిరు మంత్రోపదేశం నిషిద్ధమైన రోజులలో శ్రీరంగం గుడి గోపురమెక్కి అందరికీ వినిపించేలా గట్టిగా ఆ మంత్రాన్ని పఠించిన రామానుజాచార్యుల వారి విప్లవాత్మక చర్య వంటిది పేద విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమం బోధన. పేదల సాధికారతకోసం ప్రభుత్వం సమకూర్చిన దివ్యాస్త్రంగా ఇంగ్లిష్ మాధ్యమాన్ని వారు భావించారు. తెలుగు భాషాభిమానం పేరుతో ముందుకు తెచ్చిన మోసపూరిత వాదాలను పేద వర్గాల అనుకూల మేధావులు ప్రతి వాదాలతో తుత్తునియలు చేసి ప్రభుత్వానికి అండగా నిలిచారు. ఈ పరిణామాలతో బిత్తరపోయిన ఎల్లో సిండికేట్ తోకముడిచింది. ఈ సమావేశాల్లోనే ప్రతిపక్ష నేత తన అమ్ముల పొదిలోని యూ–టర్న్ బాణాన్ని మరోసారి ప్రయోగించాడు. తన ఖాతాలో ఇదివరకే వేసుకున్న హైదరాబాద్ నిర్మాణం, కంప్యూటర్‌ను కనిపెట్టడం, మొబైల్ ఫోన్ ఇన్వెన్షన్ వగైరాల సరసన ఇంగ్లిష్ మీడియాన్ని కూడా చేర్చుకున్నారు.

స్వల్పకాలిక సమావేశాలే అయినప్పటికీ, పేదలు, మహిళల తరఫున సాధికార శంఖారావం చేసిన సమావేశాలుగా ఇవి అసెంబ్లీ చరిత్రలో నిలిచిపోతాయి. చరిత్రాత్మకమైన దిశ బిల్లును అడ్డుకోవడానికీ, ఇతర ముఖ్యమైన బిల్లులను పక్కదోవ పట్టించడానికి వాయిదా తీర్మానాలు పెట్టడం, మార్షల్స్‌తో గొడవపడడం వగైరా పాత టెక్నిక్‌లనే ప్రతిపక్షం ఆశ్రయించింది. ఈ తరహా 'ప్లే టు ది గ్యాలరీ' వ్యూహాలకు కాలదోషం పట్టింది. ప్రజలు వాస్తవాలను అర్థం చేసుకుంటున్నారు. తన వయసు డెబ్బయ్ సంవత్సరాలైనా, ఆలోచన ఇరవైరెండేనని ప్రతిపక్ష నేత ప్రకటించుకున్నారు. ఆ మాటలు ఆచరణాత్మకంగా నిరూపితం కావాలంటే అసెంబ్లీలో పాతకాలపు వీధినాటక ప్రదర్శనలకు భరతవాక్యం చెప్పవలసి ఉంటుంది.

muralivardelli@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### ఏమయ్యారు?



"అత్యాచారం కేసులో బీజేపీ ఎమ్మెల్యే కులదీప్ సెంగార్ శిక్షార్హుడని ఢిల్లీ కోర్టు నిర్ధారించడం హర్షించదగింది. ఈ నాయకుడికి అనుకూలంగా గతంలో మాట్లాడిన నేతలంతా ఎక్కడున్నారు?" – ధ్వని భానుశాలి, కళాకారిణి

### ఆందోళన



"బిహార్, యూపీ, ఇంకా ఇతర రాష్ట్రాల్లో ఉంటున్న మా బంధువులు అనేకమంది ఎంతో ఆందోళనతో నాకు ఫోన్‌లు చేస్తున్నారు. అందరూ ఒకే విధమైన ప్రశ్నలేస్తున్నారు- మనకు ఇంకా ఎంత సమయం ఉంది? ఎలాంటి పత్రాలు మనం సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది? తర్వాతేం జరుగుతుంది?... వీటన్నిటికీ మన రాజకీయ నాయకులు సమాధానం ఇవ్వాలి. ప్రజానీకంలో చోటుచేసుకున్న భయాందోళనలను పారదోలాలి. అందుకు స్పష్టమైన పరిష్కారాలు చూపాలి" – మర్యా షకీల్, సీనియర్ జర్నలిస్టు

### వాత



"వీధుల్లోకెళ్లి హింసకు పాల్పడటాన్నే విద్యార్థులు నమ్ముకుంటే వారు న్యాయస్థానానికి రానవసరం లేదని సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్య సరైందే. జామియా, అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీల్లో పోలీసుల చర్యపై పిటిషన్లు దాఖలు చేసిన ఇందిరా జైసింగ్, కోలిన్ గోన్‌సాల్వెస్‌లకు ప్రధాన న్యాయమూర్తి ఎస్ఏ బాబ్డే ఈ సంగతి తెలిపారు. సొంత ఎజెండా కోసం కోర్టుల్ని ఉపయోగించుకునే రోజులు గతించాయని వారికి అర్థం కావాలి" – ప్రశాంత్ పటేల్ ఉమ్రావ్, న్యాయవాది

### తగునా?



"జామియాలోని విద్యార్థినీ విద్యార్థులందరినీ లైబ్రరీలోకి తరిమి, వారిని అంత దారుణంగా కొడతారా? ఇది నా ఊహాకందలేదు. ఒక తల్లిగా, ఆ పిల్లల శ్రేయస్సు కోరే వ్యక్తిగా, అక్కడ ఉపన్యాసాలు ఇవ్వడానికి తరచూ వెళ్లే వక్తగా ఈ దృశ్యాలు నన్ను చాలా బాధపెట్టాయి. ఈ ఘటనకు కారకులైనవారెవరో కనుక్కుని శిక్షించాలి" – సాగరికా ఘోష్, సీనియర్ జర్నలిస్టు

**ఇన్‌బాక్స్**

## సవరణ బిల్లును రద్దు చేయాలి

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పౌరసత్వ సవరణ బిల్లు(కాబ్), జాతీయ పౌర జాబితా(ఎన్ఆర్సీ) భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలకు పూర్తిగా విరుద్ధమైనది. ఆధునిక సమాజ నియమాలకు, సహజ న్యాయ సూత్రాలకు విఘాతమైన ఈ బిల్లులను నిరసిస్తూ ఈశాన్య రాష్ట్రాలు, మైనారిటీ ప్రజలు వినిపిస్తున్న నిరసన స్వరాన్ని మేము తెలుగు రచయితలుగా, కవులుగా, ఆలోచనాపరులుగా బలపరుస్తున్నాం. భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం, శాంతియుత సామరస్యానికి పాటు పడుతున్న ఉద్యమాలకు పూర్తిగా మద్దతు పలుకుతున్నాం.

మతాలకతీతంగా జీవనవిధానాన్ని సాగిస్తున్న దేశంలో ప్రజలు తమ తమ మతాల ప్రాతిపదికన పౌరసత్వ నిర్ధారణ చేసుకునే విషాద స్థితి కల్పించాలనుకోవడం పరమ అప్రజాస్వామికమైనది. శరణార్థులై, పీడనకు గురై నిలువనీడ కోసం వస్తున్న ప్రజలను మతాలవారీగా వేరు చేసి వారిలో కొందరిని ఆహ్వానించడం, మరికొందరిని అడ్డుకోవడం హేయమైంది. కాబ్, ఎన్నార్సీ బిల్లులతో ప్రపంచం ముందు భారత సమాజం తలవంచుకునేలా కేంద్ర ప్రభుత్వం చేస్తుండటాన్ని క్షమించలేని చర్యగా అభిప్రాయపడుతున్నాం. కాబ్, ఎన్నార్సీ బిల్లులను వ్యతిరేకిస్తున్న ఈశాన్య ప్రజలపై, జామియా మిలియా యూనివర్సిటీ విద్యార్థులపై జరిపిన హింసాత్మక చర్యలను నిరసిస్తున్నాం. భారత శాంతియుత సామాజిక వాతావరణాన్ని విచ్ఛిన్నంచేసే కాబ్, ఎన్నార్సీ బిల్లులను రద్దుచేయాలని కోరుతున్నాం.

కె. శివారెడ్డి, దేవిప్రియ, నిఖిలేశ్వర్, దేశపతి శ్రీనివాస్, జి. హరగోపాల్, జయధీర్ తిరుమలరావు, సి. కాశీం. కాత్యాయనీ విద్మహే. సూరేపల్లి సుజాత, ఎమ్ వినోదిని, అల్లం రాజయ్య, అఫ్సర్, యాకూబ్, విమల, జూపాక సుభద్ర, కుప్పిలి పద్మ, కాత్యాయని, రమా సుందరి, అరణ్య కృష్ణ, పాణి, పి వరలక్ష్మి, సజయ కాకరాల, కె. శ్రీనివాస్, ఎస్. వీరయ్య, కట్టా శేఖర్ రెడ్డి, అల్లం నారాయణ... తదితర వందమంది తెలుగు రచయితలు, కవులు, ప్రొఫెసర్లు, పాత్రికేయులు

# పుస్తక నవోదయం...

విజయవాడలోని ఏలూరురోడ్డులో అన్నీ పుస్తకాలయాలే, అందులో అన్నీ ఉద్దండుల పుస్తకాలే. అన్ని ప్రచురణల మధ్య రెండు చేతులు జోడించి నమస్కరిస్తూ కనిపిస్తుంది నవోదయ సంస్థ. తెలుగు వారంతా తెల్లకాగితాలతో ఉన్న ఒక పుస్తకాన్ని ప్రదర్శిస్తే దానికి కూడా నిశ్శబ్దంగా నవోదయ ముద్ర పడుతుంది. ఈ ముద్ర వెనుక కథ చాలా పెద్దదే. రామమోహనరావు చిన్నబావ కొండపల్లి రాఘవరెడ్డి గుడివాడలో 'నవోదయ పబ్లిషర్స్' స్థాపించిన ఏడాదికే ఆ కార్యాలయాన్ని విజయవాడకు మార్చడంతో నవోదయ ప్రస్థానం మొదలైంది. 60 ఏళ్ల క్రితం సువిశాల ప్రాంగణంలో ప్రారంభమై, కొత్త పోకడల పెనుతుఫాన్‌కు తల వంచి, తన పరిధిని తగ్గించుకుంది. నవోదయ సంస్థ ఆర్థికంగా చిక్కినా, లక్ష్యాన్ని విడిచి పెట్టలేదు. ప్రచురణలు ఆపారు. విక్రయాలు జరిపారు.


నివాళి

1934లో కృష్ణాజిల్లా గన్నవరం తాలూకా ఉంగుటూరు గ్రామంలో ముగ్గురు ఆడపిల్లల తర వాత జన్మించిన అట్లూరి రామమోహన్‌రావు, ఎస్సెస్సెల్సీ వరకు చదువుకున్నారు. 1955లో పర్వతనేని ఝూన్సీతో దండల వివాహం చేసు కున్నారు. పుస్తక వ్యాపారాన్ని గౌరవప్రదమైన వృత్తిగా భావించిన రామమోహనరావు, 'చదువుకున్న వారితో పరిచయాలు పెరిగినకొద్దీ నాకున్న సాహిత్య పరిజ్ఞానం ఎంతటిదో తెలిసింది. బాపు కార్టూన్ల సంకలనాన్ని శ్రీరమణ ముందుమాటతో మొట్టమొదటగా ప్రచురించే అదృష్టం నాకు దక్కింది. నండూరి రామమోహనరావుగారి 'విశ్వ రూపం' పుస్తకాన్ని నాటి రాష్ట్ర విద్యామంత్రి పీవీ నరసింహారావు ఆవిష్కరించడం మరపురాని ఘట్టం. 'బాపు రమణీయం' పుస్తకావిష్కరణ సభ నవోదయ సంస్థకి ఒక తీపి జ్ఞాపకం అనేవారు. కలకత్తాలోని పుస్తకప్రదర్శనకు వెళ్లి వచ్చాక, 'ఇటువంటి పండుగను యేటా విజయవాడ నగరంలో నిర్వహిస్తే బాగుంటుంది. అందరూ కలిసి వస్తే అందుకు నేను పెద్దరికం తీసుకుంటాను' అని పలికి, పాతికేళ్లపాటు పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఒక రచయిత పదికాలాల పాటు జీవించి ఉండాలంటే వారి రచనలు పుస్తక రూపంలో ఉండాలి. లేదంటే ఆ వ్యక్తి రచయితగా మరణించినట్లే అనే భావనతో చాలామందిని సజీవులను చేశారు రామమోహనరావు.

1961 నాటికి గొల్లపూడి మారుతీరావు రచించిన 'చీకట్లో చీలికలు' పుస్తకానికి బాపుతో బొమ్మలు వేయించారు. ముళ్లపూడి వెంకటరమణ 'గిరీశం లెక్చర్లు' పుస్తకం అందంగా ముద్రించడంతో, వారికి నవోదయ మీద నమ్మకం కుదిరింది. ''బాపు ఓసారి హైదరాబాద్ వెళ్తూ విజయవాడలో నన్ను కలవటం నా జీవితంలో మేలి మలుపు. నాటి నుంచి వారిద్దరూ నాకు ఆత్మీయులు. అందుకే వారితో అవసరానికి మించి అభిమానం పెంచుకున్నాను'' అని వారిని స్మరించుకునే వారు రామమోహనరావు. శంకరమంచి సత్యం రచించిన 'అమరావతి కథలు' (100 కథలు) పుస్తకానికి బాపు చేత బొమ్మలు వేయించాలనుకున్న కలను నెరవేర్చుకున్నారు. ఆకాశవాణి మిత్రుల మాటలలో జరుక్‌శాస్త్రి పేరు తరచుగా తగిలేది. 'ఎవరు ఈ జరుక్‌శాస్త్రి? చదువుదామంటే ఎక్కడా కనబడడేమండీ?' అనుకుని, సమాచారం సేకరించి, 'శరత్ పూర్ణిమ' (కథలు), 'తనలో తాను' (వ్యాసాలు), 'జరుక్‌శాస్త్రి పేరడీలు' ప్రచురించారు. ఆరుద్ర కోరికపై, శ్రీరంగం నారాయణబాబు 'రుధిరజ్యోతి' ప్రాముఖ్యత తెలియకుండానే ప్రచురించడంవల్ల శ్రీశ్రీ, ఆరుద్రల మధ్య సంబంధాలు నిర్దేశించే స్థాయికి చేరింది ఆ ప్రచురణ. 1963లో గోపీచంద్ ఫొటోని క్యాలెండర్‌గా ప్రచురించారు.

నవోదయ రామమోహనరావును ఎవరైనా 'మీరు కమ్యూనిస్టు కదా' అంటే 'నేను కమ్యూనిస్టుని కాదు, హేతువాదిని. నా పిల్లలిద్దరి పెళ్లిళ్లూ రిజిస్ట్రార్ ఆఫీసులోనే చేయించాను. మా అబ్బాయి కులాంతర వివాహం చేసుకున్నప్పుడు గర్వించాను. మా నాన్న చనిపోయినప్పుడు అంత్యక్రియలు నిర్వహించమని ఎంతమంది ఒత్తిడి చేసినా తలొగ్గలేదు. నా తదనంతరం కూడా నా శరీరంలోని అన్నిభాగాలూ వైద్య విద్యార్థులకే ఉపయోగపడాలన్నది నా కోరిక' అనేవారు. ఎన్నో ఆదర్శ భావాలు కలిగి, పుస్తక ప్రపంచంలో ఒక శకాన్ని సృష్టించిన నవోదయ రామమోహనరావు, తన ప్రచురణల ద్వారా రచయితతో పాటు చిరయశస్సు సంపాదించుకున్నారు.

(బాపు జయంతిరోజునే నవోదయ రామమోహనరావు కాలం చేయడం యాదృచ్ఛికం కావొచ్చు)

డాక్టర్ వైజయంతి పురాణపండ

# గీతా మకరందం

శ్రీకృష్ణ ముఖ కమలం నుండి వెలువడిన మకరంద బిందువు భగవద్గీత. కర్తవ్యానికి ఎక్కువ ప్రాధాన్యమిచ్చి బోధించిన గ్రంథం గీత. జీవితంలో ప్రతి ఒక్కరికీ ఏదో ఒక కర్తవ్యం నిర్దేశితమయ్యే ఉంటుంది. దానిని శ్రద్ధగా ఆచరిస్తే భగవదనుగ్రహం పొందినట్లే. ఇలా నేటి సమాజంలో అందరూ తమ తమ కర్తవ్యాలను శ్రద్ధతో, న్యాయమైన రీతిలో ఆచరిస్తే అదే నిజమైన భగవదారాధన. ఏ వ్యక్తీ తాను పూజ చేయటానికి సమయం ఉండట్లేదని, ఉపవాసాలు చేయటానికి ఆరోగ్యం సహకరించదని బాధపడనక్కరలేదు. శ్రమలోనే దైవాన్ని చూడగలగాలి. మనసును ఎప్పుడూ దైవ సాన్నిధ్యంలో ఉంచాలి. అదే నిజమైన పూజ, అసలైన ఉపవాసం. 'తన కర్తవ్య కర్మలో ఆసక్తిగల నరుడు సిద్ధి పొందుతాడు' అని గీతలో కృష్ణుడు చెప్పాడు.


జ్యోతిర్మయం

భగవద్గీత బోధించిన కర్మయోగాదులు సమాజంలో ధర్మం స్థిరంగా ఉండటానికి, ప్రకృతి వైపరీత్యాలు ఏవీ రాకుండా ఉండటానికి సమాజం శాంతియుతంగా ఉండేందుకు ఉపకరిస్తాయి. ఇంద్రియ నిగ్రహం, దానం, దయ అనే మూడు గుణాలను మానవుడు ప్రధానంగా అలవరచుకోవాలి. అప్పుడే ప్రశాంత జీవనం గడపగలుగుతాడు' అని గీత బోధించింది.

ఒక పని చేసినా దాని ఫలం చేతికందాలంటే పరిస్థితులు అనుకూలించాలి. పని చేయటం మన చేతుల్లో ఉంది కానీ ఫలం మన చేతిలో లేదు. ఇది కర్తవ్యం అనుకుని చేయటమే మానవుడు చేయవలసింది అని గీత బోధిస్తుంది. దీనినే నేటి కాలానికి లౌకిక జీవితానికి అన్వయించుకుంటే కర్తవ్యాన్ని అంకితభావంతో, ఫలితం వచ్చేదాకా, చేస్తూనే ఉండాలి.

మనిషి తన దైనందిన జీవితంలో నిత్యమూ గుర్తుంచుకోవలసిన విలువైన అంశాలను భగవద్గీత ఆద్యంతమూ అనేక సందర్భాలలో ఉపదేశించింది. వాటిని మనసున నిలుపుకుని, ఆచరణలో పెట్టడానికి ప్రయత్నించాలి. కేవలం భగవద్గీత పఠనం. పారాయణల వల్లనే ప్రయోజనం సిద్ధించదు.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి
ఫ్యామిలీ
నల్లగొండ
మంగళవారం ॥ 17-12-2019





శ్రీదేవసేన

# శక్తి సేన

**అధికారులు గట్టిగా సంకల్పిస్తే మంచి పనులు మొదలవుతాయి.
దిశ, సమత ఘటనలు చట్టాలతో మాత్రమే కట్టడి కావు.
అధికారులు కూడా పూనుకోవాలి. ప్రజలలోకి వెళ్లాలి. ప్రజలతో మాట్లాడాలి.
తెలంగాణలోని కొందరు కలెక్టర్లు, పోలీసు అధికారులు అమ్మాయిల భద్రత కోసం స్వచ్ఛందంగా పని చేస్తున్నారు.
వారిలో పెద్దపల్లి కలెక్టర్ శ్రీదేవసేన ఒకరు. ఆమె ఏం చేస్తున్నారో ఆమె మాటల్లోనే...**

''**మూ**డేళ్ల క్రితం నేను జనగామ కలెక్టర్‌గా పనిచేస్తున్నప్పుడు అక్కడ విద్యార్థినిలకు కరాటేలో శిక్షణ మొదలుపెట్టించాను. అది ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. అయితే ఓ మూడు నెలల కిందట.. మీనాక్షమ్మ అనే డెబ్బై అయిదేళ్లావిడ చురుగ్గా కలరిపయట్టు యుద్ధవిన్యాసాలు చేస్తున్న వీడియో ఒకటి యూట్యూబ్‌లో చూశాను. అంత పెద్దావిడ అంత ఎనర్జిటిక్‌గా కదలడం ఆశ్చర్యమనిపించింది. అప్పుడు వచ్చింది ఆలోచన.. స్కూల్లోని అమ్మాయిలకు కూడా ఆత్మరక్షణ కోసం ఈ విద్యను నేర్పించాలని. ఇందుకోసం పకడ్బందీగా ప్లాన్‌చేయాలని అనుకున్నా. ఈలోపే దిశ ఘటన జరగడంతో ఇక ఏమాత్రం ఆలస్యం పనికిరాదని వెంటనే కేరళలోని కలరిపయట్టు నేర్పించే బృందాన్ని పిలిపించాం. ఈ నెల (డిసెంబర్) 22 నుంచి జిల్లాలోని అన్ని స్కూళ్లలో శిక్షణను ప్రారంభించనున్నాం. శారీరకంగా, మానసికంగా అమ్మాయిలు దృఢంగా ఉండాలని 'శక్తి' పేరుతో మా జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ, గురుకుల పాఠశాలల్లోని విద్యార్థినులకు కలరిపయట్టు విద్యలో శిక్షణను ఇప్పించబోతున్నాం. ముందు విడతలో వాళ్లు విద్యార్థినులతోపాటు అదనపు సమయం కేటాయించి పీఈటీలకూ ట్రెనింగ్ ఇస్తారు. పరీక్షల కోసం ఫిబ్రవరి, మార్చిలో శిక్షణను ఆపేసి.. పరీక్షల తర్వాత మళ్లీ 'శక్తి శిక్షణ' మొదలవుతుంది. దీన్నొక కోర్స్‌గా పెట్టాలనుకుంటున్నాం. అ కావలసిన నిధుల కోసం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాం. వస్తాయి కూడా. ప్రస్తుతానికైతే అందుబాటులో ఉన్న నిర్భయ నిధులు వంటివి వాడుతున్నాం.

### డైనమిక్ కలెక్టర్

పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌గా శ్రీదేవ సేన చేస్తున్న పనులు రాష్ట్రంలో జిల్లాకు ప్రత్యేక గుర్తింపును ఇస్తున్నాయి. స్వచ్ఛభారత్ లక్ష్యసాధనలో పెద్దపల్లిని ముందు వరుసలో నిలిపారు. ఆమె కార్య నిబద్ధతకు అందిన స్వచ్ఛ్ సర్వేక్షణ్, దీన్‌దయాల్ గ్రామీణ వంటి పురస్కారాలే నిదర్శనం.

**అమ్మాయిలకు శిక్షణ.. అబ్బాయిలకు చైతన్యం**

అమ్మాయిలకు ఆత్మరక్షణ విద్యలు నేర్పించి వాళ్లలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడం ఎంత అవసరమో జెండర్ ఈక్వాలిటీ విషయంలో అబ్బాయిలను చైతన్యపర్చడమూ అంతే అవసరం. అందుకే 'శక్తి' కోర్సు ద్వారా శిక్షణను అమ్మాయిల మీద ఫోకస్ చేస్తూ 'స్పృహ' ద్వారా అబ్బాయిల మీద అవగాహన కోసం దృష్టి పెడ్తున్నాం. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులనూ భాగస్వామ్యం చేస్తున్నాం. మగపిల్లలతోపాటు తల్లిదండ్రులకూ లింగ వివక్ష నేరమనే అవగాహన కల్పించాలనుకుంటున్నాం. కొడుకు, కూతురు ఇద్దరూ సమానమనే ఎరుక తల్లిదండ్రులకు వచ్చి అది పెంపకంలో కనిపిస్తేనే ఆ ప్రభావం మగపిల్లల మీద ఉంటుంది. అలాగే అమ్మాయిలూ తమతో సమానమేనని.. వాళ్లను తోటి పౌరులుగా గౌరవించాలనీ చెప్పిస్తున్నాం. ఈ 'స్పృహ' కార్యక్రమానికి సమాచార శాఖ, ఐసిడిఎస్ ప్రధానంగా పనిచేస్తున్నా.. అన్ని శాఖల సహకారాన్నీ తీసుకుంటున్నాం. 'స్పృహ'కు సంబంధించి గ్రామాల్లో అధికారులే స్వయంగా తల్లిదండ్రులను సంప్రదించి, వాళ్లతో ఇంటరాక్ట్ అవుతారు.

**డ్రాప్ అవుట్స్‌కూ దారి..**

దిశ నేరానికి పాల్పడిన నలుగురిలో ఇద్దరు ఏమీ చదువుకోనివాళ్లు. అందులో ఒకరు డ్రాప్ అవుట్. ఇలా మధ్యలో చదువు మానేసిన వారిని గుర్తించేందుకు జిల్లాలో సర్వే చేపట్టాం. వారికి బ్యాంకు రుణాలు ఇప్పించి సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్‌తో వాళ్లను ఓ దారిలో పెట్టే చర్యలనూ ప్రారంభించాం. చదువు మానేసిన వారితో పాటు చదువుకుని ఏ ఉపాధి లేకుండా ఉన్నవారినీ గుర్తించి వారికీ రుణసహాయం అందించి స్వయం ఉపాధి పొందేలా చూస్తాం. వీటన్నిటితోపాటు అబ్బాయిల పెంపకంపై తల్లిదండ్రులకు అవగాహన పెంచే కార్యక్రమం కొనసాగుతూనే ఉంటుంది.

### ఏపీ దిశ- 2019

దిశ సంఘటన నేపథ్యంలో మహిళల భద్రతకు సంబంధించి నిర్మాణాత్మకమైన ఆలోచన చేసింది ఆంధ్రప్రదేశ్. పౌరుల్లో హింసాత్మక ప్రవృత్తిని తగ్గించేందుకు చట్టంతో పరిష్కారాన్ని సూచించింది "ఏపీ దిశ –2019" చట్టాన్ని రూపొందించి. దీనికి సంబంధించి దేశంలో సర్వత్రా ఆనందం వ్యక్తమయింది. ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మలివాల్ అయితే.. ఈ చట్టం కేంద్రానికీ స్ఫూర్తిదాయకమని.. కేంద్రమూ ఆ దిశలో ఆలోచించి సత్వర న్యాయం అందేలా మార్పులు తేవాలని అన్నారు.

**కంటి తుడుపు మాటలు వద్దు..**

దిశ సంఘటన తరువాత చాలా మంది సినీ నటులు నిరసన వ్యక్తం చేశారు. మంచిదే. కాని వాళ్లు నటించిన సినిమాల్లో హీరోయిన్ల పట్ల వ్యవహరించిన తీరు కూడా గమనించాలి. సమాజం మీద ప్రభావం చూపే సినిమా మాధ్యమం బాధ్యతగా ఉండాలి. ఇక నుంచైనా అమ్మాయిలను బొమ్మల్లా చూపించే సంస్కృతి విడనాడాలని ఆశిస్తున్నా.

**దుస్తుల మీద కామెంట్ ఎందుకు?**

అత్యాచారం జరిగింది అనగానే ముందు కామెంట్ చేసేది ఆడవాళ్ల వస్త్రధారణ మీదే. ఈ పద్ధతి మారాలి. పసిపిల్ల ఎలాంటి డ్రెస్ వేసుకుందని రేప్ చేశారు? మారుతున్న సమాజానికి అనుగుణంగా మహిళలు దుస్తులు ధరిస్తున్నారు. మహిళలనూ తమ తోటి పౌరులుగా చూసే రోజు రావాలి'' అంటూ ముగించారు కలెక్టర్ శ్రీదేవసేన.

– కట్ట నరేంద్రచారి, సాక్షి, పెద్దపల్లి,
– సేపూరి వేణుగోపాలాచారి, సాక్షి, కామారెడ్డి
ఫోటోలు: మర్రి సతీష్‌రెడ్డి

### సురక్షిత కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలో మహిళలపై ఎలాంటి అఘాయిత్యాలూ జరుగకుండా నిరోధించేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో 'సురక్షిత కామారెడ్డి' అనే కార్యక్రమాన్ని చేపట్టాం. జిల్లాలోని అన్ని ఊళ్లలో చైతన్య కార్యక్రమాలను ఆరంభించాం. ఇందులో అన్ని శాఖల అధికారులను, స్వచ్ఛంద సంస్థలను, మహిళలను, మొత్తం సమాజాన్నే భాగస్వాములను చేస్తున్నాం. వచ్చే మార్చి నెలాఖరులోపు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థులకు స్వీయరక్షణతో పాటు చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధమైంది. మహిళా పోలీసు సిబ్బందికి పురుషులతో సమానంగా డ్రైవింగ్ నేర్పించాం. మహిళలపై జరిగే దాడులను తిప్పికొట్టడంలో విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ ఇప్పించాం. ఆత్మరక్షణ పద్ధతులను నేర్పించాం. ఇది నిరంతరం కొనసాగేలా ప్రణాళిక రూపొందించాం.

– ఎస్.శ్వేత, కామారెడ్డి జిల్లా ఎస్పీ



మహిళా పోలీసుల శిక్షణను పర్యవేక్షిస్తున్న ఎస్.పి. శ్వేత

# బ్యూటిఫుల్ ఇండియా

**'మిస్ వరల్డ్'గా భారతీయ మూలాలున్న యువతి. సెకండ్ రన్నరప్‌గా మిస్ ఇండియా.**

**లండన్‌లో జరిగిన 'మిస్ వరల్డ్ 2019' పోటీలో మెరిసిన భారతీయ సౌందర్యం**

**న**ల్ల సౌందర్యానికి మళ్లీ కితాబు దక్కింది. శ్వేత వర్ణం వెనక్కు తగ్గింది. 'మిస్ యూనివర్స్ 2019' కిరీటం నల్లజాతి వనితకు దక్కిన కొద్ది రోజుల్లోనే 'మిస్ వరల్డ్ 2019' కిరీటం కూడా మరో నల్లవజ్రానికే దక్కింది. జమైకాకు చెందిన టోని ఆన్‌సింగ్ శనివారం లండన్‌లోని ఎక్సెల్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన భారీ వేడుకలో మిస్ వరల్డ్ కిరీటాన్ని శిరస్సుపై ధరించి ఈ ఘనతను సాధించింది. 23 ఏళ్ల టోని ఆన్‌సింగ్ తండ్రి ఇండియన్ కరేబియన్. తల్లి ఆఫ్రికన్ కరేబియన్. కనుక ఆమె సౌందర్యంలో భారతీయ మూలాలు ఉన్నందుకు భారతీయ సౌందర్యప్రియులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో టాప్ 3లో నిలిచి సెకండ్ రన్నరప్‌గా మిస్ ఇండియా సుమన్ రావు స్థానం పొందడం కూడా భారతీయులకు సంతోషం కలిగిస్తోంది. 111 దేశాలు ఈ కిరీటం కోసం పోటీ పడగా టోని ఆన్‌సింగ్ మొదటి స్థానంలో, సుమన్ రావు మూడో స్థానంలో నిలిచి భారతీయ సౌందర్య కేతనాన్ని రెపరెపలాడించారు. నవంబర్ 20 నుంచి మొదలైన ఈ పోటీలు దాదాపు నాలుగు వారాలపాటు కొనసాగాయి. 70 దేశాల పార్టిసిపెంట్స్ రకరకాల దశల్లో వెనుకకు మరలగా టాప్ 40లో నిలిచిన అందగత్తెలు కిరీటం కోసం హోరాహోరి తలపడ్డారు.



'మిస్‌వరల్డ్– 2019' కిరీటం దక్కించుకున్న జమైకాకు చెందిన ఆన్‌సింగ్

**జమైకా బాలిక**

'ఈ విజయం ఆ జమైకా బాలికకు అంకితం' అని కిరీటం దక్కించుకున్నాక టోని ఆన్‌సింగ్ వ్యాఖ్యానించింది. ఆ బాలిక ఎవరో కాదు తనే. ఈ విజయం తనూ తనలాంటి నల్ల జాతి బాలికలకు సొంతమని టోని పేర్కొంది. 'స్త్రీల సమానత్వం కోసం నేను చేయదగ్గ పనంతా చేస్తాను' అని కూడా ఆమె అంది. టోని కుటుంబం ఆమెకు తొమ్మిదేళ్ల వయసు ఉండగా అమెరికాకు వలస వచ్చింది. ఫ్లోరిడా యూనివర్సిటీలోనే టోని విమెన్స్ స్టడీలో గ్రాడ్యుయేషన్ చేసింది.



సెకండ్ రన్నరప్ సుమన్‌రావు

'పద్మావత్' సినిమాలోని పాటకు నృత్యం చేస్తున్న సుమన్ రావు

**రాజస్థాన్ అమ్మాయి**

రాజస్థాన్‌కు చెందిన సుమన్ రావు 'మిస్ వరల్డ్ 2019'కు హాజరయ్యే ముందు 'మిస్ రాజస్థాన్', 'మిస్ ఇండియా ఫెమినా' టైటిల్స్ గెలుచుకుంది. ప్రస్తుతం ఆమె కుటుంబం నవీ ముంబైలో ఉంటోంది. చార్టర్డ్ అకౌంటెన్సీ పూర్తి చేసే పనిలో ఉన్న సుమన్ రావు ఇప్పటికే మోడలింగ్‌లో బిజీగా ఉంది. సినిమాలలో అదృష్టం పరీక్షించుకోవాలనుకుంటోంది. కథక్ నృత్యకారిణి కావడం వల్ల మిస్ వరల్డ్ పోటీలలో ఆనవాయితీగా జరిగే డాన్స్ కాంపిటీషన్‌లో 'పద్మావత్' సినిమాలోని 'ఘుమర్' పాటకు నృత్యం చేసి ఆహూతులను ఉర్రూతలూగించింది. 'భారత దేశంలో స్త్రీలకు కట్టుబాట్లు ఎక్కువ. నా తల్లి అటువంటి కట్టుబాట్లు చాలా ఎదుర్కొంది. అయినప్పటికీ నన్ను నా కలల వెంట వెళ్లేలా చేసింది' అని సుమన్ రావు చెప్పింది. మిస్ వరల్డ్ పోటీలో సుమన్ రావు మూడో స్థానంలో నిలిచిందని తెలియగానే ఆమె స్వగృహంలో వేడుకలు మొదలయిపోయాయి. 'నా కూతురు అనుకున్నది సాధించింది' అని తండ్రి రతన్ సింగ్ రావు పొంగిపోతూ చెప్పాడు.

మొత్తం మీద ఈ శీతాకాలం భారతీయ సౌందర్యానికి మంచి సంతోషాన్ని తెచ్చిందని చెప్పుకోవాలి.

## 2వ పాశురం

**వైయత్తు వాళ్ వీర్గాళ్! నాముం నం పావైక్కు
శెయ్యుం కిరిశైగళ్ కేళీరో పాఱ్కడలుళ్
పైయత్తుయిన్ఱ పరమనడి పాడి
నెయ్యుణ్ణోం పాలుణ్ణోం నాట్కాలే నీరాడి
మైయిట్టెళుదోం మలరిట్టు నామ్ ముడియోమ్
శెయ్యాదన శెయ్యోం తీక్కుఱళై చ్చెన్రోదోమ్
ఐయముమ్ పిచ్చైయుం ఆందనైయుం కైకొట్టి
ఉయ్యుమాఱెణ్ణి ఉగందేలోర్ ఎమ్బావాయ్**

**భావం:** ఓ జనులారా! ఈ నోము పట్టాలంటే పాటించవలసిన విధులను తెలుసుకోండి . పాలకడలి మీద యోగనిద్రలో శయనించిన పరబ్రహ్మ దివ్యపాదముల మహిమను గానం చెయ్యండి. శంఖ, రథాంగ, కల్పక, ధ్వజ , అరవింద, వజ్ర, అంకుశ ఇత్యాది శ్రీచిహ్నాలతో అలరారే శ్రీపాదాలను నోరారా స్తుతించండి. పసిబిడ్డ తల్లి స్తన్యాన్ని గుర్తించినట్లు భక్తుడు భగవానుని పాదాలను గుర్తించే స్పృహ కలిగి ఉండాలి. నోము ముగిసేవరకు పాలు, నెయ్యి వర్జించండి. తెల్లవారక మునుపే తలారా నదీస్నానం చెయ్యండి. కళ్ళను కాటుకతో, తలను పువ్వులతో అలంకరించకండి. శాస్త్రవిధులను పాటించండి. నిషేధింపబడిన పనుల జోలికి వెళ్ళకండి. బాధ కలిగించే అసత్యాలను పలకవద్దు. అడిగినవారికీ, అడగనివారికీ ఉదారబుద్ధితో దానం చెయ్యండి. జీవితధ్యేయాన్ని సాధించటానికి న్యాయోచితమైన పద్ధతులను అవలంబించే ఆలోచన చెయ్యండి. అప్పుడే మనం సంతృప్తికరంగా జీవించగలం. ఓ చెలీ, ఇదే మన నిత్యకృత్యం.

– శ్రీదేవి మురళీధర్



బొమ్మ: కేశవ్ వెంకటరాఘవన్

## హిట్ టాక్

# మనవడి పాట... బామ్మ ఆట



**టిక్‌టాక్...** టాక్ ఆఫ్ ది జనం అయిపోయింది. అందులో వీడియోలు చేస్తూ.. చూస్తూ యూత్ ఎంత వినోదాన్ని ఆస్వాదిస్తున్నారో సీనియర్ సిటిజన్సూ అంతే ఆనందిస్తున్నారు. ఇప్పటిదాకా యూట్యూబ్ వంటల చానల్స్ నిర్వహించే అమ్మలు, బామ్మలతోపాటు గ్రాండ్‌పాస్‌నూ చూశాం. ఇప్పుడు టిక్‌టాక్‌లో కూడా వాళ్ల ఎంట్రీ మొదలైంది. తమిళనాడుకు చెందిన 75 ఏళ్ల 'చెల్లాం' వాళ్లకు ప్రతినిధి. మనవడు అక్షయ్ పార్థతో కలిసి హిందీ, తమిళం, ఇంగ్లిష్, మలయాళం మొదలైన భాషలన్నిట్లో పాటలతో టిక్‌టాక్ వీడియోలు చేస్తోంది ఈ మామ్మ. నిజానికి నటన అనేది మనవడైన అక్షయ్ పార్థ హాబీ. మామ్మకూ ఆట, పాట మీదున్న ఆసక్తి చూసి టిక్‌టాక్ వీడియోలకు ఆమెను ఒప్పించాడట. ఏ భాషలో ఏ పాటకైనా మనవడితో పోటీపడి మరీ నటిస్తోంది మామ్మ. వీళ్లకు పదిహేను లక్షల పైచిలుకు అభిమానులున్నారంటేనే అర్థం చేసుకోవచ్చు వీళ్ల యాక్టింగ్ పట్ల టిక్‌టాక్ వీక్షకులకున్న క్రేజ్.. వీళ్ల వీడియోలకున్న డిమాండ్‌ను! ''ఇంతమంది చూస్తున్నారంటే సంతోషంగా అనిపిస్తుంది. ఇంట్లో ఏ కొంచెం బోర్ కొట్టినా పది నిమిషాలు వీడియో చేసేసి మళ్లీ నా పనిలో పడిపోతా. దీన్ని నా మనవడు పరిచయం చేసినప్పటి నుంచి నాకు భలే టైమ్‌పాస్ అవుతోంది. చిన్నప్పుడు డ్యాన్స్ చేసిన రోజులు గుర్తొస్తున్నాయి. మా వీడియోలను చిన్నా పెద్దా అందరూ చూసి ఆనందిస్తున్నారంటే అంతకన్నా సంతోషం ఇంకేం ఉంటుంది. అయితే పిల్లలూ.. జాగ్రత్త. కేవలం ఎంటర్‌టైన్‌మెంట్‌కే అయితే టిక్‌టాక్ కాని యూట్యూబ్ కాని.. ఇంకే సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ అయినా ఓకే. కాలక్షేపానికి చూడండి.. వదిలేయండి. అక్కడితో దాన్ని మరిచిపోండి. అంతేకాని దాన్నో వ్యసనంలా మార్చుకోవద్దు. మీది చదువుకొని.. మంచి విషయాలు.. నేర్చుకోవాల్సిన సమయం. మీ దృష్టిని వాటిమీదే పెట్టండి. ఇలాంటివన్నీ టైమ్‌పాస్‌కే. ఆడుకోండి.. ఆటల్లో భాగంగానే కాసేపు ఇలాంటివి చూడండి అంతే'' అని పిల్లలకు సందేశం ఇస్తుంది చెల్లాం మామ్మ.



## ముగ్గు-ముచ్చట



**ముగ్గులకు ఆహ్వానం**

*ముగ్గులు పంపవలసిన చిరునామా:*
ముగ్గు-ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34.
muggulu.sakshi@gmail.com



30 చుక్కలు
4 వరుసలు
4 వచ్చేవరకు



**నాయిన రోజా**
గాజువాక
విశాఖపట్నం



25 చుక్కలు
9 వరుసలు
9 చుక్కలు
వచ్చేవరకు



**ఏవీఎన్ లక్ష్మి**
హైదరాబాద్

## చెట్టు నీడ

# విశ్వాసమే నడిపించింది

**యే**సు ప్రభువు ఈ లోకాన్ని విడిచిన తరువాత శిష్యులందరినీ ప్రభువు సమదృష్టితోనే చూశాడు. అయితే పేతురు. యోహానులను ఎక్కువగా ప్రేమించాడు. వారు కూడా ప్రభువుపై అచంచల విశ్వాసాన్ని, నమ్మకాన్ని ఉంచారు. యేసుక్రీస్తు నామంతో అద్భుతాలను చేశారు. ప్రభువుపై ఉన్న నమ్మకమే వారిని ఆ విధంగా ప్రేరేపించింది. అంతేకాని వారు తమ శక్తి చేత ఏమీ చేయలేదు. ప్రభువు నామంలో అద్భుతం ఉందని తెలిసి కూడా ఎక్కడా వారు వృథాగా యేసుక్రీస్తు నామాన్ని ఉచ్చరించలేదు. అత్యవసర పరిస్థితులలో ఒక సన్నివేశాన్ని చూసినప్పుడు, బాధ కలిగినప్పుడు వారు యేసు నామాన్ని విశ్వాసంతో, నమ్మకంతో పలికేవారు. అటువంటి ఉదంతం బైబిలులో ఉంది.



ఒకరోజు దేవాలయంలోనికి పేతురు, యోహాను వెళుతుండగా పుట్టుకతోనే అవిటివాడైన ఒక వ్యక్తిని కొంతమంది మోసుకు వచ్చి అక్కడ దేవాలయపు మెట్లపై కూర్చోబెట్టేవారు. ఆ కుంటివాడు వచ్చి పోయే వాళ్లను చూసి ''ధర్మం చేయండి బాబూ'' అని అడిగేవాడు. సరిగ్గా అదే సమయానికి పేతురు, యోహాను దేవాలయానికి వెళ్తుండగా వారి చూపు ఆ కుంటివాడి మీద పడింది. తదేకంగా వారు ఆ కుంటివాణ్ణి చూశారు. కుంటి వాడు కూడా వాళ్లు ఏమైనా ఇస్తారేమోనని ఆశగా, ఆబగా వాళ్లవైపు చూస్తూ ఉన్నాడు. అప్పుడు పేతురు, యోహానులు ఆ కుంటివాణ్ణి చూసి ''వెండి, బంగారు మా దగ్గర లేవు. మాకు కలిగినది నీకు ఇచ్చుచున్నాము''అన్నారు. ఆ మాటకు వాడి కళ్లు విశాలమయ్యాయి.

ఏదో పెద్ద బహుమతి (కానుక) ఇస్తారులే అనుకున్నాడు.

పేతురు, యోహాను ఇద్దరూ ఒకేసారి ''నజరేయుడైన యేసుక్రీస్తు నామంతో చెబుతున్నాము. నీవు పైకి లేచి నడుస్తావు''అని వాడి చేతులు పట్టుకుని విశ్వాసంతో, నమ్మకంతో ప్రకటించారు. ఆశ్చర్యం! ఆ మాటకు వాడి కాళ్ల చీలమండలలో బలమునొంది దిగ్గున లేచాడు. పరుగున దేవాలయంలోనికి వెళ్లి గంతులు వేస్తూ దేవుణ్ణి స్తుతించసాగాడు. నమ్మకం, విశ్వాసం దైవంపై ఉంటే ఏదైనా సాధించవచ్చనేదానికి ఈ ఉదాహరణ చాలు. (అపో.కాం. 3:1–8)

– కనుమ ఎల్లారెడ్డి

సాక్షి
ఫ్యామిలీ
నల్లగొండ
మంగళవారం ॥ 17-12-2019

# పాత బస్తీలో డిష్యుం డిష్యుం


● రవితేజ

పాతబస్తీలో రౌడీమూకలను రఫ్ఫాడిస్తున్నారు ఆఫీసర్ రవితేజ. మరి ఆ రౌడీలు తప్పు తెలుసుకున్నారా? అనే విషయం తెలుసుకోవడానికి ఇంకా సమయం ఉంది. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రవితేజ హీరోగా నటిస్తున్న చిత్రం 'క్రాక్'. 'డాన్ శీను, బలుపు' సినిమాల తర్వాత ఈ కాంబినేషన్‌లో వస్తున్న మూడో సినిమా ఇది. శ్రుతీహాసన్ కథానాయిక. వరలక్ష్మీ శరత్‌కుమార్, సముద్రఖని కీలకపాత్రలు చేస్తున్నారు. 'ఠాగూర్' మధు నిర్మాత. ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఇటీవలే హైదరాబాద్‌లోని ఓల్డ్ సిటీలో ఓ పెద్ద ఫైట్‌ని చిత్రీకరించారు. నైట్ ఎఫెక్ట్‌లో సాగే ఈ ఫైట్‌ను రామ్–లక్ష్మణ్ మాస్టర్స్ చక్కగా డిజైన్ చేశారట. ఈ సినిమా షూటింగ్ సుమారు 25 శాతం పూర్తయిందని తెలిసింది. వేసవికి విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్.

# తెలుగు రాష్ట్రంలో తలైవి

ప్రముఖనటి, తమిళనాడు మాజీ సీఎం దివంగత జయలలిత జీవితం ఆధారంగా తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ఏఎల్ విజయ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'తలైవి' (హిందీలో 'జయ' అనే టైటిల్ అనుకుంటున్నారు). ఇందులో జయలలిత పాత్రలో బాలీవుడ్ క్వీన్‌కంగనా రనౌత్ నటిస్తున్నారు. ప్రకాష్‌రాజ్, అరవిందస్వామి కీలకపాత్రలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ సినిమా ఫస్ట్ షెడ్యూల్ ఇటీవల మైసూర్‌లో ముగిసిన సంగతి తెలిసిందే. తాజా షెడ్యూల్ భాగ్యనగరంలో(హైదరాబాద్) ప్రారంభం కానుంది. ఇందుకోసం హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ స్టూడియోలో సెట్‌లు రెడీ చేశారు. ఇక్కడి షెడ్యూల్ దాదాపు 25 రోజులు సాగుతుందని సమాచారం. విష్ణు ఇందూరి, శైలేష్ ఆర్.సింగ్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జూలై 26న విడుదల చేయాలనుకుంటున్నారు.


● కంగనా రనౌత్

# డైరెక్టర్ బచ్చన్


● అమితాబ్ బచ్చన్

యాభై ఏళ్లుగా కెమెరా ముందే ఉంటూ భారతీయ ప్రేక్షకులను అలరిస్తున్నారు బిగ్ బి అమితాబ్ బచ్చన్. నటుడిగా, నిర్మాతగా, కొన్ని సినిమాలకు వాయిస్ ఓవర్ అందించిన ఆయన ఎప్పుడూ డైరెక్టర్ చైర్‌లో కూర్చోలేదు. తాజాగా 'చెహ్రే' సినిమాలో కొన్ని సన్నివేశాలకు దర్శకుడిగా మారారు బచ్చన్. ఇమ్రాన్ హష్మీ, అమితాబ్ బచ్చన్ ముఖ్య పాత్రల్లో రూమీ జాఫ్రీ తెరకెక్కిస్తున్న చిత్రం 'చెహ్రే'. ఇదో సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రం. ఈ సినిమాలో ఉద్యోగ విరమణ చేసిన లాయర్‌గా కనిపించనున్నారు అమితాబ్ బచ్చన్. ఈ సినిమా షూటింగ్ కోసం స్లోవాకియా వెళ్లారు చిత్రబృందం. అక్కడ తీసిన ఓ చేజ్ సన్నివేశం, చిన్న ఫైట్ సీన్‌కి బచ్చన్ దర్శకత్వం వహించారట. మరి పూర్తిస్థాయిలో సినిమాను డైరెక్ట్ చేసే ఉద్దేశం అమితాబ్‌కి ఉందా? లేదా? సమాధానం ఆయనే చెప్పాలి. 'చెహ్రే' చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 24న రిలీజ్ కానుంది.

# ప్రతిరోజూ పండగే హిట్ అవుతుంది

– అల్లు అరవింద్


● సత్యరాజ్, సాయి తేజ్, రాశీ ఖన్నా, అల్లు అరవింద్, మారుతి, వంశీ, 'బన్ని' వాసు

''సందేశాన్ని కూడా ఆహ్లాదకరంగా చెప్పే ప్రతిభ ఉన్న వ్యక్తి మారుతి. ఆడియన్స్ పల్స్ తెలిసిన డైరెక్టర్ తను. 'ప్రతిరోజూ పండగే' సినిమా పెద్ద హిట్ అవుతుందని మా యూనిట్ అంతా నమ్మకంగా ఉన్నాం. సాయితేజ్‌తో పాటు ఈ సినిమాలో నటించిన అందరూ బాగా చేశారు. యు.వి. క్రియేషన్స్ వంశీ, నేను కలిసి చేస్తున్న మూడో సినిమా ఇది. బన్నీ వాసు కష్టపడి నిర్మించాడు'' అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. సాయితేజ్, రాశీ ఖన్నా జంటగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ప్రతి రోజూ పండగే'. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్ని' వాసు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 20న విడుదలవుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో నిర్మాత 'దిల్' రాజు మాట్లాడుతూ–'' వాసు, మారుతి, యూవీ వంశీ కలిసి చేస్తున్న ఈ సినిమా పెద్ద హిట్ అవ్వాలి. ఈ చిత్ర కథను మారుతి మొదటిసారి నాకే చెప్పాడు.. బాగా నచ్చింది. 'ప్రతి రోజూ పండగే' చిత్రం 'శతమానం భవతి' సినిమా అంత పెద్ద హిట్ కావాలి'' అన్నారు. సాయి తేజ్ మాట్లాడుతూ– ''ఫ్యాన్స్ ఉంటే మాకు ప్రతిరోజూ పండగే. నాకు ఎప్పుడూ అండగా నిలబడింది మెగా ఫ్యాన్స్. చిరంజీవిగారితో పాటు అభిమానుల ఆశీర్వాదాలు మా యూనిట్‌కి ఉండాలని కోరుకుంటున్నా. సినిమా చూశాక ప్రేక్షకులు నిరుత్సాహ పడరనే నమ్మకం ఉంది'' అన్నారు. ''మా సినిమా ఇంత బాగా రావడానికి కారణమైన నా టీమ్‌కి థ్యాంక్స్. తమన్ మంచి పాటలిచ్చాడు. 'బన్ని' వాసు, ఎస్.కె.ఎన్, ఏలూరు శ్రీను సహకారం మరువలేనిది. చిరంజీవిగారికి కథ చెప్పినప్పుడు నచ్చింది.. ఈ చిత్రం ట్రైలర్ చూసిన ఆయన మెచ్చుకున్నారు'' అన్నారు మారుతి. ''గీతా ఆర్ట్స్‌లో చేయాలనే కోరిక ఈ సినిమాతో తీరింది'' అన్నారు రాశీ ఖన్నా. ''నా సెకండ్ ఇన్నింగ్స్‌లో వచ్చిన ఒక బెస్ట్ రోల్ ఈ సినిమాలో చేశాను'' అన్నారు నటుడు నరేష్. ''సాయి తేజ్ చాలా హార్డ్ వర్కర్. చిరంజీవి, పవన్ కళ్యాణ్‌లో ఉన్న లక్షణాలు అతనిలో ఉన్నాయి'' అన్నారు నటుడు సత్యరాజ్. ఈ వేడుకలో 'బన్ని' వాసు, సహ నిర్మాత ఎస్.కె.ఎన్, నటుడు రావు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# తూటా వస్తోంది


● ధనుష్

ధనుష్, మేఘా ఆకాష్ జంటగా గౌతమ్ మీనన్ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'ఎనై నోకి పాయుమ్ తోట'. తమిళంలో ఘన విజయం సాధించిన ఈ చిత్రాన్ని 'తూటా' పేరుతో గొలుగూరి రామకృష్ణారెడ్డి సమర్పణలో విజయభేరి బ్యానర్‌పై జి.తాతా రెడ్డి, జి.సత్యనారాయణ రెడ్డి ఈ నెల 27న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా జి.తాతరెడ్డి, జి.సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ– ''రొమాంటిక్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది. తమిళంలో సూపర్ హిట్ సాధించిన ఈ సినిమా తెలుగులోనూ ఘన విజయం సాధిస్తుందనే నమ్మకంగా ఉన్నాం. ఇప్పటికే విడుదలయిన పోస్టర్స్, సాంగ్స్‌కు, ట్రైలర్‌కు మంచి స్పందన రావడంతో సినిమాపై అంచనాలు బాగున్నాయి. ధనుష్‌కి కోలీవుడ్‌తో పాటు తెలుగులోనూ మంచి మార్కెట్ ఉండటం మాకు కలిసొస్తుంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: దర్బుక శివ.

# ఖైదీ తర్వాత దొంగ ఏంటి?

''ఊపిరి' సినిమాలో కార్తీ నటన అద్భుతం. తన గురించి చెప్పాలంటే వెయ్యిలో ఒక్కడు. మూడు సార్లు బెస్ట్ యాక్టర్‌గా ఫిలిం ఫేర్ అవార్డ్ గెలుచుకున్నారు. జీతూ చాలా తెలివైన డైరెక్టర్. 'ఖైదీ' కంటే 'దొంగ' చిత్రం పెద్ద హిట్ అవ్వాలి'' అని సీనియర్ దర్శకులు శివనాగేశ్వర రావు అన్నారు. కార్తీ హీరోగా 'దృశ్యం' ఫేమ్ జీతు జోసెఫ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దొంగ'. వయాకామ్ 18 స్టూడియోస్, ప్యారలల్ మైండ్స్ పతాకాలపై నిర్మించిన ఈ సినిమా ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ చిత్రాన్ని తెలుగులో హర్షిత మూవీస్ పతాకంపై రావూరి వి. శ్రీనివాస్ రిలీజ్ చేస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో కార్తీ మాట్లాడుతూ– ''ఖైదీ' తర్వాత 'దొంగ' ఏంటి? అని అందరూ అడుగుతున్నారు. రెండూ చిరంజీవిగారికి పెద్ద హిట్ ఇచ్చిన టైటిల్సే. స్క్రిప్ట్‌కి తగ్గట్టే ఈ రెండు పేర్లు పెట్టాం. 'దొంగ' కథ వినేటప్పుడు చాలా థ్రిల్లింగ్‌గా అనిపించింది. అక్కాతమ్ముడు రిలేషన్‌షిప్ ఇంట్రెస్టింగ్‌గా, ఎమోషనల్‌గా అనిపించింది. మా నాన్న క్యారెక్టర్ సత్యరాజ్‌గారు చేశారు. మా మూడు పాత్రలు సినిమాకి పిల్లర్స్ లాంటివి. 'నా పేరు శివ, ఊపిరి' కలిపితే వచ్చిన వైవిధ్యమైన సినిమాలా 'దొంగ' ఉంటుంది'' అన్నారు. ''దృశ్యం' సినిమా తెలుగులో రీమేక్ అయి పెద్ద విజయం సాధించినప్పుడే తెలుగు ఇండస్ట్రీలో కూడా ఓ సినిమా చేయాలనుకున్నా. ఇప్పుడు 'దొంగ' సినిమాతో తెలుగు ఇండస్ట్రీలో ఒక భాగం అయినందుకు సంతోషంగా ఉంది'' అన్నారు జీతూ జోసెఫ్. నటుడు సత్యరాజ్, డైలాగ్ రైటర్ హనుమాన్ చౌదరి, హీరోయిన్ నిఖిలా విమల్ తదితరులు పాల్గొన్నారు.


● సత్యరాజ్, నిఖిలా విమల్, కార్తీ, జీతు జోసెఫ్

# మత్తు వదిలించే కింగ్‌ఫిషర్


● విజయేంద్రప్రసాద్, బి. గోపాల్, పరుచూరి గోపాలకృష్ణ, చిన్నికృష్ణ

''ప్రస్తుత ట్రెండ్‌కి తగ్గట్టు 'కింగ్‌ఫిషర్' టైటిల్ క్యాచీగా ఉంది. నేటివిటీ, ఎమోషన్, సెంటిమెంట్ మిస్ కాకుండా కథ రాయడంలో చిన్నికృష్ణ దిట్ట'' అన్నారు ప్రముఖ పారిశ్రామికవేత్త, ఎంపీ రఘు రామకృష్ణ రాజు. రచయిత చిన్నికృష్ణ 'కింగ్‌ఫిషర్' చిత్రంతో నిర్మాతగా మారారు. హైదరాబాద్‌లో చిన్నికృష్ణ స్టూడియోస్ బ్యానర్ లోగో ఆవిష్కరణలో రచయిత పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ– ''నిర్మాతలు పడే కష్టం మాకు తెలుసు.. అందుకే ఎప్పుడూ నిర్మాతలు కాకూడదనుకున్నాం. చిన్నికృష్ణ నిర్మాతగా మారుతున్నాడని తెలిసి ఆశ్చర్యపోయా. కొత్తవారికి అవకాశాలు ఇస్తూ ప్రోత్సహిస్తాడనుకుంటున్నాను'' అన్నారు. ''చిన్నికృష్ణ వెన్నతాగే కృష్ణుడిలా కాకుండా బాక్సాఫీస్ రికార్డులు కొల్లగొట్టాలి'' అన్నారు రచయిత విజయేంద్రప్రసాద్. ''నేను ఈ స్థానంలో ఉన్నానంటే దానికి చిన్నికృష్ణ గారే కారణం'' అన్నారు దర్శకుడు కేయస్ రవీంద్ర (బాబి). ''సమరసింహా రెడ్డి'తో నా లైఫ్ టర్న్ తీసుకుంది. కథ ఇచ్చిన విజయేంద్రప్రసాద్‌గారికి థ్యాంక్స్. 'నరసింహనాయుడు'తో నా కెరీర్ మరో మలుపు తిరిగింది. ఆ చిత్రానికి కథ ఇచ్చింది చిన్నికృష్ణ'' అన్నారు దర్శకుడు బి.గోపాల్. చిన్నికృష్ణ మాట్లాడుతూ– ''సినిమాల మీద ఆసక్తితో తెనాలి నుంచి చెన్నై వెళ్లాను. భాగ్యరాజాగారి దగ్గర పనిచేశాను. సుజాత రంగరాజన్‌కి ఏకలవ్య శిష్యుణ్ణి. ఆ తర్వాత పరుచూరి సోదరులు, బి.గోపాల్‌గారు నన్ను ప్రోత్సహించారు. ఓ యువ దర్శకుడు ఈ సినిమాని తెరకెక్కిస్తాడు. జనరల్‌గా కింగ్ ఫిషర్ అనగానే బీర్ గుర్తుకువస్తుంది. 'కింగ్‌ఫిషర్' అనేది ఒక పక్షి పేరు. ఆ కింగ్‌ఫిషర్ కిక్ ఇస్తుంది.. మా కింగ్‌ఫిషర్ మత్తుని వదిలిస్తుంది'' అన్నారు. జడ్జి మాధవ్ పట్నాయక్, నిర్మాత దాసరి కిరణ్, హీరో హవీష్, కత్తి మహేష్, జగన్ పాల్గొన్నారు.

# నా లక్కీ డేట్‌కే వస్తున్నా


● రాజ్ తరుణ్

''సాధారణంగా నేను చాలా హైపర్. కానీ 'ఇద్దరిలోకం ఒకటే' సినిమాలో నా పాత్ర ఎక్కువగా మాట్లాడదు. నేను మాట్లాడే యాస కూడా ఉండదు.. సాధారణంగా మాట్లాడతాను. నా పాత్ర కొత్తగా ఉంటుంది'' అని రాజ్‌తరుణ్ అన్నారు. జీఆర్ కృష్ణ దర్శకత్వంలో రాజ్ తరుణ్, షాలినీ పాండే జంటగా తెరకెక్కిన చిత్రం 'ఇద్దరిలోకం ఒకటే'. 'దిల్' రాజు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న రిలీజ్ కానుంది. రాజ్ తరుణ్ పంచుకున్న విశేషాలు...

- ఓ టర్కీ సినిమా చూడమని జీఆర్ కృష్ణ చెబితే చూశాను. ఆ కథను మన నేటివిటీకి తగట్టు మార్చి చెప్పారు.. నాకు చాలా నచ్చింది. నేటివిటీ మార్చే ప్రయత్నంలో కొందరు కథను సరిగ్గా తయారు చేసుకోరు. కృష్ణ మాత్రం కథను బాగా తయారు చేసుకున్నారు.
- ఈ మధ్య కాలంలో నా సినిమాలు ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. 'లవర్' సినిమా తర్వాత కొంత బ్రేక్ తీసుకోవాలనుకున్నాను. దానికి చాలా కారణాలున్నాయి. తిరుపతి వెళ్లి జుత్తు ఇచ్చి వచ్చాను. ఈ బ్రేక్‌లో నార్త్ ఇండియా మొత్తం ప్రయాణించాను. ఈ ప్రయాణంలో ఫ్రెష్ అవడమే కాకుండా రీచార్జ్ అయినట్టుంది. మానసికంగానూ చాలా రిలాక్స్‌డ్‌గా అనిపించింది. గతంలో కంటే ఇకపై ఇంకా ఎక్కువగా కథపై దృష్టిపెట్టి, కష్టపడదాం అనుకున్నాను.
- షాలినీతో పని చేయడం గ్రేట్ ఎక్స్‌పీరియన్స్. తన ఎనర్జీ లెవల్స్ సూపర్. ఏడవమంటే చాలు ఏడ్చేస్తుంది. చివరి అరగంట సినిమాకు చాలా కీలకం. అదే మా చిత్రానికి పెద్ద ప్లస్ అవుతుంది. 'ఉయ్యాల జంపాల' విడుదల తేదీకే వస్తున్నాం. అది నా లక్కీ డేట్.
- బ్రేక్ వచ్చిందని వరుసగా సినిమాలు చేయాలని ప్లాన్ చేయలేదు. ప్రస్తుతం హిందీ 'డ్రీమ్ గాళ్' తెలుగు రీమేక్, 'ఒరేయ్ బుజ్జిగా..', అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌లో ఓ సినిమా చేస్తున్నాను.

- సినిమాలు వైఫల్యం చెందడానికి చాలా కారణాలుంటాయి. ప్రత్యేకించి ఒకటని చెప్పలేం.
- ప్రస్తుతం కొన్ని కథలు సిద్ధంగా ఉన్నాయి. కానీ, దర్శకత్వం ఎప్పుడు చేస్తానో తెలియదు.
- 2022లో పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నాను.

# అందుకే తెలుగులో వీలు కుదర్లేదు

''ఒక్కో ఇండస్ట్రీ ఒక్కోలాంటి సినిమాలు తీస్తుంది. తమిళం, తెలుగు, మలయాళ భాషల్లో నేను సినిమాలు చేస్తుంటాను. పలు భాషల్లో సినిమాలు చేయడం వల్ల విభిన్నత చూపించడానికి నటిగా నాకు మంచి అవకాశం అనుకుంటాను'' అన్నారు వేదిక. బాలకృష్ణ హీరోగా కేఎస్ రవికుమార్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రూలర్'. వేదిక, సోనాల్ చౌహాన్ కథానాయికలు. సి. కల్యాణ్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 20న విడుదలవుతోంది. 'బాణం, విజయ దశమి, దగ్గరగా దూరంగా' సినిమాల్లో కనిపించి వేదిక 7 ఏళ్ల విరామం తర్వాత 'రూలర్' అనే తెలుగు సినిమా చేశారు. ఈ సందర్భంగా వేదిక పంచుకున్న విశేషాలు...

- ఇతర భాషల్లో సినిమాలతో బిజీగా ఉండటంతో తెలుగులో సినిమాలు చేసే వీలు కుదర్లేదు. అక్కడ వరుస చిత్రాలతో ఇక్కడ ఎక్కువ దృష్టి పెట్టలేకపోయాను. నాకు తెలుగులో మేనేజర్ కూడా లేరు. రాఘవ లారెన్స్ దర్శకత్వంలో వచ్చిన 'కాంచన 3' తమిళంలో, తెలుగులో హిట్ అయింది. నా పాత్రకు మంచి స్పందన రావడంతో 'రూలర్'కి నన్ను సంప్రదించారు.
- బాలకృష్ణగారిలాంటి పెద్ద స్టార్ సినిమాలో అవకాశం రావడం మంచి అవకాశంగా భావించాను. కేఎస్ రవి కుమార్‌గారు చాలా మంచి సినిమాలు తీశారు. ఈ సినిమాను పూర్తి చేయాలంటే ఏడాది పడుతుంది. కానీ, మూడున్నర నెలల్లో పూర్తి చేశారాయన. సి.కల్యాణ్‌గారు రాజీపడకుండా క్వాలిటీతో తెరకెక్కించారు.
- 'రూలర్' సినిమాలో నా పాత్రకు రెండు షేడ్స్ ఉంటాయి. ఒకటి సంప్రదాయ బద్ధంగా, మరొకటి ఫుల్ గ్లామరస్‌గా ఉండేది. డామినేటింగ్‌గా ఉండే పాత్ర నాది. సప్తగిరితో కలసి కామెడీ చేస్తాను. నటనకు స్కోప్ ఉన్న పాత్ర దొరికింది. ఈ సినిమాలో పాత్రలానే నేనూ డామినేటింగే. కానీ నా ఫేస్ అలా కనిపించదు(నవ్వుతూ).
- బాలకృష్ణగారి ఎనర్జీ సూపర్. డ్యాన్స్ ఎంజాయ్ చేస్తూ చేస్తారు. ఆయన ఎనర్జీని మ్యాచ్ చేయడానికి నా వంతు ప్రయత్నం చేశాను(నవ్వుతూ). ఆయన డైలాగ్స్, యాక్టింగ్‌లో ఒక స్టయిల్ ఉంటుంది. ఆయన అందర్నీ సమానంగా చూసుకుంటారు.


● వేదిక



రసాయనిక సేద్యం వల్ల హెక్టారు పొలం నుంచి ఏటా 5-10 టన్నుల కర్బనం భూమి నుంచి విడుదలై గాలిలో కలుస్తోంది. భూతాపోన్నతికి ఇదొక కారణం!
– వాల్టర్ యన, ప్రసిద్ధ సాయిల్ మైక్రోబయాలజిస్ట్, ఆస్ట్రేలియా



మూల కార్తె : డిసెంబర్ 16 నుంచి

- ఆకును నాటి, 10 వారాల్లో జన్యుస్వచ్ఛతతో కూడిన నాణ్యమైన ‘ఆకు మొక్క’ల ఉత్పత్తి
- తమిళనాడులో నర్సరీ రైతు అద్భుత ఆవిష్కరణ



రాజరత్నం నర్సరీలో నాటిన ఆకులు



ఆకులు నాటితే 10 వారాల్లో సిద్ధమైన మొక్కలు

# ఆకు మొక్కలు!

**నాణ్యమైన పూలు, పండ్ల మొక్కల కోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉన్న నర్సరీలపై ఆధారపడే పరిస్థితికి స్వస్తి చెప్పే రోజులు వస్తున్నాయా? అంటు కట్టకుండానే, టిష్యూ కల్చర్‌తో పని లేకుండానే రైతులే, 9-10 వారాల్లో అత్యంత సులువుగా జన్యుస్వచ్ఛతతో కూడిన నాణ్యమైన మొక్కల్ని తయారు చేసుకోవచ్చా?? రాజరత్నం అద్భుత ఆవిష్కరణ గురించి తెలుసుకుంటే ఈ ప్రశ్నలన్నిటికీ‘అవును’ అనే సమాధానం వస్తుంది. ఇంతకీ ఆ ఆవిష్కరణ ఏమిటంటారా.. ‘ఆకును నాటి మొక్కను తయారు చేసుకోవడం (లీఫ్ కల్చర్)! ఒకింత ఆశ్చర్యంగా ఉన్నా ఇది ముమ్మాటికీ నిజం. రాజరత్నం ఎవరో.. ‘ఆకు మొక్కల’ కథాకమామిషు ఏమిటో చదవండి మరి..**

రాజరత్నం స్వస్థలం తమిళనాడు కోయంబత్తూరు జిల్లా మెట్టుపాళయం. వ్యవసాయ కుటుంబంలో పుట్టి అప్లయిడ్ సైన్సెస్‌లో డిగ్రీ చదివిన రాజరత్నం మక్కువతో 6 ఎకరాల భూమిలో నర్సరీని ఏర్పాటు చేశారు. 1989 నుంచి ఈడెన్ నర్సరీ గార్డెన్స్‌ను నిర్వహిస్తున్నారు. షూట్ టిప్ కల్చర్‌లో నైపుణ్యం సాధించారు. ఏటా 10 లక్షల మొక్కల్ని విక్రయిస్తూ రూ. కోటిన్నర టర్నోవర్ సాధించారు. ఈ పూర్వరంగంలో సులభమైన రీతిలో మొక్కల ఉత్పత్తి పద్ధతులు అన్వేషిస్తూ ఈ నర్సరీ రైతు వినూత్నమైన ‘లీఫ్ కల్చర్’ పద్ధతిని ఆవిష్కరించారు. పచ్చి ఆకును నాటి, వేర్లు మొలిపించడం ద్వారా అత్యంత నాణ్యమైన మొక్కను తయారు చేయడం(లీఫ్ కల్చర్) అనే అద్భుత ఆవిష్కరణతో ఆయన నర్సరీ రంగంలో సంచలనం రేపుతున్నారు. ఈ ఏడాది ప్రతిష్టాత్మక చిన్నికృష్ణన్ ఇన్నోవేషన్ అవార్డు పొందారు.లీఫ్ కల్చర్‌పై పేటెంట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు.

నర్సరీ కార్యకలాపాల్లో నైపుణ్యాన్ని మరింత పెంపొందించుకోవాలన్న దృష్టితో 2010లో తమిళనాడు వ్యవసాయ వర్సిటీలో 4 వారాల టిష్యూ కల్చర్ కోర్సు చేశారు. టిష్యూకల్చర్ పద్ధతిలో నాణ్యమైన మొక్కలను ఉత్పత్తి చేయడానికి రూ. లక్షల ఖరీదైన ప్రయోగశాలను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే, అతి తక్కువ ఖర్చుతో మొక్కలను ఉత్పత్తి చేసే మార్గమే లేదా? విత్తనాలతో, షూట్ టిప్ కటింగ్స్‌తో, ఇతరత్రా కణజాలాలతో నాణ్యమైన మొక్కలను ఉత్పత్తి చేయగలుగుతున్నప్పుడు.. పచ్చి ఆకును నాటి ఎందుకు మొక్కను ఉత్పత్తి చేయకూడదు? అన్న మెరుపు వంటి ఆలోచన వచ్చింది. అనుకున్నదే తడవుగా ప్రయోగాలు ప్రారంభించాడు. ఈ క్రమంలో ఎదురైన వైఫల్యాలను అధిగమిస్తూ ఎట్టకేలకు 2013 నాటికి పచ్చి ఆకులు నాటి కొద్ది వారాల్లోనే చక్కని మొక్కలను ఉత్పత్తి చేయగలిగాడు.

**దేశంలోనే తొలి సేంద్రియ నర్సరీ**

రాజరత్నం నర్సరీలో ప్రధానంగా షూట్ టిప్ కటింగ్స్ ద్వారా గుండు మల్లి, బొడ్డు మల్లె, సన్న జాజి, కనకాంబరం, ఐక్సోరా వంటి పూల జాతులతోపాటు నిమ్మ, జామ, దానిమ్మ, నేరేడు, నోని, బొప్పాయి తదితర పండ్ల జాతుల మొక్కలు, తమలపాకు మొక్కలను ఏటా లక్షల సంఖ్యలో ఉత్పత్తి చేస్తుంటారు. మొక్కలను పూర్తి సేంద్రియ పద్ధతిలో ఉత్పత్తి చేస్తూ, దేశంలోనే తొలి సేంద్రియ నర్సరీగా రాజరత్నం నర్సరీ గుర్తింపు పొందింది కూడా. నర్సరీ మొక్కల పెంపకానికి ఎటువంటి సేంద్రియ ఎరువులు కూడా వాడటంలేదు, రిజర్వాయర్ ఒండ్రు మట్టినే వాడుతున్నారు.

**గుండు మల్లితో లీఫ్ కల్చర్ ప్రారంభం**

తమిళనాడులో రైతులు ఎక్కువగా సాగు చేసే ‘గుండు మల్లి’ రకంతో ‘లీఫ్ కల్చర్’ను రాజరత్నం విజయవంతంగా ప్రారంభించారు. ప్రస్తుతం గుండుమల్లితోపాటు నూరు వరహాల(ఐక్సోరా) రకం పూల జాతి మొక్కలను ఆకుల ద్వారా ఉత్పత్తి చేసి ఆయన విక్రయిస్తున్నాడు. గుండుమల్లి, నూరువరహాల పూల మొక్కల విషయంలో అన్ని పరీక్షలూ విజయవంతంగా పూర్తయ్యాయన్నారు. ఆకుతో ఉత్పత్తి చేసిన గుండుమల్లి మొక్కల ద్వారా దిగుబడి 20% పెరిగింది. అధిక నీటిని తట్టుకునే శక్తి పెరిగింది. ఒక గుత్తిలో పూల సంఖ్య దాదాపుగా రెట్టింపైంది. కొమ్మల కత్తిరింపు అవసరం ఏడాదికి 3 నుంచి ఒకసారికి తగ్గిందన్నారు.

**పూర్తి ఫలితాలకు 3-5 ఏళ్ల సమయం**

నేరేడు, జామ, నోని, తమలపాకు, మిరియాలు పనస తదితర పది పంట జాతుల ఆకుల నుంచి తయారు చేసిన మొక్కలను రైతులకిచ్చి ప్రయోగాత్మకంగా సాగుచేయిస్తున్నామన్నారు. ఈ ఫలితాలు పూర్తి స్థాయిలో రావటానికి మరో 3 నుంచి 5 సంవత్సరాలు పడుతుందని రాజరత్నం వివరించారు. దీర్ఘకాలిక పంటలు కావడంతో పండ్ల మొక్కల విషయంలో అనేక కోణాల్లో ఫలితాలను నిర్ధారించుకున్న తర్వాతే రైతులకు అందించాల్సి ఉంటుందన్నారు.

‘లీఫ్ కల్చర్’పై ఏ విశ్వవిద్యాలయమూ ఇంత వరకూ పరిశోధనలు ప్రారంభించలేదన్నారు. ఏ విశ్వవిద్యాలయమైనా ఆసక్తి చూపితే సంతోషంగా కలిసి పనిచేస్తానని రాజరత్నం ఫోన్ ఇంటర్వ్యూలో ‘సాగుబడి’తో చెప్పారు.

## లీఫ్ కల్చర్‌పై రైతులకు ఉచిత శిక్షణ!



ఆకులతో మొక్కల్ని ఉత్పత్తి చేయడం చాలా సులువు. రైతులెవరైనా సులువుగా నేర్చుకోగలరు. స్కూలు పిల్లలు కూడా ఇది నేర్చుకోగలుగుతారు. యంత్రాలు, ప్రయోగశాలలు అవసరం లేదు. విద్యుత్తు అవసరం లేదు. పెద్దగా పెట్టుబడి ఏమీ అవసరం లేదు. రూ. 20 వేల నుంచి 30 వేలు చాలు. షేడ్‌నెట్ హౌస్, మిస్ట్ ఛాంబర్ ఉంటే చాలు. రైతులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు అనుదినం మా నర్సరీని సందర్శిస్తూనే ఉంటారు. ఇప్పటికే సుమారు వంద మందికి ఆకులతో మొక్కల్ని ఉత్పత్తి చేసే పద్ధతిపై శిక్షణ ఇచ్చాను. రూపాయి కూడా ఫీజు చెల్లించనక్కరలేదు. రైతులంతా ఈ పద్ధతి నేర్చుకోవాలని, మొక్కల్ని కొనకుండా తామే ఉత్పత్తి చేసుకునేలా తోడ్పడాలనేదే నా అభిమతం. శిక్షణ పొందాలనుకునే వారు ఎవరైనా మా ఊరు బయలుదేరే ముందు సమాచారం కోసం నాకు ఒకసారి ఫోన్ చేస్తే చాలు. రైతులు ఎక్కువగా సాగు చేసే పూలు, పండ్ల జాతులతోపాటు అంతరించిపోతున్న చెట్ల జాతులు, ఔషధ మొక్కలపై పరిశోధనలు చేస్తున్నాను. నర్సరీపై వచ్చే 25% ఆదాయంలో లీఫ్ కల్చర్‌పై పరిశోధనలకు వెచ్చిస్తున్నాను.

– ఎస్. రాజరత్నం,
(94860 94670) నర్సరీ రైతు,
కురుప్పాయమ్మల్ తొట్టం,
వెల్లియపాళయం రోడ్డు, మెట్టుపాళయం,
కోయంబత్తూరు జిల్లా, తమిళనాడు
www.edennurserygardens.com

## ఆకుకు వేర్లు మొలిపించేది ఇలా..

1. తొలుత ఎంపిక చేసుకున్న ఆకులు నాటడానికి మట్టి మిశ్రమం నింపిన చిన్న పాలిథిన్ గ్రోబ్యాగ్‌లు సిద్ధం చేసుకోవాలి. వీటిని తొలి రోజుల్లో పెట్టడానికి షేడ్ నెట్ హౌస్‌ను ఏర్పాటు చేసుకోవాలి.
2. షేడ్ నెట్ హౌస్ లోపల అవసరం మేరకు టన్నెల్ మిస్ట్ ఛాంబర్‌లను ఏర్పాటు చేసుకోవాలి. ఛాంబర్‌ను 8 ఎం.ఎం. ఇనుప ఫ్రేమ్‌తో రూపొందించుకోవాలి. ఇది 2.5 అడుగుల ఎత్తు ఉండాలి. అవసరాన్ని బట్టి కావల్సినంత పొడవు పెట్టుకోవాలి. ఒక టన్నెల్ మిస్ట్ ఛాంబర్‌లో రాజరత్నం 3 వేల పాలిథిన్ గ్రోబ్యాగ్‌లు ఏర్పాటు చేసుకొని, వాటిలో ఆకులు పెడుతున్నారు.
3. తొలుత, మీకు అవసరమైన చెట్టు/మొక్క నుంచి పచ్చి ఆకును తొడిమతో పాటు తుంచాలి.
4. ఆ ఆకును లేత కొబ్బరి నీటిలో అరగంట సేపు నానబెట్టాలి. కొబ్బరి నీటిలో సీజన్‌ను బట్టి, ప్రాంతాన్ని బట్టి పోషకాల హెచ్చు తగ్గులుంటాయి. దీన్ని బట్టి లీఫ్ కల్చర్‌లో ఫలితాలు ఆధారపడి ఉంటాయి.
5. కాబట్టి, కొత్తగా ఆకుతో మొక్కను ఉత్పత్తి చేసుకునే రైతులు ఖచ్చితమైన ఫలితాలను పొందేందుకు ఐ.బి.ఎ.(ఇండోల్ బటైరిక్ యాసిడ్) అనే రూటింగ్ హార్మోన్‌ను ఉపయోగించడం ఉత్తమం.
6. పాలిథిన్ బ్యాగ్‌లలోని మట్టిలోకి తొడిమె పూర్తిగా వెళ్లేలా ఆకును పెట్టాలి. ఆకుకు వేర్లు పుట్టడానికి మట్టిలో తగినంత తేమ ఉండేలా చూసుకోవాలి. తర్వాత టన్నెల్ మిస్ట్ ఛాంబర్‌లోకి అసలు గాలి చొరబడకుండా పాలిథిన్ షీట్‌ను బిగించి, అన్నివైపులా మట్టి కప్పాలి.
7. పాలిథిన్ గ్రోబ్యాగ్‌లోని మట్టిలో తేమ చాలినంత ఉందో లేదో ప్రతి 5 రోజులకో సారి సరిచూసుకోవాలి. అవసరం మేరకు ఈ గ్రోబాగ్‌లపై నీటిని తగుమాత్రంగా పిచికారీ చేయాలి.
8. 4-5 వారాల్లో ఆకుకు వేర్లు మొలుస్తాయి. మరో 4-5 వారాల్లో ఆకు పక్కనే మొక్క పెరుగుతుంది. మూడు, నాలుగు ఆకులు వస్తాయి. ఆ దశలో టన్నెల్ మిస్ట్ ఛాంబర్ పైన పాలిథిన్ షీట్‌ను తొలగించాలి. మొక్కలను షేడ్‌నెట్ హౌస్‌లో కొన్ని రోజులు ఉన్న తర్వాత.. ఆరుబయట ఎండలోకి మార్చాలి.
9. ఆరుబయట మొక్కలు బాగా ఎదిగిన తర్వాత పొలంలో నాటుకోవచ్చు.
10. నాటిన ఆకు ఎండిపోకుండా ఉండటానికి, చక్కగా వేరు పోసుకోవడానికి 30 డిగ్రీల ఉష్ణోగ్రత (2 డిగ్రీలు అటూ ఇటుగా), గాలిలో తేమ 70% ఉంటే అనువుగా ఉంటుందని రాజరత్నం అంటున్నారు.



ఆకులు ఇలా సేకరించాలి



కొబ్బరి నీటిలో నానబెట్టాలి



కొబ్బరి నీటిలో నానబెట్టి, నాటాలి



పాలిథిన్ షీట్‌ను కప్పాలి



10 వారాల్లో ఆకు మొక్కలు సిద్ధం

## 22న సేంద్రియ పద్ధతిలో గొర్రెలు, మేకల పెంపకంపై శిక్షణ

సేంద్రియ పద్ధతిలో గొర్రెలు, మేకల పెంపకంపై గుంటూరు జిల్లా పుల్లడిగుంట దగ్గర కొర్నెపాడులోని రైతు శిక్షణా కేంద్రంలో రైతులకు ఈ నెల 22(ఆదివారం)న శిక్షణ ఇవ్వనున్నట్లు రైతునేస్తం ఫౌండేషన్ అధ్యక్షుడు డా. వై. వెంకటేశ్వరరావు తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన నిపుణులు డా. జి. రాంబాబుతోపాటు గొర్రెలు, మేకల పెంపకంలో అనుభవజ్ఞులైన రైతులు శిక్షణ ఇస్తారన్నారు. ముందుగా పేర్లు నమోదు చేసుకోగోరే వారు సంప్రదించాల్సిన నంబర్లు: 970 538 3666, 0863-2286255

## 22న కాకినాడలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ శిక్షణ

గో ఆధారిత ప్రకృతి వ్యవసాయంపై లోతైన అవగాహన కలిగించే లక్ష్యంతో సొసైటీ ఫర్ అవేర్‌నెస్ అండ్ విజన్ ఆన్ ఎన్విరాన్‌మెంట్(సేవ్) స్వచ్ఛంద సంస్థ ఈ నెల 22 (ఆదివారం)న కాకినాడ విద్యుత్‌నగర్‌లోని చల్లా ఫంక్షన్ హాల్ (వినాయకుడి గుడి ఎదుట)లో ఉ. 8.30 గం. నుంచి సా. 5.30 గం. వరకు రైతులకు శిక్షణ ఇవ్వనుంది. ప్రకృతి వ్యవసాయం అంటే ఏమిటి? పెట్టుబడి, ఖర్చులు తగ్గించుకునే మార్గాలు, రైతులు పంట దిగుబడులను మొత్తం నేరుగా అమ్ముకోకుండా కొంత మోత్తాన్ని విలువ ఆధారిత ఉత్పత్తులగా మార్చి అమ్ముకోవడం, అధికాదాయం కోసం ప్రయత్నాలు, దేశీ విత్తనాల ఆవశ్యకత, దేశీ ఆవు విశిష్టత తదితర అంశాలపై సేవ్ సంస్థ వ్యవస్థాపకులు, ప్రకృతి వ్యవసాయ నిపుణులు విజయరామ్ శిక్షణ ఇస్తారు. ప్రవేశ రుసుము: ఒక్కొక్కరికి రూ. వంద. ఆసక్తి గల రైతులు ముందుగా తమ పేర్లను ఫోన్ చేసి నమోదు చేసుకోవాలి.. వివరాలకు.. సుభాష్ పాలేకర్ ప్రకృతి వ్యవసాయ సమాచార కేంద్రం: 040 27654337, 86889 98047 94495 96039

## మార్చిలో జాతీయ శాశ్వత వ్యవసాయ మహాసభ

భూతాపోన్నతిని శాశ్వత వ్యవసాయ (పర్మాకల్చర్) పద్ధతుల్లో సమర్థవంతంగా ఎదుర్కొనే మార్గాలపై రైతాంగంలో చైతన్యం తెచ్చే లక్ష్యంతో వచ్చే ఏడాది మార్చి 6 నుంచి 8వ తేదీ వరకు జాతీయ శాశ్వత వ్యవసాయ మహాసభ జరగనుంది. తెలంగాణలోని జహీరాబాద్ దగ్గర్లోని బిడకన్నె గ్రామంలో అరణ్య పర్మాకల్చర్ అకాడమీలో ఈ మూడు రోజుల మహాసభ జరగనుందని అరణ్య శాశ్వత వ్యవసాయ సంస్థ తెలిపింది.

## 20న ప్రకృతి సేద్య పద్ధతుల్లో కూరగాయల సాగుపై శిక్షణ

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కూరగాయల సాగుపై కృష్ణా జిల్లా విజయవాడ రూరల్ కొత్తూరు తాడేపల్లిలోని రామరాజు గారి వ్యవసాయ క్షేత్రంలో ఈ నెల 20 (శుక్రవారం)న ఉ. 10 గం. నుంచి సా. 5 గం. వరకు గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఆం. ప్ర. శాఖ తరఫున రైతులకు శిక్షణ ఇవ్వనున్నారు. కూరగాయల సాగులో కొత్త పద్ధతులను అనుసరిస్తున్న సీనియర్ రైతులు అనుభవాలను పంచుకుంటారు. వివరాలకు.. 78934 56163

• డెయిరీ డైరీ-20

## శీతాకాలంలో గొర్రెల, మేకల సంరక్షణ



పశువులకు శీతాకాలం ఒక గడ్డు కాలం. వీటి ఉత్పాదకత తగ్గకుండా చలి బారి నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. పెద్ద పొట్ట పశువులే కాకుండా, గొర్రెలు, మేకలు కూడా శీతాకాలం ప్రభావానికి లోనవుతాయి. మెలకువలు పాటించడం శ్రేయస్కరం.

**శీతాకాలంలో గొర్రెల యాజమాన్యం:**

1. గొర్రెలకు తప్పనిసరిగా గృహవసతి ఉండాలి. కనీసం చెట్టు నీడనన్నా ఉంచాలి. ముఖ్యంగా రాత్రి వేళల్లో మంచు బారిన పడకుండా చూడాలి.
2. ఇటీవల ఉన్నిని కత్తిరించిన గొర్రెలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. చలి నుంచి రక్షణ ఇవ్వాలి.
3. అప్పుడే పుట్టిన గొర్రెపిల్లల మీద ఉన్న మాయ తాలూకు తడిని వెంటనే శుభ్రం చేయాలి. లేదంటే శరీర ఉష్ణోగ్రత తగ్గిపోయి ‘హైపోథర్మియ’ అనే పరిస్థితి ఏర్పడుతుంది.
4. ఈతకు వచ్చిన గొర్రెలను శ్రద్ధగా పర్యవేక్షించాలి.
5. రెండు నెలల వయస్సున్న గొర్రె పిల్లలు చలిని తట్టుకుంటాయి. కానీ షెడ్లలో తేమతో కూడిన వాతావరణం ఉన్నట్లయితే న్యూమోనియా ప్రబలే అవకాశముంది.
6. శీతాకాలంలో శరీర ఉష్ణాన్ని కాపాడుకునేందుకు శరీరంలో జీర్ణప్రక్రియ ద్వారా ఉత్పత్తి అయ్యే వేడిని గొర్రెలు బయటకు పంపవు. కాబట్టి శరీర ఉష్ణ నిర్వహణకు పీచు పదార్థం గల మేతను మేపాలి.
7. చూడి 15 వారాల సమయంలో సుమారు 2 కిలోల పచ్చిమేతను అందించాలి. జొన్న, మొక్కజొన్న, సజ్జ లాంటివన్నమాట. చివరి 4 వారాల చూడి దశలో వీటితో పాటుగా 500 గ్రాముల మొక్కజొన్న పిండిని ఇవ్వాలి.
8. గొర్రె ఈనిన తర్వాత 2.5 కిలోల పచ్చిమేత తోపాటుగా 15% ప్రొటీను గల సమీకృత దాణాను ఒక కిలో ఇవ్వాలి.
9. మంచి నీరు నిల్వ లేకుండా అవసరాన్ని బట్టి అందుబాటులో ఉంచాలి.

**మేకల యాజమాన్యం**

1. మందమైన పొడవాటి వెంట్రుకలు చలి నుంచి కాపాడుతాయి.
2. పరిశుభ్రమైన వెచ్చటి గడ్డితో కూడుకున్న పక్కను ఏర్పాటు చేయాలి.
3. పెద్ద మేకలకు గృహవసతి లేకున్నా.. చిన్న పిల్లలకు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.
4. గొర్రెలకన్నా మేకలు ఎక్కువ పీచును జీర్ణం చేసుకోగలుగుతాయి. ఎక్కువ పీచు పదార్థాలు కలిగిన చెరకు పిప్పి, పొద్దుతిరుగుడు మొక్కలు, ఎండిన కంది కట్టె వంటి వాటిని మేపవచ్చు.
5. మేకల్లో ఈ సీజన్‌లో ఎక్కువగా పేలు కనబడతాయి. వాటి నుంచి రక్షణ అవసరం.
6. ఖనిజ లవణ ఇటుకలను షెడ్లలో గాని, చెట్లకు గాని వేలాడదీయాలి.

– డా. ఎం.వి.ఎ.యన్. సూర్యనారాయణ
(99485 90506), ప్రొఫెసర్ – అధిపతి,
డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైవ్‌స్టాక్ ఫామ్ కాంప్లెక్స్,
కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, తిరుపతి

# తాటి నీరా తరుణమిదే!



తాటి నీరాతో తయారవుతున్న తాటి బెల్లం



శాస్త్రీయ పద్ధతుల్లో తాటి నీరా సేకరణ

తాటి చెట్ల నుంచి నీరాను సేకరించడం డిసెంబర్ నెల నుంచి ప్రారంభమవుతుంది. తాటి నీరా అత్యంత ఆరోగ్యదాయకమైన ప్రకృతిసిద్ధమైన పానీయం. తాటిచెట్టు గెలల నుంచి స్రవించే పోషక ద్రవాన్ని పులియకుండా సేకరిస్తే నీరా, పులియబెట్టి సేకరిస్తే కల్లు అవుతాయి. తాజా నీరా చక్కటి రుచితో అంతకుమించిన పోషకాలతో కూడి ఉంటుంది. దీన్ని హెల్త్ డ్రింక్‌గా తాగవచ్చు. తాటినీరాతో బెల్లం, పాకం(సిరప్), పంచదార, పటిక బెల్లం తయారు చేయవచ్చు. ఇళ్లలో, బేకరీల్లో చక్కెరకు బదులుగా వీటిని వాడుకోవచ్చు. తాటి ఉత్పత్తుల గ్లైసెమిక్ ఇండెక్స్ (జి.ఐ.) తక్కువ కాబట్టి సాధారణ వ్యక్తులతో పాటు షుగర్ వ్యాధిగ్రస్తులు కూడా వాడుకోవచ్చని తూ.గో. జిల్లా పందిరిమామిడిలోని ఉద్యాన పరిశోధనా కేంద్రానికి చెందిన ఫుడ్ సైన్స్ సీనియర్ శాస్త్రవేత్త పి. సి. వెంగయ్య చెబుతున్నారు. ఈ పరిశోధనా కేంద్రంలో తాటి నీరాతో వివిధ ఉత్పత్తుల తయారీ కోసం అత్యాధునిక ప్రాసెసింగ్ యూనిట్‌ను నెలకొల్పారు. గీత కార్మికులు, రైతులు, గ్రామీణులకు శిక్షణ ఇస్తున్నారు.

### తాటి నీరా



తాజా తాటి నీరా

ప్రకృతి సిద్ధంగా తాటి చెట్టు నుంచి లభించే పానీయాన్ని పులియకుండా సేకరిస్తే.. దాన్ని నీరా అంటారు. ఇది రుచికరమైన, ఆరోగ్యకరమైన పానీయం. నీరా తియ్యగా ఉండటమే కాకుండా సుక్రోజు వంటి పిండి పదార్థాలు ఎక్కువగా కలిగి ఉంటుంది. నీరాలో ఇంకా అనేక రకాల పోషక విలువలు ఉన్నాయి.

నీరా చక్కెర శాతం ఎక్కువగా కలిగిన పానీయం. దీనిలో చక్కెరతోపాటు ఐరన్, ఫాస్ఫరస్ వంటి మినరల్స్, ఆస్కార్బిక్ ఆమ్లాలు వంటి విటమిన్లు ఉన్నాయి. నీరా జీర్ణ శక్తిని పెంచుతుంది. కామెర్లు వంటి జబ్బులు రాకుండా నిరోధిస్తుంది. పోషక విలువలు ఎక్కువగా ఉన్న నీరాలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వలన షుగర్ వ్యాధిగ్రస్తులు కూడా వాడవచ్చు. దీనిలో మినరల్స్, అవశ్యకమైన అమైనో ఆమ్లాలు, బి-కాంప్లెక్స్ విటమిన్లు ఉన్నాయి. గర్భవతులకు, బలహీనంగా ఉన్న పిల్లల ఆరోగ్య రక్షణకు ఉపయోగించే ఆయుర్వే ఔషధాల్లో నీరాను వాడుతున్నారు. గర్భవతులు నీరాను వారానికి మూడు లేదా నాలుగు రోజులు తీసుకోవడం వల్ల పుట్టబోయే శిశువు మంచి రంగులో, ఆరోగ్యంగా జన్మిస్తుంది. బలహీనంగా ఉన్న పిల్లలకు రోజూ తక్కువ మోతాదులో ఇస్తే వారు ఆరోగ్యంగా ఎదుగుతారు. మధుమేహం, ఊబకాయం, దంతక్షయం ఉన్న వారికి నీరా ఉపయోగపడుతుంది. గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వలన కేలరీలు తక్కువగా ఉండే పదార్థాలు ఇష్టపడే వారు నీరాతో తయారు చేసిన పదార్థాలను వాడవచ్చు. తాటి నీరా సిరప్ (పాకం), బెల్లం, పంచదారను ఇళ్లలో, బేకరీలో వివిధ రకాల పదార్థాల తయారీలో చక్కెరకు బదులుగా వాడవచ్చు. నీరాను పాకం, బెల్లం, పంచదార వంటి పదార్థాలుగా మార్చడం వలన వీటిని సాంప్రదాయ వంటలు, ఇతర పదార్థాల తయారీలో చెరకు నుంచి తయారు చేసిన బెల్లం, పంచదారకు బదులుగా వాడవచ్చు.

### తాటి పటిక బెల్లం



తాజాగా సేకరించిన నీరా (తాజా నీరా ఉదజని సూచిక 7-8 ఉంటుంది)ను 103-105 డిగ్రీల సెంటీగ్రేడ్ వద్ద బాగా మరిగించాలి. నీరా బాగా మరిగి దాదాపు మూడో వంతు వరకు ఇగిరిన తర్వాత మంటను ఆర్పివేసి.. సన్నని దారాలు లేదా తీగలతో తయారు చేసిన క్రిష్టలైజర్‌లో పోయాలి. దీన్ని కదలకుండా, గాలి తగలకుండా ఉన్న చోటనే 35-40 రోజుల పాటు ఉంచాలి. తరువాత దారాలు లేదా తీగలకు అంటుకొని ఏర్పడిన స్ఫటికాల(అదే పటిక బెల్లం)ను బయటకు తీసి కడిగి, ఆరబెట్టి నిల్వ చేసుకోవచ్చు.

### తాటి బెల్లం



తాటి నీరాతో బాండీలో పోసి మరిగించి సులభంగానే బెల్లం తయారు చేసుకోవచ్చు. తొలుత 103-105 డిగ్రీల ఉష్ణోగ్రతతో బాగా మరగబెట్టి, తరువాత తక్కువ మంట మీద కలుపుతూ ఉండాలి. చిక్కబడిన తర్వాత అచ్చులలో పోస్తే బెల్లం తయారవుతుంది. ఎటువంటి ఎంజైములు, రసాయనాలు కలపనవసరం లేదు.

### తాటి పంచదార



తాటి చెట్ల పెంపకంలో రసాయనాలు వాడే అవసరం లేదు. కాబట్టి తాటి నీరాతో తయారు చేసే పంచదారను కూడా ప్రకృతి సిద్ధంగా, ఏ విధమైన రసాయనాలు శుద్ధి చేయాల్సిన అవసరం లేదు. రసాయనాలు వాడకుండానే తాటి పంచదారను తయారు చేసుకోవచ్చు. ఇంతులో విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉన్నాయి. నీరా పంచదారను వాడటం వలన బరువు తగ్గడం, మధుమేహం అదుపులో ఉండటంతోపాటు సీరమ్ కొలస్ట్రాల్ శాతాన్ని కూడా తగ్గిస్తుంది. గుండె సంబంధిత వ్యాధులను తగ్గించడంలో కూడా నీరా పంచదార ఉపయోగపడుతుంది. తాజా నీరా(ఉదజని సూచిక 7-8)ను 103-105 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద మరిగించి, బాగా చిక్కబడిన తరువాత క్రిష్టలైజర్, సెంట్రిఫ్యూజులను ఉపయోగించి పంచదారను తయారు చేస్తారు.

### తాటి సిరప్ (పాకం)

తాజా నీరాను బాణలిలో పోసి 103-105 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద బాగా మరిగించాలి. నీరా బాగా మరిగి దాదాపు సగం పరిమాణానికి తగ్గినప్పుడు మంటను ఆర్పివేసి, చల్లబర్చి గాజు సీసాలో పోసి నిల్వ చేసుకోవాలి. దీన్ని చక్కెరకు బదులుగా వాడుకోవచ్చు. ఇది ఆరోగ్యానికి చాలా మంచిది. టీ, కాఫీలలోను, కషాయాల లోను, బేకరీ ఉత్పత్తులలోను, ఐస్‌క్రీమ్‌ల తయారీలోను నీరా సిరప్‌ను ఎక్కువగా వాడతారు.

### 4 కోట్ల తాటి చెట్లున్నా..

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో దాదాపు 4 కోట్ల తాటిచెట్లు ఉన్నాయి. ముదురు చెట్ల నుంచి డిసెంబర్ నుంచి 4 నెలల పాటు నీరాను సేకరించవచ్చు. చెరకు రసంతో తయారు చేసే పంచదార, బెల్లం కన్నా తాటి బెల్లం, తాటి పంచదార ఎంతో మేలైనవి. ఈ సహజ తీపి ఉత్పత్తులను గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువ కాబట్టి మధుమేహ రోగులు కూడా తినొచ్చు. ఇంత ప్రయోజనకరమైన తాటి చెట్లలో 1 శాతాన్ని కూడా మనం ఉపయోగించుకోకపోవడం దురదృష్టకరం. ప్రతి తాటి చెట్టు నుంచి ఏటా గరిష్టంగా రూ. 10 వేల ఆదాయం పొందవచ్చు. గ్రామీణులకు ఉపాధి అవకాశాలను ఇవ్వగల శక్తి తాటి, ఈత చెట్లకు ఉందని ప్రభుత్వాలు, గీత కార్మికులు, రైతులు గుర్తించాలి.

– పి. సి. వెంగయ్య
(94931 28932),
సీనియర్ శాస్త్రవేత్త (ఫుడ్‌సైన్స్, టెక్నాలజీ),
అఖిల భారత తాటిపరిశోధనా పథకం,
డా. వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం,
పందిరి మామిడి, తూ. గో. జిల్లా




epaper.sakshi.com

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్పర్ధయా వర్ధతే విద్య
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్ sakshieducation@gmail.com
మంగళవారం 17-12-2019

## ఉద్యోగ సమాచారం

### పీజీసీఐఎల్-53

పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** ఫీల్డ్ ఇంజనీర్-19 (ఎలక్ట్రికల్-13, సివిల్-6), ఫీల్డ్ సూపర్‌వైజర్-34 (ఎలక్ట్రికల్-27, సివిల్-6, ఈ అండ్ సీ-1).
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా, బీఈ/బీటెక్/బీఎస్సీ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.
- **వయసు:** 2019, డిసెంబర్ 22 నాటికి 29 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** ఫీల్డ్ ఇంజనీర్ పోస్టులకు రూ. 400; ఫీల్డ్ సూపర్‌వైజర్ పోస్టులకు రూ.300.
- **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 22, 2019
- **వెబ్‌సైట్:** www.powergridindia.com

### వీఎస్ఎస్‌సీ-215

కేరళ(తిరువనంతపురం)లోని ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)కి చెందిన విక్రం సారాభాయి స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్‌సీ).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 215 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. **సైంటిస్ట్, మెడికల్ ఆఫీసర్లు: 80**
- **అర్హత:** పోస్టును బట్టి ఇంజనీరింగ్ డిగ్రీ, ఎంబీబీఎస్, సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయసు:** 35 ఏళ్లకు మించకూడదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.250.
- **దరఖాస్తులు ప్రారంభం:** డిసెంబర్ 20, 2019
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 3, 2020.

2. **టెక్నీషియన్, డ్రాఫ్ట్స్‌మెన్: 72**
- **విభాగాలు:** ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, మెషినిస్ట్, డీజిల్ మెకానిక్, కెమికల్ ఆపరేటర్, టర్నర్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ తదితర విభాగాలున్నాయి.
- **అర్హత:** పోస్టును బట్టి పదోతరగతి, సంబంధిత విభాగాల్లో ఐటీఐ ఉత్తీర్ణత.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్‌టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు ఫీజు:** రూ.100.
- **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 30, 2019

3. **టెక్నికల్ అసిస్టెంట్-56, సైంటిఫిక్ అసిస్టెంట్-4, లైబ్రరీ అసిస్టెంట్-3.**
- **విభాగాలు:** మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, కెమికల్, కంప్యూటర్ సైన్స్, ఆటోమొబైల్, ఎలక్ట్రికల్, సినిమాటోగ్రఫీ, ఫొటోగ్రఫీ.
- **అర్హత:** పోస్టును బట్టి డిగ్రీ, సంబంధిత విభాగాల్లో ఇంజనీరింగ్ డిప్లొమా, పీజీ ఉత్తీర్ణత.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు ఫీజు:** రూ.250.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 1, 2020.
- **వెబ్‌సైట్:** www.vssc.gov.in

### ఎస్‌జెడ్‌సీసీ-8

తంజావూరు(తమిళనాడు)లోని సౌత్‌జోన్ కల్చరల్ సెంటర్ (ఎస్‌జెడ్‌సీసీ).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 8 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్-3, అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్-2, జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్-1, జూనియర్ అసిస్టెంట్-2.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 17, 2020.
- **వెబ్‌సైట్:** www.szccindia.org

నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...
10th Class
SRIGAYATRI EDUCATIONAL INSTITUTIONS
English

సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్లో..
- పదో తరగతి స్టడీ మెటీరియల్, ప్రీవియస్ పేపర్స్, మోడల్‌పేపర్స్
- టీఎస్, ఏపీ ఇంటర్ స్టడీ మెటీరియల్, ప్రీవియస్ పేపర్స్,మోడల్‌పేపర్స్
- ఎంసెట్, నీట్ ఆన్‌లైన్ టెస్టులు

విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

---

ఎఫ్ఎంసీజీ.. ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్. ఈ రంగం ఏటేటా వేగంగా వృద్ధి సాధిస్తోంది. దేశ ఆర్థిక వ్యవస్థలో నాలుగో అతిపెద్ద రంగంగా గుర్తింపు పొందింది. యువతకు కొలువులు అందించడంలో ఎఫ్ఎంసీజీ ముందు నిలుస్తోంది! ప్రస్తుత ఆర్థిక మందగమన పరిస్థితుల్లోనూ ఎఫ్ఎంసీజీలో భారీగా నియామకాలు జరుగనున్నాయనే తాజా అంచనాలు నిరుద్యోగులకు పెద్ద ఉపశమనమని చెప్పొచ్చు! అదే విధంగా డెలివరీ అండ్ లాజిస్టిక్స్ సెక్టార్ కూడా.. వేగంగా విస్తరిస్తూ.. ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది!! ఈ నేపథ్యంలో.. ఎఫ్ఎంసీజీ, డెలివరీ అండ్ లాజిస్టిక్స్ రంగాల్లో లభిస్తున్న కొలువులు, కోర్సులు, వేతనాల గురించి తెలుసుకుందాం..



జాబ్ ట్రెండ్స్

# ఎఫ్ఎంసీజీ.. కొలువుల దిక్సూచి

» భారీ సంఖ్యలో ఉపాధి కల్పిస్తున్న రంగంగా ఎఫ్ఎంసీజీకి గుర్తింపు
» పదో తరగతి నుంచి ప్రొఫెషనల్స్ వరకు.. అందరికీ అవకాశాలు
» డెలివరీ విభాగంలోనూ విస్తృతంగా ఉద్యోగాలు లభిస్తున్న వైనం

ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్(ఎఫ్ఎంసీజీ) అంటే.. దైనందిన జీవితంలో ప్రతిరోజు ప్రతి దశలోనూ వినియోగించే వస్తువులు. టూత్ బ్రష్ మొదలు.. పెర్ఫ్యూమ్స్, అపరెల్స్, డ్రై ఫ్రూట్స్, ఎలక్ట్రానిక్స్.. ఇలా వందల సంఖ్యలో ఉన్న వస్తువుల శ్రేణినే ఎఫ్ఎంసీజీగా పరిగణిస్తున్నారు. ఉదాహరణకు ఏదైనా హైపర్ మార్కెట్ లేదా సూపర్ మార్కెట్‌కు వెళ్లి చూస్తే.. అక్కడ కనిపించే వందల రకాల వస్తువులన్నీ ఎఫ్ఎంసీజీ విభాగం కిందకే వస్తాయి.

## రెట్టింపు వృద్ధి

ప్రస్తుతం ప్రజల జీవనశైలిలో మార్పులతో వస్తు వినియోగం ఏటేటా పెరుగుతోంది. దీంతో ఎఫ్ఎంసీజీ రంగం వేగంగా వృద్ధి సాధిస్తోంది. ఈ రంగం గత ఆర్థిక సంవత్సరంలో 13శాతం వృద్ధి నమోదు చేసింది. 2020 నాటికి రెట్టింపు స్థాయిలో వృద్ధి సాధించి.. దేశ ఎఫ్ఎంసీజీ మార్కెట్ విలువ 103.7 బిలియన్ డాలర్లకు చేరుకోనుందని అంచనా. పలు అంతర్జాతీయ కన్సల్టింగ్ సంస్థల గణాంకాల ప్రకారం-2030 నాటికి భారత ఎఫ్ఎంసీజీ రంగం ప్రపంచంలో చైనా తర్వాత అతి పెద్ద మార్కెట్‌గా అవతరించనుంది. ఫలితంగా వస్తువుల ఆవిష్కరణ నుంచి ఉత్పత్తి.. వినియోగదారులకు చేరే వరకూ.. పలు విభాగాల్లో యువతకు ఉపాధి లభించనుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షల మందికి ఉద్యోగాలు దక్కుతాయని అంచనా.

## టెన్త్ టు ఎంబీఏ

ప్రస్తుతం మాంద్యం పరిస్థితుల్లో ఉద్యోగాన్వేషణలో ఒత్తిడికి గురవుతున్న నిరుద్యోగులకు ఎఫ్ఎంసీజీ రంగం ఆశాజనకంగా కనిపిస్తోంది. ఈ రంగం పదో తరగతి నుంచి బీఏ, బీకాం, బీటెక్, ఎంబీఏ వంటి ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసుకున్న అభ్యర్థుల వరకూ.. ప్రతి ఒక్కరికీ అవకాశాలు కల్పిస్తోంది. అభ్యర్థుల అర్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగాలు లభిస్తున్నాయి. అంతేకాకుండా ఎఫ్ఎంసీజీ రంగంలో కొత్త ఉత్పత్తుల రూపకల్పనకు అవసరమైన రీసెర్చ్, డిజైన్, డెవలప్‌మెంట్ వంటి ఉన్నత హోదాలు మొదలు.. సేల్స్, డెలివరీ వరకూ.. వివిధ రకాల కొలువులు సొంతం చేసుకునే అవకాశముంది.

## ఉద్యోగ హోదాలు ఇవే

ఎఫ్ఎంసీజీ రంగంలో క్షేత్ర స్థాయిలో సూపర్ మార్కెట్స్, హైపర్ మార్కెట్స్, రిటైల్ ఔట్‌లెట్స్‌లో.. సేల్స్ అండ్ మార్కెటింగ్ పర్సన్స్; సప్లయ్ చైన్ మేనేజర్స్; ఫైనాన్స్ మేనేజర్స్, ప్రొడక్ట్/బ్రాండ్ మేనేజర్స్,హెచ్‌ఆర్ మేనేజర్స్ తదితర ఉద్యోగాలు లభిస్తున్నాయి. వీటిలో సేల్స్ అండ్ మార్కెటింగ్ విభాగాల్లో పదో తరగతి నుంచి డిగ్రీ వరకు అర్హతలు ఉన్న వారిని సంస్థలు నియమించుకుంటున్నాయి. అలాగే సప్లయ్‌చైన్, ఫైనాన్స్, బ్రాండ్ మేనేజ్‌మెంట్, హెచ్‌ఆర్ విభాగాల్లో.. ఆయా స్పెషలైజేషన్లతో బ్యాచిలర్ కోర్సులు, పీజీ డిగ్రీలు పూర్తి చేసిన అభ్యర్థులకు ప్రాధాన్యం లభిస్తోంది. ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ పరంగా ప్రొడక్షన్ ఇంజనీర్స్, ప్యాకేజింగ్ ఇంజనీర్స్, ప్రొడక్ట్ డెవలపర్స్ వంటివి ముఖ్య జాబ్ ప్రొఫైల్స్. వీటికి టెక్నికల్ అర్హతలు అవసరం.

## ఈ-కామర్స్ ఊతం

ఎఫ్ఎంసీజీ రంగంలో అవకాశాలకు ఊతమిస్తోంది ఈ-కామర్స్. వినియోగదారులు ఆన్‌లైన్ షాపింగ్ పట్ల మక్కువ చూపుతుండటంతో ఈ రంగం ప్రాధాన్యం పెరిగింది. ఎఫ్ఎంసీజీ రంగంలోని సంస్థలు ఈ-కామర్స్ కంపెనీలతో ప్రత్యేక ఒప్పందాలు చేసుకొని వస్తువులు విక్రయిస్తున్నాయి. ఎఫ్ఎంసీజీ ఉత్పత్తుల విక్రయంలో ఈ-కామర్స్ సంస్థల వాటా దాదాపు 30 శాతంగా ఉంటోంది. ఈ-కామర్స్ సంస్థలు ఎఫ్ఎంసీజీ కొలువులకు వేదికలుగా నిలుస్తున్నాయి. ఈ-కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్ సంస్థల్లో... ఆన్‌లైన్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్; ఎస్ఈఓ, ఎస్ఈఎం; డేటాఅనలిస్ట్స్; డెలివరీ అసోసియేట్స్; ప్యాకర్స్; లాజిస్టిక్స్ ఎగ్జిక్యూటివ్స్; మేనేజర్స్; ఫోన్ బ్యాంకింగ్ ఎగ్జిక్యూటివ్స్; కస్టమర్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్స్ వంటి ఉద్యోగాలు లభిస్తున్నాయి. వీటిలో సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, ప్యాకర్స్, ఫోన్ బ్యాంకింగ్ ఎగ్జిక్యూటివ్స్, సీఆర్ఎం వంటి ఉద్యోగాలను పదో తరగతి మొదలు సంప్రదాయ బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులు సైతం సొంతం చేసుకోవచ్చు. కోర్ సెక్టార్‌లోని లాజిస్టిక్స్, డేటా అనలిస్ట్స్ వంటి ఉద్యోగాలకు సంబంధిత కోర్సులు అభ్యసించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

## అర్హతలకు తగ్గ వేతనం

ఎఫ్ఎంసీజీ రంగంలో, ఈకామర్స్ విభాగాల్లో... అర్హతలు, పని చేస్తున్న సంస్థను బట్టి ప్రారంభంలో నెలకు రూ.పది వేల నుంచి రూ.50 వేల వరకు వేతనం లభిస్తోంది. కస్టమర్ సర్వీస్‌కు సంబంధించి సేల్స్ పర్సన్స్‌కు ప్రారంభంలో నెలకు రూ.పదివేల నుంచి రూ.15వేల వరకు అందుతోంది. అదే విధంగా ఫ్లోర్ మేనేజర్, బ్రాండ్ మేనేజర్, బ్రాంచ్ మేనేజర్‌లకు తొలుత నెలకు రూ.18వేల నుంచి రూ.25 వేలకు పైగా వేతనం ఖాయం. ఉత్పత్తి సంస్థల్లో సాంకేతిక, ఉత్పత్తి ఆధారిత విభాగాల్లో పని చేసే వారికి ప్రారంభంలో నెలకు రూ.15వేల నుంచి రూ.30 వేల వేతనం లభిస్తోంది. అనుభవం, నైపుణ్యాలు సొంతం చేసుకుంటే.. ఆకర్షణీయ వేతనాలతో పాటు పదోన్నతులు పొందే అవకాశముంది.

## టాప్ రిక్రూటర్స్

ఎఫ్ఎంసీజీ రంగంలో టాప్ రిక్రూటర్స్‌గా పేరొందిన పలు ప్రముఖ సంస్థలు.. ఐఐటీలు, ఐఐఎంలు వంటి ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్‌లలో క్యాంపస్ డ్రైవ్స్ నిర్వహిస్తున్నాయి. ఇక్కడి ప్రతిభావంతులను ఉన్నత స్థాయి ఉద్యోగాల్లో నియమించుకుంటున్నాయి. కింది స్థాయి పోస్టుల్లో అభ్యర్థుల కోసం కంపెనీలు జాబ్ కన్సల్టెన్సీలను సంప్రదిస్తున్నాయి. ఎఫ్ఎంసీజీ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించడంలో...

» ఐటీసీ » హిందుస్థాన్ యూనిలీవర్ » డాబర్ ఇండియా » నెస్లే ఇండియా » అమూల్ » భారతి వాల్‌మార్ట్ » ఆదిత్య బిర్లా గ్రూప్ ముందు వరుసలో నిలుస్తున్నాయి.

## ప్రత్యేక కోర్సులు- ఇన్‌స్టిట్యూట్స్

ఎఫ్ఎంసీజీ రంగానికి సంబంధించి ప్రత్యేకంగా అకడమిక్ కోర్సులు సైతం అందుబాటులోకి వస్తున్నాయి. ఇంటర్ అర్హతగా డిప్లొమా ఇన్ రిటైల్ అండ్ సేల్స్; డిగ్రీ అర్హతగా పీజీ డిప్లొమా ఇన్ రిటైల్ అండ్ సేల్స్ వంటి కోర్సులను పలు ఇన్‌స్టిట్యూట్‌లు అందిస్తున్నాయి. ఇటీవల కాలంలో ఈ రంగంలో పెరుగుతున్న మానవ వనరుల అవసరాన్ని గుర్తించిన పలు ఇన్‌స్టిట్యూట్‌లు... బీకాం, ఎంబీఏ/ పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్‌లో రిటైల్ మేనేజ్‌మెంట్‌ను ఒక స్పెషలైజేషన్‌గా అందిస్తున్నాయి. » ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ – హైదరాబాద్ » నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిటైల్ మేనేజ్‌మెంట్-బెంగళూరు » ఇండియన్ రిటైల్ స్కూల్ – బెంగళూరు » ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిటైల్ మేనేజ్‌మెంట్ – న్యూఢిల్లీ ఆయా కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నాయి.



## లాజిస్టిక్స్ అండ్ డెలివరీ

ఒక వస్తువును ప్లాంట్ నుంచి రిటైల్ ఔట్‌లెట్‌కు వరకూ.. సురక్షితంగా చేర్చేందుకు సప్లయ్ చైన్ విభాగం కీలకం. ఇందులో సప్లయ్ చైన్ మేనేజర్లు, ఎగ్జిక్యూటివ్స్, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ఎగ్జిక్యూటివ్స్ వంటి ఉద్యోగాలు లభిస్తున్నాయి. వీరికి నైపుణ్యాలు, సంస్థను బట్టి నెలకు రూ.40వేల నుంచి రూ.50 వేల వరకు వేతనం లభిస్తుంది. లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్ పూర్తి చేసిన వారికి సంస్థలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. అలాగే ప్రొడక్ట్‌ను ఔట్‌లెట్ లేదా సంస్థ గోడౌన్ నుంచి వినియోగదారుల చేతికి నేరుగా అందించే క్రమంలో డెలివరీ ఎగ్జిక్యూటివ్స్, డెలివరీ బాయ్స్, విష్ మాస్టర్స్ తదితర కొలువులు లభిస్తున్నాయి. పదో తరగతి, ఇంటర్మీడియెట్ అర్హతలు ఉండి.. ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ ఉంటే ఈ కొలువులు సొంతం చేసుకోవచ్చు.

### ఎఫ్ఎంసీజీ... ముఖ్యాంశాలు

- 2030 నాటికి రెట్టింపు కానున్న భారత ఎఫ్ఎంసీజీ రంగం.
- 2020 నాటికి 104 బిలియన్ డాలర్లకు చేరుకోనున్న దేశ ఎఫ్ఎంసీజీ మార్కెట్.
- అయిదేళ్లలో ఏడింతలు పెరగనున్న ఆన్‌లైన్ షాపింగ్.. తద్వారా 14.5 బిలియన్ డాలర్ల వ్యాపారం.
- సప్లయ్ చైన్ విభాగంలో లక్షల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి.
- ట్రాన్స్‌పోర్టేషన్, డెలివరీ విభాగాల్లో దాదాపు పది లక్షల ఉద్యోగాలు.

---

# సార్.. కెమెరా.. యాక్షన్

టట

రంగుల ప్రపంచంలో కెరీర్‌ను ఎంచుకోవాలనుకునే యువతకు మంచి అవకాశం.. జెట్ (జాయింట్ ఎంట్రన్స్ టెస్ట్)-2020. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సత్యజిత్ రే ఫిలిం అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ (ఎస్ఆర్ఎఫ్‌టీఐ), కోల్‌కతా; ఫిలిం అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌టీఐఐ), పుణెల్లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. దీని ద్వారా సినిమా, టెలివిజన్ రంగాల్లో దర్శకత్వం, ఫొటోగ్రఫీ, ఎడిటింగ్, స్క్రిప్ట్ రైటింగ్ సహా వివిధ విభాగాల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో చేరొచ్చు. జెట్-2020కు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో.. కోర్సులు.. దరఖాస్తు విధానం.. ఎంపిక ప్రక్రియ..

» జెట్ 2020 నోటిఫికేషన్ విడుదల
» ఎస్ఆర్ఎఫ్‌టీఐ, ఎఫ్‌టీఐఐల్లో కోర్సులు
» సినిమా, టీవీ రంగాల్లో ఉపాధికి మార్గం



నోటిఫికేషన్

## సినిమా, టెలివిజన్

సినిమా, టెలివిజన్.. నేడు మానవ జీవితంతో మమేకమైన సమాచార, వినోద మాధ్యమాలు. ఇవి లేకుండా ఇప్పుడు మనిషి జీవితాన్ని ఊహించడం కష్టమే. వినోదం, సందేశంతోపాటు విలువైన సమాచారం సమాజానికి చేరవేయడంలో సినిమాలు, టీవీ మీడియాకు తిరుగులేదని చెప్పొచ్చు. రంగు రంగుల సినిమా రంగంలో రాణించాలనే తమ కలలను సాకారం చేసుకునేందుకు ఎంతోమంది ప్రయత్నిస్తుంటారు. అలాగే ఎలక్ట్రానిక్ మీడియాలో అవకాశాలు వెతుక్కుంటూ.. ఉన్న ఊరిని, కన్నవారిని వదిలి హైదరాబాద్, చెన్నై, ముంబయి వంటి మహానగరాల బాట పట్టేవారెందరో! అలాంటి వారికి జెట్ ద్వారా ప్రవేశం లభించే కోర్సులు సినిమా, టెలివిజన్ రంగంలో ఉపాధి పరంగా సరైన మార్గం చూపుతాయని చెప్పొచ్చు.

## జెట్ స్కోర్

సినిమా, టెలివిజన్ రంగాన్ని తమ కెరీర్‌గా ఎంచుకోవాలనుకునే వారికోసం కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ పరిధిలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌టీఐఐ) పుణె; సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఎస్ఆర్ఎఫ్‌టీఐ), కోల్‌కతా.. ఏటా జాయింట్ ఎంట్రన్స్ టెస్ట్(జెట్) నిర్వహిస్తున్నాయి. జెట్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా సినిమా, టెలివిజన్‌కు సంబంధించిన వివిధ విభాగాల్లో పలు కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తున్నాయి. ఈ కోర్సులు పూర్తిచేయడం ద్వారా కోరుకున్న విభాగంలో ఉజ్వల భవిష్యత్‌ను సొంతం చేసుకోవచ్చు. సృజనాత్మకత, ఎప్పటికప్పుడు మారుతున్న నూతన సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు ఉంటే.. సినిమా, టెలివిజన్ రంగంలో దూసుకుపోవచ్చు.

## అందించే కోర్సులు

ప్రొడ్యూసింగ్ ఫర్ ఫిలిం అండ్ టెలివిజన్, ఆర్ట్ డైరెక్షన్ అండ్ ప్రొడక్షన్ డిజైన్, స్క్రీన్ యాక్టింగ్, స్క్రీన్ రైటింగ్, డైరెక్షన్ అండ్ స్క్రీన్ ప్లే రైటింగ్, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్, సౌండ్ రికార్డింగ్ అండ్ డిజైన్, డైరెక్షన్ అండ్ ప్రొడ్యూసింగ్, డైరెక్షన్,ఎలక్ట్రానిక్ సినిమాటోగ్రఫీ, వీడియో ఎడిటింగ్, సౌండ్ ఫర్ ఎలక్ట్రానిక్ అండ్ డిజిటల్ మీడియా, సౌండ్ రికార్డింగ్ అండ్ టెలివిజన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ అండ్ డిజిటల్ మీడియా మేనేజ్‌మెంట్, రైటింగ్ ఫర్ ఎలక్ట్రానిక్ అండ్ డిజిటల్ మీడియా విభాగాల్లో రెండు, మూడేళ్ల పీజీ డిప్లొమా, డిప్లొమా కోర్సులను అందిస్తున్నారు.

## అర్హతలు

- జెట్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఏదైనా డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. సౌండ్ రికార్డింగ్, సౌండ్ డిజైన్ కోర్సుకు ఏదైనా డిగ్రీతోపాటు ఇంటర్/10+2 స్థాయిలో ఫిజిక్స్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి.
- అలాగే ఆర్ట్ డైరెక్షన్, ప్రొడక్షన్ డిజైన్ కోర్సులకు డిగ్రీ స్థాయిలో.. అప్లైడ్ ఆర్ట్స్, ఆర్కిటెక్చర్, పెయింటింగ్, స్కల్ప్చర్, ఇంటీరియర్ డిజైన్ లేదా సంబంధిత విభాగంలో ఫైన్ ఆర్ట్స్ కోర్సు లేదా తత్సమాన డిప్లొమా పూర్తి చేయాలి. డిగ్రీ ఆఖరు సంవత్సరం చదువుతున్నవారు కూడా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది.
- సౌండ్ రికార్డింగ్, టెలివిజన్ ఇంజనీరింగ్/ సౌండ్ ఫర్ ఎలక్ట్రానిక్ అండ్ డిజిటల్ మీడియా కోర్సుకు ఏదైనా డిగ్రీతోపాటు 10+2 స్థాయిలో ఫిజిక్స్ చదివి ఉండాలి.

## పరీక్ష ఫీజు

- ఏదైనా ఒక కోర్సుకు దరఖాస్తు చేసుకునే జనరల్ కేటగిరీ అభ్యర్థులు రూ.4000, రెండు కోర్సులకు దరఖాస్తు చేసుకుంటే రూ.8000, మూడు కోర్సులకు అయితే రూ.10,000 ఫీజుగా చెల్లించాలి
- ఏదైనా ఒక కోర్సుకు దరఖాస్తు చేసుకునే ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు రూ.1250, రెండు కోర్సులకు దరఖాస్తు రూ.2500, మూడు కోర్సులకు అయితే రూ.3125 దరఖాస్తు ఫీజుగా చెల్లించాలి.

## పరీక్ష విధానం

దేశ వ్యాప్తంగా మొత్తం 27 నగరాల్లో జెట్-2020ను నిర్వహిస్తారు. పరీక్ష ఆఫ్‌లైన్ విధానంలో జరుగుతుంది. ఆబ్జెక్టివ్, సబ్జెక్టివ్(వ్యాస రూపం) రూపంలో ప్రశ్న పత్రం ఉంటుంది. రెండు రోజుల పాటు మూడు సెషన్స్‌లో పరీక్షను నిర్వహిస్తారు.

## ఎంపిక ప్రక్రియ

జెట్ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఎఫ్‌టీఐఐ,ఎస్ఆర్ఎఫ్‌టీఐలు వేర్వేరుగా తదుపరి దశ ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తాయి. కటాఫ్‌కు అనుగుణంగా ఎంపికైన అభ్యర్థులకు గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ, మెడికల్ టెస్ట్ నిర్వహించి తుది జాబితా ప్రకటిస్తారు.

## ముఖ్యమైన తేదీలు

- **దరఖాస్తు:** ఆన్‌లైన్ విధానంలో
- **దరఖాస్తు చివరి తేదీ:** జనవరి 24, 2020
- **అడ్మిట్ కార్డ్:** ఫిబ్రవరి 5, 2020
- **పరీక్ష తేదీలు:** 2020, ఫిబ్రవరి 15, 16 తేదీల్లో
- **ఫలితాలు:** 2020, మే 3వ వారంలో
- **వెబ్‌సైట్:**
  **JET website:** https://applyadmission.net/jet2020
  **FTII website:** http://ftii.ac.in/
  **SRFTI website:** http://srfti.ac.in/

సాక్షి స్పోర్ట్స్
మంగళవారం
17-12-2019

## దక్షిణాఫ్రికా జట్టులో ఆరుగురు కొత్త ఆటగాళ్లు

ఇంగ్లండ్‌తో తొలి రెండు టెస్టుల్లో తలపడే దక్షిణాఫ్రికా జట్టులో ఆరుగురు కొత్త ఆటగాళ్లకు స్థానం లభించింది. బ్యూరాన్ హెన్‌డ్రిక్స్, డేన్ పాటర్సన్, పీటర్ మలాన్, డ్వేన్ ప్రిటోరియస్, రూడీ సెకండ్, వాన్ డర్ డసెన్‌లు టీమ్‌లోకి ఎంపికయ్యారు. ఈ నెల 26 నుంచి సెంచూరియన్‌లో తొలి టెస్టు జరుగుతుంది.



# విజయాల వీచిక...

- విశాఖలో భారత్‌కు ఘనమైన రికార్డు
- 8 వన్డేలలో ఒకే ఓటమి
- రేపు విండీస్‌తో టీమిండియా పోరు



*విశాఖపట్నంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియానికి 2019లో అరుదైన అవకాశం లభించింది. ఒకే ఏడాది మూడు వేర్వేరు ఫార్మాట్‌లలో అంతర్జాతీయ మ్యాచ్‌లకు ఈ మైదానం వేదికైంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆస్ట్రేలియాతో టి20లో తలపడిన భారత్... అక్టోబరులో దక్షిణాఫ్రికాను టెస్టు మ్యాచ్‌లో ఎదుర్కొంది. ఇప్పుడు వెస్టిండీస్‌తో వన్డే సమరానికి కోహ్లి సేన సన్నద్ధమైంది. మ్యాచ్‌లు కేటాయించే బీసీసీఐ రొటేషన్ విధానాన్ని బట్టి చూస్తే ఒకే సంవత్సరం ఇలా మూడు మ్యాచ్‌లు దక్కడం పెద్ద విశేషంగానే చెప్పవచ్చు. 2005లో మొదటి మ్యాచ్ జరిగిన నాటి నుంచి బాగా అచ్చొచ్చిన విశాఖ స్టేడియంలో భారత్‌ను ఒకే ఒక పరాజయం పలకరించింది. ధోని విధ్వంసక రూపాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన నాటి నుంచి కోహ్లి 10 వేల పరుగుల మైలురాయిని అందుకున్న చిరస్మరణీయ క్షణం వరకు వైజాగ్ ఎన్నో అపురూప క్షణాలకు వేదికైంది. ఇక్కడ ఆడిన ఎనిమిది వన్డేల్లో భారత్ 6 గెలిచి, 1 మ్యాచ్‌లో ఓడగా, మరో మ్యాచ్ 'టై'గా ముగిసింది. రేపు భారత్, విండీస్ పోరు నేపథ్యంలో ఇక్కడ జరిగిన వన్డేల విశేషాలను చూస్తే....*

### 5 ఏప్రిల్, 2005

**ఫలితం:** పాక్‌పై 58 పరుగులతో భారత్ గెలుపు.
**విశేషాలు:** కెరీర్ ఐదో వన్డే బరిలోకి దిగిన మహేంద్ర సింగ్ ధోని (123 బంతుల్లో 148; 15 ఫోర్లు, 4 సిక్సర్లు) తుఫాన్ ఇన్నింగ్స్ చిరకాల ప్రత్యర్థిని చిత్తు చేసింది. ధోనితో పాటు సెహ్వాగ్ (74), ద్రవిడ్ (52) అర్ధ సెంచరీలతో భారత్ 9 వికెట్లకు 356 పరుగులు చేయగా, పాక్ 298 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ గంగూలీ అండతో మూడో స్థానంలో ఆడే అవకాశం దక్కించుకున్న ధోని అద్భుత ప్రదర్శన అతని సత్తాను బయటపెట్టడంతో పాటు కొత్త హీరోను భారత క్రికెట్‌కు అందించింది.

### 17 ఫిబ్రవరి, 2007



**ఫలితం:** శ్రీలంకపై 7 వికెట్లతో భారత్ విజయం
**విశేషాలు:** చమర సిల్వా (107 నాటౌట్) సహాయంతో శ్రీలంక 7 వికెట్లకు 259 పరుగులు చేయగా, భారత్ 41 ఓవర్లలోనే 3 వికెట్లకు 263 పరుగులు చేసి విజయాన్నందుకుంది. యువరాజ్ సింగ్ (83 బంతుల్లో 95 నాటౌట్; 11 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడగా, గంగూలీ (58 నాటౌట్), ఉతప్ప (52) రాణించారు. మహరూఫ్ వేసిన చివరి ఓవర్లో యువీ వరుసగా 4, 4, 0, 6, 4, 4 బాది మ్యాచ్‌ను ముగించడం విశేషం.

### 29 అక్టోబరు, 2010



**ఫలితం:** ఆస్ట్రేలియాపై 5 వికెట్లతో భారత్ విజయం
**విశేషాలు:** మైకేల్ క్లార్క్ (111) సెంచరీతో పాటు కామెరాన్ వైట్ (89 నాటౌట్), మైక్ హస్సీ (69) రాణించడంతో ఆసీస్ 3 వికెట్లకు 289 పరుగులు చేసింది. అయితే విరాట్ కోహ్లి (121 బంతుల్లో 118; 11 ఫోర్లు, 1 సిక్స్) చక్కటి బ్యాటింగ్‌కు సురేశ్ రైనా (71 నాటౌట్), యువరాజ్ సింగ్ (58) అండగా నిలవడంతో భారత్ 5 వికెట్లకు 292 పరుగులు చేసింది. శిఖర్ ధావన్, మిషెల్ స్టార్క్‌లకు ఇదే తొలి వన్డే.

### 2 డిసెంబర్, 2011

**ఫలితం:** వెస్టిండీస్‌పై 5 వికెట్లతో భారత్ విజయం
**విశేషాలు:** విశాఖ మైదానంలో విరాట్ కోహ్లి వరుసగా రెండో మ్యాచ్‌లోనూ సెంచరీలతో మెరిశాడు. రవి రాంపాల్ (86), లెండిల్ సిమన్స్ (78) అర్ధ సెంచరీలతో వెస్టిండీస్ 9 వికెట్లకు 269 పరుగులు చేయగా, కోహ్లి (113 బంతుల్లో 117; 14 ఫోర్లు), రోహిత్ శర్మ (90 నాటౌట్) భాగస్వామ్యంతో భారత్ 5 వికెట్లకు 270 పరుగులు చేసి నెగ్గింది.

### 24 నవంబర్, 2013

**ఫలితం:** భారత్‌పై 2 వికెట్లతో వెస్టిండీస్ విజయం
**విశేషాలు:** నగరంలో టీమిండియాకు ఎదురైన ఓటమి ఇదొక్కటే. కోహ్లి (99) మరో సెంచరీ చేజార్చుకోగా, ధోని (51) అర్ధ సెంచరీ చేయడంతో భారత్ 7 వికెట్లకు 288 పరుగులు నమోదు చేసింది. అనంతరం విండీస్ 8 వికెట్లకు 289 పరుగులు సాధించింది. జట్టులో నలుగురు బ్యాట్స్‌మెన్ అర్ధ సెంచరీలు చేయడం విశేషం. డారెన్ స్యామీ (63 నాటౌట్), సిమన్స్ (62), పావెల్ (59), డారెన్ బ్రేవో (50) ఆకట్టుకున్నారు.

### 29 అక్టోబరు, 2016

**ఫలితం:** న్యూజిలాండ్‌పై 190 పరుగులతో భారత్ విజయం
**విశేషాలు:** అమిత్ మిశ్రా (5/18) మ్యాజిక్ బౌలింగ్‌తో గెలిపించిన మ్యాచ్ ఇది. రోహిత్ శర్మ (70), విరాట్ కోహ్లి (65) అర్ధ శతకాలతో భారత్ 6 వికెట్లకు 269 పరుగులు చేయగా, కివీస్ 23.1 ఓవర్లలో 79 పరుగులకే కుప్పకూలింది. ఐదుగురు బ్యాట్స్‌మెన్ డకౌటయ్యారు. భారత ఆటగాళ్లంతా సొంత పేర్లు కాకుండా తమ జెర్సీలపై తమ తల్లుల పేర్లు ముద్రించుకొని బరిలోకి దిగడం విశేషం.

### 17 డిసెంబర్, 2017

**ఫలితం:** శ్రీలంకపై 8 వికెట్లతో భారత్ విజయం
**విశేషాలు:** ఉపుల్ తరంగ (95) మినహా అంతా విఫలం కావడంతో శ్రీలంక 215 పరుగులకే ఆలౌటైంది. శిఖర్ ధావన్ (85 బంతుల్లో 100 నాటౌట్; 13 ఫోర్లు, 2 సిక్సర్లు) సెంచరీ, శ్రేయస్ అయ్యర్ (65) అర్ధ సెంచరీ కలిసి భారత్‌కు విజయాన్ని అందించారు. ఈ మ్యాచ్‌లో గెలుపుతో భారత్ వరుసగా ఎనిమిదో సిరీస్ విజయాన్ని సాధించింది.

### ఏడాది క్రితం వీరిద్దరే...



హెట్‌మైర్



హోప్

చెన్నైలో తొలి వన్డేలో సెంచరీలతో చెలరేగి భారత్ ఓటమికి కారణమైన హెట్‌మైర్, షై హోప్‌లు మరో అద్భుత ప్రదర్శన కనబర్చాలని పట్టుదలగా ఉన్నారు. రెండో మ్యాచ్ వేదిక వైజాగ్ కావడం వారిలో ఉత్సాహాన్ని పెంచింది. గత ఏడాది అక్టోబర్ 24న విశాఖ మైదానంలో భారత్–విండీస్ మధ్య వన్డే 'టై' కావడంలో వీరిదే కీలక పాత్ర కావడం విశేషం. ముందుగా విరాట్ కోహ్లి (129 బంతుల్లో 157 నాటౌట్; 13 ఫోర్లు, 4 సిక్సర్లు) అద్భుత శతకానికి రాయుడు (73) అండగా నిలవడంతో భారత్ 6 వికెట్లకు 321 పరుగులు చేసింది. ఆ తర్వాత షై హోప్ (134 బంతుల్లో 123 నాటౌట్; 10 ఫోర్లు, 3 సిక్సర్లు), హెట్‌మైర్ (64 బంతుల్లో 94; 4 ఫోర్లు, 7 సిక్సర్లు) చెలరేగడంతో విండీస్ కూడా 7 వికెట్లకు 321 పరుగులే చేసింది. చివరి ఓవర్లో విండీస్ విజయానికి 14 పరుగులు అవసరం కాగా, తొలి 5 బంతుల్లో 9 పరుగులు వచ్చాయి. చివరి బంతికి ఐదు పరుగులు అవసరం కాగా, హోప్ ఫోర్ కొట్టగలిగాడు. కోహ్లి ఈ మ్యాచ్‌లోనే 10 వేల పరుగుల మైలురాయిని దాటాడు.

### కోహ్లి సూపర్ రికార్డు...



విశాఖపట్నంలో ఆడిన ఐదు వన్డేల్లో కోహ్లి వరుసగా 118, 117, 99, 65, 157 నాటౌట్ పరుగులు చేశాడు. సెంచరీలు చేసిన మూడు సందర్భాల్లోనూ అతనే 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' కావడం విశేషం.

### అంతకుముందు ఐదు వన్డేలు...

విశాఖపట్నంలో ప్రస్తుత స్టేడియం నిర్మించక ముందు కూడా ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో 1988–2001 మధ్య ఐదు వన్డేలు జరిగాయి. న్యూజిలాండ్, వెస్టిండీస్‌లపై ఒక్కో మ్యాచ్ గెలిచిన టీమిండియా ఆస్ట్రేలియా చేతిలో పరాజయం పాలైంది. మిగతా రెండు వన్డేలు ఆస్ట్రేలియా–కెన్యా, పాకిస్తాన్–శ్రీలంక మధ్య జరిగాయి.

## కోహ్లి క్రికెట్ రొనాల్డో: లారా



భారత రాష్ట్రపతికి బ్యాట్ అందజేస్తున్న లారా

**విశాఖపట్నం:** వెస్టిండీస్ దిగ్గజం బ్రియాన్ లారా భారత కెప్టెన్ విరాట్ కోహ్లిని సాకర్ స్టార్ క్రిస్టియానో రొనాల్డోతో పోల్చాడు. అతని శారీరక సామర్థ్యం, మానసిక స్థైర్యం, బ్యాటింగ్ నైపుణ్యం అసాధారణమని 50 ఏళ్ల లారా ప్రశంసించాడు. మూడు ఫార్మాట్లలోనూ ఎవరికీ సాధ్యం కానీ 50 పరుగుల సగటు అతనిదని కితాబిచ్చాడు. ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు భారత్‌కు వచ్చిన లారా మీడియాతో మాట్లాడుతూ 'నా దృష్టిలో కోహ్లి క్రికెట్ రొనాల్డో. పోర్చుగల్ ఫుట్‌బాల్ స్టార్‌కు కోహ్లి ఏ మాత్రం తీసిపోడు. ఆటలో, సన్నాహకంలో అతని నిబద్ధతను మెచ్చుకోవాల్సిందే. బ్యాటింగ్‌లో అతను కష్టపడేతత్వం గొప్పగా ఉంటుంది. ఏ తరం క్రికెట్ జట్టుకైనా సరిగ్గా సరిపోయే బ్యాట్స్‌మన్ అతను' అని విరాట్‌ను ఆకాశానికెత్తాడు. అంతకుముందు ఢిల్లీలో ఈ విండీస్ దిగ్గజ బ్యాట్స్‌మన్ రాష్ట్రపతి భవన్‌లో భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిశారు. ఈ సందర్భంగా లారా క్రికెట్‌కు చేసిన సేవలను కోవింద్ కొనియాడారు. వర్ధమాన క్రీడాకారులకు లారా ఓ రోల్ మోడల్ అని ఆయన కితాబిచ్చారు.

## విశాఖ చేరిన భారత్, విండీస్ జట్లు

### నేడు నెట్ ప్రాక్టీస్

**విశాఖ స్పోర్ట్స్:** రెండో వన్డే మ్యాచ్‌లో తలపడేందుకు భారత్, వెస్టిండీస్ క్రికెట్ జట్లు సోమవారం విశాఖపట్నం చేరుకున్నాయి. మంగళవారం రెండు జట్లు నెట్ ప్రాక్టీస్‌లో పాల్గొననున్నాయి. మ్యాచ్ నిర్వహణ సజావుగా సాగేందుకు అపెక్స్ కమిటీ సోమవారం సమీక్ష నిర్వహించింది. నిర్వహణ కమిటీలు సమావేశమై ఏర్పాట్లపై చర్చించాయి. అనంతరం కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ... క్రీడాకారుల భద్రత, టిక్కెట్ల విక్రయాలు, స్టేడియంలో ఆహార పదార్థాలు తదితర విషయాలపై తీసుకున్న చర్యలను వివరించారు. స్థానిక ఆటగాడు, భారత మాజీ క్రికెటర్ వై.వేణుగోపాల్ రావు పేరిట స్టేడియంలో ఓ గేట్‌ను ఏర్పాటు చేయనున్నామని... దానిని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస రావు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడు శరత్ చంద్రారెడ్డి, కార్యదర్శి దుర్గాప్రసాద్, కోశాధికారి గోపీనాథ్ రెడ్డిలతో పాటు డీసీపీ రంగారెడ్డి, జేసీ వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోహ్లి



రోహిత్



పొలార్డ్

### వెస్టిండీస్‌కు భారీ జరిమానా

**చెన్నై:** తొలి వన్డేలో భారత్‌ను ఓడించిన వెస్టిండీస్ క్రికెట్ జట్టు ఓవర్‌రేట్‌లో మాత్రం భారీగా వెనుకబడింది. దాంతో ఆ జట్టు ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో ఏకంగా 80 శాతం కోత పడింది. భారత బ్యాటింగ్ సమయంలో 50 ఓవర్లకు నిర్దేశించిన సమయం ముగిసినా దానిని పూర్తి చేయలేక విండీస్ మరో నాలుగు ఓవర్లు వెనుకబడింది. ఐసీసీ నిబంధనల ప్రకారం ఒక్కో ఓవర్‌కు 20 శాతం జరిమానా చొప్పున విండీస్ జట్టు సభ్యులపై 80 శాతం మ్యాచ్ ఫీజును జరిమానాగా విధిస్తున్నట్లు రిఫరీ డేవిడ్ బూన్ ప్రకటించారు.

## ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్: టాప్ ర్యాంక్‌లోనే కోహ్లి

**దుబాయ్:** భారత కెప్టెన్ విరాట్ కోహ్లి టెస్టుల్లో అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) సోమవారం విడుదల చేసిన టెస్టు బ్యాట్స్‌మెన్ ర్యాంకుల్లో భారత సారథి 928 పాయింట్లతో నంబర్‌వన్ ర్యాంకులో కొనసాగుతున్నాడు. ఆస్ట్రేలియా స్టార్ స్టీవ్ స్మిత్ (911) కంటే 17 రేటింగ్ పాయింట్లతో ముందంజలో ఉన్నాడు. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో స్మిత్ రెండు ఇన్నింగ్స్‌ల్లో వరుసగా 43, 16 పరుగులే చేయడం కోహ్లి ర్యాంకును పదిలం చేసింది. భారత ఆటగాళ్లలో పుజారా (791), రహానే (759)లిద్దరూ వరుసగా నాలుగు, ఆరో స్థానాల్లో ఉన్నారు. టెస్టు బౌలర్ల జాబితాలో పేసర్ బుమ్రా ఐదు నుంచి ఆరో స్థానానికి దిగజారాడు. ఈ జాబితాలో ఆస్ట్రేలియన్ సీమర్ కమిన్స్ అగ్రస్థానంలో నిలిచాడు. ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో రవీంద్ర జడేజా రెండో ర్యాంకులో ఉన్నాడు.

## బీబీసీ అత్యుత్తమ ఆటగాడిగా స్టోక్స్

### వరల్డ్ కప్, యాషెస్‌లలో అద్భుత ప్రదర్శనకు గుర్తింపు



**అబెర్డీన్ (స్కాట్లాండ్):** ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ ఈ ఏడాది ప్రతిష్టాత్మక బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (బీబీసీ) 'స్పోర్ట్స్ పర్సనాలిటీ ఆఫ్ ద ఇయర్' అవార్డుకు ఎంపికయ్యాడు. గ్రేట్ బ్రిటన్ తరపున వివిధ రంగాల్లో అసమాన ప్రదర్శన కనబర్చిన వారికి బీబీసీ ప్రతీ ఏటా ఈ పురస్కారాలు అందిస్తుంది. 2019లో మైదానంలో స్టోక్స్ ప్రదర్శన ఇంగ్లండ్ అభిమానుల దృష్టిలో అత్యుత్తమంగా నిలిచింది. ఇంగ్లండ్ తొలిసారి గెలుచున్న వన్డే వరల్డ్ కప్‌లో స్టోక్స్ 66.42 సగటుతో 5 అర్ధ సెంచరీలు సహా 465 పరుగులు చేశాడు. ఫైనల్ పోరులో అతనే 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. ఆ తర్వాత యాషెస్ సిరీస్‌లో భాగంగా హెడింగ్లీలో జరిగిన టెస్టులో ఇంగ్లండ్‌కు ఓటమి ఖాయమనిపించిన దశలో 135 పరుగుల అద్భుత బ్యాటింగ్‌తో తమ జట్టును గెలిపించాడు. ప్రేక్షకుల ఓటింగ్ ప్రకారం నిర్ణయించిన ఈ అవార్డులో స్టోక్స్ తర్వాత ఫార్ములావన్ డ్రైవర్ లూయిస్ హామిల్టన్‌కు రెండో స్థానం దక్కింది. 2005లో ఆండ్రూ ఫ్లింటాఫ్ తర్వాత ఒక క్రికెటర్ అత్యుత్తమ ఆటగాడి పురస్కారాన్ని అందుకోవడం ఇదే మొదటిసారి. కొన్నాళ్ల క్రితం బ్రిస్టల్‌లో జరిగిన ఒక పబ్ ఉదంతంలో వ్యక్తిపై దాడికి పాల్పడి దాదాపు కెరీర్ ముగిసిపోయే ప్రమాదంలో నిలిచిన దశ నుంచి ఇప్పుడు స్టోక్స్ అందరినుంచి నీరాజనాలు అందుకోవడం విశేషం. 'రెండేళ్ల క్రితం నా జీవితంలో కఠిన పరిస్థితులు ఎదుర్కొన్నాను. కానీ అలాంటి స్థితిలో అండగా నిలిచిన నా సన్నిహితుల వల్ల కోలుకోగలిగాను. ఒక టీమ్ ఈవెంట్‌లో నా వ్యక్తిగత ప్రదర్శనను అంతా గుర్తించినందుకు సంతోషంగా ఉంది' అని స్టోక్స్ వ్యాఖ్యానించాడు. బీబీసీ అవార్డుల్లో ప్రపంచ కప్ గెలుచుకున్న ఇంగ్లండ్ వన్డే జట్టు 'టీమ్ ఆఫ్ ద ఇయర్'గా నిలవగా... సూపర్ ఓవర్ చివరి బంతికి స్టంప్స్‌ను పడగొట్టి గప్టిల్‌ను కీపర్ బట్లర్ రనౌట్ చేసిన క్షణం 'గ్రేటెస్ట్ స్పోర్టింగ్ మూమెంట్' అవార్డుకు ఎంపికైంది. 1954లో నెలకొల్పిన బీబీసీ స్పోర్ట్స్ అవార్డుల్లో ఇప్పటివరకు ఐదుగురు క్రికెటర్లు మాత్రమే ఈ పురస్కారాన్ని అందుకున్నారు. గతంలో జిమ్ లేకర్ (1956లో), డేవిడ్ స్టీలీ (1975లో), ఇయాన్ బోథమ్ (1981లో), ఆండ్రూ ఫ్లింటాఫ్ (2005లో) ఈ అవార్డును పొందారు.

## అటు 14... ఇటు 48

### ఐపీఎల్ వేలానికి ఆ ఇద్దరు



నూర్ అహ్మద్



ప్రవీణ్ తాంబే

**ముంబై:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఎంతో మంది కుర్రాళ్లకు పట్టం కట్టింది. అలాగే అనుభవజ్ఞులకూ అవకాశమిచ్చింది. గత 12 ఏళ్లుగా ఆటలో కుర్రాళ్లకు, సహాయ సిబ్బందిలో అనుభవజ్ఞులకు కూడా ఎంతో పేరు తెచ్చిపెట్టింది ఈ లీగ్. అయితే కొత్తగా ఈ సారి ఓ 14 ఏళ్ల కుర్రాడు, 48 ఏళ్ల అనుభవజ్ఞుడు ఇద్దరు కూడా ఆట కోసమే వేలం పాటకు అందుబాటులో ఉన్నారు. విచిత్రంగా ఉంది కదూ! ఆ టీనేజర్ అఫ్గానిస్తాన్ క్రికెటర్ నూర్ అహ్మద్ లఖన్‌వాల్ అయితే... ఆ వెటరన్ మన ముంబైవాలా ప్రవీణ్ తాంబే! చిత్రంగా ఇద్దరు స్పిన్నర్లే కాగా... లఖన్‌వాల్ చైనామన్. ఈ అఫ్గానీ ఆటగాడు రాజస్తాన్ రాయల్స్ నుంచి ఆహ్వానం దక్కడంతో ట్రయల్స్‌లో కూడా పాల్గొన్నాడు. ఈ సందర్భంగా ఈ టీనేజ్ చైనామన్ జట్టు వర్గాల్ని ఆకట్టుకున్నట్లు తెలిసింది. ఇటీవల లక్నోలో భారత అండర్–19 జట్టుతో జరిగిన సిరీస్‌లో నూర్ అహ్మద్ లఖన్‌వాల్ 9 వికెట్లు తీసి అదరగొట్టాడు. దీంతోపాటు అఫ్గానిస్తాన్ అండర్–19 జట్టు తరఫున త్వరలో అండర్–19 ప్రపంచకప్ ఆడనున్నాడు. వచ్చే నెల దక్షిణాఫ్రికాలో కుర్రాళ్ల మెగా ఈవెంట్ జరగనుంది. ఈ నేపథ్యంలో మణికట్టు బౌలర్‌పై ఫ్రాంచైజీల ఆసక్తి పెరిగింది. మరోవైపు వయసురీత్యా అర్ధసెంచరీ కొట్టబోతున్న వెటరన్ స్పిన్నర్ తాంబే ఐపీఎల్‌లో ఇదివరకు రాజస్తాన్ రాయల్స్, గుజరాత్ లయన్స్ (ఇప్పుడు లేదు), సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడాడు.

## ఈ నిరసనలతో ఎలాగబ్బా..!

### 19న ఐపీఎల్ వేలంపై ఫ్రాంచైజీల ఆందోళన





**న్యూఢిల్లీ:** పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)తో దేశవ్యాప్తంగా అల్లర్లు చెలరేగుతున్నాయి. బంగ్లాదేశ్‌కు సరిహద్దు రాష్ట్రమైన పశ్చిమ బెంగాల్ అట్టుడుకుతోంది. ఐపీఎల్ వేలం ఆ రాష్ట్ర రాజధాని కోల్‌కతాలో నిర్వహించనున్న నేపథ్యంలో ఫ్రాంచైజీ యాజమాన్యాలు కలవరపడుతున్నాయి. వచ్చే సీజన్‌కు సంబంధించి ఈ నెల 19న ఆటగాళ్ల వేలం ప్రక్రియ జరగనుంది. ఈ నేపథ్యంలో అక్కడి పరిస్థితులపై ఫ్రాంచైజీలు ఆరాతీస్తున్నాయి. కొన్ని చోట్ల నిరసనలు హింసాత్మకంగా మారుతున్నాయి. దీనిపై ఓ ఫ్రాంచైజీ అధికారి మాట్లాడుతూ 'తీవ్రంగా ఆందోళన చెందడం లేదు కానీ... అక్కడి పరిస్థితులపై ఓ కన్నేశాం. వేలం గురువారం జరగనుండగా... సోమవారం భారీ ర్యాలీలతో నిరసన కార్యక్రమాలు జరిగాయి. ఎప్పటికప్పుడు ఈ పరిస్థితులపై సమీక్షిస్తున్నాం' అని అన్నారు. మరో ఫ్రాంచైజీ అధికారి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అయితే ఫ్రాంచైజీ వర్గాలు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)పై నమ్మకముంచాయి. పౌరసమాజమే కాదు... రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రం తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టంపై భగ్గుమంటోంది. బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ నెల 20న కోల్‌కతాలో తమ పార్టీ నేతలతో సమావేశం కానుంది. ఈ నేపథ్యంలో వేలం పాట ముగిశాక మరుసటి రోజు తిరుగు పయనం కావడంపై కూడా ఫ్రాంచైజీలు ఆలోచిస్తున్నాయి. అయితే గురువారం జరిగే ఐపీఎల్ వేలం కార్యక్రమంలో ఎలాంటి మార్పు లేదని... ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే వేలం కార్యక్రమం జరుగుతుందని బీసీసీఐ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

## ఆసీస్ మహిళల 'ఎ' జట్టుదే సిరీస్

### మూడో వన్డేలో భారత మహిళల 'ఎ' జట్టు ఓటమి



అరుంధతి రెడ్డి

**బ్రిస్బేన్:** సిరీస్ విజేతను నిర్ణయించే అనధికారిక మూడో వన్డేలో భారత మహిళల 'ఎ' జట్టు సమష్టిగా విఫలమైంది. దీంతో చివరి వన్డేలో ఆస్ట్రేలియా మహిళల 'ఎ' జట్టు 3 వికెట్ల తేడాతో గెలిచి మూడు మ్యాచ్‌ల అనధికారిక సిరీస్‌ను 2–1తో కైవసం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 176 పరుగులు చేసింది. హైదరాబాద్ అమ్మాయి అరుంధతి రెడ్డి (70 బంతుల్లో 45; 2 ఫోర్లు, సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచింది. కెప్టెన్ వేద కృష్ణమూర్తి (61 బంతుల్లో 35; 3 ఫోర్లు) ఆకట్టుకుంది. ఓపెనర్ షఫాలీ వర్మ (0) నిరాశ పరిచింది. ఆస్ట్రేలియా బౌలర్లలో స్ట్రానో 3 వికెట్లు తీయగా... అన్నాబెల్ సదర్ల్యాండ్, తహిలా మెక్‌గ్రాత్ చెరో రెండు వికెట్లతో రాణించారు. అనంతరం స్వల్ప విజయలక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన ఆసీస్ 39.3 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 177 పరుగులు చేసి గెలిచింది. 119/7తో కష్టాల్లో ఉన్న ఆసీస్‌ను బర్న్స్ (52 బంతుల్లో 53 నాటౌట్; 4 ఫోర్లు, సిక్స్), స్ట్రానో (37 బంతుల్లో 22 నాటౌట్; 2 ఫోర్లు) ఆదుకున్నారు. వీరు అజేయంగా ఎనిమిదో వికెట్‌కు 58 పరుగులు జోడించి జట్టుకు విజయాన్ని అందించారు. భారత బౌలర్లలో హేమలత 3 వికెట్లు, తనూజా కన్వర్ 2 వికెట్లు దక్కించుకున్నారు.

## టెన్నిస్‌లో బెట్టింగ్ కలకలం!



**బెర్లిన్:** టెన్నిస్‌లో బెట్టింగ్ కలకలం చోటుచేసుకుంది. దాదాపు 135 మందికి పైగా ప్రొఫెషనల్ ఆటగాళ్లకు బెట్టింగ్‌లతో సంబంధం ఉందని... అందులో అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) టాప్–30 ర్యాంకింగ్ ఆటగాళ్లు ఉన్నారంటూ జర్మనీ మీడియా డై వెల్ట్, బ్రాడ్‌క్యాస్టర్ జీడీఎఫ్ బాంబు పేల్చింది. వీరు త్వరలోనే అమెరికా దర్యాప్తు సంస్థ అయిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ), యూరోపియన్ అథారిటీస్‌లతో విచారణ ఎదుర్కోనున్నారని ఆ మీడియా సంస్థలు తెలిపాయి. ఇందులో ఇప్పటి వరకు 3 ఏటీపీ టూర్ టైటిల్స్ నెగ్గిన టాప్–30 ర్యాంకు ఆటగాడు ఉన్నాడని సమాచారం. అర్మేనియా బెట్టింగ్ మాఫియాతో చేతులు కలిపిన కొందరు టెన్నిస్ ఆటగాళ్లు మ్యాచ్ ఫలితాలను తారుమారు చేస్తున్నారని బెల్జియం న్యాయవాది ఎరిక్ బిషప్ తెలిపారు. ఈ బెట్టింగ్‌ల ద్వారా కొన్ని వేల యూరోలు చేతులు మారుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇటీవల ఫిక్సింగ్ చేస్తూ దొరికిన అర్జెంటీనా మాజీ టెన్నిస్ ఆటగాడు మార్కో ట్రుంగెల్లిటి ఈ బెట్టింగ్ సమాచారం అందించినట్లుగా టెన్నిస్ వర్గాలు విశ్వసిస్తున్నాయి.

# సాక్షి బిజినెస్

మంగళవారం
17-12-2019

WWW.SAKSHIBUSINESS.COM


## స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు

| సెన్సెక్స్‌ | నిఫ్టీ |
|---|---|
| 71 ▼ | 33 ▼ |
| 40,939 | 12,054 |

మరిన్ని వార్తలు, స్టాక్‌ అప్‌డేట్స్‌ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (సాయి రెండు 11.30గంటలకు)

| సూచీ | విలువ | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్‌ | 8,832 | ▲ 97 |
| డోజోన్స్‌ | 28,341 | ▲ 178 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,519 | ▲ 166 |
| డాక్స్‌ | 13,408 | ▲ 125 |
| షాంఘై | 2,984 | ▲ 16 |
| నికాయ్‌ | 23,952 | ▼ 70 |

• అమెరికా • బ్రిటన్‌ • జర్మనీ • చైనా • జపాన్‌

## ఫారెక్స్‌ రేట్లు రూ. లలో

| | కరెన్సీ | | • కొనుగోలు | • అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్‌ డాలర్‌ | ఎస్‌బీఐ | 70.05 | 71.69 |
| £ | బ్రిటన్‌ పౌండ్‌ | ఎస్‌బీఐ | 93.27 | 96.57 |
| € | యూరో | ఎస్‌బీఐ | 77.44 | 80.33 |
| ¥ | జపాన్‌ ఎన్‌ (100) | ఎస్‌బీఐ | 63.60 | 65.98 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్‌ | ఎస్‌బీఐ | 47.74 | 49.93 |
| S$ | సింగపూర్‌ డాలర్‌ | ఎస్‌బీఐ | 51.14 | 53.22 |
| SAR | సౌదీ రియాల్‌ | థామస్‌కుక్‌ | 18.10 | 19.70 |
| UAE D | యూఏఈ దిర్హామ్‌ | థామస్‌కుక్‌ | 18.82 | 19.82 |
| ¥ | చైనా యువాన్‌ | థామస్‌కుక్‌ | 9.52 | 10.93 |

# బ్రూక్‌ఫీల్డ్‌ చేతికి జియో టవర్ల కంపెనీ

- డీల్‌ విలువ రూ. 25,215 కోట్లు
- దేశీ ఇన్‌ఫ్రాలో భారీ విదేశీ పెట్టుబడి ఇదే!




**న్యూఢిల్లీ:** రిలయన్స్‌ ఇండస్ట్రీస్‌ మొబైల్‌ కంపెనీ రిలయన్స్‌ జియోకు చెందిన టవర్ల వ్యాపారాన్ని కెనడాకు చెందిన బ్రూక్‌ఫీల్డ్‌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ పార్ట్‌నర్స్‌ ఎల్‌పీ కొనుగోలు చేయనుంది. ఈ డీల్‌ విలువ రూ.25,212 కోట్లు. ఒక భారత ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ కంపెనీలో విదేశీ కంపెనీ పెట్టిన అత్యధిక పెట్టుబడి ఇదే కావటం గమనార్హం. ఈ మేరకు బ్రూక్‌ఫీల్డ్‌తో తమ రిలయన్స్‌ ఇండస్ట్రియల్‌ ఇన్వెస్ట్‌మెంట్స్‌ అండ్‌ హోల్డింగ్స్‌ లిమిటెడ్‌ (ఆర్‌ఐఐహెచ్‌ఎల్‌) ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుందని రిలయన్స్‌ ఇండస్ట్రీస్‌ అధినేత ముకేశ్‌ అంబానీ తెలిపారు. ఈ డీల్‌లో భాగంగా టవర్ల వ్యాపారాన్ని నిర్వహించే టవర్‌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ ట్రస్ట్‌ కంపెనీలో వంద శాతం వాటాను బ్రూక్‌ఫీల్డ్‌ కొనుగోలు చేస్తుంది. ఒప్పందంలో భాగంగానే బ్రూక్‌ఫీల్డ్‌ అనుబంధ సంస్థ అయిన బీఐఎఫ్‌ ఫోర్త్‌ జార్విస్‌ ఇండియా, ఇతర ఇన్వెస్టర్లకు టవర్‌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు స్పాన్సరర్‌గా వ్యవహరిస్తున్న ఆర్‌ఐఐహెచ్‌ఎల్‌ కంపెనీ యూనిట్లను జారీ చేస్తుందని ముకేశ్‌ తెలియజేశారు. డీల్‌ పూర్తయిన తర్వాత టవర్‌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ ట్రస్ట్‌కు స్పాన్సరర్‌గా బ్రూక్‌ఫీల్డ్‌ వ్యవహరిస్తుంది. ఈ ఒప్పందానికి సంబంధించి అన్ని అనుమతులను త్వరలోనే సాధిస్తామని ఆయన చెప్పారు. ఈ ట్రస్ట్‌ దేశవ్యాప్తంగా మొత్తం 1,30,000 టవర్లను నిర్వహిస్తోంది. ఈ సంఖ్యను 1,75,000కు పెంచుకోవాలని యోచిస్తోంది. ఈ డీల్‌ ద్వారా లభించే నిధులను రిలయన్స్‌ జియో రుణభారాన్ని తగ్గించుకోవడానికి వినియోగించుకోవాలని ఆర్‌ఐఎల్‌ భావిస్తోంది. ఈ వార్తల నేపథ్యంలో బీఎస్‌ఈలో రిలయన్స్‌ షేర్‌ రూ.1,593కు ఎగిసినప్పటికీ, చివరకు 1% నష్టంతో రూ.1,566 వద్ద ముగిసింది.

# ఏపీలో డావ్‌ ఎలక్ట్రిక్‌ టూ వీలర్స్‌ ప్లాంటు

- సుమారు రూ. 700 కోట్ల పెట్టుబడి
- తయారీ సామర్థ్యం 5 లక్షల యూనిట్లు
- కంపెనీ డైరెక్టర్‌ బాలాజీ అచ్యుతుని



మీడియా సమావేశంలో లానా, మైఖేల్, బాలాజీ (ఎడమ నుంచి)

**హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో:** ఎలక్ట్రిక్‌ వాహనాల తయారీలో ఉన్న చైనాకు చెందిన డావ్‌ ఈవీటెక్‌.. భారత్‌లో ఆటోమొబైల్‌ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణపట్నానికి దగ్గరలో దీనిని నెలకొల్పనుంది. 200 ఎకరాల స్థలం కేటాయించాలని ఇప్పటికే ఏపీ ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నట్లు కంపెనీ డైరెక్టర్‌ బాలాజీ అచ్యుతుని సోమవారమిక్కడ మీడియాకు వెల్లడించారు. ఏటా 5 లక్షల యూనిట్ల తయారీ సామర్థ్యంతో ప్లాంటును ఏర్పాటు చేస్తామన్నారు. ఇంక్యుబేషన్‌ సెంటర్‌తోపాటు బ్యాటరీ, చాసిస్, కంట్రోలర్స్, మోటార్ల తయారీ సైతం ఇక్కడ చేపడతామని చెప్పారు. నవంబర్‌లో ఈ కాంప్లెక్స్‌ నుంచి తొలి ఉత్పాదన రెడీ అయ్యే అవకాశముందన్నారు. మూడేళ్లలో రూ.700 కోట్లు ఖర్చు చేస్తామని, ప్రత్యక్షంగా 2,000 మందికి, పరోక్షంగా 3,000 మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. 40 దాకా అనుబంధ పరిశ్రమలు వస్తాయన్నారు.

**ఫిబ్రవరిలో తొలి వాహనం..**

డావ్‌ ఈవీటెక్‌ భారత్‌లో తొలి వాహనాన్ని ఫిబ్రవరిలో విడుదల చేస్తోంది. వచ్చే ఏడాది ఆరు మోడళ్లను ప్రవేశపెడతామని డావ్‌ ఈవీటెక్‌ చైర్మన్‌ మైఖేల్‌ లియో వెల్లడించారు. అంతర్జాతీయంగా 25 ఏళ్లపాటు ఎలక్ట్రిక్‌ వాహన రంగంలో సాధించిన అనుభవంతో భారత్‌లో అడుగుపెడుతున్నట్టు చెప్పారు. గంటకు 25 కిలోమీటర్ల లోపు వేగంతో ప్రయాణించే లో స్పీడ్‌ మోడళ్లు 3... అలాగే 25 కిలోమీటర్లకంటే వేగంగా ప్రయాణించే హై స్పీడ్‌ మోడళ్లు 3 అందుబాటులోకి తెస్తారు. వీటిలో ఇంటర్నెట్‌తో అనుసంధానించిన వాహనాలు కూడా ఉంటాయని కంపెనీ సీవోవో లానా జోయో తెలిపారు. కాగా, వాహనాల ధర లోస్పీడ్‌ అయితే రూ.50–75 వేలు, హై స్పీడ్‌ మోడళ్లు రూ.75 వేల నుంచి రూ.1 లక్ష వరకు ఉంటుంది. ఒకసారి చార్జ్‌ చేస్తే మోడల్‌ను బట్టి 100–125 కిలోమీటర్లు ప్రయాణిస్తాయి. సొంత ప్లాంటు రెడీ అయ్యే వరకు హైదరాబాద్‌ సమీపంలోని తూప్రాన్‌ వద్ద ఉన్న అసెంబ్లింగ్‌ ప్లాంటులో టూ వీలర్లు రూపుదిద్దుకుంటాయి.

# పన్ను తగ్గించండి

## సెజ్‌లోని ఐటీ కంపెనీలపై..

- 15 శాతానికి పరిమితం చేయాలన్న ఐటీ పరిశ్రమ
- బీమాపై పన్ను భారం తగ్గించాలన్న ఆర్థిక రంగ సంస్థలు
- పన్నులను క్రమబద్ధీకరించాలన్న మొబైల్‌ కంపెనీలు
- బడ్జెట్‌ ముందస్తు చర్చలో భాగంగా డిమాండ్లు


ఫైనాన్షియల్‌ రంగం, క్యాపిటల్‌ మార్కెట్‌ ప్రతినిధులతో ప్రి-బడ్జెట్‌ సమావేశంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌

**న్యూఢిల్లీ:** ప్రత్యేక ఆర్థిక మండళ్ల (సెజ్‌) నుంచి పనిచేసే ఐటీ కంపెనీలపై 15 శాతమే కార్పొరేట్‌ పన్ను విధించాలని కేంద్రాన్ని ఐటీ పరిశ్రమ డిమాండ్‌ చేసింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ 2020–21 బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌కు సమర్పించనున్న దృష్ట్యా... దీనికోసం సోమవారం నుంచి వివిధ రంగాల ప్రతినిధులతో సంప్రదింపులు ప్రారంభించారు. ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీ (ఐటీ), స్టార్టప్‌లు, మొబైల్‌ తయారీ, ఆర్థిక సేవల రంగాలకు చెందిన ప్రతినిధులు మంత్రి ముందు తమ డిమాండ్ల చిట్టాను విప్పారు.

**ఐటీ పరిశ్రమ..**

''కొత్తగా ఏర్పడే తయారీ రంగ కంపెనీలకు కార్పొరేట్‌ పన్ను రేటును 15 శాతానికి తగ్గించారు. సెజ్‌లలో ఏర్పాటయ్యే కొత్త సేవల కంపెనీలకూ 15 శాతం రేటు అమలు చేస్తే సెజ్‌లలోని తయారీ, సేవల రంగాలకు ఒకటే రేటు అమలవుతుందని కేంద్రానికి సూచించాం'' అని నాస్కామ్‌ సీనియర్‌ డైరెక్టర్‌ ఆశిష్‌ అగర్వాల్‌ చెప్పారు. ఉపాధి కల్పన, పెట్టుబడుల విషయంలో సెజ్‌లు భవిష్యత్తు వృద్ధికి కీలకమన్నారు. విస్తృతమైన టెక్నాలజీలపై (డీప్‌టెక్‌) పనిచేసే స్టార్టప్‌ల కోసం నిధితోపాటు, ఆవిష్కరణల సమూహాలను ఏర్పాటు చేయాలని సూచించినట్టు వెల్లడించారు. దేశంలో డేటా డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని డేటా సెంటర్‌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని సూచించినట్టు రిలయన్స్‌ జియో వైస్‌ ప్రెసిడెంట్‌ విశాఖ సైగల్‌ తెలిపారు.

**ఆర్థిక సేవల సంస్థలు..**

టర్మ్‌ ఇన్సూరెన్స్‌ విస్తరణ కోసం జీఎస్‌టీ రేటును తగ్గించాలని, అందరికీ ఆర్థిక సేవలను చేరువ చేయడానికి కేవైసీ నిబంధనలను క్రమబద్ధీకరించాలని ఫైనాన్షియల్‌ అండ్‌ క్యాపిటల్‌ మార్కెట్స్‌ రంగానికి చెందిన కంపెనీలు (బ్యాంకులు, బీమా కంపెనీలు, ఎన్‌బీఎఫ్‌సీలు) ప్రభుత్వానికి సూచించాయి. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో పాలనను మెరుగుపరచడంపై, పీజే నాయక్‌ కమిటీ సిఫారసుల అమలుపై దృష్టి సారించాలని కోరాయి. ఎన్‌బీఎఫ్‌సీ రంగంలో ఒత్తిళ్లను తొలగించి, నిర్వహణను మెరుగుపరిచే విషయమై కూడా సూచనలు చేశాయి. ఆర్థిక పరిమితులకు లోబడి వీటిని పరిష్కరిస్తామని కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి రాజీవ్‌కుమార్‌ తెలిపారు. ''ఎన్‌పీఎస్‌లో పెట్టుబడులపై పన్ను మినహాయింపును రూ.50వేల నుంచి రూ.లక్షకు పెంచాలని సూచించాయి. అటల్‌ పెన్షన్‌ యోజనలో ప్రవేశానికి గరిష్ట వయో పరిమితి 50 ఏళ్లు చేయాలని కూడా కోరాం'' అని ఎస్‌బీఐ చైర్మన్‌ రజనీష్‌ కుమార్‌ మీడియాకు వెల్లడించారు.

**మొబైల్‌ పరిశ్రమ...**

ఇటీవల ప్రభుత్వం ఎగుమతులపై తగ్గించిన రాయితీలతో ఉద్యోగాలకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లుతుందని ఇండియన్‌ సెల్యులార్‌ అండ్‌ ఎలక్ట్రానిక్స్‌ అసోసియేషన్‌ (ఐసీఈఏ) ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై స్పష్టత ఇవ్వాలని, అలాగే, మొబైల్‌ హ్యాండ్‌సెట్లపై జీఎస్‌టీ రేటు తగ్గించాలని కోరింది. దేశంలో పెద్ద ఎత్తున తయారీకి ఇది అవసరమని పేర్కొంది. ఎగుమతులపై 8% రాయితీ ఇవ్వాలని కోరింది.

## జీఎస్‌టీ పరిహార చెల్లింపులకు కట్టుబడి ఉన్నాం

### కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌




**ముంబై:** జీఎస్‌టీ పరిహార చెల్లింపులపై కేంద్రం తన హామీని విస్మరించబోదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ రాష్ట్ర ప్రభుత్వాలకు మరోసారి భరోసానిచ్చారు. వసూళ్లు తగ్గినందునే పరిహార చెల్లింపుల్లో ఆలస్యం జరుగుతున్నట్లు వివరణ ఇచ్చారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వాలు అసహనానికి గురికావాల్సిన అవసరం లేదన్నారు. పరిహారాన్ని వెంటనే కేంద్రం చెల్లించాలంటూ కేరళ, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలు డిమాండ్‌ చేస్తున్న నేపథ్యంలో ఆర్థిక మంత్రి ఇలా స్పందించారు. ''ఇది వారి హక్కు. నేను తోసిపుచ్చడం లేదు. దీన్ని నిలబెట్టుకోకపోవడం ఉండదని స్పష్టం చేయదలుచుకున్నాను'' అని వివరించారు. ముంబైలో సోమవారం జరిగిన టైమ్స్‌ నెట్‌వర్క్‌ 'భారత ఆర్థిక సదస్సు'ను ఉద్దేశించి ఆమె వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా మాట్లాడారు. డేటా (సమాచారం) విశ్వసనీయతపై ప్రభుత్వం దృష్టి పెట్టినట్టు మంత్రి నిర్మలా సీతారామన్‌ స్పష్టం చేశారు.

**రాష్ట్రాలకు రూ.35,298 కోట్ల పరిహారం**

కీలకమైన జీఎస్‌టీ కౌన్సిల్‌ భేటీ ఈ నెల 18న జరగనుండగా, రెండు రోజుల ముందు సోమవారం.. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు రూ.35,298 కోట్లను జీఎస్‌టీ పరిహారం కింద కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ విషయాన్ని పరోక్ష పన్నులు, కస్టమ్స్‌ మండలి (సీబీఐసీ) ట్వీట్‌ ద్వారా తెలియజేసింది. సకాలంలో పరిహార చెల్లింపులను కేంద్రం విడుదల చేయకపోవడంతో పలు రాష్ట్రాలు అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే.

## మూడేళ్లలో వేదాంత రూ. 60,000 కోట్ల పెట్టుబడి

**ముంబై:** వేదాంత కంపెనీ రానున్న 2–3 ఏళ్లలో రూ.60,000 కోట్ల మేర పెట్టుబడులు పెట్టనుంది. రానున్న 4– 5 ఏళ్లలో 3,000– 4,000 కోట్ల డాలర్ల మేర ఆదాయాన్ని ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వేదాంత రిసోర్సెస్‌ చైర్మన్‌ అనిల్‌ అగర్వాల్‌ చెప్పారు. ఇదే కాలానికి 1,000 కోట్ల డాలర్ల నికర లాభం సాధించడం లక్ష్యమని వివరించారు. ఇక్కడ జరిగిన ఇండియా ఎకనామిక్‌ కాన్‌క్లేవ్‌ 2019లో ఆయన ఈ వివరాలు వెల్లడించారు.

**మరిన్ని ప్రభుత్వ కంపెనీలను కొంటాం....**

భారత్‌లో ఇప్పటిదాకా 3,500 కోట్ల డాలర్ల మేర ఇన్వెస్ట్‌ చేశానని అనిల్‌ అగర్వాల్‌ తెలిపారు. గత పదేళ్లలో హిందుస్తాన్‌ జింక్, బాల్కో, సెసగోవా, కెయిర్న్‌ తదితర మొత్తం 13 కంపెనీలను కొనుగోలు చేశామని చెప్పారు. ఈ కంపెనీల కార్యకలాపాలన్నీ సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొన్నారు. మరిన్ని ప్రభుత్వ రంగ కంపెనీలను కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ప్రభుత్వం విదేశీయులపై కాకుండా తమలాంటి స్వదేశీ పారిశ్రామికవేత్తలపైనే ఆధారపడాలని ఆయన సూచించారు. విదేశీయులు లాభాపేక్షతోనే వ్యవహరిస్తారని, తమలాంటి స్వదేశీ పారిశ్రామికవేత్తలు మాత్రం దేశాభివృద్ధికి తోడ్పాటునందిస్తారని చెప్పారు. ప్రభుత్వం తమపై ఆధారపడితే విదేశీ పెట్టుబడులు కూడా తేగలమని పేర్కొన్నారు. గ్లాస్, ఆప్టికల్‌ ఫైబర్, కేబుల్‌ పరిశ్రమలపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నామని ఈ సందర్భంగా చెప్పారాయన. గత ఆరేళ్లలో వివిధ పన్నుల రూపేణా ప్రభుత్వానికి రూ.2 లక్షల కోట్లు చెల్లించామని తెలిపారు.




# ఐఓసీని అధిగమించిన రిలయన్స్‌

- ఫార్చ్యూన్‌ ఇండియా–500 కంపెనీల జాబితాలో అగ్రస్థానం
- 2018–19 ఏడాదిలో రూ. 5.81 లక్షల కోట్ల ఆదాయం
- వృద్ధిలో ఐఓసీ కంటే 8.4% అధికం




**న్యూఢిల్లీ:** ముకేశ్‌ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్‌ ఇండస్ట్రీస్‌ (ఆర్‌ఐఎల్‌) మరో ఘనతను సాధించింది. తాజాగా ఫార్చ్యూన్‌ ఇండియా– 500 జాబితాలో అగ్ర స్థానానికి చేరుకుంది. ఆదాయం పరంగా వెలువడిన ఈ జాబితాలో ప్రభుత్వ రంగంలోని ఇండియన్‌ ఆయిల్‌ కార్పొరేషన్‌ను (ఐఓసీ) వెనక్కు నెట్టి తొలి స్థానాన్ని కైవసం చేసుకుంది. 2018–19 ఆర్థిక సంవత్సరంలో ఆర్‌ఐఎల్‌ రూ. 5.81 లక్షల కోట్ల ఆదాయాన్ని నమోదు చేసినట్లు ఫార్చ్యూన్‌ ఇండియా పేర్కొంది. వృద్ధి 41.5 శాతం ఉండగా.. పోటీ సంస్థ ఐఓసీతో పోల్చితే ఈ కంపెనీ వృద్ధి 8.4 శాతం అధికంగా ఉంది. ఐఓసీ అమ్మకాలు రూ.5.36 లక్షల కోట్లు కాగా, వృద్ధి 26.6 శాతం, లాభం రూ.39,588 కోట్లుగా ఉన్నాయి. ఇక గడిచిన 10 ఏళ్ల సగటు పరంగా చూస్తే.. ఈ కాలంలో ఐఓసీ ఆదాయం కంటే ఆర్‌ఐఎల్‌ ఆదాయం 3 రెట్లు అధికం. ఇక, 2015 ఆర్థిక సంవత్సరంలో ఐఓసీ రూ. 4,912 కోట్ల లాభాన్ని నమోదుచేయగా.. ఆర్‌ఐఎల్‌ 4 రెట్లు అధికంగా రూ. 23,566 కోట్ల లాభాన్ని కళ్లచూడటం విశేషం.

**ఓఎన్‌జీసీ స్థానం పదిలం**

గతేడాది మాదిరిగానే ఈ సారి కూడా ఓఎన్‌జీసీ మూడవ స్థానంలో నిలిచింది. ఎస్‌బీఐ(4), టాటా మోటార్స్‌ (5), బీపీసీఎల్‌ (6) స్థానాల్లో ఉన్నాయి. అంతక్రితం ఏడాదిలో కూడా ఈ కంపెనీల జాబితా ఇదే వరుసలో ఉంది. రాజేష్‌ ఎక్స్‌పోర్ట్స్‌ 2019 జాబితాలో 7వ స్థానానికి చేరుకుంది. టాటా స్టీల్, కోల్‌ ఇండియా, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌ (టీసీఎస్‌), లార్సెన్‌ అండ్‌ టూబ్రో వరుసగా 8, 9, 10, 11 వ స్థానంలో ఉన్నాయి. ఇక ఐసీఐసీఐ బ్యాంక్‌ రెండు మెట్లు ఎక్కి 12వ స్థానంలో నిలిచింది. ఆ తరువాత వరుస స్థానాల్లో హిందాల్కో ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ ఉన్నాయి. కాగా, ఫార్చ్యూన్‌ ఇండియా జాబితాలోని 500 కంపెనీల 2019 సగటు ఆదాయం 9.53 శాతం పెరగ్గా, లాభం 11.8 శాతం వృద్ధి చెందింది.

## జియో–బీపీ బ్రాండ్‌ పేరుతో పెట్రోల్‌ బంకులు

**న్యూఢిల్లీ:** ఇంధన రిటైల్‌ విభాగంలో వ్యాపారం విషయమై రిలయన్స్‌ ఇండస్ట్రీస్, బీపీ పీఎల్‌సీ సోమవారం ఒప్పందం చేసుకున్నాయి. ఆగస్ట్‌లో చేసుకున్న ఒప్పందానికి కొనసాగింపుగా డీల్‌పై సంతకాలు చేశాయి. 2020 ఏడాది మొదటి 6 నెలల్లో జాయింట్‌ వెంచర్‌(జేవీ) కార్యరూపం దాల్చవచ్చని అంచనా. ప్రస్తుతం ఆర్‌ఐఎల్‌కు దేశవ్యాప్తంగా 1,400 బంకులు ఉన్నాయి. వీటినీ జాయింట్‌ వెంచర్‌ కిందకు తీసుకురానున్నారు. మొత్తం 5,500 విక్రయ కేంద్రాలకు విస్తరించాలన్నది లక్ష్యం. జేవీలో ఆర్‌ఐఎల్‌కు 51%, మిగిలిన వాటా బీపీకి ఉంటుంది. 49% వాటాకు బీపీ రూ.7,000 కోట్లు వెచ్చించనుంది.




# 172% పెరిగిన ఉల్లిపాయల ధర

- రివ్వుమన్న నిత్యావసర వస్తువుల టోకు ధర
- నవంబర్లో 0.58 శాతం పెరిగిన టోకు ద్రవ్యోల్బణం
- స్పష్టంగా కనిపిస్తున్న డిమాండ్‌ రహిత స్థితి



**న్యూఢిల్లీ:** టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం నవంబర్‌ గణాంకాలు వ్యవస్థలో మందగమన స్థితికి అద్దం పట్టాయి. ధరల స్పీడ్‌ కేవలం 0.58 శాతంగా నమోదయ్యింది. అంటే 2018 నవంబర్‌లో టోకు ధరల బాస్కెట్‌తో పోల్చిచూస్తే, 2019 నవంబర్‌లో అదే బాస్కెట్‌ ధర కేవలం 0.58 శాతమే పెరిగిందన్నమాట. అయితే సామాన్యునికి సంబంధించి నిత్యావసర వస్తువుల ధరలు మాత్రం ఆందోళన కలిగిస్తున్నాయి. ఉల్లిపాయ ధరలు వార్షికంగా చూస్తే, ఏకంగా 172 శాతం పెరిగాయి. ఈ ధరలూ పెరగకపోతే, టోకు ద్రవ్యోల్బణం క్షీణతలోకి జారిపోయేదని అంచనా. 2019 అక్టోబర్‌లో ద్రవ్యోల్బణం 0.16 శాతం అయితే 2018 నవంబర్‌లో ఈ రేటు 4.47 శాతం. ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన గణాంకాల్లో ముఖ్యాంశాలు చూస్తే...

- **తయారీ:** మొత్తం సూచీలో దాదాపు 60 శాతం వాటా ఉన్న తయారీ రంగంలో ధరల పెరుగుదల అసలు నమోదుకాలేదు. 2018 నవంబర్‌తో పోల్చితే 2019 నవంబర్‌లో ఈ బాస్కెట్‌ ధర –0.84 శాతం క్షీణించింది. 2018 నవంబర్‌లో ఈ రేటు 4.21 శాతం.
- **ఇంధనం, విద్యుత్‌:** సూచీలో దాదాపు 22 శాతం వెయిటేజ్‌ ఉన్న ఈ విభాగంలో కూడా ద్రవ్యోల్బణం –7.32 శాతం క్షీణించింది. గత ఏడాది నవంబర్‌లో ఈ విభాగంలో ద్రవ్యోల్బణం 15.54 శాతం.
- **ప్రైమరీ ఆర్టికల్స్‌:** ఫుడ్, నాన్‌ ఫుడ్‌ ఆర్టికల్స్‌తో కూడిన ఈ విభాగంలో ద్రవ్యోల్బణం భారీగా 7.68 శాతం పెరిగింది. 2018 నవంబర్‌లో ఈ రేటు 0.59 శాతం మాత్రమే. ఇక ఇందులోనూ నాన్‌–ఫుడ్‌ ఆర్టికల్స్‌ విభాగాన్ని చూసుకుంటే ద్రవ్యోల్బణం 6.40 శాతం నుంచి 1.93 శాతానికి తగ్గింది.

**సామాన్యుడిపై భారం...**

ఫుడ్‌ ఆర్టికల్స్‌ చూస్తే... 2018 నవంబర్‌లో అసలు ఈ విభాగంలో పెరుగుదల నమోదుకాకపోగా, –3.24 శాతం క్షీణతలో ఉంది. అయితే తాజా సమీక్షా నెల నవంబర్‌లో ఈ బాస్కెట్‌ ధర ఏకంగా 11.08 శాతం ఎగసింది. గడచిన 71 నెలల్లో ఈ స్థాయిలో ఆహార ఉత్పత్తుల ధరలు పెరగడం ఇదే తొలిసారి. అక్టోబర్‌లో ఈ రేటు 9.80 శాతంగా ఉంది. ఉల్లిపాయల ధరలు 172 శాతం పెరిగితే, కూరగాయల విషయంలో ఈ ధర స్పీడ్‌ 45.32 శాతంగా ఉంది. పప్పు దినుసుల ధరలు టోకున 16.59 శాతం ఎగశాయి.

# భారత ఉక్కు రంగంలోకి 'ఆర్సెలర్‌'

- పూర్తయిన ఎస్సార్‌ స్టీల్‌ టేకోవర్‌
- దివాలా చట్టం కింద పరిష్కారమైన అతి పెద్ద కేసు



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ ఉక్కు దిగ్గజం ఆర్సెలర్‌ మిట్టల్‌ ఎట్టకేలకు భారత ఉక్కు రంగంలోకి అరంగేట్రం చేసింది. రచ్చ గెలిచిన లక్ష్మీనివాస్‌ మిట్టల్‌ ఇంట గెలవడానికి చాలా సమయం పట్టింది. చాలా ఏళ్ల సమయం, ప్రయాసల అనంతరం ఆయన ఉక్కు కంపెనీ ఆర్సెలర్‌ మిట్టల్‌ మన దేశంలోకి అడుగిడింది. భారత్‌లో ఉక్కు కంపెనీని ఏర్పాటు చేయాలన్న ఎల్‌ఎన్‌ మిట్టల్‌ కల ఎట్టకేలకు ఎస్సార్‌ స్టీల్‌ టేకోవర్‌ ద్వారా సాకారమయింది. ఈ టేకోవర్‌ ప్రక్రియ సోమవారంతో పూర్తయ్యిందని ఆర్సెలర్‌ మిట్టల్‌ పేర్కొంది.

**అతి పెద్ద దివాలా రికవరీ...**

ఎస్సార్‌ స్టీల్‌ కంపెనీని రూ.42,000 కోట్లకు ఆర్సెలర్‌ మిట్టల్‌ టేకోవర్‌ చేయడానికి సుప్రీం కోర్టు గత నెలలోనే ఆమోదం తెలిపింది. దివాలా చట్టం కింద (ఇన్‌సాల్వెన్సీ అండ్‌ బ్యాంక్‌రప్టసీ కోడ్‌–ఐబీసీ) పరిష్కారమైన అతి పెద్ద రికవరీ ఇదే. నిప్పన్‌ స్టీల్‌ కంపెనీతో కలిసి ఆర్సెలర్‌ మిట్టల్‌ కంపెనీ ఏర్పాటు చేసిన జాయింట్‌ వెంచర్‌ కంపెనీ (ఆర్సెలర్‌ మిట్టల్‌ /నిప్పన్‌ స్టీల్‌ (ఏఎమ్‌/ఎన్‌ఎస్‌ ఇండియా)) ఇకపై ఎస్సార్‌ స్టీల్‌ను నిర్వహిస్తుంది. ఈ జాయింట్‌ వెంచర్‌ కంపెనీ చైర్మన్‌గా అదిత్య మిట్టల్‌ (ప్రస్తుత ఆర్సెలర్‌ మిట్టల్‌ కంపెనీ సీఎఫ్‌ఓ, ప్రెసిడెంట్‌ ) వ్యవహరిస్తారు. ఈ జేవీలో ఆర్సెలర్‌ మిట్టల్‌కు 60 శాతం, నిప్పన్‌ స్టీల్‌ కంపెనీకి 40 శాతం చొప్పున వాటాలున్నాయి.

లగ్జెంబర్గ్‌ ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఉక్కు దిగ్గజం ఆర్సెలర్‌... భారత్‌లో అడుగిడాలని చాలా ఏళ్ల కిందటే ప్రయత్నాలు ప్రారంభించింది. జార్ఖండ్, ఒడిశాల్లో 12 మిలియన్‌ టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం గల రెండు ప్లాంట్లను ఏర్పాటు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. భూ సేకరణ, పర్యావరణ, ఇతర అనేక అవరోధాల కారణంగా ఈ ప్రయత్నాలకు అడ్డుకట్ట పడింది.

# ఇతర ప్రాంతాలకూ 'నెక్సస్‌'

- ప్రతిపాదనలపై చర్చలు...
- సంస్థ ఈడీ ఎరిక్‌ వెల్లడి
- డిఫెన్స్‌ స్టార్టప్‌ సంస్థల వర్క్‌షాప్‌ ప్రారంభం


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఎరిక్‌

**హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో:** దేశీ స్టార్టప్‌లకు తోడ్పాటునిచ్చేందుకు దేశ రాజధాని న్యూఢిల్లీలో ఏర్పాటైన 'నెక్సస్‌ స్టార్టప్‌ హబ్‌' తాజాగా ఇతర ప్రాంతాలకూ కార్యకలాపాలు విస్తరించాలని యోచిస్తోంది. టి–హబ్‌ తరహా భాగస్వాములతో జట్టు కట్టే దిశగా చర్చలు జరుపుతోంది. సోమవారమిక్కడ టి–హబ్‌లో డిఫెన్స్‌ స్టార్టప్స్‌ వర్క్‌షాప్‌ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా సంస్థ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ (ఈడీ) ఎరిక్‌ అజూలే ఈ విషయాలు తెలియజేశారు. అమెరికా ప్రభుత్వ సహకారంతో నెక్సస్‌ స్టార్టప్‌ హబ్‌ తొలిసారిగా భారత్‌లోనే ఏర్పాటైందని ఆయన చెప్పారు. ''దీనిద్వారా ఇప్పటిదాకా 93 స్టార్టప్‌ సంస్థలకు శిక్షణ అందించాం. సుమారు రెండేళ్ల కాలంలో ఇవి దాదాపు 5.6 మిలియన్‌ డాలర్ల మేర నిధులు సమీకరించాయి. వెయ్యి మందికి పైగా ఉపాధి కల్పిస్తున్నాయి'' అని ఎరిక్‌ వివరించారు. మరోవైపు, రక్షణ రంగంలో భారత్, అమెరికా పరస్పర సహకారంతో ముందుకెడుతున్నట్లు కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా హైదరాబాద్‌లోని అమెరికా కాన్సుల్‌ జనరల్‌ (తాత్కాలిక) ఎరిక్‌ అలెగ్జాండర్‌ తెలిపారు. ఇరు దేశాల మధ్య రక్షణ సంబంధాలు మరింత బలోపేతం కావడానికి ఇలాంటి వర్క్‌షాప్‌లు తోడ్పడతాయన్నారు.

రెండు రోజుల పాటు జరిగే ఈ వర్క్‌షాప్‌ను హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్‌ జనరల్, నెక్సస్‌ స్టార్టప్‌ హబ్‌ కలిసి నిర్వహిస్తున్నాయి. ఇందులో మార్ఫిడో టెక్నాలజీస్, కాన్‌స్టెలీ సిగ్నల్స్‌ వంటి 15 పైగా స్టార్టప్‌లు పాల్గొంటున్నాయి. రక్షణ రంగంలో వ్యాపారావకాశాల గురించి స్టార్టప్‌ సంస్థలు అవగాహన పెంచుకునేందుకు ఇది ఉపయోగపడనుంది. ఈ నెల 18, 19న హైదరాబాద్‌లోనే జరగనున్న అమెరికా– భారత్‌ రక్షణ రంగ సదస్సులో కూడా పాల్గొనే అవకాశం స్టార్టప్స్‌కు దక్కనుంది.

**దిగ్గజాలతో అవకాశాలకు వేదిక..**

లాక్‌హీడ్‌ మార్టిన్‌ వంటి రక్షణ రంగ దిగ్గజ సంస్థల గురించి మరింత క్షుణ్ణంగా తెలుసుకునేందుకు ఇలాంటి వర్క్‌షాప్‌లు తోడ్పడతాయని స్టార్టప్‌ సంస్థ కాన్‌స్టెలీ సిగ్నల్స్‌ సహ వ్యవస్థాపకుడు, సీఈవో సత్య గోపాల్‌ పాణిగ్రాహి తెలిపారు. కీలకమైన మేథోహక్కులు, దిగ్గజ సంస్థలతో కలిసి పనిచేసే అవకాశాల గురించి అవగాహన పెంచుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. రాడార్‌ సిమ్యులేషన్‌ సిస్టమ్స్‌ను రూపొందించే కాన్‌స్టెలీ సిగ్నల్స్‌ రెండేళ్ల క్రితం ప్రారంభమైంది. సహ వ్యవస్థాపకుడు అవినాష్‌ రెడ్డితో పాటు నలుగురితో ప్రారంభమైన తమ సంస్థలో ప్రస్తుతం 12 మంది సిబ్బంది ఉన్నారని పాణిగ్రాహి తెలిపా రు. దేశీయంగా ఇప్పటిదాకా రెండు సిస్టమ్స్‌ విక్రయించామని, వీటి ఖరీదు రూ. 50 లక్షల నుంచి రూ.8–10 కోట్ల దాకా ఉంటుందని తెలిపారు.

## మరో విడత రేటు కోతకు చాన్స్‌!

### ఆర్‌బీఐ గవర్నర్‌ దాస్‌ సంకేతాలు



**ముంబై:** రిజర్వ్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్‌ శక్తికాంత దాస్‌ మరో విడత రెపో రేటు తగ్గిస్తామనే సంకేతాలిచ్చారు. బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటే రెపో. ప్రస్తుతం ఇది 5.15 శాతంగా ఉంది. ఆర్థిక వ్యవస్థలో మందగమన ధోరణిని ఆర్‌బీఐ 2019 ఫిబ్రవరిలోనే గుర్తించిందని, దీన్ని నివారించే లక్ష్యంతోనే అప్పటి నుంచీ వరుసగా ఐదు ద్వైమాసిక సమావేశాల్లో రెపో రేటును తగ్గిస్తూ వచ్చామని చెప్పారాయన. ఈ కాలంలో 135 బేసిస్‌ పాయింట్ల రెపో (1.35%) తగ్గించడాన్ని ప్రస్తావించారు. ఈ నెల్లో పెంచకపోవటాన్ని ప్రస్తావిస్తూ... ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుని, వేచిచూసే ధోరణికి మారామన్నారు. భారత ఆర్థిక వ్యవస్థపై టైమ్స్‌ నెట్‌వర్క్‌ నిర్వహించిన ఒక సదస్సులో ఆయన మాట్లాడారు. 'బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, కంపెనీలు తమ బ్యాలెన్స్‌ షీట్లను సరిచేసుకునే ప్రక్రియలో ఉన్నాయి. మొండిబకాయిల సమస్య పరిష్కారానికి సంబంధించిన దిశలో ఇది ఒక కీలక అడుగు. తదుపరి ఆర్థిక వృద్ధికి ఊతం ఇచ్చే అంశం' అని పేర్కొన్నారు.

● హైదరాబాద్‌కు చెందిన టెక్నాలజీ స్టార్టప్ వెరీడాక్ గ్లోబల్ ఇండియా.. థానే మున్సిపల్ కార్పొరేషన్‌కు బ్లాక్ చెయిన్ ఆధారిత ప్రాపర్టీ ట్యాక్స్ అసెస్‌మెంట్ పైలెట్ ప్రాజెక్ట్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. దేశంలో తొలి ప్రాజెక్ట్ ఇదేనని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో ఇంటి పన్ను చెల్లింపులు, అనుమతులు వేగవంతమవటమే కాకుండా పారదర్శకత ఉంటుందని కంపెనీ సీఈవో రియా అచాల్కర్ తెలిపారు.

### బులియన్ రూ.లలో

| | |
|---|---|
| **ముంబై** | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,750 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,900 |
| వెండి (కిలో) | 47,400 |
| **చెన్నై** | |
| బంగారం (24 క్యారెట్లు) | 37,960 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,150 |
| వెండి (కిలో) | 47,400 |
| **హైదరాబాద్** | |
| బంగారం (24 క్యారెట్లు) | 37,960 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,150 |
| వెండి (కిలో) | 47,400 |
| **ప్రొద్దుటూరు** | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,880 |
| బంగారం (22 క్యారెట్లు) | 35,960 |
| వెండి (కిలో) | 45,400 |
| **విశాఖపట్నం** | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,870 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,150 |
| వెండి (కిలో) | 44,500 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,170 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,220 |
| వెండి (కిలో) | 47,500 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

### ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 60.12 (రాత్రి 11.30కు) | $59.98 (శుక్రవారం ముగింపు) |
| బ్రెంట్ | 65.47 (రాత్రి 11.30కు) | $65.22 (శుక్రవారం ముగింపు) |

### కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో) 17-12-2019

| | |
|---|---|
| విశాఖ | 470-00 |
| చిత్తూరు | 458-00 |
| వరంగల్ | 436-00 |
| విజయవాడ | 452-00 |
| గోదావరి | 452-00 |
| **16-12-2019 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 433-00 |

# రికార్డ్ స్థాయి నుంచి నష్టాల్లోకి

● ఇంట్రాడేలో ఆల్‌టైమ్ హైకి సెన్సెక్స్
● బలహీనంగా టోకు ద్రవ్యోల్బణ గణాంకాలు
● పతనమైన రూపాయి
● మూడు రోజుల లాభాలకు బ్రేక్
● 71 పాయింట్ల నష్టంతో 40,939కు సెన్సెక్స్
● 33 పాయింట్లు పతనమై 12,054కు నిఫ్టీ




ఆద్యంతం లాభ, నష్టాల మధ్య సాగిన సోమవారం నాటి ట్రేడింగ్‌లో స్టాక్ మార్కెట్ చివరకు నష్టాల్లో ముగిసింది. ఇంట్రాడేలో జీవిత కాల గరిష్ట స్థాయి, 41,185 పాయింట్లని చేరిన సెన్సెక్స్ చివరకు 71 పాయింట్లు నష్టపోయి 40,939 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 33 పాయింట్లు పతనమై 12,054 పాయింట్ల వద్దకు చేరింది. దీంతో మూడు రోజుల లాభాలకు బ్రేక్ పడింది. టోకు ధరల ద్రవ్యోల్బణ గణాంకాలు బలహీనంగా ఉండటం, రూపాయి మారకం విలువ (17 పైసలు పడిపోయి 71 వద్ద ముగింపు) బలహీనపడటం ప్రతికూల ప్రభావం చూపించాయి. ఇంధన, ఎఫ్‌ఎమ్‌సీజీ, లోహ, వాహన షేర్లు నష్టపోయాయి. సెన్సెక్స్‌తో పాటు బ్యాంక్ నిఫ్టీ కూడా ఇంట్రాడేలో ఆల్‌టైమ్ హైను తాకింది. సెన్సెక్స్ లాభాల్లోనే మొదలైంది. ఆరంభ కొనగోళ్ల జోరుతో ఇంట్రాడేలో జీవిత కాల గరిష్ట స్థాయి, 41,185 పాయింట్లను తాకింది. అయితే టోకు ధరల ద్రవ్యోల్బణ, ఇతర గణాంకాలు బలహీనంగా ఉండటంతో సెంటిమెంట్ దెబ్బతిన్నది. ఈ నేపథ్యంలో.. ఇటీవల పెరిగిన షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. దీంతో సెన్సెక్స్, నిఫ్టీలు నష్టాల్లోకి జారిపోయాయి. చివరి అరగంట వరకూ లాభ, నష్టాల మధ్య కదలాడాయి.ఒక దశలో 175 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్ మరో దశలో 92 పాయింట్లు నష్టపోయింది. రోజంతా 267 పాయింట్ల రేంజ్‌లో తిరిగింది.

### స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్‌ఈ | 1,944 |
| ఎన్‌ఎస్‌ఈ | 29,080 |
| ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్) | 8,62,838 |
| ఎఫ్‌ఐఐ | 728 |
| డీఐఐ | - 796 |

**త్వరలో ఈక్విటాస్ ఎస్‌ఎఫ్‌బీ ఐపీఓ..**

ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ (ఈక్విటాస్ ఎస్‌ఎఫ్‌బీ) త్వరలో ఐపీఓకు వస్తోంది. సోమవారం ఐపీఓ పత్రాలను సెబీకి సమర్పించింది. ఈ ఐపీఓలో భాగంగా ఈ బ్యాంక్ రూ.550 కోట్ల విలువైన తాజా ఈక్విటీ షేర్లను జారీ చేస్తుంది. దీంతో పాటు 8 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్‌ఎస్) మార్గంలో ప్రమోటర్ సంస్థ విక్రయించనున్నది.

## నిస్సాన్ 'రెడ్ వీకెండ్స్' ఆఫర్



**న్యూఢిల్లీ:** ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ నిస్సాన్ ఇండియా తాజాగా 'రెడ్ వీకెండ్స్' పేరిట సరికొత్త ఆఫర్‌ను ప్రకటించింది. ఇందులో భాగంగా నిస్సాన్ కిక్స్ కారు కొనుగోలుపై రూ.1.15 లక్షల మేర ప్రయోజనాన్ని ఇస్తోంది. క్యాష్ డిస్కౌంట్ రూ. 40000, ఎక్స్ఛేంజ్ డిస్కౌంట్ రూ. 40000, కార్పొరేట్ డిస్కౌంట్ రూ. 10000, వారెంటీ విలువ రూ. 20500 ఉన్నట్లు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ రాకేష్ శ్రీవాస్తవ చెప్పారు. ఈ మోడల్‌తో పాటు డాట్సన్ కార్లను కేవలం 6.99 శాతం వడ్డీ రేటుకే అందిస్తున్నట్లు వెల్లడించారు.

## అమల్లోకి... రోజంతా 'నెఫ్ట్' విధానం

**ముంబై:** నగదు బదిలీ లావాదేవీలకు ఉపయోగపడే నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ (నెఫ్ట్) విధానం ఇకపై ప్రతి రోజూ, ఇరవై నాలుగ్గంటలూ అందుబాటులో ఉండనుంది. సోమవారం నుంచి ఇది అమల్లోకి వచ్చింది. దీంతో అర్ధరాత్రి 12 గం.ల నుంచి సాధారణ నెఫ్ట్ వేళలైన ఉదయం 8 గంటల లోపు .. తొలి ఎనిమిది గంటల్లో ఏకంగా 11.40 లక్షల లావాదేవీలు సెటిల్ చేసినట్లు రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. డిజిటల్ చెల్లింపులను మరింత ప్రాచుర్యంలోకి తెచ్చే దిశగా ఆర్‌బీఐ నెఫ్ట్ విధానాన్ని ఇరవై నాలుగ్గంటలూ అందుబాటులోకి తీసుకొచ్చింది.

## దివాలా కోడ్‌తో 160 సంస్థలకు పునరుజ్జీవం: సాహూ

**న్యూఢిల్లీ:** దాదాపు 160 కంపెనీలు మూతబడకుండా దివాలా కోడ్ (ఐబీసీ) కాపాడిందని ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్సీ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఐబీబీఐ) చైర్‌పర్సన్ ఎంఎస్ సాహూ తెలిపారు. దీన్ని సక్రమంగా అమలు చేస్తే.. దేశ ఆర్థిక వృద్ధికి మరికొన్ని పాయింట్ల మేర ఊతం లభించగలదని ఆయన పేర్కొన్నారు. దివాలా కోడ్ కింద వేలానికి వచ్చిన సంస్థలకు 210 శాతం దాకా అధిక వేల్యుయేషన్ లభించిందని సాహూ వెల్లడించారు. ''సాధారణంగా విక్రయించినట్లయితే గరిష్టంగా 100 శాతం వచ్చేది. కానీ ఐబీసీ వల్ల అదనంగా 110 శాతం బోనస్‌గా వచ్చిందని భావించాలి'' అని మార్కెట్లు, ఎకానమీపై దివాలా కోడ్ ప్రభావాల మీద జరిగిన సదస్సులో ఆయన వ్యాఖ్యానించారు.

### అనిల్ అంబానీ కేసులో

## చైనా బ్యాంకులకు చుక్కెదురు

**న్యూఢిల్లీ:** రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) తీసుకున్న 680 మిలియన్ డాలర్ల కార్పొరేట్ రుణాలకు పూచీకత్తు వివాదంలో సంస్థ చైర్మన్ అనిల్ అంబానీకి ఊరట లభించింది. ఈ రుణాలను అనిల్ అంబానీ చెల్లించాలంటూ చైనా బ్యాంకులు వేసిన క్లెయిమ్ దరఖాస్తును బ్రిటన్ హైకోర్టు తోసిపుచ్చింది. దీనికి తాను పూచీకత్తునిచ్చినట్లు తగిన సాక్ష్యాధారాలేమీ లేవని, పూర్తి విచారణ జరగకుండా చైనా బ్యాంకులు తనను ఒత్తిడి చేయజాలవని అంబానీ చేసిన వాదనలను న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. నవంబర్ 7న దీనిపై విచారణ జరిగిందని, సోమవారం ఉత్తర్వులు వచ్చాయని అనిల్ అంబానీ అధికార ప్రతినిధి తెలిపారు.

## ఎన్‌ఎండీసీకి ఐదు పీఆర్‌ఎస్‌ఐ అవార్డులు

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** మైనింగ్ దిగ్గజం ఎన్‌ఎండీసీ తాజాగా పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్‌ఎస్‌ఐ) నిర్వహించిన 41వ అఖిల భారతీయ సదస్సులో అయిదు అవార్డులు దక్కించుకుంది. హౌస్ జర్నల్ (హిందీ- ప్రథమ స్థానం), సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ నివేదిక (రెండో స్థానం), కార్పొరేట్ ఫిలిం (రెండో స్థానం), సోషల్ మీడియా అండ్ పీఆర్ అండ్ బ్రాండింగ్ (రెండో స్థానం), కాఫీ టేబుల్ బుక్ (3వ స్థానం) విభాగాల్లో ఈ పురస్కారాలు లభించాయి. తెలంగాణ హోం మంత్రి మహ్‌మూద్ చేతుల మీదుగా ఎన్‌ఎండీసీ డైరెక్టర్ సుమిత్ దేబ్ వీటిని అందుకున్నట్లు సంస్థ తెలిపింది.

## బజాజ్ ఫైనాన్స్ నుంచి హనీమూన్ హాలిడే కవరేజీ

**హైదరాబాద్:** హనీమూన్ పర్యటనకు సంబంధించి అన్ని రకాల కవరేజీతో కూడిన ప్లాన్‌ను బజాజ్ ఫైనాన్స్ ఆవిష్కరించింది. రూ.699 ప్రీమియంకు రూ.3 లక్షల కవరేజీ పొందొచ్చని కంపెనీ తెలిపింది. పర్యటన సమయంలో ఊహించని ఘటనలు జరిగితే కవరేజీ పొందొచ్చని తెలియజేసింది. అంటే.. చివరి నిమిషంలో పర్యటన రద్దు చేసుకోవాల్సి వస్తే, బ్యాగేజీ కోల్పోతే, అత్యవసరంగా ఆస్పత్రిలో చేరాల్సి వస్తే, హనీమూన్ పర్యటనలో ఉన్నప్పుడు తమ ఇళ్లలో దొంగతనాల కారణంగా ఎదురయ్యే నష్టానికి ఈ ప్లాన్ కింద పరిహారం పొందొచ్చని బజాజ్ ఫైనాన్స్ తెలిపింది.

## ఎంఎస్‌ఎంఈ వడ్డీ రాయితీ పథకంలో మార్పులకు ఆమోదం

**న్యూఢిల్లీ:** సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్‌ఎంఈలు) వడ్డీ రాయితీ పథకం మార్గదర్శకాల్లో మార్పులకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం తెలిపారు. జీఎస్‌టీకి అర్హత పొందిన కంపెనీలు ఆధార్ సమర్పించే నిబంధనను తొలగించారు. అలాగే, క్లెయిమ్ పరిష్కారానికి ఆడిటర్ సర్టిఫికెట్ నిబంధనను ఎత్తివేశారు. ఈ మార్పుల వల్ల తక్కువ వ్యయానికే రుణాలు పొందడం వీలవుతుందని, ఎంఎస్‌ఎంఈ ఉత్పాదక పెరుగుతుందని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేసింది.

## సబ్‌కా విశ్వాస్ స్కీమ్ పొడిగింపునకు కేంద్రం నో..

**న్యూఢిల్లీ:** సబ్‌కా విశ్వాస్ స్కీమ్ గడువును కేంద్రం మరింత పొడిగించకపోవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. దీనికి డిసెంబర్ 31 ఆఖరు తేదీ కాగా.. స్కీమ్‌ను వినియోగించుకోదల్చుకున్న వారు ఆ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆర్థిక శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. సర్వీస్ ట్యాక్స్, సెంట్రల్ ఎక్సైజ్ సుంకాలకు సంబంధించి వివిధ స్థాయిల్లో ఉన్న 1.83 లక్షల కేసుల కారణంగా.. దాదాపు రూ. 3.6 లక్షల కోట్ల మొత్తం వివాదాల్లో చిక్కుకుంది. దీంతో వివాదాలను పరిష్కరించే క్రమంలో.. అర్హులైన పన్ను చెల్లింపుదారులు తమ బకాయిలను చెల్లించేందుకు ఒకసారి అవకాశమిస్తూ సెప్టెంబర్ 1న కేంద్రం ఈ వన్ టైమ్ విండోను ప్రారంభించింది.

## దివాలా చట్టం ఒక మైలురాయి: అజయ్ త్యాగి

**న్యూఢిల్లీ:** ఆర్థిక రంగంలో ఇటీవలి సంక్షోభాలు ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని దెబ్బతీశాయని సెబీ చీఫ్ అజయ్ త్యాగి వ్యాఖ్యానించారు. అయితే వేగంగా స్పందించి తగిన నిర్ణయాలను తీసుకున్నామని సంతృప్తి వ్యక్తం చేశారు. దివాలా చట్టం సానుకూల ఫలితాలు ఐదేళ్లలో దేశీయ కార్పొరేట్ బాండ్ మార్కెట్లో కనిపించనున్నాయని పేర్కొన్నారు. దివాలా చట్టం భారత ఆర్థిక చరిత్రలో కీలకమైన సంస్కరణ అని ఆయన కొనియాడారు.

# నిర్మాణాత్మక సంస్కరణలపై దృష్టి పెట్టాలి

● బ్యాంకుల ప్రక్షాళనను వేగవంతం చేయాలి
● ఐఎంఎఫ్ ముఖ్య ఆర్థికవేత్త గీతా గోపీనాథ్




**వాషింగ్టన్:** దేశీయంగా పడిపోయిన డిమాండ్‌ను పునరుద్ధరించేందుకు బ్యాంకుల ప్రక్షాళన, కార్మిక సంస్కరణలు తరహా నిర్మాణాత్మక సంస్కరణలపై భారత్ దృష్టి సారించాలని ఐఎంఎఫ్ ముఖ్య ఆర్థికవేత్త గీతా గోపీనాథ్ సూచించారు. భారత ఆర్థిక వ్యవస్థ సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. దేశీయంగా మందగించిన డిమాండ్‌ను పునరుజ్జీవింపజేయడంతో పాటు, ఉత్పాదకత పెంపు ద్వారా ఉద్యోగాలను కల్పించేలా సంస్కరణలు ఉండాలన్నది తమ సూచనగా పేర్కొన్నారు. దేశ జీడీపీ సెప్టెంబర్ త్రైమాసికంలో ఆరేళ్ల కనిష్ట స్థాయికి పడిపోయి 4.5 శాతంగా నమోదు కావటం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం ఐదేళ్ల రెండో విడత పాలన ఆరంభంలో ఉన్నందున... సంస్కరణలను ముందుకు తీసుకెళ్లడానికి ఇదే సరైన తరుణమని ఆమె చెప్పారు. విశ్వసనీయమైన ద్రవ్యోలోటు తప్పనిసరి అని అభిప్రాయపడ్డారు.పెట్టుబడులు తగ్గిపోవడం, వినియోగ వృద్ధి నిదానించడమే వృద్ధి మందగమనానికి కారణాలని ఆమె ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

**వినియోగం బలహీనం...**

**వృద్ధి అంతంతే: భారత్‌పై మూడీస్**

కుటుంబాల వినియోగ శక్తి బలహీనంగా ఉండడం భారత్ వృద్ధికి బ్రేకులు వేస్తోందని మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ తన తాజా నివేదికలో పేర్కొంది. రుణ వృద్ధి, చెల్లింపులపై కూడా ఇది ప్రతికూల ప్రభావం చూపుతోందని విశ్లేషించింది. 2020 మార్చితో ముగిసే ఆర్థిక సంవత్సరానికి స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు అంచనాను 5.8 నుంచి 4.9 శాతానికి తగ్గించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక పరిస్థితుల బాగోలేవని పేర్కొంది. ఉపాధి కల్పన పరిస్థితులు కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయని తెలిపింది.

రాష్ట్రీయం



గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధిత కుటుంబాలు

## గవర్నర్‌ను కలసిన హాజీపూర్ బాధితులు

**బొమ్మలరామారం:** సంచలనం సృష్టించిన యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం హాజీపూర్ బాలికల హత్యా ఘటన బాధితులు సోమవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను కలిశారు. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో హాజీపూర్ సర్పంచ్ కవితా వెంకటేశ్, ఎంపీటీసీ సభ్యుడు పక్కీరు రాజేందర్‌రెడ్డితో కలసి వారు గవర్నర్ వద్దకు వెళ్లారు. తమ బిడ్డల హత్య కేసులో న్యాయం చేయాలని వేడుకున్నారు. బాధితులు జరిగిన ఉదంతాన్ని వివరిస్తున్న సమయంలో గవర్నర్ తీవ్ర ఉద్వేగానికి లోనైనట్లు తెలిసింది. కడుపు కోత బాధ ప్రతి తల్లికి సమానమేనని హాజీపూర్ ఘటనలో బలైన చిన్నారులు తన పిల్లలుగానే భావిస్తానని గవర్నర్ అన్నట్లు బాధితులు తెలిపారు. గవర్నర్ స్పందించిన తీరు తమకు ఊరట కలిగించిందని వారు చెప్పారు. నిందితుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డికి ఉరి శిక్ష విధించాలని, తమ కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, తమ గ్రామానికి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, గ్రామానికి ఉన్న లింకు రోడ్లను బీటీగా మార్చాలని, మండలంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని బాధితులు గవర్నర్‌కు వినతిపత్రం సమర్పించారు.

## బాలికపై యువకుడి అత్యాచారం

### ఆపై ఫొటోలు చూపించి బ్లాక్‌మెయిల్

**తాండూరు:** ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం ఆ ఫొటోలు చూపించి బ్లాక్‌మెయిల్ చేశాడు. అయితే కేసు నమోదులో పోలీసులు తీవ్ర జాప్యం చేశారు. చివరకు డీఎస్పీ స్పందించడంతో యువకుడిని రిమాండుకు పంపారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో సోమవారం ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలు.. తాండూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన 14 ఏళ్ల విద్యార్థిని తాండూరు శివాజీచౌక్ ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతోంది. తాండూరు మండలం దస్తగిరిపేట్‌కు చెందిన యువకుడు పవన్ స్థానికంగా కారు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. దాదాపు నెల రోజుల క్రితం బాలికను ప్రేమపేరుతో నమ్మించి కారులో హైదరాబాద్‌కు తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. అనంతరం తన వద్ద ఉన్న బాలిక ఫొటోలను చూపించి బ్లాక్ మెయిల్ చేస్తూ అత్యాచారం చేసే యత్నం చేశాడు. దీంతో బాధితురాలు కుటుంబీకులతో కలసి నవంబర్ 8న తాండూరు పట్టణ ఠాణాలో ఫిర్యాదు చేసింది. ఈ విషయమై షీ టీమ్‌కు కూడా సమాచారం ఇచ్చింది. అయితే కొందరు రాజీకి యత్నించడంతో పోలీసులు కేసు నమోదు చేయడంలో జాప్యం చేశారు. దీంతో వారం తర్వాత బాధితురాలు తాండూరు డీఎస్పీని ఆశ్రయించింది. దీంతో కేసు నమోదు చేసి విచారణ జరిపారు. అనంతరం నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కాగా నిందితుడు మరో ఇద్దరు బాలికలను కూడా వేధించాడని సమాచారం. అత్యాచారం కేసు నమోదులో పోలీసుల తీరు పలు అనుమానాలకు తావిస్తోంది. బాలికపై అత్యాచారం జరిగినా కేసు నమోదులో జాప్యం చేయడం, నిర్లక్ష్యంగా వహించడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. బాలిక అత్యాచారం కేసుపై సీఐ రవి కుమార్‌ను వివరణ కోరగా.. 'కేసు డీఎస్పీ పరిధిలోకి వస్తుంది.. ఆయనే విచారణ జరిపారు. పనిఒత్తిడి కారణంగా కేసును వెల్లడించలేదు' అని అన్నారు.

# ఇక ప్రైవేటు వ్యవసాయ కళాశాలలు!

● కీలక నిర్ణయం దిశగా వ్యవసాయశాఖ కసరత్తు
● కోర్సులకు డిమాండ్ నేపథ్యంలో ఏర్పాటుకు సిద్ధమైన కొందరు
● విధాన నిర్ణయం తీసుకోనందున వినతిని తోసిపుచ్చిన సర్కారు
● త్వరలో ఈ అంశాన్ని సీఎం కేసీఆర్‌కు నివేదించనున్న అధికారులు



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో ప్రైవేటు వ్యవసాయ కళాశాలలను ఏర్పాటు చేయాలని వ్యవసాయశాఖ యోచిస్తోంది. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం కూడా దీనిపై కసరత్తు చేస్తోంది. వ్యవసాయశాఖ ఇటీవల పలు సందర్భాల్లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశాల్లోనూ ప్రైవేటు వ్యవసాయ కళాశాలల ఏర్పాటు అంశం చర్చకు వచ్చింది. వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కూడా ప్రైవేటు వ్యవసాయ కళాశాలల ఏర్పాటుకు సానుకూలంగా ఉన్నారని, ఈ నేపథ్యంలో కసరత్తు చేస్తున్నట్లు ఉన్నతస్థాయి వర్గాలు తెలిపాయి. 'వ్యవసాయ, ఉద్యాన తదితర అనుబంధ రంగాల కోర్సులకు భారీ డిమాండ్ ఉంది. ఈ కోర్సులు చేసిన వారికి ఉద్యోగావకాశాలు బాగున్నాయి. కానీ ప్రభుత్వ వ్యవసాయ కాలేజీల్లో సీట్లు పరిమితంగా ఉండటంతో అనేక మంది మహారాష్ట్ర సహా ఇతర ప్రాంతాలకు వెళ్లి అక్కడ ప్రైవేటులో చదువుతున్నారు. దీంతో రాష్ట్రంలోనే ప్రైవేటు వ్యవసాయ కళాశాలలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది' అని వ్యవసాయశాఖ భావిస్తోంది. త్వరలో ముఖ్యమంత్రి కేసీఆర్ వద్ద ఈ అంశాన్ని ప్రస్తావించాలని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే కొందరు ప్రైవేటు వ్యవసాయ కాలేజీల ఏర్పాటుకు ముందుకు వచ్చారు. కానీ ప్రైవేటు కాలేజీల ఏర్పాటుపై విధానపరమైన నిర్ణయం తీసుకోనందున వారి విన్నపాన్ని తిరస్కరించామని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

**సీట్లు తక్కువ... డిమాండ్ ఎక్కువ**

ఇంటర్ బైపీసీ పూర్తయిన విద్యార్థులకు ఎంసెట్ ర్యాంకుల ఆధారంగా వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, ఫిషరీస్ సైన్స్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఆరు వ్యవసాయ కళాశాలల్లో బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్‌లో 432 సాధారణ సీట్లు, 75 పేమెంట్ సీట్లు, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని రెండు కళాశాలల్లో బీఎస్సీ ఆనర్స్ హార్టికల్చర్‌లో 130 సాధారణ సీట్లు, 20 పేమెంట్ సీట్లు ఉన్నాయి. అలాగే పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విద్యాలయం పరిధిలోని మూడు కళాశాలల్లో బీవీఎస్‌సీ అండ్ యానిమల్ హజ్బెండరీలో 158 సీట్లు, వనపర్తి జిల్లా పెబ్బేరు, ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా ముత్తుకూర్లలోని ఫిషరీస్ సైన్స్ కళాశాలల్లోని బీఎఫ్‌ఎస్‌సీలో (తెలంగాణ కోటా) 36 సీట్లలో ప్రవేశానికి అవకాశముంది. ఈ ఏడాది బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్‌లో 25 సీట్లు ఎన్‌ఆర్‌ఐ స్పాన్సర్ కోటా కింద భర్తీకి అవకాశం కల్పించారు. ఎన్‌ఆర్‌ఐ కోటా సీటుకు ఫీజు రూ. 34 లక్షలు, పేమెంట్ సీట్లకు రూ. 14 లక్షల చొప్పున వసూలు చేయాలని యూనివర్సిటీ ఈ ఏడాది నిర్ణయించింది. తెలంగాణలో ఈ ఏడాది బైపీసీ వార్షిక పరీక్షలో పాసైనవారు 62 వేల మంది ఉన్నారు. వారు కాకుండా గతంలో ఫెయిలై తిరిగి పరీక్ష రాసిన వారు, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ రాసిన విద్యార్థులు మరో 40 వేల మంది ఉన్నారు. అంటే లక్ష మందికిపైగా బైపీసీ పూర్తి చేశారు. వారిలో చాలా మంది సాధారణ బీఎస్సీ డిగ్రీకి బదులు ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర మెడికల్ కోర్సులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. కానీ ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్‌లో 4,670 సీట్లు, డెంటల్‌లో 1,140 సీట్లు, ఆయుర్వేద, హోమియో, యునాని కోర్సుల్లో 655 సీట్లున్నాయి. అంటే అన్ని మెడికల్ సీట్ల సంఖ్య 6,465 ఉన్నాయి. ఈ ఏడాది నీట్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన వారు ఏకంగా 37 వేల మంది ఉన్నారని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ కరుణాకర్ రెడ్డి తెలిపారు. దీంతో మెడికల్‌లో సీట్లు రాని వారిలో వేలాది మంది వ్యవసాయ కోర్సులు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఫలితంగా సీట్లు రాని వారంతా ఇతర రాష్ట్రాల్లో ప్రైవేటు వ్యవసాయ కోర్సులు చదువుతున్నారు.

**పరిశీలనలో ఉంది..**

ప్రైవేటు వ్యవసాయ కాలేజీల ఏర్పాటు అంశం జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశీలనలో ఉంది. దీనిపై ఇంకా ఎటువంటి నిర్ణయం జరగలేదు.

\- వ్యవసాయ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**కొందరు సంప్రదించారు...**

ప్రైవేటు కాలేజీల ఏర్పాటు కోసం కొందరు సంప్రదించిన మాట వాస్తవమే. అయితే దీనిపై ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోనందున ఆయా విన్నపాలను తిరస్కరించాం.

\- పార్థసారథి, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి

# గోల్కొండ కోట వద్ద నిర్మాణాలా?

● కందకంలో పనులపై హైకోర్టు విస్మయం
● తక్షణమే పనులు ఆపాలని మధ్యంతర ఉత్తర్వులు

**సాక్షి, హైదరాబాద్:** చారిత్రక గోల్కొండ కోట కందకం దెబ్బతినే విధంగా కోట వద్ద ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) నుంచి అనుమతి లేకుండా కోట వద్ద నిర్మాణ పనులు ఎలా చేస్తారని ప్రశ్నించింది. కోట వద్ద పైపులైన్ పనుల నిర్మాణం గురించి పత్రికల్లో వచ్చిన కథనాన్ని హైకోర్టు ప్రజాహితవ్యాజ్యంగా పరిగణించి సోమవారం విచారణ చేపట్టింది. కోట చుట్టూ నిర్మాణ పనులు చేయడంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిల ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. జాతీయ ప్రాముఖ్యత ఉన్న గోల్కొండ కోట 500 ఏళ్ల నాటిదని, అలాంటి చారిత్రక కట్టడం వద్ద పైపులైన్ పనులని ఏవిధంగా చేపట్టారో, ఎవరి అనుమతి తీసుకుని చేస్తున్నారో తెలియజేయాలని జీహెచ్‌ఎంసీని ఆదేశించింది. హైదరాబాద్‌లోనే చార్మినార్, గోల్కొండ వంటివి కాకుండా ఇంకేమైనా జాతీయ రక్షిత కట్టడాలు గురించి తెలియజేయాలని ఏఎస్ఐ, జీహెచ్‌ఎంసీలను ఆదేశించింది. రామప్ప ఆలయాన్ని యునెస్కో గుర్తించిందని, రాష్ట్రం మాత్రం చారిత్రక కట్టడాల్ని పట్టించుకోవడం లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

**జరుగుతున్నాయా.. లేదా :** కోట వద్ద పనులు జరుగుతున్నాయో లేదో మధ్యాహ్నం 2.30 గంటలకు చెప్పాలని జీహెచ్‌ఎంసీని ఆదేశించింది. తిరిగి విచారణ ప్రారంభం కాగానే జీహెచ్‌ఎంసీ తరఫు న్యాయవాది వాదిస్తూ, ఎలాంటి నిర్మాణ పనులు జరగడం లేదని చెప్పారు. అక్కడే ఉన్న అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్‌ను ఉద్దేశించి.. హైదరాబాద్ మహా నగరంలోని చారిత్రక కట్టడాల జాబితాలో కొత్త వాటిని చేర్చేందుకు ప్రభుత్వం ఎం దుకు ప్రయత్నించడం లేదని ధర్మాసనం ప్రశ్నించింది. చార్మినార్, గోల్కొండ వంటి కట్టడాలను హెచ్‌ఎండీఏ జోనల్ రెగ్యులేషన్ యాక్ట్–1988 ప్రకారం ఆ జాబితాలో చేర్చేందుకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించింది. తెలంగాణ హెరిటేజ్ యాక్ట్–2017 కింద రక్షిత భవనాల జాబితా నుంచి ఎర్రమంజిల్ చారిత్రక భవనాన్ని ప్రభుత్వం తొలగించడం చెల్లదని వెలువరించిన తీర్పు సమయంలో హెరిటేజ్ మాన్యుమెంట్స్ కమిటీ ఏర్పాటు చేయాలన్న ఆదేశాల్ని ఇప్పటివరకూ ఎందుకు అమలు చేయలేదని నిలదీసింది. జాతీయ ప్రాముఖ్యత ఉన్న ఇలాంటి కట్టడాల రక్షణకు తీసుకునే చర్యలను ఏఎస్ఐ, రాష్ట్ర ప్రభుత్వం వేరువేరుగా నివేదించాలని ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం కావాలని ఏజీ కోరడంతో విచారణను జనవరి 21కి వాయిదా వేసింది.

# వాటిని ఏం చేయాలి?

● 'ఎన్‌కౌంటర్'లో మరణించిన నలుగురి మృతదేహాలపై తర్జనభర్జన
● కుళ్లిపోయే ప్రమాదం ఉందన్న ఫోరెన్సిక్ వైద్యులు

**హైదరాబాద్:** చటాన్‌పల్లి ఎన్‌కౌంటర్‌లో మరణించిన దిశ హత్య కేసు నిందితుల మృతదేహాలు కుళ్లిపోయే ప్రమాదం ఉందని, వాటిని ఏం చేయాలో చెప్పాలని కోరుతూ ప్రభుత్వ ప్లీడర్(జీపీ)కి లేఖ రాసేందుకు గాంధీ ఆస్పత్రి పాలన యంత్రాంగం సిద్ధమవుతోంది. ఈ నెల 7న ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మహ్మద్ ఆరిఫ్, జొల్లు శివ, జొల్లు నవీన్, చెన్నకేశవులు మృతదేహాలకు అదే రోజు ఫోరెన్సిక్ వైద్యులు బృందం మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, మెడికల్ కాలేజీలో భద్రపరిచారు. సుప్రీంకోర్టు విచారణ నేపథ్యంలో ఈనెల 13వరకు గాంధీ మార్చురీలో భద్రపరచాలని హైకోర్టు సూచించింది. దీంతో నలుగురి మృతదేహాలను ఈ నెల 9న గాంధీ మార్చురీకి తీసుకువచ్చి ఫ్రీజర్ బాక్స్‌లో భద్రపరిచారు. ఫ్రీజర్ బాక్సుల్లో పెట్టిన మృతదేహాలు వారం రోజుల తర్వాత క్రమంగా కుళ్లిపోతాయి. ఎంబామింగ్ ప్రక్రియ చేపట్టి ఫార్మల్ డీహైడ్ ద్రావకాన్ని రక్తనాళాల ద్వారా మృతదేహాల్లోకి ఎక్కిస్తే పాడవకుండా ఉంటాయి. దీంతో మృతదేహాలకు ఎంబామింగ్ చేయాలని ఫోరెన్సిక్ వైద్యులు నిర్ణయించారు. అయితే ఎంబామింగ్ చేస్తే మృతదేహాలకు రీపోస్టుమార్టం చేసేందుకు అవకాశం ఉండకపోవడం, మరోపక్క మృతదేహాలు కుళ్లిపోవడం ప్రారంభమయ్యే దశకు చేరుకోవడంతో ఏం చేయాలో తెలియక గాంధీ ఫోరెన్సిక్ వైద్యులు ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సమాచారం అందించారు. ఇలాంటి కేసుల్లో కోర్టు ఆదేశాల మేరకే మృతదేహాలకు ఎంబామింగ్ చేయాలనే నిబంధన ఉందని సంబంధిత వైద్యులు తెలిపారు. గాంధీ ఆస్పత్రి పాలన యంత్రాంగం, ఫోరెన్సిక్ వైద్య బృందం సోమవారం ఈ విషయమై సుదీర్ఘంగా చర్చించారు. తర్వాత మృతదేహాలను ఏం చేయాలో చెప్పాలని కోరుతూ జీపీకి లేఖ రాయాలని నిర్ణయించారు. గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ నెల 13 వరకు మృతదేహాలను భద్రపరచమని న్యాయస్థానం లిఖితపూర్వకంగా ఆదేశాలు జారీ చేసిందన్నారు. గడువు ముగిసిన నేపథ్యంలో మృతదేహాలను ఏం చేయాలో చెప్పాలని మంగళవారం జీపీకి లేఖ రాయనున్నట్లు తెలిపారు.

epaper.sakshi.com

# ‘పౌర’ ఆగ్రహం తీవ్రం

- దేశవ్యాప్తంగా పౌరసత్వ సవరణ చట్ట వ్యతిరేక ప్రదర్శనలు
- జామియా వర్సిటీలో పోలీసుల తీరుపై సర్వత్రా ఆగ్రహం
- ఢిల్లీ, ముంబై, లక్నో, హైదరాబాద్ విశ్వవిద్యాలయాల్లో ఆందోళనలు
- కోల్‌కతాలో మమత భారీ ర్యాలీ


పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా కోల్‌కతాలో సోమవారం సీఎం మమత ఆధ్వర్యంలో భారీర్యాలీ

**న్యూఢిల్లీ:** వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)పై వ్యతిరేకత రోజురోజుకీ తీవ్రమవుతోంది. మొదట అస్సాం, త్రిపుర తదితర ఈశాన్య రాష్ట్రాలకే పరిమితమైన ఆందోళనలు సోమవారం నాటికి దేశవ్యాప్తమయ్యాయి. దేశ రాజధానిలోని జామియా యూనివర్సిటీ విద్యార్థుల ఆందోళనలకు పలు ఇతర యూనివర్సిటీలు, ఐఐటీలు సంఘీభావం ప్రకటించి, నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. కోల్‌కతాలో పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ, ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ ఆందోళనల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. జామియా వర్సిటీలో విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యాన్ని ఖండిస్తూ కాంగ్రెస్ నేతృత్వంలో విపక్షాలు ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించాయి. బాధ్యతారహితంగా చట్టాన్ని తీసుకువచ్చిన కేంద్రానిదే ఈ హింసకు బాధ్యత అని కాంగ్రెస్ నేత గులాం నబీ ఆజాద్ పేర్కొన్నారు. కేరళ రాజధాని తిరువనంతపురంలో అసాధారణంగా ప్రత్యర్థి పక్షాలు ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ నిరసనల్లో పాల్గొన్నాయి. ఢిల్లీ, లక్నో, ముంబై, హైదరాబాద్, బెంగళూరుల్లోని పలు వర్సిటీల్లో విద్యార్థులు నిరసనలు చేపట్టారు. ఐఐటీ, ఐఐఎం, ఐఐఎస్ విద్యార్థులు సైతం ఈ ఆందోళనల్లో పాల్గొన్నారు. కోల్‌కతాలో మమతాబెనర్జీ టీఎంసీ కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. బెంగాల్‌లో ఎన్నార్సీ, సీఏఏలను అడ్డుకునేందుకు తన ప్రాణాలైనా ఇస్తానని ప్రకటించారు. రాష్ట్రంలో రహదారులు, రైల్వే లైన్లను ఆందోళనకారులు నిర్బంధించారు. పలు ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు, లూటీలు చోటు చేసుకున్నట్లు వార్తలు వచ్చాయి.

**జామియా వర్సిటీలో..:** ఢిల్లీలోని జామియా మిలియా వర్సిటీ విద్యార్థులపై ఆదివారం పోలీసుల దౌర్జన్యాన్ని నిరసిస్తూ సోమవారం వేలాది విద్యార్థినీ, విద్యార్థులు వర్సిటీ ప్రధాన ద్వారం ముందు బైఠాయించారు. వర్సిటీ ముందున్న రోడ్లపై ఆందోళనలు నిర్వహించారు. వర్సిటీ అధికారుల అనుమతి లేకుండా పోలీసులు లోపలికి వచ్చి, విద్యార్థులపై లాఠీచార్జి చేసి, టియర్‌గ్యాస్ ప్రయోగించడాన్ని ప్రశ్నించారు. పోలీసుల దౌర్జన్యంపై సీబీఐ విచారణ జరగాలని డిమాండ్ చేశారు. కొందరు విద్యార్థులు తీవ్రమైన చలిలో, చర్మాన్ని కోసేసే చలిగాలుల మధ్య షర్ట్ లేకుండా నిల్చుని నిరసన తెలిపారు. నిరసనకారులు జాతీయ పతాకాన్ని పట్టుకుని, మానవహారంగా నిలిచి, కేంద్రం, ఢిల్లీ పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాగా, ఆదివారం అదుపులోకి తీసుకున్న విద్యార్థుల్లో 50 మందిని సోమవారం పోలీసులు విడుదల చేశారు. ఆదివారం నాటి హింసపై దర్యాప్తు జరుపుతామని పోలీసులు తెలిపారు. ఆందోళనకారులు 4 డీటీసీ బస్సులు, 100 ప్రైవేటు వాహనాలు, 10 పోలీస్ బైకులు ధ్వంసం చేశారన్నారు. కాగా, జామియా వర్సిటీ వైస్ చాన్స్‌లర్ నజ్మా అఖ్తర్ కూడా విద్యార్థులకు మద్దతుగా మాట్లాడారు.


ఇండియా గేట్ వద్ద ధర్నాకు దిగిన ప్రియాంక

**నియంతృత్వంపై పోరాడుతాం: ప్రియాంక**

జామియా మిలియా విద్యార్థులకు సంఘీభావంగా పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ నేతలు ఇండియా గేట్ వద్ద మౌన ప్రదర్శన నిర్వహించారు. రాజ్యాంగాన్ని నాశనం చేసేందుకే పౌరసత్వ సవరణ చట్టాన్ని తీసుకువచ్చారని కేంద్రంపై ప్రియాంక మండిపడ్డారు. పౌరసత్వ చట్టం పరిణామాలపై రాష్ట్రపతి కోవింద్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీ తెలిపాయి.

**నిబంధనలకు లోబడే పౌరసత్వం**

పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్‌ల నుంచి వచ్చే ముస్లిమేతర అక్రమ వలసదారులకు ఆటోమేటిక్‌గా పౌరసత్వం లభించదని కేంద్రం స్పష్టం చేసింది. కొన్ని నియమ నిబంధనలకు లోబడే పౌరసత్వ కల్పిస్తామని పేర్కొంది.

## ఇతర విశ్వవిద్యాలయాల్లో..

దేశవ్యాప్తంగా పలు విశ్వవిద్యాలయాల విద్యార్థులు పౌరసత్వ సవరణ చట్టంపై సోమవారం నిరసనలు చేపట్టారు. జామియా వర్సిటీ విద్యార్థులపై పోలీసుల తీరును ఖండించారు. ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థులు పరీక్షలను బహిష్కరించారు. లక్నోలోని నాద్వా కాలేజీ విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. హైదరాబాద్‌లోని మౌలానా నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలో ఆదివారం అర్ధరాత్రి నిరసన ప్రదర్శన నిర్వహించారు. కాశిలోని బనారస్ హిందూ యూనివర్సిటీ, కోల్‌కతాలోని జాదవ్‌పూర్ యూనివర్సిటీల్లోనూ విద్యార్థులు జామియా వర్సిటీ విద్యార్థులకు సంఘీభావంగా నిరసన జరిపారు. విద్యార్థులపై టియర్ గ్యాస్ ప్రయోగించడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాన్పూర్, మద్రాస్, బొంబాయి ఐఐటీల్లో, అహ్మదాబాద్ ఐఐఎం, బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌ల్లో తొలిసారి విద్యార్థులు ఆందోళనల్లో పాల్గొన్నారు. ముంబైలోని టిస్(టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్) విద్యార్థులు ‘ఢిల్లీ పోలీస్.. షేమ్ షేమ్’ అని నినదిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఢిల్లీలోని జేఎన్‌యూ విద్యార్థులు ఆందోళనల్లో భారీగా పాల్గొన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కేరళ, కాసర్‌గఢ్, పుదుచ్చేరి యూనివర్సిటీల విద్యార్థులు తరగతులను బహిష్కరించారు. ఆదివారం అలీగఢ్ వర్సిటీలో పోలీసులతో జరిగిన ఘర్షణలో దాదాపు 60 మంది విద్యార్థులు గాయపడిన విషయం తెలిసిందే.

## చాలా బాధగా ఉంది



పౌరసత్వ చట్ట సవరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా హింసాత్మక ఆందోళనలు జరగడం దురదృష్టకరమని, ఈ పరిణామాలు తనను తీవ్రంగా బాధిస్తున్నాయని ప్రధాని మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. సమాజాన్ని చీల్చేందుకు కొందరు స్వార్థపరులు చేస్తున్న కుట్రలకు ప్రజలు బలికారాదని, వదంతులు వ్యాప్తి చెందకుండా చూడాలని ఆయన కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం పలు ట్వీట్లు చేశారు. పౌరసత్వ చట్ట సవరణ కారణంగా భారతీయులకుగానీ, ఏ మతం వారికిగానీ అన్యాయం జరగదని హామీ ఇచ్చారు. దీనిపై జరుగుతున్న ఉద్యమాలు పలు రాష్ట్రాలకు విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రధాని తన ట్వీట్ల ద్వారా శాంతి సందేశాలను పంపే ప్రయత్నం చేశారు. ఇది శాంతి భద్రతలను కాపాడుకోవాల్సిన సమయమని, అందరూ ఐకమత్యంతో సోదరభావంతో మెలగాలని హితవు పలికారు. తప్పుడు సమాచారం, వదంతుల వ్యాప్తికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# ‘ఉన్నావ్’ దోషి ఎమ్మెల్యేనే

**ఢిల్లీ కోర్టు సంచలన తీర్పు**

- సెల్‌ఫోన్ రికార్డు ఆధారంగా సెంగార్ అత్యాచారానికి పాల్పడినట్లు నిర్ధారణ
- రెండేళ్లకు బాధితురాలికి న్యాయం
- 19వ తేదీన శిక్ష ఖరారు


కోర్టుకు వచ్చిన ఎమ్మెల్యే సెంగార్ (ఫైల్)

**న్యూఢిల్లీ:** నిర్భయ ఘటన తర్వాత అదే స్థాయిలో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఉన్నావ్ అత్యాచారం కేసులో కోర్టు తీర్పు వెలువరించింది. బాలిక కిడ్నాప్.. అత్యాచారం.. బాధితురాలి తండ్రి లాకప్ మరణం.. ఆమె ప్రయాణిస్తున్న వాహనానికి ప్రమాదం.. వంటి మలుపులతో రెండేళ్లుగా నలుగుతున్న ఈ కేసులో ఎట్టకేలకు బాధితురాలికి న్యాయం జరిగింది. సుప్రీంకోర్టు జోక్యంతో ఆగస్టు నుంచి రోజువారీ విచారణ చేపట్టిన తీస్‌హజారీ కోర్టు సోమవారం బీజేపీ బహిష్కృత ఎమ్మెల్యే కుల్దీప్‌సింగ్ సెంగార్‌ను దోషిగా తేల్చింది. ఈ కేసులో 19వ తేదీన శిక్ష ఖరారు చేయనున్నట్లు సోమవారం తెలిపింది.

**రెండేళ్లు.. అనూహ్య మలుపులు..**

నిర్భయ ఘటనలో విచారణ జాప్యంపై వెల్లువెత్తిన ప్రజాగ్రహం ఒకవైపు, దిశ ఘటనతో దిగ్భ్రాంతికి గురైన సమాజం మరోవైపు ఉండగా ఉన్నావ్ ఘటనలో తాజా తీర్పు కొంత ఊరటనిచ్చింది. ఈ కేసులో సహ నిందితురాలు శశి సింగ్‌ను కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. బాధిత బాలికను ఘటనా స్థలానికి తీసుకెళ్లింది శశి సింగే అయినప్పటికీ, అక్కడ అత్యాచారం జరుగుతుందన్న విషయం శశికి తెలియదని అభిప్రాయపడింది. సెంగార్ బాలికపై అత్యాచారానికి పాల్పడినట్టు సెల్‌ఫోన్ రికార్డు ఆధారంగా నిర్ధారించిన కోర్టు తీర్పును వెలువరించింది.

**బాధితురాలి ఆందోళన.. సోషల్ మీడియా..**

2017లో బాలికను కిడ్నాప్ చేసి, బీజేపీ బహిష్కృత ఎమ్మెల్యే సెంగార్ అత్యాచారానికి పాల్పడ్డాడు. దీనిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో ముఖ్యమంత్రి యోగి ఇంటి ఎదుట బాధితురాలు ఆందోళనకు దిగింది. ఆ తర్వాతే పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ తర్వాత బాధితురాలి తండ్రిపై ఎమ్మెల్యే సోదరుడు అతుల్ సెంగార్ దాడి చేశాడు. తీవ్రంగా గాయపడ్డ బాధితురాలి తండ్రిని పోలీసులు జైల్లో నిర్బంధించారు. రెండు రోజుల అనంతరం ఆయన కస్టడీలోనే మృతి చెందారు. తన తండ్రిపై ఎమ్మెల్యే సోదరుడు దాడి చేస్తున్న వీడియో క్లిప్పింగ్‌ని బాధితురాలు సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్ అయింది. ప్రజల్లో వ్యతిరేకత రావడంతో కేసును ప్రభుత్వం సీబీఐకి అప్పగించింది. ఆ తర్వాతే ప్రధాన నిందితుడు సెంగార్, మరో ఇద్దరిని అరెస్టు చేశారు.

**బీజేపీ నుంచి కుల్దీప్ సింగ్ బహిష్కరణ..**

ఉత్తరప్రదేశ్‌లోని బంగేరుమావ్ నుంచి సెంగార్ నాలుగు పర్యాయాలు బీజేపీ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆరోపణల నేపథ్యంలో బీజేపీ ఆయన్ను ఆగస్టులో పార్టీ నుంచి బహిష్కరించింది. ఐపీసీ సెక్షన్ 120 బి (నేరపూరిత కుట్ర), 363 (కిడ్నాపింగ్), 366 (కిడ్నాప్, వివాహం చేసుకోవాలంటూ బలవంతం చేయడం), 376 (అత్యాచారం), పోక్సో చట్టంలోని ఇతర సెక్షన్ల కింద సెంగార్‌పై పోలీసులు కేసులు పెట్టారు. విచారణ ప్రక్రియ మొత్తాన్ని కెమెరాలో రికార్డు చేశారు. ఈ కేసులో ప్రధాన సాక్షులు బాధితురాలి తల్లి, మామ. కోర్టు తీర్పు అనంతరం బాధితురాలికి ప్రత్యేకంగాభద్రతను ఏర్పాటు చేశారు. బాధితురాలిని, ఆమె కుటుంబ సభ్యులను ప్రత్యేక వసతి గృహంలో ఉంచారు.

### కారు ప్రమాదంపై అనుమానాలు

ఈ ఏడాది జూలై 28న బాధితురాలు, ఆమె బంధువులు, న్యాయవాది ప్రయాణిస్తున్న కారును ఓ ట్రక్కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాధితురాలు గాయపడగా, ఆమె బంధువులిద్దరు మరణించారు. న్యాయవాది కూడా తీవ్రంగా గాయపడ్డారు. ఇది సాధారణ ప్రమాదం కాదనీ, తనను అంతం చేసే ప్రయత్నంలో భాగంగానే జరిగిందని బాధితురాలు అప్పట్లో ఆరోపించింది.

### లక్నో నుంచి ఢిల్లీ కోర్టుకు కేసు..

అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్‌కి బాధితురాలు ఈ పరిణామాలపై లేఖ రాసింది. దీంతో ఆయన స్పందించి ఇందుకు సంబంధించిన అన్ని కేసులను లక్నో నుంచి ఆగస్టు 1వ తేదీన ఢిల్లీకి బదిలీ చేశారు. రోజువారీ విచారణ జరిపి 45 రోజుల్లోగా పూర్తి చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. బాధితురాలి తండ్రిపై అక్రమ ఆయుధాల కేసు, ఆయన లాకప్ మరణం, బాధితురాలికి రోడ్డు ప్రమాదం, బాధితురాలిపై గ్యాంగ్ రేప్‌కి సంబంధించిన కేసుతో సహా మొత్తం నాలుగు కేసులపై విచారణ కొనసాగుతోంది.

### భోరుమన్న సెంగార్

ఈ కేసులో మధ్యాహ్నం మూడు గంటలకు కోర్టు తీర్పు వెలువడనుందని వెల్లడించగానే కోర్టు ఆవరణ ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారిపోయింది. కోర్టులోకి ఇరు పక్షాల న్యాయవాదులు మినహా ఎవ్వరినీ అనుమతించలేదు. సీబీఐని కొన్ని ప్రశ్నలడిగిన అనంతరం జిల్లా జడ్జి ధర్మేష్ శర్మ ఎమ్మెల్యే సెంగార్‌ను దోషిగా ప్రకటిస్తూ తీర్పునిచ్చారు. దీంతో సెంగార్, ఆయన కుమార్తెలు భోరున విలపించారు.

### సీబీఐకి కోర్టు అక్షింతలు

ఈ ఘటనపై విచారణలో జాప్యానికి సీబీఐనే కారణమని కోర్టు పేర్కొంది. నిబంధనలకు విరుద్ధంగా పురుష అధికారులు వాంగ్మూలం తీసుకోవడం, విచారణ కోసం ఆమెను సీబీఐ కార్యాలయానికి పిలిపించుకోవడాన్ని తప్పుపట్టింది.

## జిల్లాల్లో 2 పోక్సో కోర్టులు: సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ:** లైంగిక వేధింపుల నుంచి చిన్నారులను రక్షించేందుకు ఉద్దేశించిన పోక్సో(ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ ఆఫెన్సెస్) చట్టం కింద 300 పైగా ఎఫ్ఐఆర్‌లు పెండింగ్‌లో ఉన్న ప్రతీ జిల్లాలో రెండు ప్రత్యేక పోక్సో కోర్టులను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు సోమవారం రాష్ట్రాలను ఆదేశించింది. 100కు పైగా పోక్సో కేసులు పెండింగ్‌లో ఉన్న జిల్లాల్లో ప్రత్యేకంగా ఒక పోక్సో కోర్టును ఏర్పాటు చేయాలని గతంలో సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ విషయంపై జస్టిస్ దీపక్ గుప్తా, జస్టిస్ అనిరుద్ధ బోస్‌ల ధర్మాసనం స్పష్టతనిచ్చింది. ‘పోక్సో కేసులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోక్సో కోర్టుల్లోనే విచారించాలి. ఈ కోర్టులు వేరే కేసులను విచారించకూడదు. జిల్లాల్లో పోక్సో పెండింగ్ కేసులు 100కు పైగా ఉంటే ఒక ప్రత్యేక కోర్టు, 300కు పైగా ఉంటే 2 ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయాలి’ అని పేర్కొంది. అయితే, జిల్లాలో 100 కన్నా తక్కువ పోక్సో కేసులు పెండింగ్‌లో ఉంటే.. ఇతర అత్యాచార కేసులను ఆ కోర్టులు విచారించవచ్చని వివరించింది.

## రేప్ కేసుల విచారణ తీరుపై ‘సుప్రీం’ కమిటీ

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా కోర్టుల్లో అత్యాచార ఘటనల కేసుల విచారణ ఎంత సత్వరంగా జరుగుతోందో పరిశీలించేందుకు సుప్రీంకోర్టు ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటు చేసింది. జస్టిస్ సుభాష్ రెడ్డి, జస్టిస్ ఎంఆర్ షాలతో కూడిన ఇద్దరు సభ్యుల కమిటీని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ బాబ్డే నియమించారని సోమవారం సుప్రీంకోర్టు వర్గాలు వెల్లడించాయి. మహిళలు, చిన్నారులపై పెరిగిపోతున్న లైంగికదాడులు, సంచలనం రేపిన ‘దిశ’ కేసులో నలుగురు నిందితులు ఎదురు కాల్పుల్లో చనిపోయిన నేపథ్యంలో న్యాయస్థానం ఈ నిర్ణయం తీసుకుంది.

## జార్ఖండ్‌లో 56.58% పోలింగ్ నమోదు

**రాంచీ:** జార్ఖండ్‌లో నాలుగవ విడత అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 15 నియోజకవర్గాల్లో జరిగిన ఈ పోలింగ్‌లో 56.58 శాతం ఓటింగ్ నమోదైందని అధికారులు తెలిపారు. మొత్తం నాలుగు జిల్లాల్లో సోమవారం ఈ ఎన్నికలు జరిగాయి. జమువా నియోజకవర్గంలో 50, 51 బూత్‌లలో ఓట్లు వేసేందుకు నిరాకరించారు. మొత్తం 6,101 పోలింగ్ కేంద్రాల్లో 587 సమస్యాత్మకమైనవిగా, 405 సున్నితమైనవిగా గుర్తించారు. 20న చివరి దశ పోలింగ్ జరగనుంది. 23న ఫలితాలు వెలువడనున్నాయి.

## ఆఫ్రికా తీరంలో భారతీయుల కిడ్నాప్

**న్యూఢిల్లీ:** ఆఫ్రికా పశ్చిమ తీరంలో 20 మంది భారతీయులను సముద్ర దొంగలు కిడ్నాప్ చేశారు. కిడ్నాప్ వ్యవహారాన్ని భారత అధికారులు నైజీరియా అధికారులకు చేరవేశారు. హాంకాంగ్ జెండాతో ఉన్న పడవలో వీరు ప్రయాణిస్తుండగా కిడ్నాప్ అయినట్లు అధికారులు ప్రకటించారు. దాదాపు 10 రోజుల క్రితం ఈ ఘటన జరగ్గా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై నైజీరియా అధికారులతో మాట్లాడామని విదేశాంగ శాఖ తెలిపింది. నైజీరియా తీరం వెంట ఇలా జరగడం ఈ ఏడాది ఇది మూడోది.

# ప్రాథమిక స్థాయి నుంచే న్యాయ సాయం

**జస్టిస్ ఎన్‌వీ రమణ**



**సాక్షి, న్యూఢిల్లీ:** న్యాయం అర్థించే వారికి ప్రాథమిక స్థాయి నుంచే న్యాయ సహాయం అందాలని జాతీయ న్యాయ సేవల అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ అన్ని రాష్ట్రాల న్యాయ సేవల సంస్థల ఎగ్జిక్యూటివ్ చైర్మన్లు, సభ్య కార్యదర్శులకు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ‘పోలీస్ స్టేషన్‌కు హాజరవ్వాల్సి వచ్చినప్పటి నుంచే న్యాయ సహాయార్థులకు న్యాయ సేవలు అందించాలి. సరైన సమయంలో అప్పీలు దాఖలు చేయడం, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీలు, సుప్రీం కోర్టు లీగల్ సర్వీస్ కమిటీలతో సమన్వయం చేసుకోవడం, బెయిల్ అప్లికేషన్ అవసరమైన వారిని గుర్తించడం, వారికి న్యాయ సేవలు అందించడం వంటి అంశాలపై దృష్టి పెట్టాలి’ అని పేర్కొన్నారు. శిక్ష పడిన వారికి న్యాయ సేవలు అందించే దిశగా ప్రస్తుతం ఉత్తర ప్రదేశ్, ఢిల్లీ రాష్ట్రాల్లో నల్సా ప్రత్యేక ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రమంగా అన్ని రాష్ట్రాలకు దీనిని విస్తరించాలని నిర్ణయించారు. నేర బాధితులకు న్యాయ సహాయం అందించాలన్న మరో ముఖ్యమైన అంశంపైనా చర్చించారు. 2020లో ఐదు జాతీయ లోక్ అదాలత్‌లను నిర్వహించనున్నట్టు వివరించారు. ఫిబ్రవరి, ఏప్రిల్, జూలై, సెప్టెంబరు, డిసెంబర్ రెండో శనివారం ఈ అదాలత్‌లను నిర్వహిస్తారు.

# ఆకాశాన్నంటే రామ మందిరం

**4 నెలల్లో అయోధ్యలో ఆలయం పనులు: అమిత్ షా**



**పకూర్ (జార్ఖండ్):** అయోధ్యలో ఆకాశాన్నంటే భవ్యమైన రామమందిర నిర్మాణం నాలుగు నెలల్లో మొదలుకానుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. తద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులందరి వందేళ్ల స్వప్నం సాకారం కానుందని తెలిపారు. జార్ఖండ్‌లోని పకూర్ ప్రాంతంలో సోమవారం జరిగిన ఒక ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడారు. రామ జన్మభూమి అంశం కేసు కోర్టుల్లోనే నలిగిపోయేలా చేసేందుకు కాంగ్రెస్ నేత కపిల్ సిబల్ ఎందుకు ప్రయత్నించారో సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు. ‘కాంగ్రెస్ దేశ సరిహద్దులను కాపాడలేకపోయింది, దేశాన్ని అభివృద్ధి చేయలేకపోయింది, ప్రజల మనోభావాలను గుర్తించడంలో విఫలమైంది’ అని అమిత్ షా వ్యాఖ్యానించారు. బ్రిటిష్ పాలకులపై పోరాడిన గిరిజన నాయకులకు నివాళులర్పిస్తూ ఆయన.. ‘మిర్ జాఫర్ వంటి దేశ ద్రోహులు పరాయి పాలనకు వంతపాడారు. అలాంటి వారు మీ ప్రతినిధులు కారాదు. దేశాన్ని అభివృద్ధి చేసి రక్షించే మోదీని, బీజేపీని గెలిపించండి’ అని కోరారు. ‘కాంగ్రెస్ ఒడిలో కూర్చుని ముఖ్యమంత్రి కావాలని జేఎంఎం నేత హేమంత్ సోరెన్ కలలు కంటున్నారు. జార్ఖండ్ రాష్ట్ర ఉద్యమంలో యువకులపై కాల్పులు జరిపిందెవరో చెప్పాలి’ అని ప్రశ్నించారు. ఒకప్పుడు కాంగ్రెస్/ఆర్జేడీ కూటమి యువకుల బలిదానానికి కారణమైతే నేడు హేమంత్ పదవి కోసం కాంగ్రెస్‌తో పొత్తుపెట్టుకున్నందుకు సిగ్గుపడాలన్నారు.

# తదుపరి ఆర్మీ చీఫ్ మనోజ్ ముకుంద్



**న్యూఢిల్లీ:** ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ మనోజ్ ముకుంద్ నరవానే నియమితులు కానున్నారు. ప్రస్తుత ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ ఈ నెల 31న పదవీ విరమణ పొందనున్నారు. సంప్రదాయం ప్రకారం ఆయన తర్వాత అత్యంత సీనియర్ అయిన ముకుంద్ నరవానే ఆర్మీ చీఫ్‌గా నియమితులై 13 లక్షల మంది ఉన్న ఆర్మీని నడపనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లన్నీ ఉన్నత స్థాయిలో పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆర్మీ వైస్ చీఫ్‌గా పనిచేస్తున్నారు. వైస్ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించడానికి ముందు ఆయన చైనాతో సరిహద్దు పంచుకుంటున్న ప్రాంతాల వద్ద పనిచేస్తున్న ఈస్ట్రన్ కమాండ్‌ను నడిపించారు. 37 ఏళ్ల తన సర్వీసులో సమస్యాత్మక ప్రాంతాలైన జమ్మూకశ్మీర్ వంటి చోట్ల పనిచేశారు. జమ్మూకశ్మీర్‌లో రాష్ట్రీయ రైఫిల్స్ బెటాలియన్‌కు నాయకత్వం వహించారు. మూడేళ్ల పాటు మయన్మార్‌లో ఉండి భారత ఎంబసీతో కలసి పని చేశారు. ఈయన నేషనల్ డిఫెన్స్ అకాడెమీ, ఇండియన్ మిలిటరీ అకాడెమీ పూర్వ విద్యార్థి. ఈయన గతంలో ‘విశిష్ట సేవా అవార్డ్’తో పాటు ‘అతి విశిష్ట సేవా మెడల్’ కూడా అందుకున్నారు. తన బెటాలియన్‌ను జమ్మూకశ్మీర్‌లో చక్కగా నడిపించినందుకు సేనా మెడల్ కూడా అందుకున్నారు. బిపిన్ రావత్ పదవీ విరమణ అనంతరం డిఫెన్స్ స్టాఫ్ మొట్టమొదటి చీఫ్‌గానూ పనిచేసే అవకాశం ఉంది.

# లోక్‌సభ సీట్లను వెయ్యికి పెంచాలి

**మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ**



**న్యూఢిల్లీ:** భారత్‌లోని జనాభాను పరిగణనలోకి తీసుకుంటే పార్లమెంటు ఉభయసభల సభ్యుల సంఖ్యను భారీగా పెంచాల్సిన అవసరం ఉందని మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ వ్యాఖ్యానించారు. లోక్‌సభ సీట్లకు ప్రస్తుతమున్న 543 నుంచి 1000కి, అదే శాతంలో రాజ్యసభ సీట్లను పెంచాలని ప్రణబ్ సూచించారు. ఒక్కో సభ్యుడు ప్రాతినిధ్యం వహించే జనాభా సంఖ్యలోనూ ప్రస్తుతం చాలా తేడా ఉందన్నారు. ఒక్కో లోక్‌సభ సభ్యుడు 16 నుంచి 18 లక్షల మందికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడని, వారందరికి ఆయనొక్కడు ఎలా అందుబాటులో ఉండగలడని ప్రశ్నించారు. ‘1971 జనాభా లెక్కల ఆధారంగా చివరగా 1977లో లోక్‌సభ సభ్యుల సంఖ్యను సవరించాం. అప్పటి జనాభా 55 కోట్లు. ప్రస్తుత జనాభా అందుకు రెండింతలు. అందువల్ల లోక్‌సభ సభ్యుల సంఖ్యను కూడా కనీసం 1000 చేయాలి’ అన్నారు. ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో.. ‘భారత్‌లో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం విజయవంతమైందా? ముందున్న సవాళ్లేంటి’ అనే అంశంపై సోమవారం అటల్ బిహారీ వాజ్‌పేయి సంస్మరణ ప్రసంగాన్ని ప్రణబ్ వెలువరించారు. ఈ సందర్భంగా ఓటరు ఇచ్చే తీర్పును పార్టీలు సరిగ్గా అర్థం చేసుకోవాలని ఆయన సూచించారు. ‘ప్రజలు సంఖ్యారూపంలో ఆధిక్యత ఇచ్చి ఉండొచ్చు. కానీ దేశంలోని మెజారిటీ ఓటర్లు ఒకే పార్టీకి మద్దతివ్వడం ఎప్పుడూ జరగలేదు. అందువల్ల అధికారంలో ఉన్న పార్టీలు ఈ ఆధిక్యతావాదంపై జాగ్రత్త వహించాలి’ అని సూచించారు. ‘భారతీయ ఓటర్లు ఇచ్చే తీర్పును రాజకీయ పార్టీలెప్పుడూ సరిగ్గా అర్థం చేసుకోలేదు. అందువల్ల అఖండ మెజారిటీ రాగానే ఏమైనా చేయొచ్చని భావిస్తాం. అలా వ్యవహరించిన పార్టీలకు ఆ తరువాత అదే ఓటర్లు శిక్ష విధించిన సందర్భాలు చాలా ఉన్నాయి’ అని కీలక వ్యాఖ్యలు చేశారు. ‘ప్రజలు మీకు సంఖ్యాత్మక మెజారిటీ ఇచ్చారంటే దానర్థం వారు సుస్థిర ప్రభుత్వం కోరుకుంటున్నారు. అలాగే, మెజారిటీ ఓటర్లు మీకు మద్దతివ్వలేదంటే.. వారు ఆధిక్యతావాద ప్రభుత్వాన్ని కోరుకోవడం లేదు అని అర్థం. అదే మన పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఇచ్చే సందేశం’ అని ప్రణబ్ విశ్లేషించారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల ఎన్నికలను ఒకేసారి నిర్వహించడం ఒకసారి సాధ్యమవుతుందేమో కానీ, ప్రతీసారీ సాధ్యం కాదని ప్రణబ్ పేర్కొన్నారు.




Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com